www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

మంగళవారం | 9-9-2025 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 23 సంచిక (Issue) : 162 | శ్రీ విశ్వావసునామ సంవత్సరం, దక్షిణాయనం, వర్షరుతువు, భాద్రపదమాసం, బహుళపక్షం; తిథి: విదియ రా.6.29 తదుపరి తదియ; నక్షత్రం: ఉత్తరభాద్ర రా. 6.07 తదుపరి రేవతి; వర్జ్యం: శేషం ఉ.6.20 వరకు, పున: తె.5.05; దుర్ముహూర్తం: ఉ.8.32-9.21, రా.10.10-10.56; అమృతఘడియలు: మ.1.42-3.10; రాహుకాలం: మ.3.00-4.30; సూర్యోదయం: 6.05, సూర్యాస్తమయం: 6.18 | వరంగల్

Warangal | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

న్యాయస్థానాలను రాజకీయ యుద్ధక్షేత్రాలుగా మార్చొద్దు

14



రాజకీయ వ్యాఖ్యలను రాజకీయ స్ఫూర్తితోనే ఎదుర్కోవాలి

విమర్శలను ఎదుర్కొనే, భరించే సామర్థ్యం ఉండాలి: సుప్రీంకోర్టు

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై బీజేపీ వేసిన పరువు నష్టం పిటిషన్ కొట్టివేత

ఇలాంటి పిటిషన్లు వేస్తే రూ.10 లక్షల జరిమానా విధిస్తామని హెచ్చరిక

ఢిల్లీ ముఖ్యమంత్రి రేఖా గుప్తా నిర్వహించిన సమావేశంలో ఆమె భర్త మనీశ్



ఢిల్లీలో 'ఫులేరా' సర్కారు!

అధికారిక సమావేశంలో సీఎం భర్త ఎందుకు?

- మనీశ్ గుప్తా ఏ హోదాలో పాల్గొన్నారు?.. బీజేపీ సమాధానం చెప్పాలి
- పంచాయత్ వెబ్ సిరీస్‌లోని ఫులేరా గ్రామాన్ని పోల్చుతూ ఆప్ విమర్శలు
- సీఎం భర్తగా కాదు.. సామాజిక కార్యకర్తగా వచ్చారు: బీజేపీ 2



మల్లెపూలు తీసుకెళ్లినందుకు..

1.14 లక్షల జరిమానా

ఆస్ట్రేలియాలో మలయాళ నటి నవ్య నాయర్‌కు చేదు అనుభవం

కఠిన బయో సెక్యూరిటీ చట్టాలే కారణం

మెల్‌బోర్న్ ఎయిర్‌పోర్ట్‌లో ఘటన

న్యూఢిల్లీ, సెప్టెంబరు 8: మహిళలు తమ జడలో పూలు పెట్టుకోవడం దక్షిణ భారతదేశంలో ఎంతో సహజం. ముఖ్యంగా మల్లెపూలు... అయితే మల్లెపూలు తెచ్చుకోవడం కూడా నేరమే ఆస్ట్రేలియాలో..! ఈ కారణం గానే మలయాళ నటి నవ్య నాయర్‌కు మెల్‌బోర్న్ అంతర్జాతీయ విమానాశ్రయంలో రూ.1.14 లక్షల జరిమానా

మిగతా 2వ పేజీలో...

రూ.2 కోట్ల విలువైన రద్దయిన నోట్ల పట్టివేత



హిమాయత్‌నగర్, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం 2016లో రద్దు చేసిన రూ.500, రూ.1,000 నోట్లను పెద్దమొత్తంలో మార్పిడి చేస్తున్న ముఠాను హైదరాబాద్ తూర్పుమండలం పోలీసులు అరెస్టు చేశారు. నారాయణగూడలోని కెనరా బ్యాంకు వద్ద ఇద్దరిని, స్థానిక జలమండలి కార్యాలయం వద్ద మరో ముగ్గురిని అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద రూ.2 కోట్లు విలువ చేసే రద్దయిన రూ.500, రూ.1,000 నోట్లను స్వాధీనం చేసుకున్నారు. అరెస్టయిన వారిలో ఇద్దరు మహిళలు ఉన్నట్లు సమాచారం. నిందితులను టాస్క్‌ఫోర్స్ కార్యాలయంలో విచారిస్తున్నట్లు తెలిసింది. ఆ తర్వాత.. తదుపరి దర్యాప్తు నిమిత్తం నారాయణగూడ పోలీసులకు అప్పగిస్తారు.

మూసీ పునరుజ్జీవం..

చేసి చూపిస్తాం

సబర్మతి, గంగా, యమునలను అభివృద్ధి చేయొచ్చు గానీ.. మూసీ శుద్ధి జరగొద్దా?

పదేళ్ల పాలనలో హైదరాబాద్‌కు గోదావరి జలాలను తీసుకురావాలన్న ఆలోచనే.. బీఆర్ఎస్‌కు రాలేదు

తాటిచెట్టంత మనిషి.. మెదడు మోకాలులోనూ లేదు

ప్రస్తుతం ఎల్లంపల్లి నుంచి హైదరాబాద్‌కు తాగునీరు అది కూడా కాంగ్రెస్ హయాంలో నిర్మించిన ప్రాజెక్టే

ప్రాణహిత–చేవెళ్లలోనూ మల్లన్నసాగర్ ప్రతిపాదన ఉంది

కడుపులో విషం పెట్టుకొని ప్రాజెక్టులను ఆపొద్దు

విపక్ష నేతల కుట్రలు తిప్పికొడతాం.. సంగతి తేలుస్తాం

ప్రతిపక్షాలు అభివృద్ధిలో కలిసి రావాలి: సీఎం రేవంత్

గోదావరి ఫేజ్– 2, 3, మూసీ ప్రాజెక్టులకు శంకుస్థాపన



గండిపేట వద్ద బహిరంగ సభలో సీఎం రేవంత్, హాజరైన జనం

హైదరాబాద్ సిటీ, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): 'ఎవరు అడ్డం పడినా.. అడ్డంకులు సృష్టించినా.. కుట్రలు, కుతంత్రాలు చేసినా మూసీ పునరుజ్జీవ ప్రాజెక్టును పూర్తి చేసి చూపిస్తాం' అని సీఎం రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. గుజరాత్‌లో మోదీ ఆధ్వర్యంలో సబర్మతి నది, యూపీలో యోగి నేతృత్వంలో గంగా నది, ఢిల్లీలో రేఖా గుప్తా నాయకత్వంలో యమునా నది తీరప్రాంత అభివృద్ధి పనులు చేపట్టారని, 4 కోట్ల ప్రజలు ఉన్న తెలంగాణలో మూసీ తీర ప్రాంత అభివృద్ధి జరగొద్దా? అని ప్రశ్నించారు. రూ.7,360కోట్లతో గోదావరి తాగునీటి సరఫరా పథకం ఫేజ్-2, 3, మూసీ పునరుజ్జీవ ప్రాజెక్టు పనులకు సోమవారం గండిపేట వద్ద రేవంత్‌రెడ్డి శంకుస్థాపన చేశారు. అనంతరం నిర్వహించిన బహిరంగ సభలో మాట్లాడుతూ నిజాం పాలకుల దూర దృష్టి వల్లే హైదరాబాద్‌కు ముంపు ముప్పు, తాగు నీటి సమస్యలకు పరిష్కారం లభించిందని పేర్కొన్నారు. 1920, 1922లో హిమాయత్‌సాగర్,

మిగతా 13వ పేజీలో...

కవిత ప్రకటనతో కేసీఆర్ కుటుంబ దోపిడీ గుట్టురట్టు! 12

కార్లలో డీజిల్ పోసుకోలేని స్థాయి నుంచి వేల కోట్లకు..

2029లో రాహుల్ ప్రధాని కావడం తథ్యం

టీపీసీసీ భేటీలో మహేశ్‌గౌడ్

మేడారం పనులు వంద రోజుల్లో పూర్తి కావాలి 13

జాతర వేళ భక్తులకు ఇబ్బందులు రాకూడదు

వారంలో నేనే స్వయంగా వచ్చి పరిశీలిస్తా: సీఎం

మేడారం, బాసర అభివృద్ధిపై అధికార్లతో సమీక్ష

ఢిల్లీకి వెళ్లిన సీఎం రేవంత్

పలువురు కేంద్ర మంత్రులను కలిసే అవకాశం



కర్మాండూలో నిరసనకారులు, పోలీసుల మధ్య ఘర్షణ

సోషల్ మీడియాపై నిషేధానికి వ్యతిరేకంగా..

భగ్గుమన్న నేపాల్

ఆందోళనకారులపై కాల్పులు.. 20 మంది మృతి

400 మందికి పైగా యువకులకు గాయాలు

పార్లమెంట్ ఆవరణలోకి యువత

వాటర్ కెనాన్‌లు, టియర్ గ్యాస్, రబ్బర్ బుల్లెట్లతో భద్రతాబలగాల కాల్పులు

అవినీతి వ్యతిరేక ఉద్యమంగా రూపాంతరం

ప్రధాని శర్మ ఓలి దిగిపోవాలంటూ నినాదాలు

నేపాల్ హోంమంత్రి రమేశ్ లేఖక్ రాజీనామా

కర్మాండూ, దేశ సరిహద్దుల్లో కర్ఫ్యూ విధింపు

అర్ధరాత్రి ఓలి ఇంటిపై రాళ్లదాడి.. కాల్పులు

అప్రమత్తమైన భారత్.. బిహార్‌లో హైఅలర్ట్

నేపాల్‌లో ఆందోళనల వెనక అమెరికా?



పార్లమెంటు ఆవరణలో యువకుల నిరసన

కర్మాండూ, సెప్టెంబరు 8: హిమాలయ దేశం నేపాల్‌లో రాజధాని నగరం కర్మాండూ సోమవారం నెత్తురోడింది. సోషల్ మీడియాపై నేపాల్ సర్కారు విధించిన నిషేధానికి వ్యతిరేకంగా వందలు, వేల సంఖ్యలో యువత గళమెత్తింది. ప్రభుత్వం విధించిన కర్ఫ్యూను లెక్క చేయకుండా.. రోడ్లెక్కింది. పార్లమెంట్ భవనం ప్రాంగణంలోకి చొచ్చుకుపోయింది. వారిని అడ్డుకునేందుకు భద్రతా బలగాలు వాటర్ కెనాన్‌లను, టియర్‌గ్యాస్‌లను ప్రయోగించాయి. ఆందోళనకారులు కూడా బలగాలపై రాళ్లు, చెట్ల కొమ్మలతో దాడి చేశారు. దీంతో.. సైన్యం విచక్షణారహితంగా రబ్బర్

మిగతా 2వ పేజీలో...

---

22 మందితో బీజేపీ రాష్ట్ర కమిటీ

యువతకు, కొత్తవారికి పెద్దపీట

బీసీలు, మహిళలకు మూడోవంతు

వివరాలు ప్రకటించిన రాంచందర్‌రావు

హైదరాబాద్, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): భారతీయ జనతా పార్టీ తెలంగాణ రాష్ట్ర కమిటీని ఎట్టకేలకు ప్రకటించారు. రాష్ట్ర బీజేపీలో కొద్ది రోజులుగా కొనసాగుతున్న ఉత్కంఠకు తెరదించారు. పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్‌రావు సోమవారం 22 మందితో రాష్ట్ర కమిటీని ప్రకటించారు. ఈ కమిటీలో యువతకు పెద్దపీట వేశారు. పదవులు ఆశించిన పలువురు సీనియర్లకు షాక్ ఇచ్చారు. పైరవీలకు చెక్ పెట్టి, కొత్తవారికి అవకాశం ఇచ్చారు. కొత్త కమిటీలో ఓసీలు 11 మంది,

మిగతా 12వ పేజీలో...

ఉప రాష్ట్రపతి ఎన్నిక నేడే!

- జాతీయవాది, ఉదారవాది మధ్య సైద్ధాంతిక సమరం
- ఎన్డీఏ నుంచి వివాద రహితుడు సీపీ రాధాకృష్ణన్
- ఇండియా అభ్యర్థిగా న్యాయ కోవిదుడు సుదర్శన్‌రెడ్డి
- పోలింగ్‌కు దూరమని ప్రకటించిన బీఆర్ఎస్, బీజేడీ
- 422 మంది సభ్యుల బలంతో ఎన్డీఏదే పైచేయి
- నేడు సాయంత్రానికి ఫలితాల వెల్లడి





న్యూఢిల్లీ, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఒకరు బాల్యం నుంచీ హిందూత్వ భావజాలంతో ఎదిగిన జాతీయవాది అయితే మరొకరు సోషలిస్టు భావజాలాన్ని పుణికిపుచ్చుకున్న ఉదారవాది. ఉప రాష్ట్రపతి పదవికి మంగళవారం జరిగే ఎన్నికల్లో ఎన్డీఏ కూటమి తరఫున సీపీ రాధాకృష్ణన్, ఇండీ కూటమి తరఫున జస్టిస్ సుదర్శన్‌రెడ్డిల మధ్య జరుగుతున్న పోటీ గతంలో ఎన్నడూ లేనివిధంగా సైద్ధాంతిక సమరాన్ని తలపిస్తోంది. రెండు సార్లు లోక్‌సభకు ఎన్నికై మహారాష్ట్ర గవర్నర్‌గా ఉన్న అత్యంత వివాదరహితుడు సీపీ రాధాకృష్ణన్, దాదాపు రెండు దశాబ్దాల పాటు హైకోర్టు, సుప్రీంకోర్టుల్లో న్యాయమూర్తిగా పలు చరిత్రాత్మక తీర్పులు

మిగతా 2వ పేజీలో...



చర్య తీసుకున్నాక నేను మాట్లాడేదేముంది?

పార్టీలో సమగ్రంగా చర్చించాకే కవితపై వేటు

ఉప రాష్ట్రపతి ఎన్నికలో బీఆర్ఎస్ ఓటెయ్యదు!

రైతుల కష్టాలు ప్రభుత్వాలు పట్టించుకోనందుకే

ఫిరాయింపు ఎమ్మెల్యేలపై వేటు పడాల్సిందే: కేటీఆర్

హైదరాబాద్, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): పార్టీ నుంచి సోదరి కవిత సస్పెన్షన్‌పై ఎట్టకేలకు బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ స్పందించారు. పార్టీలో కీలకంగా చర్చించాకే ఆమెను సస్పెండ్ చేయాలని నిర్ణయం తీసుకున్నారని చెప్పారు. సోమవారం తెలంగాణ భవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. కవిత వ్యవహారంపై మీడియా ప్రతినిధులు ప్రశ్నించగా, కేటీఆర్ ఎక్కడా ఆమె

మిగతా 12వ పేజీలో...

వి.ప్రకాశ్.. నోరు అదుపులో పెట్టుకో! 12

లేకుంటే దాడులు తప్పవు: జాగృతి నేతలు


రెండో దశ సుంకాలు!

రష్యాతోపాటు ఆ దేశం నుంచి చమురు కొంటున్న దేశాలపై విధిస్తాం: ట్రంప్

ఆంక్షలతో రష్యా ఆర్థికం కూలుతుంది.. పుతిన్ చర్చలకొస్తారు

సుప్రీంకోర్టు సుంకాలు కొట్టేస్తే ఆయా దేశాలకు రిఫండ్ తప్పదు

అది పెనుభారమే.. అమెరికా ఆర్థికమంత్రి స్కాట్ బెసెంట్



వాషింగ్టన్‌లో ఓ సదస్సులో అటార్నీ జనరల్ పామ్ బొండితో ట్రంప్

వాషింగ్టన్, సెప్టెంబరు 8: రష్యా మీద, ఆ దేశం నుంచి చమురు కొనుగోలు చేస్తున్న దేశాల మీద రెండోదశ సుంకాలు విధిస్తామని, అందుకు సిద్ధంగా ఉన్నామని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ హెచ్చరించారు. ఆదివారం ఓ మీడియా ప్రతినిధి అడిగిన ప్రశ్నకు సమాధానంగా ట్రంప్ ఈ విషయం చెప్పారు. దీనిపై అమెరికా ఆర్థిక మంత్రి స్కాట్ బెసెంట్ మరింత వివరణ ఇచ్చారు. యూరోపియన్ కమిషన్ అధ్యక్షుడు ఉర్సులా వాన్ డెర్ లెయెన్‌తో ట్రంప్ ఇప్పటికే మాట్లాడారని, యూరప్

మిగతా 2వ పేజీలో...

- రష్యాతో వ్యాపారం చేసే దేశాలపై సుంకాలు సరైందే: జెలెన్‌స్కీ
- 'సైడ్ ఇన్‌కం' ఉంటే బహిష్కరణే!.. హెచ్1బీ వీసాదార్లకు హెచ్చరిక
- ట్రంప్‌తో పంచాయితీ తెగకుంటే వచ్చే ఆర్థిక సంవత్సరం కష్టమే

కేంద్ర ప్రభుత్వ ముఖ్య ఆర్థిక సలహాదారు అనంత నాగేశ్వరన్ 2

ధర కాసింత.. చల్లుడు కొండంత!

అవసరానికి మించి యూరియా వినియోగం

డీఏపీ, కాంప్లెక్స్ ధరలతో పోలిస్తే చవక

నిరుటికన్నా బాగా పెరిగిన అమ్మకాలు

అదును దాటాక చల్లినా దండగే!

యూరియా దొరక్క రైతుల్లో నిర్వేదం

ఆగ్రహంతో ఆందోళనలు.. రాస్తారోకోలు 14

జెరూసలెంలో కాల్పులు.. ఆరుగురి మృతి 2

ఇద్దరు పాలస్తీనీయుల ఘాతుకం.. కాల్చి చంపిన సైన్యం



ఆధార్ ఆధారమే!

దాంతో ఓటర్ గుర్తింపు కార్డు ఇవ్వాల్సిందే 10

ఆధార్ సరైనదో కాదో తేల్చే హక్కు ఈసీకి ఉంది

కేంద్ర ఎన్నికల సంఘానికి సుప్రీంకోర్టు ఆదేశం

ఆధార్ పౌరసత్వ గుర్తింపు కాదని స్పష్టీకరణ

---

1 నుంచి ధాన్యం కొనుగోళ్లు


కొన్ని జిల్లాల్లో 25 నుంచే కేంద్రాల ఏర్పాటు!

ఈ ఖరీఫ్‌లో కోటిన్నర టన్నుల వడ్ల దిగుబడి

కోటి టన్నులు కేంద్రాలకు వస్తుందని అంచనా

8 వేల కొనుగోలు కేంద్రాల ఏర్పాటు

నేడు రాష్ట్రానికి ఎఫ్‌సీఐ బృందం 3



కన్నకొడుకును నిప్పుపెట్టి చంపేశారు!

వ్యసనాలకు బానిసై వేధిస్తున్నాడని తల్లిదండ్రుల ఘాతుకం

సహకరించిన మరో కొడుకు

కర్ణాటకలో ఘటన.. నిందితుల అరెస్టు 2

మల్లెపూలు తీసుకెళ్లినందుకు 1.14 లక్షల జరిమానా



(మొదటి పేజీ తరువాయి)

విధించారు! మలయాళ నటి నవ్య నాయర్ ఆస్ట్రేలియాలోని విక్టోరియాలో మలయాళీ అసోసియేషన్ నిర్వహించిన ఓనం వేడుకల్లో పాల్గొనేందుకు వెళ్లారు. ఈ సమయంలో తన తోపాటు హ్యాండ్‌బ్యాగులో 15 సెంటీమీటర్ల మల్లెపూల దండను తీసుకెళ్లినందుకు మెల్‌బోర్న్ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్‌లో ఆమెకు రూ.1.14 లక్షల జరిమానా విధించారు. అయితే ఇది అనుకోకుండా జరిగిందని ఆమె చెప్పారు. మల్లెపూలు తెచ్చుకోవడం అక్కడ చట్ట వ్యతిరేకమని తనకు తెలియదని పేర్కొన్నారు. అక్కడి అధికారులు తనను 1,980 ఆస్ట్రేలియన్ డాలర్ల(రూ.1.14 లక్షలు) జరిమానా చెల్లించాలని కోరారని తెలిపారు. కాగా మెల్‌బోర్న్ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్‌లో కఠినమైన 'బయో సెక్యూరిటీ' చట్టాలు అమలులో ఉన్నాయి. విదేశాల నుంచి వచ్చేవారు తమ వెంట పూలు, పండ్లు, విత్తనాలతోపాటు పాల ఉత్పత్తులు, పలు స్వీట్లు తేకుండా నిషేధించారు. వాటివల్ల తోటి ప్రయాణికులకు, తమ దేశంలో ప్రజలకు వ్యాధులు, తెగుళ్లు సోకే ప్రమాదం ఉందని ఇటువంటి నిబంధనలు విధించారు. అయితే ఈ ఘటనతో నవ్య నాయర్ విచారానికి గురవకుండా విక్టోరియాలో ఓనం వేడుకల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు.

జెరూసలెంలో కాల్పులు.. ఆరుగురి మృతి

» గాజాపై హరికేన్ తరహా దాడి చేస్తామన్న ఇజ్రాయెల్

జెరూసలెం, సెప్టెంబరు 8: యూదుల పవిత్ర స్థలమైన ఇజ్రాయెల్‌లోని జెరూసలెంలో జరిగిన కాల్పుల్లో ఆరుగురు మృతిచెందారు. 12 మంది గాయపడ్డారు. జెరూసలెంలోని రమోత్ జంక్షన్ బస్టాప్ వద్దకు వాహనంపై వచ్చిన ఇద్దరు పాలస్తీనా సాయుధులు విచక్షణారహితంగా కాల్పులు జరిపారు. ఈ కాల్పుల్లో మృతిచెందిన ఆరుగురిలో 30 ఏళ్లలోపు వారు ముగ్గురున్నారు. ఓ గర్భిణి కూడా కాల్పుల్లో గాయపడినట్లు అధికారులు తెలిపారు. మరోవైపు కాల్పులకు పాల్పడిన సాయుధులను ఇజ్రాయెల్ సైన్యం హతమార్చింది. ఘటనా స్థలాన్ని ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు పరిశీలించారు. కాల్పుల నేపథ్యంలో జెరూసలెంలో భద్రతను కట్టుదిట్టం చేశారు. మరోవైపు, తమ బందీలను విడిచిపెట్టకుంటే గాజాపై విరుచుకుపడతామని ఇజ్రాయెల్ రక్షణ మంత్రి కాట్జ్ హెచ్చరించారు. హరికేన్ తరహాలో దాడి చేస్తామన్నారు. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ కూడా హమా‌స్‌కు ఇదే చివరి వార్నింగ్ అని హెచ్చరించారు.

15 రోజుల బిడ్డను ఫ్రీజర్‌లో పెట్టి మర్చిపోయిన తల్లి

మొరాదాబాద్, సెప్టెంబరు 8: తన 15 రోజుల బిడ్డను ఓ తల్లి ఫ్రీజర్‌లో పెట్టి మర్చిపోయింది. ఆ శిశువు చలికి గుక్కపట్టి ఏడవడంతో కుటుంబ సభ్యులు గమనించి ఆస్పత్రికి తరలించడంతో ప్రాణాపాయం తప్పింది. ఉత్తరప్రదేశ్‌లోని మొరాదాబాద్‌లో చోటుచేసుకున్న ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. శుక్రవారం రాత్రి బిడ్డను నిద్రపుచ్చిన తల్లి.. అలాగే ఆ శిశువును ఫ్రీజర్‌లో పెట్టి నిద్రపోయింది. అయితే కొద్ది నిమిషాలకే ఆ బిడ్డ చలికి తట్టుకోలేక బిగ్గరగా ఏడవడం ప్రారంభించాడు. దీంతో బిడ్డ కోసం ఇల్లంతా వెతికిన కుటుంబ సభ్యులు ఫ్రీజర్‌లో ఉన్నట్లు గుర్తించి బయటకు తీసి ఆస్పత్రికి తరలించారు. ఆ శిశువుకు చికిత్స అందించిన వైద్యులు.. ప్రాణాలకు ఏ ప్రమాదం లేదని తెలిపారు. అయితే సదరు మహిళ ప్రసవానంతర మానసిక సమస్యల (పోస్ట్‌పార్టమ్ సైకోసిస్)తో బాధపడుతున్నట్లు వైద్య పరీక్షల్లో తేలింది. దీంతో చికిత్స నిమిత్తం ఆమెను కుటుంబ సభ్యులు ఆస్పత్రిలో చేర్చారు. కాగా, ప్రసవానంతరం హార్మోన్లలో మార్పులు, మానసిక ఒత్తిడి కారణంగా కొందరు మహిళలకు పోస్ట్‌పార్టమ్ సైకోసిస్ రావచ్చని.. దీంతో వారు తీసుకునే అసంబద్ధ నిర్ణయాలు బిడ్డకు హానీ చేయొచ్చని వైద్యులు చెబుతున్నారు. ముందే గుర్తించి చికిత్స అందిస్తే నయం చేయొచ్చంటున్నారు.

ట్రంప్ సవాళ్లను ఉమ్మడిగా ఎదుర్కొందాం

» బ్రిక్స్ దేశాలకు జిన్‌పింగ్ పిలుపు



బీజింగ్, సెప్టెంబరు 8: అమెరికా అధ్యక్షుడు ట్రంప్ సుంకాల రూపంలో విసురుతున్న సవాళ్లను ఉమ్మడిగా ఎదుర్కోవాలని చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ బ్రిక్స్ దేశాల నేతలకు పిలుపునిచ్చారు. ట్రంప్ ప్రకటించిన సుంకాల యుద్ధం ప్రపంచ ఆర్థిక వ్యవస్థను తీవ్రంగా దెబ్బతీసిందని, అంతర్జాతీయ వాణిజ్య నిబంధనలను పూర్తిగా విస్మరించిందని చెప్పారు. బ్రెజిల్, రష్యా, ఇండియా, చైనా, దక్షిణ అమెరికా దేశాల కూటమి అయిన 'బ్రిక్స్' నేతల సదస్సు సోమవారం వీడియో కాన్ఫరెన్స్ రూపంలో జరిగింది. దీనిని బ్రెజిల్ అధ్యక్షుడు లులా డి సిల్వా నిర్వహించారు. ఈ సందర్భంగా జిన్‌పింగ్ ప్రసంగిస్తూ ఆధిపత్యవాదం, ఏకపక్ష వాదం, రక్షణవాదం రోజురోజుకూ పెరుగుతున్నాయని ఇవి వాణిజ్య యుద్ధాలకు దారి తీస్తున్నాయని తెలిపారు. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ పేరు పెట్టకుండా ఆయన ఈ విమర్శ చేశారు. అమెరికా ప్రాబల్యానికి వ్యతిరేకంగా ఆయన గ్లోబల్ గవర్నెన్స్ ఇనిషియేటివ్ (జీజీఐ)ని ప్రతిపాదించారు. ఈ సదస్సులో ప్రధాని మోదీ తరఫున విదేశాంగ మంత్రి జైశంకర్ మాట్లాడుతూ ఆర్థిక విధానాలు న్యాయబద్ధంగా, పారదర్శకంగా ఉండాలని సూచించారు.

రష్యా చమురు.. 'నెత్తుటి సొమ్ము': నవారో

న్యూయార్క్, సెప్టెంబరు 8: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వాణిజ్య సలహాదారు పీటర్ నవర్రో సోమవారం మరోసారి భారత్‌పై విమర్శలు చేశారు. రష్యా నుంచి భారత్ కొనుగోలు చేస్తున్న ముడి చమురును 'బ్లడ్ మనీ' (నెత్తుటి సొమ్ము) అని వ్యాఖ్యానించారు. ఎక్స్‌లో పోస్టు పెడుతూ "వాస్తవం: ఉక్రెయిన్‌పై రష్యా దాడి చేయడానికి ముందు భారత్ రష్యా నుంచి భారీగా చమురు కొనుగోలు చేయలేదు. ఇప్పుడు కొనుగోలు చేస్తోంది. ఇది నెత్తుటి సొమ్ము. ప్రజలు చనిపోతున్నారు" అని పేర్కొన్నారు. అంతకుముందు కూడా ఇలాంటి విమర్శలే చేశారు.

రష్యాతో వ్యాపారం చేసే దేశాలపై సుంకాల పెంపు సరైన ఆలోచన: జెలెన్‌స్కీ



వాషింగ్టన్, సెప్టెంబరు 8: రష్యాతో వ్యాపారాలు చేసే దేశాలపై అమెరికా సుంకాలు పెంచడాన్ని ఉక్రెయిన్ అధ్యక్షుడు వొలొడ్మిర్ జెలెన్‌స్కీ సమర్థించారు. అది సరైన ఆలోచన అని వ్యాఖ్యానించారు. అయితే ఆయన ఎక్కడా భారత దేశం పేరును ప్రస్తావించలేదు. ఆదివారం ఓ టీవీ ఛానెల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన మాట్లాడుతూ 'రష్యాతో ఇంకా వ్యాపార లావాదేవీలు కొనసాగిస్తున్న దేశాలపై టారిఫ్‌లు పెంచడం మంచిదే. ఇది సరైన ఆలోచనే' అని అభిప్రాయపడ్డారు. భారత్‌పై టారిఫ్‌లు పెంచడం దుష్ఫలితాలు ఇచ్చిందా అన్న ప్రశ్నకు సమాధానంగా పై అభిప్రాయం వ్యక్తం చేశారు.

భగ్గుమన్న నేపాల్



నిరసనల్లో నినదిస్తున్న ఓ యువతి

(మొదటి పేజీ తరువాయి)



నేపాల్ పార్లమెంటు వైపు ర్యాలీగా వెళ్తున్న వేలాది మంది యువతీయువకులు

బుల్లెట్లతో కాల్పులు జరిపింది. ఈ ఘటనలో 12 ఏళ్ల బాలుడు సహా.. 20 మంది ప్రాణాలను కోల్పోయారు. మరో 400 మందికి పైగా యువకులకు గాయాలయ్యాయి. ఆ తర్వాత ప్రభుత్వం సోషల్ మీడియాను పునరుద్ధరించినా.. ముందుజాగ్రత్తగా కఠ్మాండూ సహా, పొఖారా తదితర జిల్లాలు, దేశ సరిహద్దుల వద్ద కర్ఫ్యూ విధించింది. శాంతిభద్రతల వైఫల్యానికి నైతిక బాధ్యత వహిస్తూ.. నేపాల్ హోంమంత్రి రమేశ్ లేఖక్ రాజీనామా చేశారు. భారత్ కూడా అప్రమత్తమైంది. ఇండో-నేపాల్ సరిహద్దుల్లో సశస్త్ర సీమాబల్(ఎస్ఎస్‌బీ) భద్రతను కట్టుదిట్టం చేసింది. నేపాల్‌తో సరిహద్దు పంచుకుంటున్న బిహార్‌లోని ఏడు జిల్లాలు-- పశ్చిమ చంపారన్, తూర్పు చంపారన్, సీతామర్హి, మధుబని, అరారియా, సుపౌల్, కిషన్‌గంజ్ జిల్లాల్లో హైఅలెర్ట్ ప్రకటించి, సరిహద్దులను మూసివేసింది.

చూస్తుండగానే పెరిగిన ఆందోళనలు



నేపాల్ సర్కారు ఈ నెల 3న ఫేస్‌బుక్, ఎక్స్, యూట్యూబ్ సహా.. 26 సామాజిక మాధ్యమాలపై నిషేధం విధించిన విషయం తెలిసిందే..! ఈ చర్య భావప్రకటన స్వేచ్ఛకు విఘాతం కల్పిస్తోందంటూ.. 30 ఏళ్లలోపు యువకులు(జెన్-జడ్) అందుబాటులో ఉన్న టిక్‌టాక్ వంటి సామాజిక మాధ్యమాల్లో ఉద్యమాన్ని లేవనెత్తారు. సోమవారం ఉదయం నుంచి ఒక్కొక్కరుగా రోడ్డెక్కారు. అలా మధ్యాహ్నానికి సుమారు 12 వేల మంది యువకులు నిరసనల్లో పాల్గొన్నారు. దాంతో.. కఠ్మాండూ ప్రధాన రహదారులు జనసంద్రంగా మారాయి. క్రమంగా ఆందోళనకారులు పార్లమెంట్ భవనం వైపు దూసుకెళ్లారు. కొందరు యువకులు గేట్లపైకెక్కి.. పార్లమెంట్ ప్రాంగణంలోకి చొచ్చుకుపోయారు. నేపాల్ చరిత్రలోనే ఆందోళనకారులు పార్లమెంట్ ప్రాంగణంలోకి చొచ్చుకురావడం ఇదే మొదటిసారి. దీంతో అక్కడున్న భద్రతాబలగాలు, సైన్యం వాటర్ కెనాన్‌లు, భాష్ప వాయు గోళాలతో వారిని అడ్డుకునే ప్రయత్నం చేశాయి. ఆందోళనకారులు కూడా తమ వద్ద పడిన భాష్ప వాయు గోళాలు, రాళ్లు, చెట్ల కొమ్మలతో ఎదురుదాడికి దిగడంతో.. రబ్బర్ బుల్లెట్లతో కాల్పులు జరిపాయి. ఈ ఘటనలో 20 మంది మృతిచెందారు. క్షతగాత్రుల్లో 10 మంది పరిస్థితి ఆందోళనకరంగా ఉంది. నిరసనకారులు రాళ్లు రువ్విన ఘటనలో 178 మంది నేపాల్ పోలీసులు, 30 మంది సాయుధ బలగాలకు గాయాలయ్యాయి. ఈ పరిస్థితుల్లో ప్రభుత్వం సామాజిక మాధ్యమాలపై నిషేధాన్ని ఎత్తివేస్తున్నట్లు ప్రకటన చేసింది. ఆ మేరకు మధ్యాహ్నం 3.30 నుంచి ఫేస్‌బుక్ వంటి సోషల్‌మీడియా ప్లాట్‌ఫారాలు నేపాల్‌లో తిరిగి పనిచేశాయి. అటు భద్రత బలగాలు రాష్ట్రపతి, ఉపరాష్ట్రపతి, ప్రధాని ఇళ్లకు కట్టుదిట్టమైన భద్రత కల్పించాయి. అయితే.. నేపాల్ కాలమానం ప్రకారం అర్ధరాత్రి సమయంలో ఆందోళనకారులు ప్రధాని కేపీ శర్మ ఓలి ఇంటిపై రాళ్లు రువ్వారు. దీంతో, పోలీసులు గాల్లోకి కాల్పులు జరిపారు.

ఏడు జిల్లాల్లో కర్ఫ్యూ

యువత ఆందోళన సోమవారం అర్ధరాత్రికి నేపాల్ వ్యాప్తంగా విస్తరించింది. 7జిల్లాల్లో హింస నమోదైంది. ఈ జిల్లాల్లో కర్ఫ్యూ విధించారు. కాగా.. యువత ఆందోళనలకు మాజీ ప్రధాని పుష్పకమల్ దహాల్(ప్రచండ) మద్దతు పలికారు. విదేశాల్లో నివసిస్తున్న నేపాలీలు కూడా జెన్-జడ్ ఉద్యమానికి మద్దతిచ్చారు.

కేపీ శర్మ ఓలి.. దిగిపో

సోషల్ మీడియాపై నిషేధానికి వ్యతిరేకంగా ప్రారంభమైన ఉద్యమం కాస్తా.. ప్రభుత్వ చర్యలు, మరణాలతో రూపాంతరం చెందింది. అవినీతికి వ్యతిరేక ఉద్యమంగా మారింది. ఆందోళనకారులు నేపాల్ ప్రధాని కేపీ శర్మ ఓలి దిగిపోవాలంటూ నినాదాలు చేశారు. ఆయనను ఒక దొంగగా పేర్కొంటూ.. 'కేపీ చోర్' అనే ప్లకార్డులను ప్రదర్శించారు. ప్రభుత్వం అప్రమత్తమై.. అత్యవసరంగా జాతీయ భద్రత సమావేశాన్ని ఏర్పాటు చేసింది. యువతపై కాల్పులను నేపాల్ విపక్షాలు తీవ్రంగా ఖండించాయి. సీపీఎన్(మావోయిస్టు సెంటర్) డిప్యూటీ జనరల్ సెక్రటరీ బర్షమన్ పున్, ఎన్‌సీపీ ప్రధాన కార్యదర్శి కబీంద్రతోపాటు.. కాంగ్రెస్-యూఎంఎల్, రాష్ట్రీయ ప్రజాతంత్ర పార్టీ(ఆర్పీపీ), సీపీఎన్(యూఎంఎల్), సోషలిస్టు పార్టీలు ఈ మేరకు వేర్వేరుగా ప్రకటనలు చేశాయి. ఒక్క హోంమంత్రి రాజీనామాతో సరిపోదని కేపీ శర్మ ఓలి సహా.. మంత్రిమండలి రాజీనామా చేయాలని ఆయా పార్టీల నేతలు డిమాండ్ చేశారు. వీరికి మంత్రి మండలిలో కూర్చునే నైతిక అర్హత లేదన్నారు.



నిరసనకారుల దాడిలో గాయపడిన పోలీస్

అమెరికా పాత్ర?

నేపాల్ ఆందోళనల వెనక అమెరికా పాత్ర ఉందంటూ నేపాలీ పత్రికల అనుబంధ వెబ్‌సైట్లు కథనాలను ప్రచురించాయి. అందుకే సోషల్ మీడియా నిషేధానికి వ్యతిరేకంగా జరిగిన ఉద్యమం కాస్తా.. 'కేపీ శర్మ ఓలి దిగిపో' అనే నినాదం వైపు మళ్లినట్లు విశ్లేషించాయి. ఓలి చైనాకు ఆప్తుడు అనే విషయం తెలిసిందే..! అయితే.. ఇటీవలి కాలంలో అమెరికా నేపాల్‌లో ప్రాజెక్టులను చేపట్టింది. అందుకే.. ఆర్థిక, దౌత్య మద్దతును పెంచింది. మిలీనియం చాలెంజ్ కార్పొరేషన్(ఎంసీసీ) వంటి సంస్థలు రూ.లక్షల కోట్ల విలువైన ప్రాజెక్టులను నిర్వహిస్తున్నాయి. ఎన్ఎంబీ బ్యాంకుతో కలిసి నేపాల్ ప్రభుత్వం 2025లో అమెరికా అనుబంధ సంస్థలైన ఇంటర్నేషనల్ ఫైనాన్స్ కార్పొరేషన్(ఐఎఫ్‌సీ), బ్రిటిష్ ఇంటర్నేషనల్ ఇన్వెస్ట్‌మెంట్(బీఐఐ) ద్వారా 60 మిలియన్ డాలర్ల 'గ్రీన్ బాండ్' ఒప్పందాన్ని కుదుర్చుకుంది. ఇటీవల ప్రధాని ఓలి తీసుకున్న పలు నిర్ణయాలతో కొన్ని అమెరికా ప్రాజెక్టులకు బ్రేకులు పడ్డాయి. దీంతో.. ఓలికి వ్యతిరేకంగా ఉద్యమాన్ని అమెరికా తెరవెనక ఉండి నడుపుతోందని నేపాలీ పత్రికలు పేర్కొన్నాయి.

లోకం తీరు



సోషల్ మీడియాపై నిషేధం ఎందుకు?

విద్వేషపూరిత ప్రసంగాలు, ఫేక్ ప్రొఫైల్స్, సైబర్ నేరాలు, ఫేక్‌న్యూస్ వ్యాప్తి వంటి కేసులను విచారించిన సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు నేపాల్ ప్రభుత్వం ఐటీ, కమ్యూనికేషన్స్ చట్టం ప్రకారం సామాజిక మాధ్యమాలన్నీ రిజిస్టర్ చేసుకోవాలని గత నెల 28న ఆదేశాలిచ్చింది. అందుకోసం వారం రోజులు గడువిచ్చింది. అలా రిజిస్ట్రేషన్ చేసుకున్న సంస్థలు ప్రభుత్వం కోరిన సమాచారాన్ని అందించాల్సి ఉంటుంది. అభ్యంతరకరమైన పోస్టులను తొలగించాలని పేర్కొంటే.. సామాజిక మాధ్యమ సంస్థలు ఆ ఆదేశాలను పాటించాల్సి ఉంటుంది. ప్రభుత్వం, పౌరులు ఇచ్చే లీగల్ నోటీసులకు కచ్చితంగా స్పందించేందుకు నేపాల్‌లో అధికారులను నియమించాలి. టిక్‌టాక్, వైబర్, విట్క్, నిబంజ్, పోపోలైవ్ వంటి సంస్థలు రిజిస్ట్రేషన్ చేసుకున్నాయి. టెలిగ్రామ్, గ్లోబల్ డైరీ సంస్థలు రిజిస్ట్రేషన్‌కు దరఖాస్తు చేసుకోగా.. ఆమోదం పెండింగ్‌లో ఉంది. ఫేస్‌బుక్, ఎక్స్, యూట్యూబ్ సహా.. 26 సామాజిక మాధ్యమ సంస్థలు మాత్రం రిజిస్ట్రేషన్‌కు సుముఖంగా లేవు. భారత్‌లో ఇలాంటి నిబంధనకు కట్టుబడిన ఆయా సంస్థలు తమ దేశంలో విముఖంగా ఉండడంతో.. ప్రభుత్వం ఈ నెల 3న వాటిని నిషేధించింది.

ఢిల్లీలో ఫులేరా సర్కారు!

» సీఎం రేఖాగుప్తా భర్త ఏ హోదాతో అధికారిక భేటీలో పాల్గొన్నారు: ఆప్

న్యూఢిల్లీ, సెప్టెంబరు 8: అధికారిక కార్యక్రమంలో ఢిల్లీ సీఎం రేఖాగుప్తాతో పాటు ఆమె భర్త కూడా పాల్గొనడం రాజకీయ దుమారానికి దారి తీసింది. ఢిల్లీలోని షాలిమార్ బాగ్ నియోజకవర్గంలో పలు అభివృద్ధి ప్రాజెక్టులపై ఆదివారం ముఖ్యమంత్రి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఇందులో అధికారులతో పాటు ఆమె భర్త మనీష్ గుప్తా కూడా పాల్గొన్నారు. నియోజకవర్గంలో జరుగుతున్న పనుల పురోగతిపై ఎప్పటికప్పుడు సమగ్ర నివేదిక సమర్పించాలని సీఎం రేఖ అధికారులను ఆదేశించారు. ఈ సమావేశానికి సంబంధించిన వివరాలు, ఫొటోలను సీఎంవో ఎక్స్‌లో షేర్ చేసింది. ఆ ఫొటోలో పసుపుపచ్చ రంగు చొక్కా ధరించిన మనీష్ గుప్తా, తన భార్య రేఖ పక్క కుర్చీలో కూర్చొని ఉన్నారు. దీనిపై ప్రతిపక్షాలు విమర్శలు గుప్పించాయి. అధికారిక సమావేశంలో సీఎం భర్త ఎందుకు కూర్చున్నారని ఆప్ నేత సౌరభ్ భరద్వాజ్ ప్రశ్నించారు. ప్రభుత్వంతో సంబంధం లేని వ్యక్తిని అధికారిక సమావేశాల్లో కూర్చోబెట్టడం రాజ్యాంగ విరుద్ధమని పేర్కొన్నారు. ఢిల్లీలో 'ఫులేరా' తరహా ప్రభుత్వం నడుస్తోందా? అని ప్రశ్నించారు. పంచాయత్ అనే వెబ్ సిరీస్‌లో 'ఫులేరా' గ్రామానికి సర్పంచ్ మహిళ కాగా.. అక్కడ ఆమె భర్త పెత్తనం చెలాయిస్తుంటాడు. ఈ నేపథ్యంలోనే ఆప్ నేత 'ఫులేరా' సర్కారు అంటూ విమర్శలు గుప్పించారు. "ఢిల్లీలో 'ఫులేరా' ప్రభుత్వం నడుస్తోందా? కుటుంబ పాలనపై కాంగ్రె‌స్‌ను విమర్శించే బీజేపీ.. దీనికి సమాధానం చెప్పాలి. ఇది కుటుంబ పాలన కాదా?" అని సౌరభ్ భరద్వాజ్ ఎక్స్‌లో ప్రశ్నించారు. ఆప్ మరో నేత సంజయ్ సింగ్.. "ప్రధాని మోదీ ఢిల్లీకి ఇద్దరు సీఎంలను నియమించారు" అని విమర్శలు గుప్పించారు. అయితే, అధికారిక సమావేశంలో మనీష్ కూర్చోవడాన్ని బీజేపీ సమర్థించుకుంది. అందులో తప్పేమీ లేదంది. "మనీష్ కేవలం సీఎం రేఖ భర్త మాత్రమే కాదు. ఆయనో సామాజిక కార్యకర్త. షాలిమార్‌బాగ్ నియోజకవర్గంలో జరిగే పనులను పర్యవేక్షిస్తుంటారు. స్థానిక ప్రజల ప్రతినిధిగా ఉన్నారు. ఆ హోదాలోనే ఆయన సమావేశంలో కూర్చున్నారు. ఆ సమావేశంలో కొందరు స్థానికులు కూడా ఉన్నారు" అని ఢిల్లీ బీజేపీ నేత హరీశ్ ఖురానా చెప్పారు.

ఉప రాష్ట్రపతి ఎన్నిక నేడే!

(మొదటి పేజీ తరువాయి)



రాధాకృష్ణన్, సుదర్శన్‌రెడ్డి

వెలువరించిన జస్టిస్ సుదర్శన్‌రెడ్డిలలో ఎవర్ని రెండవ రాజ్యాంగ ఉన్నత పదవి అయిన ఉపరాష్ట్రపతి పదవికి ఉభయ సభల పార్లమెంట్ సభ్యులు ఎన్నుకుంటారో అన్నది మంగళవారం సాయంత్రానికి తేలనుంది. సంఖ్యాబలం రీత్యా చూస్తే ఎన్డీఏ అభ్యర్థి మెజారిటీ ఓట్లతో నెగ్గే అవకాశాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. ఇరు వర్గాలు ఈ ఎన్నికలో సాధ్యమైనన్ని ఎక్కువ ఓట్లు సాధించేందుకు శాయశక్తులా కృషి చేస్తున్నాయి.

ఓటేసేది 770 మందే

మంగళవారం ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 వరకు ఓటింగ్ ప్రక్రియ కొనసాగుతుంది. సాయంత్రం 6 గంటలకు ఓట్ల లెక్కింపు జరుగుతుంది. లోక్‌సభలో ఒక సీటు ఖాళీగా ఉన్న రీత్యా 542 మంది సభ్యులు, రాజ్యసభలో ఆరు సీట్లు ఖాళీ ఉన్న రీత్యా 239 మంది సభ్యులు ఓటింగ్ లో పాల్గొనాల్సి ఉంది. ఉభయ సభల్లో మొత్తం 781 మంది సభ్యులు ఓటింగ్ లో పాల్గొనాల్సి ఉండగా బీజేడీ నుంచి ఏడుగురు, బీఆర్ఎస్ నుంచి నలుగురు ఓటింగ్‌కు గైరు హాజరు కావాలని నిర్ణయించడంతో కేవలం 770 మంది మాత్రమే ఓటింగ్‌లో పాల్గొననున్నారు. వీరిలో 386 ఓట్లు ఎవరికి లభిస్తే వారు ఉప రాష్ట్రపతి అవుతారు.

ఇండీ కూటమి 42 ఓట్ల దూరం

జస్టిస్ బి.సుదర్శన్‌రెడ్డికి కాంగ్రెస్, సమాజ్‌వాదీ, తృణమూల్ కాంగ్రెస్, డీఎంకే, శివసేన(ఉద్ధవ్ థాకరే), ఎన్సీపీ(శరద్ పవార్), ఆర్జేడీ, సీపీఎం, సీపీఐ, ఐయూఎంఎల్, జేఎంఎం, సీపీఐఎంఎల్, నేషనల్ కాన్ఫరెన్స్, వీసీకే, భారత్ ఆదివాసీ పార్టీ, కేరళ కాంగ్రెస్, ఎండీఎంకే, ఆర్ఎల్‌టీపీ, ఆర్ఎస్‌పీ, ఎంఎన్ఎం(కమల్ హాసన్) ఏజీఎం, కేరళ కాంగ్రెస్(మణి) మద్దతును ప్రకటించాయి. ఇండియా కూటమికి కనీసం 324 ఓట్లు లభించే అవకాశాలున్నాయి. దాదాపు 100 ఓట్లకు పైగా వ్యత్యాసం కనిపిస్తున్నప్పటికీ సంఖ్యాబలం పెంచుకోవడానికి ఇరు వర్గాలు కొద్ది రోజులుగా గట్టి ప్రయత్నాలు చేస్తున్నాయి. బీజేపీ తన ఎంపీలను ఢిల్లీకి రప్పించి వర్క్‌షాప్ నిర్వహించింది. ఏపీ ఐటీ మంత్రి లోకేష్ స్వయంగా వచ్చి తెలుగుదేశం ఎంపీలందరితో సమావేశం ఏర్పాటు చేశారు. ఒక్క ఓటు కూడా వృధా కానివ్వొద్దని, రాధాకృష్ణన్ గెలుపు ప్రజాస్వామ్యానికి అవశ్యమని సూచించారు. ఇండీ కూటమి కూడా తమ ఎంపీలందర్నీ ఢిల్లీలో మోహరించింది. కాంగ్రెస్ తన ఎంపీలతో మాక్ ఓటింగ్ నిర్వహించి, వారికి శిక్షణనిచ్చింది. జస్టిస్ సుదర్శన్‌రెడ్డి దేశవ్యాప్తంగా పర్యటించి, ఇండియా కూటమి నేతలను కలుసుకున్నారు. కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గే కూటమి నేతలందరితోనూ ఫోన్‌లో మాట్లాడుతున్నారు. ఒక్క ఓటు కూడా వృధా కాకుండా అందర్నీ రప్పించే ప్రయత్నం చేస్తున్నారు.

ఎన్డీఏకి గెలిపించేంత బలం

ఎన్డీఏకు ఇప్పటికే 422 మంది సంఖ్యాబలం (లోక్‌సభలో 293, రాజ్యసభలో 129) ఉన్నది. బీజేపీకి టీడీపీ, జేడీయూ, శివసేన(షిండే) లోక్ జనశక్తి(చిరాగ్ పశ్వాన్), అన్నాడీఎంకే, జేడీఎస్, జనసేన, రాష్ట్రీయ లోక్‌దళ్, అప్నాదళ్(సోనేలాల్), ఎన్సీపీ అజిత్ పవార్ వర్గం, ఆల్ జార్ఖండ్ స్టూడెంట్స్ యూనియన్, హిందూస్తానీ ఆవామ్ మోర్చా, సిక్కిం క్రాంతికారీ మోర్చా, ఏజీపీ, యుపిపిఎల్, ఎన్‌పీపీ, ఆర్ఎల్ఎం, టీఎంసీ, ఆర్‌పీఐ, వైసీపీ, పలువురు స్వతంత్ర సభ్యులు, నామినేటెడ్ సభ్యులు మద్దతునిస్తున్నారు.

కన్నకొడుకును నిప్పుపెట్టి చంపేశారు!

వ్యసనాలకు బానిసై వేధిస్తున్నాడని తల్లిదండ్రుల ఘాతుకం



అనిల్ (ఫైల్)

బెంగళూరు, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): మద్యం, ఆన్‌లైన్ బెట్టింగ్‌లకు బానిసై వేధిస్తున్న కుమారుడిని తల్లిదండ్రులు, సోదరుడు మూకుమ్మడిగా కడతేర్చారు. కాళ్లూ చేతులు కట్టేసి, అతనిపై డీజిల్ పోసి నిప్పంటించారు. కర్ణాటక రాష్ట్రం బీదరి గ్రామంలో ఈ నెల 5న ఈ ఘటన జరిగింది. గ్రామానికి చెందిన పరప్ప, శాంతి దంపతుల కుమారుడు అనిల్ పరప్ప కానట్టి(32) మద్యానికి బానిసయ్యాడు. ఆన్‌లైన్ బెట్టింగ్‌లు ఆడుతూ, విలాసవంతంగా జీవించేవాడు. వ్యసనాల కోసం ఇప్పటికే అతను చేసిన రూ.20 లక్షల అప్పును తల్లిదండ్రులు తీర్చారు. తాజాగా మరో రూ.5 లక్షలు అప్పు చేశాడు. ఆస్తిలో వాటా ఇవ్వాలని తల్లిదండ్రులను వేధించడం ప్రారంభించాడు. పొలాన్ని ఇస్తే అమ్మేస్తాడని తల్లిదండ్రులు భావించారు. ఈ క్రమంలో ఉద్యోగార్థం వేరే ప్రాంతంలో ఉంటున్న అనిల్ తమ్ముడు బసవరాజ కానట్టి ఇటీవల సెలవులపై స్వగ్రామానికి వచ్చాడు. అతడితోనూ అనిల్ గొడవపడ్డాడు. చేతికి చిక్కిన వస్తువులతో తల్లిదండ్రులపై దాడి చేశాడు. దీంతో అందరూ కలిసి అతడి కళ్లలో కారం చల్లి బంధించారు. కాళ్లు, చేతులు కట్టేసి, ఒంటిపై డీజిల్ పోసి నిప్పంటించారు. ముగ్గురు నిందితులను పోలీసులు అరెస్టు చేశారు.

'సైడ్ ఇన్‌కం' ఉంటే బహిష్కరణే!

» హెచ్1బీ, ఎఫ్1 వీసాదారులకు అమెరికా హెచ్చరిక

వాషింగ్టన్, సెప్టెంబరు 8: అమెరికాలో వలసదారులకు దేశ బహిష్కరణ ముప్పు తీవ్రమైంది. హెచ్1బీ, ఎఫ్1 వీసాదారులు అనధికారికంగా ఉద్యోగాలు చేస్తున్నట్లు తేలితే ముప్పు తప్పదని ఇమ్మిగ్రేషన్ అధికారులు హెచ్చరిస్తున్నారు. అనధికారిక ఉద్యోగాలు(సైడ్ జాబ్స్) చేసేవారిని గుర్తించేందుకు ఇమ్మిగ్రేషన్ అధికారులు ఐఆర్ఎస్(ఇంటర్నల్ రెవెన్యూ సర్వీస్) సమాచారంపై ఎక్కువగా ఆధారపడుతున్నారు. హెచ్1బీ లేదా ఎఫ్-1 వీసాదారులు అనధికారికంగా ఉద్యోగాలు చేస్తూ ఆదాయం పొందుతున్నట్టు గుర్తిస్తే అలాంటి వారికి వీసా నిరాకరించడం, దేశంలోకి ప్రవేశాన్ని నిరాకరించడంతోపాటు దేశం నుంచి బహిష్కరణకు గురయ్యే అవకాశం కూడా ఉందని తాజాగా ఒక ఆంగ్ల పత్రిక కథనం వెల్లడించింది. సైడ్ ఇన్‌కంను గుర్తించేందుకు పన్నుల రికార్డులను క్షుణ్ణంగా పరిశీలిస్తున్నట్టు ఆ కథనం పేర్కొంది. 'ఐఆర్ఎస్ స్పష్టంగా ఐసీఈ(ఇమ్మిగ్రేషన్ అండ్ కస్టమ్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్)తో సమాచారాన్ని పంచుకుంటోంది. అనధికారికంగా ఉద్యోగాలు చేసేవారిని గుర్తించి చర్యలు చేపట్టే ప్రక్రియను మేం ప్రారంభించాం' అని ఇమ్మిగ్రేషన్ అటార్నీ జత్ షావో తెలిపారు.

రెండో దశ సుంకాలు!

(మొదటి పేజీ తరువాయి)

దేశాలు (ఈయూ) కూడా కలిసి వస్తే.. రెండో దశ సుంకాలు విధించి రష్యా మీద ఒత్తిడి పెంచుతామన్నారు. ఫలితంగా రష్యా ఆర్థికవ్యవస్థ కుప్పకూలుతుందని, పుతిన్ చర్చలకు రాక తప్పని పరిస్థితి నెలకొంటుందని స్కాట్ పేర్కొన్నారు. ఉక్రెయిన్-రష్యా యుద్ధంపై స్పందిస్తూ.. 'ఉక్రెయిన్ సైన్యం ఎంతకాలం ఎదుర్కొంటుంది.. రష్యా ఆర్థిక వ్యవస్థ ఎంతకాలం తట్టుకొని నిలబడగలుగుతుంది అన్నదే ప్రధానం. ఈ రెండింటి మధ్యే ఇప్పుడు రేసు నడుస్తోంది' అని స్కాట్ వివరించారు. మరోవైపు, అమెరికా వాణిజ్య భాగస్వామ్య దేశాలపై ట్రంప్ విధించిన సుంకాలు చట్టవ్యతిరేకమని దేశ సుప్రీంకోర్టు కొట్టేస్తే.. వాటిలో సగమైనా ఆయా దేశాలకు, సంస్థలకు తక్షణం తిరిగి చెల్లించాల్సి ఉంటుందని స్కాట్ బెసెంట్ తెలిపారు. అదే పరిస్థితి వస్తే ఆర్థికశాఖకు మోయలేని భారం అవుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. సుప్రీంకోర్టు ఆదేశిస్తే వాటిని పాటించకతప్పదని స్పష్టం చేశారు. ట్రంప్ విధించిన సుంకాలు చట్టవ్యతిరేకమని గత నెల అమెరికాలో ఒక దిగువస్థాయి కోర్టు తీర్పునిచ్చిన విషయం తెలిసిందే. దీనిపై ప్రభుత్వం సుప్రీంకోర్టులో అప్పీల్ దాఖలు చేసింది.

ట్రంప్‌తో పంచాయితీ తెగకుంటే వచ్చే ఆర్థిక సంవత్సరం కష్టమే

» భారత ఆర్థిక సలహాదారు అనంత నాగేశ్వరన్

న్యూఢిల్లీ, సెప్టెంబరు 8: ట్రంప్ టారిఫ్‌ల మోత కారణంగా భారత్ వృద్ధిరేటులో 0.5% నుంచి 0.6% వరకు కోత పడవచ్చని భారత ముఖ్య ఆర్థిక సలహాదారు వి.అనంత నాగేశ్వరన్ అన్నారు. బ్లూమ్‌బెర్గ్ టీవీ చానెల్‌కు ఆయన ఇంటర్వ్యూ ఇచ్చారు. రష్యా చమురు కొనుగోలు కారణంగా భారత్ మీద అదనంగా వేసిన ప్రతీకార ట్యారిఫ్‌ల వ్యవహారం కొంతకాలమే ఉంటుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ ట్యారిఫ్‌ల అనిశ్చితి వచ్చే ఆర్థిక సంవత్సరానికి కూడా కొనసాగితే మాత్రం ప్రభావం తీవ్రంగా ఉంటుందని, భారత్‌కు ముప్పు తప్పదని హెచ్చరించారు. 2026 మార్చితో ముగిసే ఆర్థిక సంవత్సరానికి భారత ప్రభుత్వం 6.3 నుంచి 6.8 శాతం వృద్ధిరేటును ఆశిస్తోంది. మొదటి మూడు నెలల వృద్ధిరేటు భారీగా 7.8 శాతం నమోదైన నేపథ్యంలో భారత్ భారీ అంచనాల్లో ఉంది. జీఎస్టీ సంస్కరణలతో పన్నురేట్లు భారీగా తగ్గడం, ద్రవ్యోల్బణం బాగా తగ్గిపోవడం ఆర్థిక వ్యవస్థల మీద ఆశలు రేకెత్తిస్తున్నాయని నాగేశ్వరన్ చెప్పారు.

ఏ దేశంలో వారికి ఆ దేశంలోనే!

» వలసేతర వీసాల ఇంటర్వ్యూలపై అమెరికా రూల్స్ టఫ్

న్యూఢిల్లీ, సెప్టెంబరు 8: వలసేతర వీసా(నాన్ ఇమ్మిగ్రెంట్).. బీ-1(వ్యాపారం), బీ-2(పర్యాటకం) ఇంటర్వ్యూలకు సంబంధించిన నిబంధలను మరింత కఠినతరం చేస్తూ అమెరికా విదేశాంగ శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. దీని ప్రకారం వలసేతర వీసా కోసం దరఖాస్తు చేసుకున్న వారు ఇక నుంచి వారి స్వదేశంలో లేదా, చట్టపరమైన నివాసం ఉన్న ప్రాంతాల్లో మాత్రమే ఇంటర్వ్యూలకు హాజరు కావాల్సి ఉంటుంది. ఈ ఉత్తర్వులు భారతీయులు సహా అన్ని దేశాల పౌరులకు వర్తిస్తాయని, తక్షణమే అమల్లోకి వస్తాయని విదేశాంగ శాఖ స్పష్టం చేసింది. స్వల్ప కాలంలో ఇంటర్వ్యూలు పొందాలనుకునే వారు ఇప్పటి వరకు వారు పనిచేస్తున్న దేశాల నుంచి వలసేతర వీసాలకు దరఖాస్తు చేసుకుని, అక్కడే ఇంటర్వ్యూలకు హాజరయ్యేవారు. తాజా నిబంధనతో వీరు ఇకపై ఆ అవకాశాన్ని కోల్పోనున్నారు. "దరఖాస్తుదారులు వారి స్వదేశం లేదా చట్టపరమైన నివాసం ఉన్న ప్రాంతాల్లోని అమెరికా దౌత్యకార్యాలయాలు, కాన్సులేట్‌లలో మాత్రమే ఇంటర్వ్యూలకు అర్హులు." అని ఉత్తర్వుల్లో అధికారులు పేర్కొన్నారు.

ఎంపీసీలో చరిత్ర... బైపీసీలో జాగ్రఫీ

- ఏపీలో సరికొత్త ఇంటర్ విద్య
- ఎలక్టివ్ విధానం తెచ్చిన వైవిధ్యమిది
- 24 సబ్జెక్టుల్లో ఏదైనా ఎంచుకోవచ్చు
- ఒకరోజు ఒక సబ్జెక్టుకే పరీక్షలు నిర్వహించేలా ప్రణాళిక

(అమరావతి, ఆంధ్రజ్యోతి)



ఇంటర్మీడియట్ విద్య రాష్ట్రంలో వినూత్నంగా మారింది. కూటమి ప్రభుత్వం ఇంటర్ విద్యలో కీలక సంస్కరణలు ప్రవేశపెట్టడంతో విద్యార్థులు నచ్చిన సబ్జెక్టులను ఎంపిక చేసుకున్నారు. ఇప్పటివరకూ ఇంటర్మీడియట్ విద్య అంటే సంబంధిత సబ్జెక్టులే చదవాలి అనే నిబంధన ఉండేది. ఎంపీసీ విద్యార్థులు గణితం, ఫిజిక్స్ కెమిస్ట్రీ కాకుండా మరో సబ్జెక్టు చదివే అవకాశం ఉండేది కాదు. అలాగే బైపీసీలో బయాలజీ, ఫిజిక్స్ కెమిస్ట్రీలు మాత్రమే చదవాలి. 2025-26 విద్యా సంవత్సరం నుంచి ఇంటర్ విద్యలో తీసుకొచ్చిన మార్పులతో కోర్ సబ్జెక్టులను ఎలాగైనా చదువుకునే వెసులుబాటు కలిగింది. దీంతో విద్యార్థులు వైవిధ్యమైన కాంబినేషన్‌లో సబ్జెక్టులను ఎంపిక చేసుకున్నారు. ఇప్పటివరకూ ఎంపీసీ, బైపీసీల్లో ఆరేసి సబ్జెక్టులు, మిగిలిన గ్రూపుల్లో ఐదు చొప్పున సబ్జెక్టులున్నాయి. ఇంటర్ బోర్డు ఈ ఏడాది నుంచి ఎంపీసీలో ఏబీలుగా ఉన్న గణితం సబ్జెక్టులను ఒక్కటిగా కలిపింది. బైపీసీలో ఉన్న బోటనీ, జువాలజీని బయాలజీగా మార్చింది. దీంతో అన్ని గ్రూపుల్లో 5 సబ్జెక్టుల విధానం అమల్లోకి వచ్చింది. ఇకనుంచి ద్వితీయ భాష సబ్జెక్టు స్థానంలో ఎలక్టివ్ సబ్జెక్టును వచ్చింది. అంటే మొత్తం ఇంటర్ విద్యలో అందుబాటులో ఉన్న 24 సబ్జెక్టులను ఎలక్టివ్ సబ్జెక్టు కింద తీసుకోవచ్చు. అయితే, ఎంపికలో పరిమితులు లేవు. దీంతో ఎంపీసీ విద్యార్థులు బయాలజీ తీసుకుంటే, బైపీసీ విద్యార్థులు గణితం తీసుకున్నారు. ఈ ఏడాది నుంచి వచ్చిన మార్పులతో విద్యార్థులకు ఎంబైపీసీ చదివే అవకాశం వచ్చింది. సాంకేతికంగా ఎంబైపీసీ పేరుతో గ్రూపులేకపోయినా ఎంపీసీ విద్యార్థులు బయాలజీ, బైపీసీ విద్యార్థులు గణితం చదివే వెసులుబాటు కలిగింది. అయితే ఎంబైపీసీ కోసం ఇంటర్ బోర్డు మరో అవకాశం కూడా కల్పించింది. ఈ రెండు గ్రూపుల విద్యార్థులకు అదనపు సబ్జెక్టు తీసుకునే అవకాశం ఇచ్చింది. అయితే ఈ అదనపు సబ్జెక్టుల్లో ఉత్తీర్ణత సాధించకపోయినా ఇంటర్ సర్టిఫికెట్ వస్తుంది. కానీ ఇవే సబ్జెక్టులను ఎలక్టివ్‌గా తీసుకున్నవారు కచ్చితంగా ఉత్తీర్ణులు కావాలి. అదనపు సబ్జెక్టు తీసుకున్న వారికి మొత్తం ఆరు సబ్జెక్టులు ఉంటాయి. మొత్తంగా ఈ ఏడాది ఇంటర్మీడియట్ ఫస్టియర్‌లో 5,40,924 మంది అడ్మిషన్ పొందారు.

ఒకరోజు ఒక సబ్జెక్టే

ఎంబైపీసీ, ఎలక్టివ్ విధానం ప్రవేశపెట్టడంతో పబ్లిక్ పరీక్షల షెడ్యూల్‌ను బోర్డు మార్చనుంది. ప్రతి సంవత్సరం గణితం సబ్జెక్టు ఉన్నరోజే బోటనీ, జువాలజీ పరీక్షలు ఉంటున్నాయి. ఇప్పుడు ఎంబైపీసీ తీసుకున్నవారు రెండూ ఒకేరోజు రాయడం సాధ్యం కాదు కాబట్టి వేర్వేరు రోజుల్లో పరీక్షలు నిర్వహిస్తారు. ఫస్టియర్ విద్యార్థులకు ఒక రోజు ఒకే సబ్జెక్టు పరీక్ష ఉండేలా మార్పులు చేయనున్నారు. అందుకే ఈ విద్యా సంవత్సరం నుంచి మార్చికి బదులుగా ఫిబ్రవరి నుంచే ఇంటర్ పబ్లిక్ పరీక్షలు ప్రారంభించాలని ఇంటర్ బోర్డు ప్రాథమికంగా నిర్ణయించింది.

వైద్య కోర్సుల్లో ప్రవేశాలకు లైన్ క్లియర్

- జీవో 33కు సవరణలు చేసిన రాష్ట్ర సర్కారు
- నాలుగు కేటగిరీలకు స్థానికత నుంచి మినహాయింపు
- నేటి నుంచి దరఖాస్తుల స్వీకరణ.. 15 నుంచి కౌన్సెలింగ్

హైదరాబాద్, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): వైద్య విద్య ప్రవేశాలకు సంబంధించిన స్థానికత ఉత్తర్వుపై రాష్ట్ర సర్కారు కీలక నిర్ణయం తీసుకుంది. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు జీవో నంబరు 33ను సవరిస్తూ సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. సవరించిన జీవో ప్రకారం రాష్ట్ర ప్రభుత్వంలో పనిచేస్తూ బదిలీల్లో భాగంగా తెలంగాణ వెలుపల నివసిస్తున్న రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల కుటుంబాలకు చెందిన విద్యార్థులు, ఆల్ ఇండియా సర్వీసులు (రాష్ట్ర క్యాడర్‌కు చెంది ఇతర రాష్ట్రాల్లో పని చేస్తున్న ఐఏఎస్, ఐఎఫ్‌ఎస్, ఐపీఎస్) క్యాడర్ కుటుంబాలకు చెందిన విద్యార్థులు, ఆర్మీ, పోలీస్ సిబ్బంది పిల్లలు, కార్పొరేషన్, ఏజెన్సీల్లో పనిచేసే ఉద్యోగుల కుటుంబాలకు చెందిన విద్యార్థులకు స్థానికతపై మినహాయింపునిచ్చారు. ఈ 4 కేటగిరీలకు చెందిన విద్యార్థులు వరుసగా నాలుగేళ్లు తెలంగాణలో చదువకున్నా..వారి తల్లిదండ్రులు ఇక్కడి వారేనని, బదిలీల కాలంలో పిల్లలు రాష్ట్రం వెలుపల చదివారనే అంశాన్ని సంబంధిత ఉద్యోగ ధ్రువపత్రంలో రుజువు పత్రాలు సమర్పిస్తే స్థానికులుగానే పరిగణించనున్నట్లు ప్రభుత్వం ఉత్తర్వుల్లో పేర్కొంది. దీంతో ఆ 4 కేటగిరీలకు చెందిన విద్యార్థులు మంగళవారం నుంచి ఈ నెల 11 వరకు ప్రవేశాల కోసం దరఖాస్తు చేసుకునేందుకు కాళోజీ నారాయణరావు ఆరోగ్య యూనివర్సిటీలో అవకాశం కల్పించింది. ఆ తర్వాత ఫిర్యాదులు, అభ్యంతరాల స్వీకరణ, ధ్రువపత్రాల పరిశీలన అనంతరం తుది జాబితా వెల్లడిస్తామని వర్సిటీ వీసీ డాక్టర్ నందకుమార్ రెడ్డి తెలిపారు. కాగా, జీవో నంబర్ 33కు సవరణ నేపథ్యంలో ఈ నెల 15 నుంచి ఎంబీబీఎస్, బీడీఎస్‌లలో కన్వీనర్ కోటా ప్రవేశాల కౌన్సెలింగ్‌ను హెల్త్ వర్సిటీ ప్రారంభించనుంది. మొత్తం 4 విడతల కౌన్సెలింగ్ ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయనుంది. రాష్ట్రంలో ప్రభుత్వ, ప్రైవేటులో కలిపి మొత్తం 8,515 ఎంబీబీఎస్ సీట్లున్నాయి. ప్రభుత్వ కాలేజీల్లో 4,090 యూజీ సీట్లున్నాయి. ఇందులో అఖిల భారత కోటా కింద 613 సీట్లు వెళ్లాయి. మిగిలిన సీట్లకు హెల్త్ వర్సిటీ కౌన్సెలింగ్ నిర్వహించనుంది.

ప్రేమ జంట విషాదం

- రైలు కింద పడి ప్రియురాలి ఆత్మహత్య
- తట్టుకోలేక ప్రియుడి బలవన్మరణం
- మంచిర్యాల జిల్లాలో విషాదం

లక్షెట్టిపేట, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఒక్క రోజు వ్యవధిలో ప్రేమ జంట ఆత్మహత్యకు పాల్పడ్డ ఘటన మంచిర్యాల జిల్లాలో జరిగింది. ఆదివారం యువతి ఆత్మహత్యకు పాల్పడగా.. ఆమె మరణాన్ని తట్టుకోలేక లక్షెట్టిపేట మండలం వెంకట్రావుపేట శివారులో యువకుడు సోమవారం బలవన్మరణానికి పాల్పడ్డాడు. దండేపల్లి మండలం కొర్విచెల్మకు చెందిన వెనంక వినయ్‌బాబు(26).. కొంతకాలంగా హిత వర్షిణిని ప్రేమిస్తున్నాడు. ఆమె మేడ్చల్ జిల్లా ఘట్‌కేసర్‌లో బీటెక్ ఫైనల్ ఇయర్ చదువుతోంది. ఆమె ఆదివారం సికింద్రాబాద్‌లో రైలు కింద పడి ఆత్మహత్య చేసుకుంది. ప్రియురాలి మరణాన్ని తట్టుకోలేక తాను కూడా ఆత్మహత్యకు పాల్పడుతున్నట్లు లేఖ రాసిన వినయ్.. బావిలో దూకి చనిపోయాడు.

హరీశ్.. గురుకులాలపై రాజకీయాలొద్దు : అడ్లూరి

హైదరాబాద్, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): గురుకులాలపై హరీశ్‌రావు రాజకీయాలు చేయడం బాధాకరమని.. పేద దళిత, బీసీ పిల్లలతో రాజకీయాలు చేయొద్దని మంత్రి అడ్లూరి లక్ష్మణ్ హితవు పలికారు. కుటుంబ తగాదాలతో ఆయన నోటికొచ్చింది మాట్లాడుతున్నారని.. రాష్ట్రం ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నా హాస్టల్ పిల్లలను ఆదుకుంటున్నామని చెప్పారు. ఏ సంక్షేమ హాస్టల్‌కైనా వెళ్లి పరిశీలించడానికి సిద్ధమేనంటూ హరీశ్‌కు సవాల్ విసిరారు. దమ్ముంటే ముందు కవిత ప్రశ్నలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశా రు. సోమవారం గాంధీభవన్‌లో అడ్లూరి మీడియాతో మాట్లాడారు.

ఒకటి నుంచి ధాన్యం కొనుగోళ్లు

కొన్నిజిల్లాల్లో ఈనెల 25 నుంచే కేంద్రాల ఏర్పాటు .. ఈ ఖరీఫ్‌లో కోటిన్నర టన్నుల మేర వడ్ల దిగుబడి

- కోటి టన్నుల దాకా వస్తుందని అంచనా
- 8వేల కొనుగోలు కేంద్రాల ఏర్పాటు
- ప్రక్రియపై చర్చించేందుకు నేడు రాష్ట్రానికి ఎఫ్‌సీఐ బృందం
- ఈనెల 16న క్షేత్రస్థాయి అధికారులతో టీజీసీఎస్ సమావేశం
- 62 లక్షల ఎకరాల్లో వరిసాగు
- ఇందులో 60శాతానికి పైగా సన్నాలే



హైదరాబాద్, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): వానాకాలం (ఖరీఫ్) సీజన్‌లో రైతులు పండించిన వడ్లను కొనుగోలు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం సమాయత్తమవుతోంది. భారత ఆహార సంస్థ (ఎఫ్‌సీఐ) మార్గదర్శకాల ప్రకారం ఖరీఫ్ ధాన్యం సేకరణ అక్టోబరు 1న మొదలవ్వాలి. ఈ మేరకు ఎఫ్‌సీఐ నుంచి రాష్ట్ర సర్కారుకు ఆదేశాలు కూడా వచ్చాయి. ఈ క్రమంలో అదే తేదీ నుంచి.. వీలైతే కాస్త ముందుగానే, అంటే ఈనెల 25న ధాన్యం కొనుగోళ్లు ప్రారంభించేందుకు రాష్ట్ర పౌరసరఫరాల సంస్థ (టీజీసీఎస్) ఏర్పాట్లు చేస్తోంది. ఖరీఫ్‌లో 62 లక్షల పైచిలుకు ఎకరాల్లో రైతులు వరిసాగు చేశారు. కోటిన్నర మెట్రిక్ టన్నుల మేర వడ్ల దిగుబడి వస్తుందని అంచనా వేశారు. ఇందులో కోటి మెట్రిక్ టన్నుల వడ్లు కొనుగోలు కేంద్రాలకు రావొచ్చునని భావిస్తున్నారు. ధాన్యం కొనుగోళ్ల కోసం రాష్ట్రవ్యాప్తంగా 8 వేల కొనుగోలు కేంద్రాలు ఏర్పాటుచేయనున్నారు. ఉమ్మడి నిజామాబాద్, నల్లగొండ జిల్లాల్లో సీజన్‌లో కాస్త ముందుగానే నాట్లు పడ్డాయి కాబట్టి అక్కడ త్వరగా పంట చేతికొస్తుంది. ఫలితంగా బాన్సువాడ, బోధన్, మిర్యాలగూడ తదితర చోట్ల సెప్టెంబరు చివరి వారంలోనే కొనుగోలు కేంద్రాలు ఏర్పాటుచేయాలనే డిమాండ్ వస్తోంది. రాష్ట్ర ప్రభుత్వం కూడా ఆయాచోట్ల కాస్త ముందుగానే కొనుగోలు కేంద్రాలను ప్రారంభించే అవకాశాలున్నాయి. కాగా ఖరీఫ్ కొనుగోళ్ల ప్రక్రియపై చర్చించేందుకు ఎఫ్‌సీఐ నుంచి ఉన్నతాధికారుల బృందం మంగళవారం హైదరాబాద్‌కు వస్తోంది. ఈ బృందం.. ఎఫ్‌సీఐ హైదరాబాద్ ప్రాంతీయ అధికారులు, రాష్ట్ర పౌరసరఫరాల శాఖ, కార్పొరేషన్ అధికారులు హాజరవుతున్నారు. వరిసాగు ఎక్కువగా జరిగిన 16 జిల్లాలకు చెందిన అధికారులు కూడా ఈ సమావేశానికి పిలిచారు. జిల్లా అదనపు కలెక్టర్లు, డీఎస్‌వోలు, మేనేజర్లు, జనరల్ మేనేజర్లతో ఖరీఫ్ ధాన్యం సేకరణకు సంబంధించిన అంశాలపై వర్క్‌షాప్ నిర్వహించనున్నారు. ఈనెల 16 తేదీన డాక్టర్ మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి కేంద్రంలో ఖరీఫ్ ధాన్యం సేకరణ ప్రణాళికపై చర్చించటానికి కమిషనర్ డీఎస్ చౌహాన్ ప్రత్యేక సమావేశం నిర్వహించనున్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న అన్ని జిల్లాల అడిషనల్ కలెక్టర్లు, జిల్లా పౌరసరఫరాల సంస్థ మేనేజర్లు, జిల్లా పౌరసరఫరాలశాఖ అధికారులు, ఇతర అధికారులతో చర్చించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

యాసంగి బోనస్ ఎప్పుడు?

2025-26 సీజన్‌కు సంబంధించి కేంద్ర సర్కారు కనీస మద్దతు ధర (ఎమ్మెస్పీ)ని ప్రకటించింది. ఈ మేరకు సాధారణ రకానికి క్వింటాకు రూ.2,369 చొప్పున, గ్రేడ్-ఏ ధాన్యానికి రూ.2,389 చొప్పున రైతులకు చెల్లిస్తారు. సన్నరకాలకు క్వింటాకు రూ.500 చొప్పున బోనస్‌ను రాష్ట్ర సర్కారు చెల్లిస్తోంది. గత యాసంగి సీజన్‌కు సంబంధించి బోనస్‌ను ఇప్పటికీ సర్కారు రైతులకు చెల్లించలేదు. దీనిపై అన్నదాతల్లో ఆందోళన నెలకొంది. యాసంగితో పోలిస్తే ఖరీఫ్‌లో సన్నాలను రైతులు ఎక్కువగా సాగుచేస్తారు. ఈ ఖరీఫ్‌లో సాగైన వరిలో 60శాతంపైగా సన్న రకాలే కావడం గమనార్హం. ఈ క్రమంలో వానాకాలం సీజన్‌కు సంబంధించి బోనస్‌పై రాష్ట్ర ప్రభుత్వం నుంచి స్పష్టమైన ప్రకటన వెలువడాల్సి ఉంది.



అమీర్‌పేటలోని హెచ్‌ఎండీఏ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న ఆర్‌ఆర్‌ఆర్ బాధిత రైతులు

మా భూముల జోలికి రావొద్దు

- తప్పనిసరైతే మార్కెట్ ధర చెల్లించాల్సిందే
- హెచ్‌ఎండీఏ ఎదుట ట్రిపుల్‌ఆర్ బాధిత రైతుల ఆందోళన.. హైవేపై రాస్తారోకో

హైదరాబాద్ సిటీ, యూసఫ్‌గూడ, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): రీజినల్ రింగ్ రోడ్డుకు(ఆర్‌ఆర్‌ఆర్) భూములు ఇచ్చేది లేదని, తమ భూముల జోలికి రావొద్దని, ఆర్‌ఆర్‌ఆర్ అలైన్‌మెంట్‌ను మార్చాలని అక్కడి రైతులు ఆందోళనకు దిగారు. ఒకవేళ భూములు సేకరించాలనుకుంటే బహిరంగ మార్కెట్ ధర ప్రకారం పరిహారం చెల్లించి భూములు తీసుకోవాలని డిమాండ్ చేశారు. నాలుగు జిల్లాలోని 20 మండలాలకు చెందిన రైతులు, భూ యజమానులు సోమవారం పెద్దఎత్తున హైదరాబాద్ అమీర్‌పేటలోని హెచ్‌ఎండీఏ కార్యాలయానికి తరలివచ్చారు. వందల సంఖ్యలో రైతులు రావడంతో హెచ్‌ఎండీఏ ఎదుట పోలీసులు భారీగా బందోబస్తు ఏర్పాటు చేశారు. హెచ్‌ఎండీఏ ఉన్నతాధికారులను కలిసేందుకు బాధితులు ప్రయత్నించగా సాధ్యపడలేదు. అభ్యంతరాలను పేపర్ మీద రాసిచ్చి, వెళ్లిపోవాలంటూ అక్కడి సిబ్బంది చెప్పడంతో రైతులు కార్యాలయం ఎదుట రహదారిపైకి చేరుకొని ప్లకార్డులు పట్టుకొని రాస్తారోకో చేశారు. రైతులు రోడ్డు మీద కూర్చోవడంతో ఇరువైపులా వాహనాలు నిలిచిపోయాయి. ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించేందుకు రైతులను పోలీసులు బలవంతంగా అక్కడి నుంచి హెచ్‌ఎండీయే కార్యాలయంలోకి తరలించారు. ఫలితంగా రైతులు కార్యాలయంలోనే బైఠాయించారు. ఈ ఆందోళనలో యాదాద్రి, నల్లగొండ, మహబూబ్‌నగర్, వికారాబాద్ జిల్లాలకు చెందిన రైతులు పాల్గొన్నారు. హెచ్‌ఎండీఏ కార్యదర్శి ఉపేందర్‌రెడ్డి, సీపీవో రవీందర్‌రెడ్డిని కలిసి రైతులు తమ అభ్యంతరాలను వివరించారు.

రాజకీయాల్లోకి రాజారెడ్డి!

- అవసరమైనప్పుడు నా కుమారుడు ఏపీలో రంగప్రవేశం చేస్తారు: షర్మిల
- కర్నూలులో ఉల్లి రైతులకు పరామర్శ
- తల్లి వెంట వచ్చిన తనయుడు



కర్నూలు, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): అవసరమైనప్పుడు తన కుమారుడు వైఎస్ రాజారెడ్డి ఆంధ్ర రాజకీయాల్లోకి వస్తారని పీసీసీ చీఫ్ వైఎస్ షర్మిల వ్యాఖ్యానించారు. సోమవారం కర్నూలు మార్కెట్ యార్డులో ఉల్లి రైతుల కష్టాలు తెలుసుకొని, వారిని పరామర్శించేందుకు కుమారుడితో కలసి వచ్చారు. రాజారెడ్డి కూడా మెడలో కండువా వేసుకుని పర్యటన ముగిసే వరకూ తల్లి షర్మిల వెంటే ఉన్నారు. అవసరమైనప్పుడు ఆంధ్ర రాజకీయాల్లో వస్తారని షర్మిల అన్నప్పుడు ఆయన మొహంలో చిరునవ్వు కనిపించింది. రైతుల సమక్షంలోనే కుమారుడి రాజకీయ పరిచయం చేయాలనే వ్యూహంలో భాగంగానే కర్నూలు మార్కెట్‌ను వేదికగా చేసుకున్నారని రాజకీయ విశ్లేషకులు అంటున్నారు. సోమవారం ఉదయం హైదరాబాద్ నుంచి కర్నూలు బయల్దేరే ముందు రాజారెడ్డి తమ ఇంట్లో నుంచి బయటకు రాగానే అమ్మమ్మ వైఎస్ విజయమ్మ ఆశీర్వాదం తీసుకున్నారు. ఇప్పటి వరకు కుటుంబ కార్యక్రమాల్లో మినహా రాజకీయ కార్యక్రమాల్లో ఆయన కనిపించలేదు. తొలిసారిగా కర్నూలు మార్కెట్ యార్డులో తల్లి షర్మిలతో కలసి రైతులను పరామర్శించడం కాంగ్రెస్ శ్రేణుల్లో నూతన ఉత్సాహం నింపింది. ఈ ప్రకటన వైసీపీపైనే కాకుండా రాజారెడ్డి స్వయాన మేనమామ, మాజీ సీఎం జగన్‌పై రాజకీయంగా ప్రభావం చూపే అవకాశం లేకపోలేదని పలువురు పేర్కొంటున్నారు.

అమెరికా వెళ్లి తిరిగొచ్చాక!

వైఎస్ షర్మిల, అనిల్‌కుమార్ కుమారుడు వైఎస్ రాజారెడ్డి 1996లో జన్మించారు. హైదరాబాద్‌లోని ఓక్‌రిడ్జ్ ఇంటర్నేషనల్ స్కూల్‌లో చదువుకున్నారు. అమెరికాలో ఉన్నత విద్యను పూర్తి చేసి, ప్రస్తుతం అక్కడే సొంతంగా వ్యాపారాలు చూసుకుంటున్నారు. రాజారెడ్డి రెండు వారాల్లో అమెరికాకు వెళ్తారు. అక్కడ వ్యాపార వ్యవహారాలు చక్కదిద్దుకుని రాష్ట్రానికి తిరిగొస్తారు. అనంతరం రాజారెడ్డితో కలసి వైఎస్ షర్మిల ఢిల్లీకి వెళ్లి కాంగ్రెస్ అగ్రనేతలు సోనియా గాంధీ, రాహుల్ గాంధీలతో సమావేశం అవుతారని సమాచారం.

ఉల్లి రైతులను ఆదుకోవాలి: షర్మిల

ఉల్లి రైతుల కష్టాలు చూస్తుంటే కన్నీళ్లు వస్తున్నాయని, ధరలు పతనమై పెట్టుబడిలో సగం కూడా రావడం లేదని షర్మిల అన్నారు. క్వింటాకు రూ.2,500 గిట్టుబాటు ధర చెల్లించి ఉల్లి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. పంట దిగుబడులతో కర్నూలు మార్కెట్‌కు వచ్చిన ఉల్లి రైతులతో ఆమె మాట్లాడారు. ధరలు ఎలా ఉన్నాయో అడిగి తెలుసుకున్నారు. రైతులకు అన్యాయం జరుగుతుందంటే ఇక్కడే ఆమరణదీక్ష చేపడతానని అన్నారు.

చర్లపల్లి డ్రగ్స్ కేసు..
తొలుత బంగ్లాదేశీని పంపిన డ్రగ్స్ ముఠా!

- వెంబడించి ఆమెను పట్టుకున్న మహారాష్ట్ర పోలీసులు

హైదరాబాద్‌సిటీ, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): చర్లపల్లిలో మెఫిడ్రిన్ డ్రగ్స్ వ్యవహారం గుట్టురట్టు చేయడానికి మహారాష్ట్ర పోలీసులు పక్కా స్కెచ్ వేసినట్లు తెలుస్తోంది. శ్రీనివాస్ విజయ్ ఓలేటి తయారు చేస్తున్న మెఫిడ్రిన్ గురించి తెలుసుకున్న ముంబైలోని డ్రగ్స్ ముఠా.. నమూనాను తీసుకురావాలంటూ బంగ్లాదేశీ మహిళ ఫాతిమా మురాబ్ షేక్‌ను హైదరాబాద్‌కు పంపారు. ఫాతిమా ఓ సాధారణ పర్యాటకురాలిగా హైదరాబాద్ వచ్చి, 200 గ్రాముల మెఫిడ్రిన్‌ను ముంబై తీసుకెళ్లారు. సమాచారం అందుకున్న ముంబై క్రైమ్ బ్రాంచ్ పోలీసులు.. ఫాతిమాను అనుసరించారు. అక్కడి పోలీసుల సహకారంతో గత నెల 8న ఆమెను అదుపులోకి తీసుకున్నారు. ఆమె వద్ద 178 గ్రాముల మెఫిడ్రిన్ లభించింది. ఆ వెంటనే.. ఫాతిమాను హైదరాబాద్‌కు పంపిన డ్రగ్స్ ముఠాలోని 9 మందిని అరెస్టు చేశారు. ఆ తర్వాతే..డెకాయ్ ఆపరేషన్ నిర్వహించి, చర్లపల్లిలోని డ్రగ్స్ తయారీ కంపెనీ గుట్టును రట్టు చేశారు. కాగా.. ఈ కేసుతో తెలంగాణ నార్కోటిక్స్ బ్యూరో(ఈగల్), రాచకొండ పోలీసులు, ఎక్సైజు విభాగం, కాలుష్య నియంత్రణ మండలి(పీసీబీ) అధికారులు అప్రమత్తమయ్యారు. సోమవారం చర్లపల్లితోపాటు.. నాచారం పారిశ్రామిక వాడల్లో క్షేత్రస్థాయి పరిశీలన జరిపినట్లు సమాచారం. శ్రీనివాస్ విజయ్ నిర్వహించిన నాచారంలోని వాగ్దేవి ల్యాబ్, చర్లపల్లిలోని కంపెనీని తనిఖీ చేసినట్లు తెలిసింది.

ముంబైలో 'ఈగల్' తనిఖీలు

ఇటీవల అరెస్టయిన నైజీరియా డ్రగ్స్ సరఫరాదారుల కేసులో తెలంగాణ నార్కోటిక్స్ వింగ్ (ఈగల్) సోమవారం ముంబైలో తనిఖీలు జరిపింది. అక్కడ నైజీరియన్ డ్రగ్స్ పెడ్లర్లు జరిపిన హవాలా లావాదేవీల నెట్‌వర్క్‌కు సంబంధించి ఈ తనిఖీలు జరిగినట్లు సమాచారం. ఇక్కడ మత్తుపదార్థాల దందా చేస్తూ.. వచ్చిన ఆదాయాన్ని హవాలా మార్గంలో ముంబై మీదుగా నైజీరియా, ఇతర దేశాలకు పంపుతున్నట్లు ఈగల్ దర్యాప్తులో తేలింది. ముంబైతోపాటు..పుణెలో ఈగల్ తనిఖీలు జరిగినట్లు తెలుస్తోంది.

భూరికార్డులు సరి చేసేందుకు 5,000 లంచం

- నారాయణపేట జిల్లాలో ఏసీబీకి చిక్కిన మద్దూర్ ఆర్‌ఐ

మద్దూర్, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): నారాయణపేట జిల్లా మద్దూర్ మండలం అప్పిరెడ్డిపల్లి గ్రామ రైతు భూ రికార్డులను సరి చేయడానికి రూ.5,000 లంచం తీసుకుంటూ రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ (ఆర్‌ఐ) కె. అమర్‌నాథ్ సోమవారం ఏసీబీ అధికారులకు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుబడ్డాడు. అప్పిరెడ్డిపల్లి రైతు భూ రికార్డుల్లో మిస్ అయిన 5గుంటల భూమిని పట్టాదార్ పాస్‌బుక్‌లో నమోదు చేయాలని దరఖాస్తు చేసుకున్నాడు. ఇందుకుగాను రూ.5,000 లంచం ఇవ్వాలని ఆర్‌ఐ అమర్‌నాథ్ డిమాండ్ చేశాడు. దీంతో బాధితుడు ఏసీబీ అధికారుల దృష్టికి తీసుకెళ్లగా వారి సూచన మేరకు సోమవారం ఆర్‌ఐకి రూ.5,000 అందజేశాడు. ఆ వెంటనే ఆర్‌ఐను పట్టుకుని కేసు నమోదు చేశామని ఏసీబీ డీఎస్పీ బాలకృష్ణ తెలిపారు.

పరీక్షకు అనుమతించలేదని ప్రొఫెసర్‌పై కత్తితో దాడి

- నూజివీడు ట్రిపుల్ ఐటీలో ఎంటెక్ విద్యార్థి ఘాతుకం

నూజివీడు టౌన్, అమరావతి, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): పరీక్షకు అనుమతించలేదని ఆగ్రహంతో ఊగిపోయిన ఓ ఎంటెక్ విద్యార్థి.. ఏకంగా ప్రొఫెసర్‌పైనే కత్తితో దాడికి దిగి తీవ్రంగా గాయపరిచాడు. ఆర్జీయూకేటీ నూజివీడు ట్రిపుల్ ఐటీ క్యాంపస్‌లో సోమవారం జరిగిన ఈ ఘటన తీవ్ర కలకలం రేపింది. విజయనగరం జిల్లా కొత్తవలస మండలం వడ్డిగూడెంకు చెందిన మద్ది వినయ్ పురుషోత్తమ్ నూజివీడు ట్రిపుల్ ఐటీలో ఎంటెక్ చదువుతున్నాడు. అయితే, క్యాంపస్ హాస్టల్లో వసతి పొందుతూ తరగతులకు హాజరుకాలేదు. 74 శాతం హాజరు లేకపోవడంతో హెచ్‌వోడీతోపాటు ట్రిపుల్ ఐటీ ఉన్నతాధికారులు దీనిపై అభ్యంతరం వ్యక్తంచేస్తూ వినయ్‌ను పరీక్షలకు అనుమతించలేదు. సోమవారం మొదటి సంవత్సరం ల్యాబ్ పరీక్ష ఉండగా... ఉదయం ఎగ్జామ్ హాల్‌కు వచ్చిన వినయ్‌ను ప్రొఫెసర్ గోపాలరాజు పరీక్ష రాయనివ్వలేదు. దీంతో ఒక్కసారిగా ఆగ్రహానికి గురైన వినయ్.. తనవెంట తెచ్చుకున్న కత్తితో గోపాలరాజుపై విచక్షణారహితంగా దాడికి పాల్పడ్డాడు. గాయపడిన గోపాలరాజును నూజివీడు ఏరియా ఆస్పత్రికి తరలించారు. పోలీసులు... హత్యాయత్నం కేసు నమోదు చేసి వినయ్‌ను అరెస్టు చేశారు. కాగా, ఆర్జీయూకేటీ నూజివీడు క్యాంపస్ ప్రొఫెసర్ గోపాలరాజుపై ఎంటెక్ విద్యార్థి దాడికి పాల్పడటాన్ని మంత్రి లోకేశ్ సోమవారం తీవ్రంగా ఖండించారు. విద్యార్థుల్లో క్రమశిక్షణ లేమి, హింసా ప్రవృత్తిని ఎట్టి పరిస్థితుల్లో ఉపేక్షించబోని పేర్కొన్నారు.

బారికేడ్లను ఢీకొన్న బైకు.. ఇద్దరి మృతి

- హైదరాబాద్-బెంగళూర్ జాతీయ రహదారిపై ఘటన

శంషాబాద్ రూరల్, సెప్టెంబర్ 8 (ఆంధ్రజ్యోతి): అతివేగానికి ఇద్దరు యువకులు బలయ్యారు. బైక్‌తో బారికేడ్లను బలంగా ఢీకొట్టడంతో ఇద్దరు యువకులు దుర్మరణం చెందారు. ఈ ఘటన రంగారెడ్డి జిల్లా శంషాబాద్‌లోని హైదరాబాద్ - బెంగళూర్ జాతీయ రహదారిపై ఆదివారం అర్ధరాత్రి జరిగింది. గండిగూడకు చెందిన కట్ట చింటు (23), మదన్‌పల్లికి చెందిన మంచర్ల అఖిల్ (22) స్నేహితులు. ఆదివారం వారిద్దరు బైకుపై వెళ్తుండగా పెద్దషాపూర్ పాత చెక్‌పోస్టు వద్ద బైకు అదుపు తప్పి బారికేడ్లను ఢీకొట్టింది. దీంతో ఇద్దరి తలలకు తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతి చెందారు. పెద్దషాపూర్ చెక్‌పోస్టు వద్ద రహదారి విస్తరణ పనులు జరుగుతుండడంతో అక్కడ సిమెంట్ బారికేడ్లు ఏర్పాటు చేశారు. వాటిని బలంగా ఢీకొట్టడంతోనే ఈ ప్రమాదం జరిగిందని పోలీసులు గుర్తించారు. మృతుల కుటుంబసభ్యులకు సమాచారం అందించి, మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. చింటు ఓ ప్రైవేటు కంపెనీలో సూపర్‌వైజర్‌గా పనిచేస్తుండగా, అఖిల్ ఎయిర్‌పోర్టు క్యాబ్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. చేతికొచ్చిన పిల్లలు రోడ్డు ప్రమాదంలో మృతిచెందడంతో వారి కుటుంబసభ్యుల రోదనలు మిన్నంటాయి. అయితే రోడ్డుపై ఎలాంటి హెచ్చరికల బోర్డులు లేకుండా బారికేడ్లను ఏర్పాటు చేయడంతోనే ఈ ప్రమాదం జరిగిందని వారు ఆరోపించారు. బాధ్యులైన రోడ్డు విస్తరణ కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలని పోలీసులను కోరారు. కేసు నమోదు చేసినట్లు సీఐ నరేందర్‌రెడ్డి తెలిపారు.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

నేపాల్‌లో యువ ప్రభంజనం

సోషల్ మీడియాపై ప్రభుత్వ నిషేధాన్ని నిరసిస్తూ నేపాల్‌లో యువతరం చేపట్టిన ఉద్యమాన్ని మీడియా 'జెన్ జీ రివల్యూషన్'గా అభివర్ణిస్తోంది. వేలాదిమంది యువతీయువకులు ఏకంగా పార్లమెంట్ భవనం మీదకు లంఘించడం ఆశ్చర్యం కలిగిస్తుంది. ప్రభుత్వ బలగాలు ఏకంగా కాల్పులకు తెగబడటంతో పదహారు మంది మరణించారనీ, వందలాది మంది గాయపడ్డారని వార్తలు వస్తున్నాయి. బంగ్లాదేశ్‌లో హసీనా ప్రభుత్వం తరహాలో నేపాల్‌లో ఓలి తీవ్ర దమనకాండకు పాల్పడుతున్నా యువత వెనకడుగువేయడం లేదు. పాతికకుపైగా సామాజిక వేదికలు నిషేధానికి గురైన వెంటనే, ఒక ప్రధాన నాయకుడంటూ లేకపోయినా, టిక్‌టాక్ ఆధారంగా ఇంతటి భారీ స్థాయి జనసమీకరణతో సాగుతున్న ఈ ఉద్యమం ఓలి ప్రభుత్వాన్ని దిగివచ్చేట్టు చేస్తుందా, ప్రభుత్వమే కూలిపోయే పరిస్థితులు ఏర్పడతాయా అన్నది చూడాలి.

ఓలి ప్రభుత్వం చైనా యాప్‌లను అనుమతించి, అమెరికా సోషల్ మీడియాను నిషేధించడంతో ఈ ఆగ్రహం వెల్లువెత్తిందనీ, ఉద్యమం వెనుక అమెరికా కుట్ర ఉన్నదన్న విమర్శలను అటుంచితే, అమెరికా కంపెనీలు నేపాల్ నిబంధనలకు, చట్టాలకు అనుగుణంగా నడుచుకోకపోవడంతో ఈ పరిస్థితి ఏర్పడిన మాట వాస్తవం. అన్ని సోషల్ మీడియా సంస్థలు నేపాల్‌లో నమోదు కావాలనీ, స్థానిక ప్రతినిధి, ఫిర్యాదుల పరిష్కర్త వంటి అధికారులను నియమించాలంటూ గత ఏడాది నేపాల్ సుప్రీంకోర్టు ఆదేశించింది. తదనుగుణంగా నేపాల్ రూపొందించిన నిబంధనలకు చైనా యాప్‌లు రిజిస్టర్ చేసుకున్నాయి కానీ, ప్రధాన ప్లాట్‌ఫామ్‌లు దిగిరాలేదు. నేపాల్ ప్రభుత్వం పలుమార్లు గడువులు పెంచుతూ చివరకు సెప్టెంబర్ 4న 26 అప్లికేషన్లను బ్లాక్ చేసింది. ప్రధానంగా అమెరికన్ సంస్థలు మా దేశ చట్టాల పట్ల ఇలా అగౌరవంగా వ్యవహరించడంతో, ఈ చర్యద్వారా నేపాల్ తన ఆత్మగౌరవాన్ని కాపాడుకున్నదని ప్రభుత్వం చెబుతోంది. నేపాల్‌లో దాదాపు కోటి ముప్పైఐదులక్షల మంది ఫేస్‌బుక్ వినియోగదారులున్నారు. ఇన్‌స్టాగ్రామ్, వాట్సాప్ వంటి అప్లికేషన్లకు లక్షలాదిమంది ఉన్నారు. ఇప్పుడు ఉద్యమిస్తున్న యువతరం సోషల్ మీడియాకు బానిసలు అయిపోవడంతో ఆత్మాభిమానాన్ని కూడా వదిలేసి, ఇలా రోడ్లమీదకు వచ్చారని కొందరు చులకనగా మాట్లాడుతున్నారు. సోషల్ మీడియా ఈ జెన్ జనరేషన్‌కు ఉల్లాసం, ఉత్సాహంతో పాటు ఉపాధి కూడా ఇస్తున్నది. సమస్త సమాచారాన్ని అరచేతిలో చూడగలగడంతో పాటు, ఈ నెట్‌వర్క్ ద్వారా వ్యాపారాలు చేసుకుంటూ, పలువిధాలుగా ఆదాయాలను సంపాదించుకుంటున్న యువత పెద్దసంఖ్యలో ఉన్నారు. స్వదేశంలో ఉపాధిలేక సంపాదనకోసం ఇతర దేశాలకు తరలిపోయిన లక్షలాది మంది నేపాలీ యువత తమ కుటుంబీకులతో, బంధుమిత్రులతో సంభాషించే అవకాశాన్ని కూడా కోల్పోతారు.

నిర్దిష్టమైన ఎజెండా, డిమాండ్లు లేనట్టు పైకి కనిపిస్తున్నప్పటికీ, సోషల్ మీడియాను పునరుద్ధరించాలన్న నినాదం మరింత విస్తరించి, ఇప్పుడు పాలకుల అవినీతినీ, బంధుప్రీతినీ కూడా ప్రశ్నిస్తోంది. పాలకుల, వారి పుత్రరత్నాల విలాసవంతమైన జీవితాలను సామాన్యుల బతుకు కష్టంతో పోలుస్తూ 'నెపో బేబీ' వంటి ట్రెండ్స్ విస్తృతంగా ప్రచారమవుతున్నాయి. 'నాయకుల పిల్లలు విమానాల్లో వస్తారు, సామాన్యుల పిల్లలు శవపేటికలో తిరిగివస్తారు' వంటి నినాదాలు ప్రజలను ప్రభావితం చేస్తాయి. రాబడికోసమో, రాజ్యాంగ నిబంధనల కోసమో సామాజిక మాధ్యమాలను నిషేధించలేదని, పాలకుల అవినీతి ప్రజలకు తెలియకుండా, వారిపై విమర్శలు, ప్రశ్నలు వ్యాప్తిచెందకుండా, ఈ నిషేధం అమలు చేశారని ఉద్యమకారుల అభిప్రాయం. సామాజిక మాధ్యమాలతోనే పలు దేశాల్లో అవినీతి ప్రభుత్వాలు కూలిపోయినందున నేపాల్ పాలకులు భయపడుతున్నారని వారంటారు.

నిప్పంటూ అంటుకున్నాక అది ఎంతకాలం మండుతుందో, ఎక్కడికి పాకుతుందో, వేటిని తగలబెడుతుందో చెప్పలేం. నేపాల్‌లో యువతరం తన గుండెలను మండిస్తున్న అంశాలన్నింటినీ ఇప్పుడు ముందుపెడుతోంది. దేశ సమూల ప్రక్షాళనకు నడుంబిగిస్తోంది. తమ అధికారకాంక్షతో ఓలి, ప్రచండ నేపాల్ రాజకీయాన్ని పూర్తిగా భ్రష్టు పట్టించారు. ఒకరి కుర్చీ ఒకరు లాగుతూ రాజ్యాంగాన్నీ, చట్టాలను అపహాస్యం చేస్తూంటే, మిగతాపక్షాలన్నీ అధికారకోసం, అవినీతిలో వాటాకోసం వీరితో వంతులవారీగా చేతులు కలుపుతున్నాయి. నేపాల్ ప్రజలు అనతికాలంలోనే ప్రజాస్వామ్యం మీద నమ్మకం కోల్పోయారు. మళ్ళీ రాజుగారు రావాలంటూ అక్కడ ఉద్యమం మొదలైంది కూడా. యువత ఆందోళనలకు తలొగ్గి, ఆత్మగౌరవాన్ని కూడా వెనక్కునెట్టి, సోషల్ మీడియాపై నిషేధాన్ని ఓలి ప్రభుత్వం ఎత్తివేయవచ్చు. కానీ, ఈ ఉద్యమం నేపాల్ అధికారపక్షాలన్నింటికీ ఒక బలమైన హెచ్చరిక.

భారత్ చేయి విడిస్తే అమెరికాకే భారం



> భారత్ వ్యూహాత్మక స్వయం ప్రతిపత్తి తన సార్వభౌమత్వాధికార వ్యక్తీకరణేగానీ, ఏ దేశాన్నీ ధిక్కరించడంగానీ, సవాల్ చేయడం గానీ కాదని అమెరికా గుర్తించాలి. విదేశీ వాణిజ్యంలో ఏ దేశమైనా స్వీయ జాతీయ ప్రయోజనాలకే అగ్ర ప్రాధాన్యమిస్తుంది. మరి రష్యా నుంచి చమురు, సహజవాయువు, సైనిక సామగ్రి కొనుగోలు చేస్తున్నందుకు భారత్‌ను ప్రతీకార సుంకాలతో శిక్షించడం సమంజసమేనా, ట్రంప్ గారూ?

భారత్‌తో వ్యూహాత్మక భాగస్వామ్యం అమెరికాకు కలిమి, బలిమి కలిగించేదేకానీ భారమయ్యేది కాదు, కాబోదు. అయినా ప్రపంచ అతి పెద్ద ప్రజాస్వామ్య దేశాన్ని ప్రపంచ పురాతన ప్రజాస్వామిక రాజ్యం ఎందుకు దూరం చేసుకుంటోంది? 1940ల తుదినాళ్లలోను, 1950ల తొలినాళ్లలోను 'చైనాను కోల్పోయింది ఎవరు?' అన్న అంశంపై అమెరికాలో తీవ్ర చర్చ జరిగింది. అక్టోబర్ 1949లో జనచైనా (పీపుల్స్ రిపబ్లిక్ ఆఫ్ చైనా) ఆవిర్భావం అమెరికా రాజకీయ వేత్తలు, శాసన నిర్మాతలను అమితంగా కలవరపరిచింది. మహానాయకుడు మావో నేతృత్వంలో చైనా కమ్యూనిస్టు పార్టీ చాంగ్-కై-షేక్ నాయకత్వంలోని జాతీయవాద కొమింగ్‌టాంగ్‌ను ఓడించి జనచైనాను నెలకొల్పింది. ఈ పరిణామం కమ్యూనిజంపై ప్రచ్ఛన్న యుద్ధంలో ప్రజాస్వామ్యానికి ఒక వినాశనకర ఓటమిగా, అమెరికా విదేశాంగ విధానం వైఫల్యంగా వాషింగ్టన్ పాలకవర్గాలు భావించాయి.

భారత స్వాతంత్ర్య శతాబ్ది (2047) నాటికి, లేదా ఆలోగానే మరొక పరిణామం అమెరికా పాలకవర్గాలలో మరో తీవ్ర అలజడికి కారణమయ్యేందుకు ఆస్కారమున్నది. అమెరికాకు దూరమై, చైనా, రష్యాలకు భారత్ సన్నిహితమవడమే ఆ సంభావ్య పరిణామం. అదే జరిగితే 'భారత్‌ను కోల్పోయింది ఎవరు?' అనే విషయమై అమెరికాలో సంచలనశీల వాదోపవాదాలు జరగడం ఖాయం.

భారత్‌తో మైత్రి పెద్దగా ప్రాధాన్యం లేని విషయంగా అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ వ్యవహరిస్తున్నారు! ఇది సబబేనా? అమెరికా-భారత్ స్నేహబంధం 21వ శతాబ్ది అత్యంత ప్రధానమైన వ్యూహాత్మక భాగస్వామ్యాలలో అగ్రగణ్యమైనది. రక్షణ రంగంలో సహకారం, సాంకేతికతల ఆదాన ప్రదానాల నుంచి పసిఫిక్ మహాసముద్ర తీరస్థ ప్రాంతాలలో శాంతి సుస్థిరతలకు ఇతోధిక కృషి దాకా పరస్పర గౌరవ విశ్వాసాలు, ఉమ్మడి ప్రయోజనాలకు దృఢమైన పునాదులను న్యూఢిల్లీ, వాషింగ్టన్ నిర్మించుకున్నాయి.

అయితే ఇప్పుడు ఆ పునాదులు కదిలిపోతున్నాయి. కారణమేమిటి? భారత్‌పై కనీవినీ ఎరుగని రీతిలో ట్రంప్ విధిస్తున్న ప్రతీకార సుంకాలు, భారత్ పట్ల ఆయన ప్రదర్శిస్తున్న తిరస్కారపూరిత వైఖరి. ఇవి ఉభయ దేశాల మధ్య దౌత్య ఘర్షణలకు దారితీస్తున్నాయి. అమెరికాకు ప్రధాన శత్రువు అని భావిస్తున్న చైనాపై 30 శాతం సుంకాలు, ఇతర ఆసియా దేశాలపై 15 నుంచి 20 శాతం సుంకాలు మాత్రమే విధించిన ట్రంప్ భారత్‌పై ఏకంగా 50 శాతం సుంకాలు విధించారు! అమెరికా ప్రజలు సైతం హర్షించని నిర్ణయమిది అనడంలో సందేహం లేదు. పాతికేళ్లుగా భారత్-అమెరికా సంబంధాలను నిర్వచించి, నిర్ణయిస్తున్న, నిర్దేశిస్తున్న 'వ్యూహాత్మక భాగస్వామ్యం' ఏమయింది? ట్రంప్ నిర్ణయాలు, చర్యలు దానికి సమాధి తవ్వుతున్నాయి.

అయితే ఆ వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని కాపాడుకుని పెంపొందించుకునేందుకు ఇంకా కాలం మించిపోలేదు -వాషింగ్టన్ అభిలషిస్తే. భారత్ పట్ల ఘర్షణాత్మక వైఖరిని అమెరికా విడనాడాల్సిన సమయమాసన్నమయింది. బీటలువారుతున్న వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని పునరుద్ధరించుకుని దృఢతరం చేసుకోవాల్సిన ఆగత్యం ఎంతైనా ఉన్నది. ఇది ఇరుదేశాల ప్రయోజనాల పరిరక్షణకే కాకుండా ప్రపంచ దేశాల విస్తృత లబ్ధికి కూడా చాలా అవసరం.

ఆగస్టు 26-27 అర్ధరాత్రి భారతీయ సరకులపై సుంకాలను రెట్టింపు (50 శాతం) చేశారు. అమెరికాకు భారత్ ఎగుమతి చేస్తున్న 8,700 కోట్ల డాలర్ల విలువైన సరుకులలో 4,800 కోట్ల డాలర్ల విలువైన సరుకులపై ఈ సుంకాల పెంపుదల భారం పడింది. జౌళి, బంగారు ఆభరణాలు, ముత్యాలు, చర్మ ఉత్పత్తులు, సముద్ర ఆహారోత్పత్తులు (ముఖ్యంగా రొయ్యలు), ఆటోమొబైల్స్ విడిభాగాల ఎగుమతులు ఈ సుంకాల భారాన్ని భరించవలసివున్నది. ప్రస్తుతానికి ఫార్మాస్యూటికల్స్, ఎలక్ట్రానిక్ వస్తువులను ఈ సుంకాల పెరుగుదల నుంచి మినహాయించారు.

భారత్ ఎగుమతులపై అమెరికా సుంకాల పెరుగుదలకు కారణమేమిటి? రష్యా నుంచి చమురు, సహజ వాయువు, సైనిక సామగ్రిని భారత్ కొనుగోలు చేయడమే! ఈ కొనుగోళ్ల నుంచి లభిస్తున్న ఆదాయంతోనే రష్యా, ఉక్రెయిన్‌పై ఎడతెగని యుద్ధం చేయగలుగుతోందని ట్రంప్ ఆరోపిస్తున్నారు. ఈ అభియోగాన్ని న్యూఢిల్లీ తీవ్రంగా ఖండించింది. అదొక నిరాధారమైన ఆరోపణ అని సహేతుకంగా స్పష్టం చేసింది. చైనా తమకంటే చాలా పెద్ద ఎత్తున రష్యా నుంచి చమురు కొనుగోలు చేస్తుందని, యూరోపియన్ యూనియన్ దేశాలు కూడా రష్యా నుంచి 6,700 కోట్ల డాలర్ల విలువైన సరుకులు దిగుమతి చేసుకుంటున్నాయని, అయినా చైనా, యూరోపియన్ దేశాలపై అమెరికా అధిక సుంకాలు విధించలేదని భారత్ ఆక్షేపించింది. భారత్‌పైనే వివక్ష ఎందుకు అని ప్రశ్నించింది.

ట్రంప్ విధించిన 50 శాతం సుంకాలు కేవలం ఆర్థిక జరిమానాలు కాదు. అవి రాజకీయ సంకేతాలు. వ్యూహాత్మక స్వతంత్ర ప్రతిపత్తితో వ్యవహరిస్తున్నందుకు భారత్‌కు శిక్షగా అమెరికా ఆ ప్రతీకార సుంకాలు విధించిందని న్యూఢిల్లీ అధికార వర్గాలు సునిశ్చితంగా విశ్వసిస్తున్నాయి. ఆ సుంకాల పర్యవసానాలు భారత్‌కు తీవ్ర నష్టదాయకంగా పరిణమించనున్నాయి. అమెరికా విపణిలో భారతీయ సరుకులు పోటీ సామర్థ్యాన్ని కోల్పోనున్నాయి. స్వదేశంలో తిరుపూర్, సూరత్, విశాఖపట్నంలో వేలాది కార్మికులు వీధిన పడవలసే పరిస్థితులు నెలకొన్నాయి. అమెరికా వినియోగదారులు అధిక ధరలు భరించవలసిరావడంతో ఆ దేశ వ్యాపారస్తులు ఇప్పటికే వియత్నాం, ఈక్విడార్, థాయిలాండ్, టర్కీ నుంచి భారతీయ ఉత్పత్తులకు ప్రత్యామ్నాయంగా వివిధ సరుకుల దిగుమతికి ఇప్పటికే ఏర్పాట్లు చేసుకొంటున్నారు. సూరత్‌లో బంగారు ఆభరణాల శ్రామికులు, తిరుపూర్‌లో జౌళి కార్మికులు, విశాఖపట్నంలో రొయ్యల సాగుదారులు కోలుకోలేని రీతిలో నష్టాలపాలయ్యారు.

ఇది అటు అమెరికాకు కానీ, ఇటు భారత్‌కు కానీ లాభదాయకం కాని పరిస్థితి. ఉభయులకూ నష్టాలు ఖాయంగా వాటిల్లుతాయి. ఇంకెంత మాత్రం ఈ పరిస్థితి కొనసాగకూడదు. దీనిని తొలగించుకోకపోతే భారత్-అమెరికా ద్వైపాక్షిక సంబంధాలు అడుగంటుతాయి. ఆర్థిక వ్యవస్థల సౌష్ఠవమూ దెబ్బతింటుంది. ఆసక్తికరమైన విషయమేమిటంటే ఈ వాణిజ్య యుద్ధం పెచ్చరిల్లుతున్నప్పటికీ రక్షణ రంగంలో భారత్ అమెరికాల మధ్య సహకారం యథాతథంగా ఉన్నది. సైనిక సహకారాన్ని మరింత దృఢతరం చేసుకునేందుకు, అత్యాధునిక ఆయుధాల ఉత్పత్తిలో భాగస్వామ్యాన్ని పెంపొందించుకొనేందుకు, 'టైగర్ ట్రయంఫ్' పేరిట సంయుక్త సైనిక విన్యాసాలు నిర్వహించేందుకు భారత్, అమెరికాలు ఫిబ్రవరి 2025లో పరస్పరం సంకల్పించుకున్నాయి. పలు అత్యాధునిక యుద్ధ విమానాలు, నవీన సైనిక సామగ్రిని అమెరికా నుంచి కొనుగోలు చేసేందుకు భారత్ నిర్ణయించుకున్నది. ట్రంప్ విధించిన ప్రతీకార సుంకాలతో రక్షణ రంగంలో ఈ సహకారానికి తీవ్ర విఘాతమేర్పడే అవకాశమున్నది. భారత్ కేవలం వాణిజ్య భాగస్వామి మాత్రమే కాదు, ఇండో-పసిఫిక్ ప్రాంతంలో ఒక కీలక శక్తి. అమెరికా ఈ వాస్తవాన్ని విస్మరిస్తే 'క్వాడ్' బలహీనపడే ప్రమాదమున్నది. అది, అమెరికాకు ఏ మాత్రం శ్రేయస్కరం కాని పరిణామమవుతుంది.

భారత్ వ్యూహాత్మక స్వయం ప్రతిపత్తి తన సార్వభౌమత్వాధికార వ్యక్తీకరణేగానీ, ఏ దేశాన్నీ ధిక్కరించడంగానీ, సవాల్ చేయడం గానీ కాదని అమెరికా గుర్తించాలి. విదేశీ వాణిజ్యంలో ఏ దేశమైనా స్వీయ జాతీయ ప్రయోజనాలకే అగ్ర ప్రాధాన్యమిస్తుంది. మరి రష్యా నుంచి చమురు, సహజవాయువు, సైనిక సామగ్రి కొనుగోలు చేస్తున్నందుకు భారత్‌ను ప్రతీకార సుంకాలతో శిక్షించడం సమంజసమేనా, ట్రంప్ గారూ? దూరదృష్టితో తీసుకోని నిర్ణయాలు అమెరికాకు ప్రతికూలంగా పర్యవసించడం ఖాయం. ఉభయతారకం కాని చర్యలకు బదులుగా వాషింగ్టన్ ఇలా వ్యవహరించడం ఇరు దేశాలకూ శ్రేయస్కరంగా ఉంటుంది : ప్రతీకార సుంకాలను, మరీ ముఖ్యంగా శ్రమ సాంద్ర రంగాలపై, తక్షణమే ఎత్తివేయాలి (25 శాతం సుంకాలకే ఈ రంగాలు కుదేలవుతున్నాయి. 50 శాతం సుంకాలతో అవి తమ ఉత్పత్తులను విక్రయించుకోవడం అసాధ్యం); స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలపై చర్చలు వేగవంతం చేయాలి; పరస్పర రాయితీలపై నిర్మాణాత్మక చర్చలతో భారత్‌పై విధించే సుంకాలను, ఇతర ఆసియా దేశాల విషయంలో వలే, 15 నుంచి 19 శాతానికి తగ్గించాలి; ప్రభుత్వాధినేతల మధ్య ప్రత్యక్ష సంభాషణలతో సహా అత్యున్నత స్థాయి దౌత్య మంతనాలను పునః ప్రారంభించాలి (ఈ నెల 17న ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పుట్టిన రోజు సందర్భంగా ఆయనకు అధ్యక్షుడు ట్రంప్ శుభాకాంక్షలు తెలిపితే ఇరువురి మధ్య సంబంధాలలో నెలకొన్న పొరపొచ్చాలు తొలగిపోయి సుహృద్భావం వెల్లివిరియదా? ఈ నెలలోనే ప్రారంభమవనున్న ఐక్యరాజ్యసమితి సర్వప్రతినిధి సమావేశాల సందర్భంగా ట్రంప్, మోదీ మనసు విప్పి మాట్లాడుకుంటే అద్భుతాలు సంభవిస్తాయి). సాంకేతికతల ఆదాన ప్రదానాలు, రక్షణ రంగంలో సహకారం పరస్పర విశ్వాసాన్ని దృఢతరం చేస్తాయి, ఉభయ దేశాల ప్రయోజనాలను పరిరక్షిస్తాయి. భారత్ కేవలం ఒక సౌలభ్య భాగస్వామి మాత్రమే కాదు, ఎంతో ప్రాధాన్యమున్న ఎనలేని సానుకూల పరిణామాలకు దోహదం చేసే సాటిలేని భాగస్వామి. భారత్ భాగస్వామ్యం బలిమేగానీ భారం కాదని, కాబోదనే వాస్తవాన్ని అర్థం చేసుకోవాలి. విభేదాలు కొనసాగితే రెండు దశాబ్దాల (ఉమ్మడి లక్ష్యాల, ప్రయోజనాల) వ్యూహాత్మక ఏకీకరణ నిరర్థకమవుతుంది. భారత్-అమెరికా వ్యూహాత్మక సంబంధం అంతర్జాతీయ శాంతిభద్రతలు, రాజకీయ సుస్థిరత భవిష్యత్తుకు ఆవశ్యకమైనది. ఆ వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని పునర్నిర్మించేందుకు భారత్-అమెరికాల మధ్య పరస్పర విశ్వాసం మళ్లీ నిండుగా వర్ధిల్లాలి. ఇందుకు అమెరికాయే ప్రథమ చొరవ తీసుకోవాలి. 'చెరపకురా చెడేవు, చెరువుకు నీటి ఆశ, నీటికి చెరువు ఆశ' అనే భారతీయ లోకోక్తులలోని విశ్వజనీన వివేకాన్ని ట్రంప్ విస్మరించరని ఆశిద్దాం.



• శశి థరూర్
లోక్‌సభ సభ్యుడు
('ఇండియన్ ఎక్స్‌ప్రెస్' సౌజన్యం)

జావెద్ అక్తర్ తప్పేంటి?

'షోలే' సినిమా విడుదలై 50 సంవత్సరాలు అయిందని సంబరాలు చేసుకుంటున్నాం. అయితే ఆ ల్యాండ్ మార్క్ సినిమాకు రచనా సహకారం అందించినవారిలో ఒకరైన జావెద్ అక్తర్‌కు జరిగిన అవమానం గురించి మాత్రం పట్టించుకోవడం మానేశాం.

పశ్చిమ బెంగాల్ ప్రభుత్వం, ఉర్దూ అకాడెమి ఆధ్వర్యంలో 'Urdu in Cinema' పేరుతో చేపట్టిన మూడు రోజుల సాహితీ ఉత్సవం సెప్టెంబరు 1 నుంచి 3వ తేదీ వరకూ కలకత్తాలో జరగాల్సి ఉన్నది. ఈ కార్యక్రమానికి అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. జావెద్ అక్తర్‌తో పాటు ప్రముఖ బాలీవుడ్ దర్శకుడు, కవి అయిన ముజఫర్ అలీని కూడా పిలిచారు. వీళ్లిద్దరి పేర్లతో పోస్టర్లు వెలిశాయి. ముషాయిరా, సెమినార్లు, ప్రసంగాలు, ఉర్దూ నాటకాలు, సినిమా సంభాషణలు వంటి అనేక అంశాలు ఈ కార్యక్రమంలో అలరిస్తాయని షెడ్యూల్ కూడా ప్రకటించారు. అయితే ప్రారంభానికి కొన్ని గంటల ముందు కార్యక్రమాన్ని వాయిదా వేస్తున్నట్టు ప్రభుత్వం ప్రకటించింది. ఆ తర్వాత ఎప్పుడు నిర్వహిస్తారో కూడా చెప్పలేదు, సరైన కారణాలు కూడా సదరు సాహితీవేత్తలకు తెలుపలేదు.



> జావెద్ అక్తర్ మొదటి నుంచి హేతువాద దృక్పథం ఉన్నవాడని తెలిసి కూడా బెంగాల్ ప్రభుత్వం ఆయన వాక్ స్వేచ్ఛను కాపాడలేకపోయింది. మతతత్వ పార్టీగా పేరున్న బీజేపీకి ఒక దశలో కాంగ్రెస్ కన్నా ఎక్కువగా ఎదురొడ్డి నిలిచి, గెలిచి చివరికి బెంగాల్‌లో దీదీ సాధించిందేంటో ఆత్మవిమర్శ చేసుకోవాల్సిన అవసరం ఏర్పడింది.

అసలు విషయం ఏంటంటే జావెద్ అక్తర్‌ని ప్రముఖంగా ఉర్దూ అకాడెమి పిలవడాన్ని బెంగాల్‌లోని కొన్ని మత సంస్థలు అభ్యంతరం తెలిపాయి. జావెద్ ఇస్లాంకి వ్యతిరేకంగా మాట్లాడారని, నాస్తికత్వం ముసుగులో తమ సంప్రదాయాలకు వ్యతిరేకంగా ప్రచారం చేశారని అలాంటి వ్యక్తిని ఈ కార్యక్రమానికి పిలవడం తమకు నచ్చలేదని జమాతే ఉలేమా హింద్ సంస్థ ప్రభుత్వానికి లేఖ రాసింది. ఈ ప్రయత్నాన్ని వెంటనే విరమించుకోకపోతే తాము తీసుకునే తీవ్ర చర్యలకు బాధ్యులు అవుతారని హెచ్చరించింది. అంతేకాకుండా గతంలో బంగ్లాదేశ్ రచయిత్రి తస్లీమా నస్రీన్‌కు వ్యతిరేకంగా తాము చేసిన ఉద్యమాన్ని కూడా గుర్తుపెట్టుకోవాలని భయపెట్టింది. ఈ సంస్థకు వాయహిన్ (Wahya Hin) అనే సంస్థ కూడా మద్దతు తెలిపింది. దీంతో తర్జన భర్జన పడ్డ బెంగాల్ ప్రభుత్వం చివరికి వివాదం ముదురుతుండటంతో మొత్తం కార్యక్రమాన్నే రద్దు చేసుకుని పారిపోయింది.

జావెద్ అక్తర్ మొదటి నుంచి తనను తాను నాస్తికుడిగానే ప్రకటించుకున్నారు. చివరికి తన పేరుకు ఇస్లాంకు కూడా సంబంధం లేదని అది పర్షియన్ పేరు అని ఒక సందర్భంలో చెప్పారు. ఆయన గతంలో షరియత్ చట్టాల మీద విమర్శ చేశారు. ముస్లిం మత సంఘాలు ఏకపక్షంగా ఫత్వాలు జారీ చేయడాన్ని వ్యతిరేకించారు. మత మూఢత్వం ముస్లింలకు మేలు చేయదని చెప్పారు. ఈ దేశంలో మత సామరస్యం పరిఢవిల్లాలనేది ఆయన ఆకాంక్ష. దేవుని ఉనికిని ప్రశ్నిస్తూ ఆయన బహిరంగంగా టీవీ ఇంటర్వ్యూలు ఇచ్చారు. లౌకిక పునాదుల మీద తాను నడుస్తానని ప్రకటించారు.

అయితే అంతకుముందు హిందూ మత సంస్థల ఆగ్రహానికి కూడా జావెద్ అక్తర్ గురయ్యారు. మైనార్టీల మీద మెజార్టీ మతవాదులు చేస్తున్న దాడులు తాలిబన్ల దుశ్చర్యలను తలపిస్తున్నాయని అన్నారు. ముఖ్యంగా ఆరెస్సెస్‌ని, భజరంగదళ్‌ని, వీహెచ్‌పీని టార్గెట్ చేస్తూ విమర్శలు చేశారు. దీంతో హిందుత్వ సంఘాలు ఆయనను తీవ్రంగా విమర్శించాయి. ఒక దశలో చంపేస్తామని కూడా బెదిరించాయి. అయినా ఆయన తన ధోరణి మార్చుకోలేదు.

అయితే తాజా వివాదంలో మాత్రం సహజంగానే హిందూ సంఘాలు జావెద్ అక్తర్ వైపు నిలిచాయి. ఈ సంఘటనను ఆధారం చేసుకుని బెంగాల్ ప్రభుత్వంపై పెద్ద ఎత్తున విమర్శలకు దిగాయి. పశ్చిమ బెంగాల్లో ఇలాంటి బెదిరింపుల పాలనను కొనసాగిస్తారా? అంటూ బహిరంగంగానే నిరసన ప్రదర్శనలు చేస్తున్నాయి. దీన్ని ఒక రాజకీయ అస్త్రంగా బీజేపీ ప్రయోగిస్తుండటంతో మరోవైపు జావెద్‌ను వ్యతిరేకిస్తున్న ముస్లిం మత సంఘాలు కూడా రంగంలోకి దిగి రాజకీయ విమర్శలు చేయడం మొదలుపెట్టాయి.

ఈ మొత్తం గందరగోళం మధ్య జావెద్ అక్తర్ స్పందించి పశ్చిమ బెంగాల్ ప్రభుత్వంపై సంధించిన కొన్ని ప్రశ్నలు మాత్రం చర్చకు దారి తీస్తున్నాయి. రెండు వర్గాల మతమౌఢ్యుల దగ్గర నుంచి తరచూ తనకు బెదిరింపులు వస్తున్నాయంటే తాను సరైన దారిలోనే నడుస్తున్నట్టు భావిస్తున్నానని తెలిపారు. ఉర్దూ అకాడెమికి మత సంస్థలకు సంబంధం ఏంటి? అని ప్రశ్నించారు. 'ఉర్దూ అనేది మత భాష కాదు, ప్రజల భాష' అని అన్నారు. మతానికి ఏ మాత్రం సంబంధం లేని కార్యక్రమంలో పలు మత సంస్థల మాటలకు విలువనిచ్చి కార్యక్రమాన్ని రద్దు చేయడం సమంజసంగా లేదని చెప్పారు. ఈ విషయంలో పశ్చిమ బెంగాల్ ప్రభుత్వం అనుసరించిన తీరు మొదటి నుంచి ప్రజాస్వామ్య విధానాలకు, విభిన్న గొంతులకు నిలయంగా ఉన్న కోల్‌కతా నగర ప్రతిష్ఠకు భంగం కలిగించేదిగా ఉందని చెప్పారు. ప్రభుత్వం పారిపోకుండా ఈ విషయంలో జోక్యం చేసుకుని కవులు, కళాకారుల గొంతును, మాట్లాడే స్వేచ్ఛను కాపాడితే బావుండేదన్నారు. జరిగిన పరిణామాలతో తాను తీవ్ర నిరాశకు గురైనట్టు చెప్పారు. జావెద్ అక్తర్‌కి మద్దతుగా పలువురు హిందీ, ఉర్దూ రచయితలు స్పందించి బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీకి ఉత్తరం రాశారు. బెంగాల్‌లో వాక్ స్వాతంత్ర్యాన్ని కాపాడలేకపోయారని ఆ లేఖలో విమర్శించారు.

జావెద్ అక్తర్ సాదా సీదా కవి కాదు. ఎందరి హృదయాలనో కదిలించే బలమైన కవిత్వం, పాటలు రాసినవారు. ఉర్దూ, హిందీ రెండు భాషల్లోనూ రచనలు చేశారు. పద్మశ్రీ, పద్మభూషణ్ పురస్కారాలు అందుకున్నారు. ఐదుసార్లు జాతీయ అవార్డులు పొందారు. హైదరాబాద్‌లో సైతం ఆయన ప్రముఖ కవి సినారె పేరు మీద ఇచ్చే విశ్వంభర పురస్కారం అందుకున్నారు. తన చలన చిత్ర జీవితంలో షోలే, జంజీర్, దీవార్ తోపాటు ఎన్నో మైలురాళ్ల వంటి సినిమాలకు రచనా సహకారం అందించారు.

జావెద్ అక్తర్ మొదటి నుంచి హేతువాద దృక్పథం ఉన్నవాడని తెలిసి కూడా బెంగాల్ ప్రభుత్వం ఆయన వాక్ స్వేచ్ఛను కాపాడలేకపోయింది. మతతత్వ పార్టీగా పేరున్న బీజేపీకి ఒక దశలో కాంగ్రెస్ కన్నా ఎక్కువగా ఎదురొడ్డి నిలిచి, గెలిచి చివరికి బెంగాల్‌లో దీదీ సాధించిందేంటో ఆత్మవిమర్శ చేసుకోవాల్సిన అవసరం ఏర్పడింది. ఇప్పటికైనా తప్పు సరిదిద్దుకుని ఈ కార్యక్రమాన్ని తిరిగి ఇదే సాహితీవేత్తలతో నిర్వహించి పరువు కాపాడుకోవాల్సి ఉంది.

◆ డా. వేంపల్లె షరీఫ్
జర్నలిస్టు, కథా రచయిత

పోరాటాల స్ఫూర్తి శిఖరం



కాలమేదైనా
కాలాంతకులపై కళ్లెర్రజేశావు
ఎండుకుపోతున్న నేల దుర్నీతిని ఎండగట్టావు
అన్యాయాన్నెదిరించి అగ్గిబరాటై నిలిచావు

బువ్వ, తొక్కే మా భాషలు
పలుకుబడులే మా గుండెసవ్వడులు
తంగెడుపూలే మా పరిమళాలు
బతుకమ్మ బోనాలే
మా సాంస్కృతిక పతాకాలని ఎలుగెత్తి చాటావు
పుట్టమన్ను తెచ్చి రచ్చకట్టపై అలికి
బొడ్రాయి ముందు మాండలికాల చిత్రపటమేశావు

భుజాన సంచేసుకొని
సద్దకంకుల్లా అక్షరగింజల్ని పంచిపెట్టావు
నాగొడవంతా ప్రజాగొడవనేనని ప్రకటించావు
నలుగురికోసం రందిపడి
జనంకోసం జమిడీక నగారై మోగావు

స్వేచ్ఛా సంగ్రామంలో నీ కవితలే
రాబందులపై రాకెట్లలా దూసుకుపోయినవి
నీ కన్నీళ్లే నీటిగోసలై జలదీక్షలై నిలదీసినవి
నీ పట్టుదలలే ధిక్కార సాహితీ సమ్మేళన
తుఫానులై సాగినవి

మానవహక్కులను అడుగనేర్పిన చైతన్యదీప్తి
గులాంగిరిని బొందపెట్టె తాత్త్విక జీవనగీతం
పోరాటాలకు స్ఫూర్తి శిఖరం
తెలంగాణ ధ్వజస్తంభం

— వనపట్ల సుబ్బయ్య
(నేడు కాళోజీ నారాయణరావు జయంతి)

అంతులేని రాజకీయ పతనం!

ముప్పై మంది ఎంపీలు తమను కలవడానికి ఎన్నికల కమిషన్ గత నెల అనుమతిని ఇచ్చింది. ఆగస్టు 10న ఆ ఎంపీలు తమ ఫిర్యాదును దాఖలు చేయడానికి ఈసీ కార్యాలయానికి బయలుదేరారు. యాత్ర ప్రశాంతంగా జరుగుతోంది. పార్లమెంటు నుంచి ఆ ఆఫీస్‌కు దూరం ఒక కిలోమీటరు కంటే తక్కువే. ఊరేగింపు బయలుదేరిన సమయం ట్రాఫిక్ రద్దీ ఉండే సమయం కూడా కాదు. అయినప్పటికీ, పార్లమెంట్ సభ్యుల యాత్రను ఢిల్లీ పోలీసులు అడ్డుకున్నారు. ప్రజాప్రతినిధుల ప్రజాస్వామ్య హక్కులను అణచివేయడానికి కూడా ఈ ప్రభుత్వం వెనుకాడలేదు.

బీజేపీకీ, ఎన్నికల కమిషన్‌కు మధ్య ఉన్న సంబంధం గురించి రాహుల్ గాంధీ సంచలన ఆరోపణలు చేశారు. ఒక నియోజకవర్గంలో ఎన్నికల ప్రక్రియపై ఆయన చేసిన పరిశోధన ప్రకారం- జాబితాలోని లక్ష కంటే ఎక్కువమంది ఓటర్ల నమోదులో చాలా అవకతవకలు ఉన్నాయి. ఇవి రెండు అంశాలను స్పష్టం చేస్తున్నాయి: ఒకటి, నిజాయితీతో కూడిన దిద్దుబాట్లు చేయాల్సిన అవసరాన్ని; రెండు, ఓటర్ల నమోదులో మోసం చేసే ఉద్దేశం ఉండే అవకాశాన్ని. ఈ విధమైన వాదనలు చేసే అవకాశం ఉన్నప్పటికీ రాహుల్‌గాంధీ తన విజ్ఞాపన పత్రంలో అణకువతో కూడిన అభ్యర్థన మాత్రమే చేసారు. అన్ని నియోజకవర్గాలలో నిష్పాక్షిక దర్యాప్తు నిర్వహించాలన్నారు. అవకతవకలకు కారణాలను వివరించమన్నారు. జాబితా తాలూకు ఎలక్ట్రానిక్ వెర్షన్‌ను తనకు ఇస్తే అన్ని నియోజకవర్గాల్లో ఈ విధమైన విశ్లేషణను చేపట్టడానికి సంసిద్ధంగా ఉన్నానని తెలియజేశారు.

ఈ విషయాలు వెల్లడైన కొన్ని గంటల్లోనే, దీన్ని కాదనే రుజువులేమీ చూపించకుండా, రాహుల్‌గాంధీ ఎత్తి చూపిన విషయాలన్నీ అబద్ధాలనీ, తప్పుదారి పట్టించేవనీ బీజేపీ ఖండించింది. కేబినెట్ మంత్రులు రాహుల్‌పై వ్యక్తిగత దూషణలతో విరుచుకుపడ్డారు, ఆయన వ్యక్తిత్వ హననానికి పూనుకున్నారు. ఆయనపై దేశ వ్యతిరేకి అని ముద్ర వేస్తూ తీవ్రంగా విమర్శించారు. రాహుల్ విశ్లేషణ తప్పు అని ప్రకటించడానికి బీజేపీ దగ్గర ఉన్న డేటా ఏమిటి? అసలు ఎన్నికల కమిషన్ తరఫున మాట్లాడాల్సిన అవసరం ఆ పార్టీకి ఎందుకు వచ్చింది? మరోపక్క గోదీ మీడియా బీజేపీ వాదనలనే ప్రతిధ్వనించింది. ఇంతటి జాతీయ సమస్య కంటే వీధి కుక్కలపై సుప్రీం తీర్పు వంటి అంశాలకు ఎక్కువ ప్రాధాన్యతను ఇచ్చింది.

ఎన్నికల కమిషన్ మరింత దారుణంగా వ్యవహరించింది. రాహుల్ తన ఆధారాలను బైటపెట్టిన కొన్ని గంటల్లోనే, ఆ డేటా తప్పు అని తోసిపుచ్చింది. రాహుల్ క్షమాపణ చెప్పాలని, అఫిడవిట్ సమర్పించాలని డిమాండ్ చేసింది. రాహుల్‌గాంధీ వెల్లడించిన వివరాలు వారి దగ్గర ఇప్పటికే ఉన్నాయా? లేక రాహుల్ డేటా తప్పు అని నిరూపించే విధంగా ఈ లోగా ఓటర్ల జాబితాను సవరించగలమన్న విశ్వాసమా? ఎన్నికల కమిషన్ అందించిన డేటా ఆధారంగానే తన విశ్లేషణ ఉందని రాహుల్ గాంధీ విలేఖరుల బహిరంగ సమావేశంలో సుస్పష్టంగా ప్రకటించారు. అలాంటప్పుడు ఒక నిష్పాక్షిక సంస్థగా ఈసీ మొదటి ప్రతిస్పందన ఏమై ఉండాల్సింది? ఎత్తి చూపిన అవకతవకలపై దర్యాప్తు చేసి ఫలితాలు ప్రకటిస్తామని చెప్పాల్సింది. కానీ రాహుల్ వాదనను ఖండించడంలో ఎన్నికల కమిషన్ చూపించిన తొందరపాటు దాని ఉద్దేశాలపై అనుమానాలను కలిగిస్తున్నది. అంతేగాక, అది దర్యాప్తులను తారుమారు చేసే అవకాశం ఉందని కూడా సూచిస్తున్నది. సామాన్యుడి ప్రాథమిక హక్కులపై ప్రభావం చూపే ఈ విషయంపై పూర్తిగా పారదర్శకంగా, నిష్పాక్షికంగా, నిజాయితీగా దర్యాప్తు జరగడం చాలా ముఖ్యం.

> ప్రతిపక్షాలు లేవనెత్తిన ఓటరు జాబితాలో అవకతవకలూ, డేటా తారుమారు వంటి అంశాలు దర్యాప్తునకు అర్హమైనవి. ఈ విషయంలో ఎన్నికల సంఘం ఆ డేటా కచ్చితత్వాన్ని నిర్ధారణ చేసుకోవడానికి దర్యాప్తు చేపట్టాలి. అంతేతప్ప, వారికి రాహుల్ అఫిడవిట్ ఎందుకు అవసరం? రాహుల్‌గాంధీని జవాబుదారీగా నిలబెట్టేందుకు అఫిడవిట్ అవసరం అనేటట్లయితే, ఒకవేళ లోపాలు ఉన్నట్టు వెల్లడైన పక్షాన క్రిమినల్‌గా ప్రాసిక్యూషన్‌కు సిద్ధపడుతూ ఈసీ కూడా అఫిడవిట్ ఇవ్వాలి కదా?



ప్రతిపక్షాలు లేవనెత్తిన ఓటరు జాబితాలో అవకతవకలూ, డేటా తారుమారు వంటి అంశాలు దర్యాప్తునకు అర్హమైనవి. ఈ విషయంలో ఎన్నికల సంఘం ఆ డేటా కచ్చితత్వాన్ని నిర్ధారణ చేసుకోవడానికి దర్యాప్తు చేపట్టాలి. అంతేతప్ప, వారికి రాహుల్ అఫిడవిట్ ఎందుకు అవసరం? రాహుల్‌గాంధీని జవాబుదారీగా నిలబెట్టేందుకు అఫిడవిట్ అవసరం అనేటట్లయితే, ఒకవేళ లోపాలు ఉన్నట్టు వెల్లడైన పక్షాన క్రిమినల్‌గా ప్రాసిక్యూషన్‌కు సిద్ధపడుతూ ఈసీ కూడా అఫిడవిట్ ఇవ్వాలి కదా?

న్యాయం కోసం కోర్టులను సంప్రదించమని ప్రతిపక్షాలకు ప్రభుత్వం, ఈసీ సలహా ఇస్తున్నాయి. తక్కువ సమయంలో న్యాయం జరుగుతుందని వారు నిర్ధారించగలరా? కోర్టులు చాలా సమయం తీసుకుంటాయని, ఈలోగానే మరో ఎన్నికలు వస్తాయని తెలిసిందే. అదలా వుంచితే, కోర్టులు చట్టపరమైన ఆదేశాల ద్వారా అన్ని రాజకీయ పరిపాలనా సమస్యలను పరిష్కరించగలవా?

స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) గురించి ప్రతిపక్షాలు పార్లమెంటులో చర్చించాలని చేసిన ప్రయత్నాన్ని ప్రభుత్వం అడ్డుకుంది. ఎన్నికల కమిషన్ ఒక స్వయంప్రతిపత్తి గల సంస్థ అనీ, అందువల్ల దానిని పార్లమెంటులో చర్చించలేమని పేర్కొంది. కానీ కాగ్, ఈడీ, సీబీఐలు కూడా స్వయంప్రతిపత్తి గల సంస్థలే. మరి వాటి గురించి పార్లమెంటులో చర్చను అనుమతిస్తున్నారు, చర్చ జరుగుతున్నది కూడా. ఎస్ఐఆర్‌పై చర్చ విషయంలో మాత్రం ప్రభుత్వమూ, గోదీ మీడియా కలిసి ప్రతిపక్షాలు పార్లమెంటు కార్యకలాపాలకు అడ్డు వస్తున్నాయని నిందిస్తున్నాయి. న్యాయమైన, స్వేచ్ఛాయుతమైన ఎన్నికలను డిమాండ్ చేయడానికి సాధారణ వ్యక్తికి ఉన్న రాజ్యాంగ హక్కు కంటే మరేదీ ముఖ్యమైనది కాదన్నది ఇక్కడ గమనించాలి.

ఈ రోజు వరకు, ఎంపీలను అరెస్టు చేయడానికి పోలీసులు కారణాలు పేర్కొనలేదు. నైతిక దృక్కోణం నుంచి చూస్తే, ప్రజల్లో 60శాతం ఆకాంక్షలకు ప్రతిపక్ష ఎంపీలు ప్రాతినిధ్యం వహిస్తుండగా ప్రభుత్వ పక్షం పార్లమెంట్ సభ్యులు 40శాతం జనాభా ఆకాంక్షలకు మాత్రమే ప్రాతినిధ్యం వహిస్తారు. కాబట్టి, ప్రతిపక్షాల వారు ఒక సమస్యపై ప్రాతినిధ్యం వహించడానికి శాంతియుత నిరసన ప్రదర్శనను చేపడుతుంటే ప్రభుత్వం ఎలా తిరస్కరించగలదు? నిరంకుశ రాజకీయాలను దేశం అనుమతించాలా? ప్రజలు తమకు అధికారం ఇచ్చారని క్లెయిమ్ చేయడానికి ప్రభుత్వానికి చట్టబద్ధత ఉంది నిజమే. కానీ ప్రభుత్వాన్ని ప్రశ్నలు అడగడానికీ, దానిని జవాబుదారీగా నిలబెట్టడానికీ ప్రజలు ఒక ప్రతిపక్షాన్ని ఎన్నుకున్నారనే నిజాన్ని కూడా గౌరవించాలి. ప్రతి విమర్శను దేశ వ్యతిరేకమైనదిగా లేదా భారతదేశానికి వ్యతిరేక కుట్రగా నిరంతరం పేర్కొనడం అనేది అతిగా ఉపయోగించబడుతున్న ఒక జిత్తులమారి ఎత్తుగడ.

న్యాయమైన, స్వేచ్ఛాయుత ఎన్నికలు దేశంలోని సామాన్యులకు అత్యంత ముఖ్యమైన అంశం. రాహుల్‌గాంధీ ఆరోపణలు ఒక విస్ఫోటన స్వభావం గలవి కావటం వలన సుప్రీంకోర్టు లేదా దేశాధ్యక్షుడు పారదర్శకమైన, నిష్పాక్షికమైన స్వతంత్ర దర్యాప్తును ఏర్పాటు చేయవలసిన ఆవశ్యకత ఉంది. పౌర సమాజం ఇప్పటికిప్పుడే అప్రమత్తమై సమతుల్యతను పునరుద్ధరించడానికి నడుం బిగించకపోతే, దేశానికి కోలుకోలేని నష్టం జరిగే అవకాశం ఉన్నది.

■ కె. విజయ్‌రావు
వైస్ చైర్మన్, సొసైటీ ఫర్ కమ్యూనల్ హార్మనీ



ప్రజాకవి కాళోజీ నారాయణరావు పేరిట ఏర్పాటైన కాళోజీ ఫౌండేషన్ పదేళ్లుగా కాసింత స్థలం కోసం పరితపిస్తోంది. ఆయన జీవితాన్ని ప్రజలకు పరిచయం చేసే కృషిలో నిరంతరం మమేకమవుతున్న ఫౌండేషన్.. కార్యాలయ నెలవు కోసం పోరాటమే చేస్తోంది. గతంలో ఇచ్చిన స్థలాన్ని లాక్కున్నారు. మరో రెండు చోట్ల ఇచ్చినట్లే ఇచ్చి మొండిచేయి చూపారు. చివరికి కాళోజీ కళాక్షేత్రంలో రెండు గదులు కట్టిస్తామన్న కాకతీయ పట్టణాభివృద్ధి సంస్థ (కుడా).. తర్వాత మాట మార్చింది. కాళోజీ పేరుతో ఓ విశ్వవిద్యాలయాన్ని ఏర్పాటు చేసి, ఒక కళాక్షేత్రాన్ని నిర్మించిన ప్రభుత్వం.. ఫౌండేషన్‌కు మాత్రం సొంత భవన నిర్మాణానికి స్థలం ఇవ్వడానికి చేతులు రావడం లేదు. కాళోజీ అధ్యయన కేంద్రం ఏర్పాటు ఊసేలేదు. కాళోజీ నివసించిన ఇల్లు కూలిపోతున్నా పట్టింపు లేదు. ఆ నివాసాన్ని స్మారక మందిరంగా మార్చుతామన్న హామీ అమలుకు నోచుకోవడం లేదు. మంగళవారం (సెప్టెంబరు 9) కాళోజీ 111వ జయంతి సందర్భంగా ప్రత్యేక కథనం..

- కళాక్షేత్రంలో చోటిస్తామని మొండిచేయి
- ఏకశిల పార్క్‌లో స్థలం ఇచ్చి చివరి నిమిషంలో రద్దు
- మరో రెండు చోట్ల ప్రతిపాదించినా అమలులోకి రాని ఆచరణ
- అటకెక్కిన అధ్యయన కేంద్రం ఏర్పాటు
- శిథిలావస్థలో కాళోజీ నివసించిన ఇల్లు
- కలగా మారిన స్మారక మందిర నిర్మాణం

కాళోజీ ఫౌండేషన్‌కు నెలవెక్కడ?

స్థలం కోసం దశాబ్దకాలంగా ఎదురుచూపులు

హనుమకొండ, సెప్టెంబర్ 8 (ఆంధ్రజ్యోతి): 1994లో కాళోజీ ఫౌండేషన్ పురుడుపోసుకున్నది. కాళోజీ బతికున్న రోజుల్లోనే ఆయన అనుమతితోనే నాగిళ్ల రామశాస్త్రి అధ్యక్షుడిగా ఏర్పాటైంది. కాళోజీ శిష్యులు, అభిమానులు, సాహితీవేత్తల సహకారంతో దశాబ్దకాలంగా అనేక కార్యక్రమాలను నిర్వహిస్తోంది. కాళోజీ జయంతి రోజున తెలంగాణ మాండలిక భాషా దినోత్సవాన్ని ఏటా నిర్వహిస్తూ వచ్చింది. తెలంగాణ ఆవిర్భావం తర్వాత తెలంగాణ భాషా దినోత్సవాన్ని నిర్వహిస్తోంది. తెలుగు సాహిత్యంలో లబ్ధప్రతిష్టులైన పలువురికి ప్రతీ ఏటా కాళోజీ స్మారక అవార్డులను ప్రదానం చేస్తోంది. తెలుగులోనే కాకుండా హిందీలోనూ సాహితీ సృజన సాగిస్తున్నవారిని పురస్కారాలతో ఉచిత రీతిన సత్కరిస్తోంది. పలు కాళోజీ రచనలను ముద్రించింది కూడా. ఇటీవల ఇంగ్లీష్‌లోకి అనువాదం చేసిన కథలు, కవితలను పుస్తకంగా తీసుకువచ్చింది. కాకతీయ విశ్వవిద్యాలయంలో ప్రతీ ఏటా కాళోజీ పేర ఎండోమెంట్ లెక్చర్‌ను నిర్వహిస్తోంది. కాళోజీ అధ్యయన కేంద్రం, కాళోజీ రచనలతో లైబ్రరీ ఏర్పాటు, కాళోజీపేర సాహిత్య కార్యక్రమాల నిర్వహణ కోసం సొంత భవన నిర్మాణం ఫౌండేషన్ చిరకాల స్వప్నం. స్థలం కోసం ఫౌండేషన్ నిర్వాహకులు ప్రభుత్వ, ప్రజా ప్రతినిధుల చుట్టూ కాళ్లరిగేలా గత పదేళ్లుగా తిరుగుతున్నారు.

తెలుగు మాండలిక భాషా దినోత్సవం

సమాజంలోని అసమానతలను, వ్యత్యాసాలను ఎండగడుతూ కాళోజీ తనదైన సాహిత్యాన్ని సృష్టించారు. తెలంగాణ నుడికారంతో, పలుకుబడులతో ఆయన రాసిన కవిత్వం ప్రజల ఆదరణ పొందింది. 'నా గొడవ' పేరుతో ముద్రితమైన ఆయన సాహిత్యం.. ఒక శతాబ్దకాలపు తెలంగాణ సామాజిక, రాజకీయ చరిత్రకు దర్పణం పడుతుంది. బడి పలుకుల భాష కాదు, పలుకుబడుల భాష కావాలని కాళోజీ పట్టుబట్టారు. అందుకే ఆయన జయంతిని అధికారికంగా తెలుగు మాండలిక భాషా దినోత్సవంగా జరుపుతున్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో గిడుగు రామ్మూర్తి జయంతి (ఆగస్టు 29)ని తెలుగు భాషా దినోత్సవంగా జరుపుకునే వారు. తెలంగాణ రాష్ట్ర అవతరణ తర్వాత కాళోజీ సాహిత్య సేవకు గౌరవంగా దానిని సెప్టెంబరు 9కి మార్చారు.

ఇచ్చి లాక్కున్నారు..

వాకాటి కరుణ కలెక్టర్‌గా ఉన్నప్పుడు హనుమకొండ బాలసముద్రంలోని ఏకశిల పార్క్‌లో భవన నిర్మాణానికి కాళోజీ ఫౌండేషన్‌కు స్థలం కేటాయించారు. నిర్మాణానికి వనరులు సమకూర్చుకొని తీరా భూమి పూజ నిర్వహించుకునే సమయానికి పార్క్ స్థలంలో (మిగతా 6లో..)

కళాక్షేత్రం.. ఓ తెల్ల ఏనుగు

రూ.70కోట్లతో నిర్మించిన కాళోజీ కళాక్షేత్రం కుడా అధికారుల తీరుతో తెల్ల ఏనుగులా మారింది. కాళోజీ ఆశయాలకు అనుగుణంగా నిర్వహించాల్సిన ఈ కేంద్రం.. ఇందుకు భిన్నంగా పెద్ద మొత్తంలో డబ్బులు చెల్లించిన వారికే అద్దెకు ఇస్తున్నారు. లక్షలు లేనిదే కాళోజీ కళాక్షేత్రంలో కార్యక్రమం నిర్వహించలేని పరిస్థితి ఉంది. కాళోజీ కళాక్షేత్రంలో ఓ కార్యక్రమం నిర్వహణకు కనీస కిరాయి రూ.50వేలు చెల్లించాల్సి వస్తున్నది. అదనంగా క్లీనింగ్, సెక్యూరిటీ, కరెంటు బిల్లు రూపంలో మరో రూ.20వేల వరకు అవుతున్నది. ఇంత భారీ మొత్తం కావడంతో కాళోజీ కళాక్షేత్రం కళలకు సంబంధించిన కార్యక్రమాలు నిర్వహించేందుకు దూరంగా ఉంటున్నారు. చార్జీలను భారీగా నిర్ణయించడంపై రెండు రోజుల కిందట కళాసంస్థలు, సాహితీ సంస్థల ప్రతినిధులు కళాక్షేత్రం ఎదుట నిరసన ప్రదర్శన నిర్వహించారు. సాంస్కృతిక శాఖ డైరెక్టర్ మామిడి హరికృష్ణకు, కుడా చైర్మన్‌కు లేఖలు కూడా రాశారు. హైదరాబాద్‌లోని రవీంద్రభారతి తరహాలో సాంస్కృతిక, సాహిత్య, కళలు, నాటక రంగాల వారికి కాళోజీ కళాక్షేత్రం అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని కాళోజీ అభిమానులు కోరుతున్నారు





సమీక్ష సమావేశంలో సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు, ఉన్నతాధికారులు

మేడారం అభివృద్ధిపై దృష్టి పెట్టాలి

- భక్తులకు అసౌకర్యం కలగకుండా పనులు చేపట్టాలి
- త్వరలోనే మేడారాన్ని క్షేత్రస్థాయిలో పరిశీలిస్తా..
- సమీక్ష సమావేశంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

ములుగు, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ములుగు జిల్లాలో జరిగే మేడారం మహాజాతర నాటికి భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అభివృద్ధి పనులపై దృష్టి పెట్టాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. హైదరాబాద్‌లో మేడారం, బాసర ఆలయాల అభివృద్ధిపై ఆయన సోమవారం సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. మేడారం, బాసర ఆలయాల మాస్టర్ ప్లాన్‌ను అధికారులు సీఎంకు వివరించారు. మేడారం అభివృద్ధికి సంబంధించిన డిజైన్లను పరిశీలించిన ముఖ్యమంత్రి 100 రోజుల్లో పనులు పూర్తయ్యేలా ప్రణాళికలు రూపొందించాలని అధికారులను ఆదేశించారు. పూర్తిగా సహజ సిద్ధమైన రాతి కట్టడాలతో నిర్మాణాలను చేపట్టాలన్నారు. భక్తులకు సౌకర్యవంతంగా ఉండేలా ఎంట్రీ, ఎగ్జిట్, పార్కింగ్‌తో పాటు వసతులు ఉండాలన్నారు. భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకొని జంపన్నవాగులో నీరు నిల్వ ఉండేలా ఏరియాల వారీగా చెక్‌డ్యామ్‌ల నిర్మాణాలకు ప్రణాళికలు రూపొందించాలని సూచించారు. త్వరలోనే మేడారాన్ని క్షేత్రస్థాయిలో పరిశీలిస్తానన్నారు. అందుకు సంబంధించిన అన్ని ఏర్పాట్లు చేసుకోవాలని అధికారులను ఆదేశించారు. అలయ అభివృద్ధి విషయంలో స్థానిక ప్రజల సెంటిమెంట్‌ను గౌరవించాలన్నారు. నిపుణుల, పూజారుల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో మంత్రులు కొండా సురేఖ, ధనసరి సీతక్క, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, సీఎం ప్రిన్సిపల్ సెక్రటరీ శ్రీనివాసరాజు, దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజారామయ్యర్ తదితరులు పాల్గొన్నారు.

కమ్యూనిస్టులు నిస్వార్థపరులు

- పార్టీ ఫిరాయింపులకు ఆజ్యం పోసింది బీఆర్‌ఎస్సే..
- తెలంగాణ సాయుధ పోరాట వారోత్సవాలను విజయవంతం చేయాలి
- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు

హనుమకొండ కలెక్టరేట్, సెప్టెంబరు8(ఆంధ్రజ్యోతి): నిత్యం ప్రజా జీవితంలో ఉండే కమ్యూనిస్టులకు ఎలాంటి మచ్చ ఉండదని, కమ్యూనిస్టులు నిస్వార్థపరులని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. హనుమకొండ నక్కలగుట్టలోని హరితకాకతీయ హోటల్‌లో సోమవారం సీపీఐ జాతీయ మాజీ ప్రధాన కార్యదర్శి, నల్లగొండ మాజీ ఎంపీ సురవరం సుధాకర్‌రెడ్డి సంస్మరణ సభ జరిగింది. ముఖ్య అతిథిగా సాంబశివరావు హాజరై సుధాకర్‌రెడ్డి చిత్రపటానికి పూలుచల్లి నివాళులు అర్పించారు.

అనంతరం సాంబశివరావు మాట్లాడుతూ.. సురవరం సుధాకర్‌రెడ్డి, సీతారాం ఏచూరి, గద్దర్ లాంటి వారు మరణించినప్పుడు ప్రజలు నీరాజనాలు పలికారన్నారు. త్యాగాలకు, పోరాటాలకు నిలయం కమ్యూనిస్టు పార్టీ అని, అందుకే 100 ఏళ్లు పూర్తిచేసుకున్నా నేటికీ ప్రజల గుండెల్లో నిలిచి ఉందన్నారు. ఎన్నికలు ధన ప్రవాహంగా మారిపోయినా, మతోన్మాద శక్తులు ప్రజలను విభజిస్తున్నా వాటికి ఎదురొడ్డి సీపీఐ నిలబడిందన్నారు. దేశంలో కమ్యూనిస్టులందరూ ఏకం కావాలని, ఎర్రజెండాలన్ని ఒకే జెండాగా మారాలన్నారు. పార్టీ ఫిరాయింపులకు ఆజ్యం పోసింది బీఆర్‌ఎస్ పార్టేనని, ఫిరాయింపులకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలన్నారు. ఏ పార్టీ వారైనా పార్టీ మారగానే వారి సభ్యత్వం రద్దు చేయాలన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టులో అవినీతిపై నిష్పక్షపాతంగా విచారణ జరపాలన్నారు. ప్రస్తుతం పరిస్థితుల్లో సీబీఐపై నమ్మకం పోయిందని, కేంద్రం కనుసన్నల్లో కాకుండా సీబీఐ నిష్పక్షపాతంగా వ్యవహరించాలన్నారు. ఈ నెల 11 నుంచి 17వ తేదీ వరకు నిర్వహించే తెలంగాణ సాయుధ పోరాట వారోత్సవాలను విజయవంతం చేయాలని సాంబశివరావు పిలుపునిచ్చారు. వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు మాట్లాడుతూ.. కమ్యూనిస్టులు బడుగు, బలహీనవర్గాల కోసమే పోరాడతారని, పేద ప్రజల పట్ల కమ్యూనిస్టులకు ఎంతో అంకితభావం ఉంటుందన్నారు. మనువాద భావాజాలన్ని ప్రజలపై రుద్దుతున్న బీజేపీని తరిమికొట్టేందుకు అందరం కలిసికట్టుగా పనిచేయాలన్నారు. సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాస్‌రావు మాట్లాడుతూ.. సురవరం సుధాకర్‌రెడ్డి లేని లోటు వామపక్షాలతో పాటు ప్రజలకు తీరని లోటు అన్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లాతో ఆయనకు అనుబంధం ఉందని, పలు భూపోరాటాలకు సహకారం అందించాలన్నారు. ఈ సంస్మరణ సభలో సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాస్‌రావు, సీపీఐ హనుమకొండ, వరంగల్ జిల్లాల కార్యదర్శులు కర్రె బిక్షపతి, షేక్‌బాష్‌మియా, సీపీఎం జిల్లా కార్యదర్శి గాదె ప్రభాకర్‌రెడ్డి, సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు నేదునూరి జ్యోతి, సీనియర్ నాయకులు తాటిపాముల వెంకట్రాములు, మేకల రవి, ఆదరి శ్రీనివాస్, వలీవుల్లా ఖాద్రీ, మద్దెల ఎల్లేష్ తదితరులు పాల్గొన్నారు.



సురవరం సుధాకర్‌రెడ్డి సంస్మరణ సభలో మాట్లాడుతున్న కూనంనేని సాంబశివరావు



13న మెగా జాతీయ లోక్ అదాలత్

- కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలి
- పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్

వరంగల్ క్రైం, సెప్టెంబర్ 8(ఆంధ్రజ్యోతి): ఈ నెల 13న నిర్వహించే మెగా జాతీయ లోక్ అదాలత్‌ను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్ సూచించారు. చిన్న చిన్న కేసులతో కక్షలు పెంచుకొని కోర్టుల చుట్టూ తిరుగుతూ సమయం, డబ్బులు వృథా చేసుకోకుండా న్యాయశాఖ ఇచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసువాలని సూచించారు. కమిషనరేట్‌లోని 3 జోన్‌లలో కోర్టు విధులు నిర్వర్తించే కానిస్టేబుళ్లతో పాటు పోలీస్ అధికారులు రాజీపడే కేసులను గుర్తించి ఇరువర్గాలను పిలిపించి కౌన్సెలింగ్ నిర్వహించి రాజీపడేటట్లు అవగాహన కల్పించాలన్నారు. రాజీపడాలనుకునేవారు పోలీసు అధికారులను సంప్రదిస్తే లోక్ అదాలత్ ద్వారా బాధితులకు సత్వరమే న్యాయం జరుగుతుందన్నారు. క్రిమినల్ కంపౌండబుల్ కేసులు, సివిల్ తగాదా కేసులు, ఆస్తి విభజన కేసులు, కుటుంబపరమైన కేసులు, వైవాహిక జీవితానికి సంబంధించిన కేసులు, బ్యాంకు రివకరీ, విద్యుత్ చౌర్యం, చెక్ బౌన్స్ కేసులు ఉన్న కక్షిదారులు లోక్ అదాలత్ హాజరై పరిష్కరించుకోవచ్చన్నారు.

సరస్వతీ బ్యారేజీలో పడవ బోల్తా

- ఒకరి గల్లంతు.. సురక్షితంగా బయటపడిన మరొకరు
- ఇద్దరూ మహారాష్ట్రకు చెందిన వారు



వెంకటేశ్ (ఫైల్)

మహదేవపూర్, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : నాటు పడవ బోల్తా పడి సరస్వతీ బ్యారేజీ వద్ద గోదావరిలో ఒకరు గల్లంతైన సంఘటన భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలంలో సోమవారం చోటుచేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మహారాష్ట్ర గడ్చిరోలి జిల్లా సిరొంచ తాలూకా మండలాపురానికి చెందిన గడ్డం వెంకటేశ్(40), తూనూరి కిష్టయ్య మంచిర్యాల జిల్లా పొక్కూరులో చేపలు పట్టే నాటు పడవాను కొనుగోలు చేశారు. గోదావరిలో దాన్ని నడుపుకుంటూ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలం సరస్వతీ బ్యారేజీ వద్దకు చేరారు. బ్యారేజీ ఒక గేటు ద్వారా నీటి ప్రవాహంలో పడవను నడుపుతుండగా వరద ఉధృతికి అది బోల్తా పడింది. ఇందులో గడ్డం వెంకటేశ్ గోదావరిలో గల్లంతయ్యాడు.. తూనూరి కిష్టయ్య ఈదుకుంటూ సురక్షితంగా ఒడ్డుకు చేరుకున్నాడు. సరస్వతి బ్యారేజీ భూపాలపల్లి మండలం మహదేవపూర్, మంచిర్యాల జిల్లా చెన్నూరుకు మధ్య ఉండటంతో అక్కడి పోలీసులు రంగంలోకి దిగి వెంకటేశ్ ఆచూకీ కోసం గాలింపు చర్యలు చేపట్టారు. గజ ఈతగాళ్ల ద్వారా గోదావరి గాలిస్తున్నారు.

ఆఫీసులోనే ఉద్యోగిని ఆత్మహత్యాయత్నం

- కాంగ్రెస్ నాయకుడి వేధింపులే కారణమని వెల్లడి
- బాధితురాలు నల్లబెల్లి తహసీల్దార్ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్

నల్లబెల్లి, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): అధికార పార్టీకి చెందిన ఓ నాయకుడు తనను చాలాకాలంగా లైంగికంగా వేధిస్తున్నాడని, లొంగకపోవడంతో తనపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశాడని ఆరోపిస్తూ వరంగల్ జిల్లా నల్లబెల్లి మండల తహసీల్దార్ కార్యాలయంలో పనిచేసే జూనియర్ అసిస్టెంట్ వాంకుడోతు కల్పన సోమవారం పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. ఈ మేరకు ఆమె సోషల్ మీడియాలో సూసైడ్ నోట్ పోస్టు చేసింది. దీంతో గమనించిన సిబ్బంది వెంటనే ఆమెనే కిందకు తీసుకువచ్చారు. ఆపై తహసీల్దార్ కారులో నర్సంపేటలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. బాధితురాలు రాసిన నోట్‌లో పేర్కొన్న వివరాలు ఇలా వున్నాయి.. నల్లబెల్లి మండల తహసీల్దార్ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న తనను బిల్‌నాయక్ తండాకు చెందిన కాంగ్రెస్ నాయకుడు మాలోతు చరణ్‌సింగ్ లైంగికంగా వేధించేవాడన్నారు. లొంగకపోయేసరికి తనపై కక్ష గట్టాడని, 'నేను అధికార పార్టీ మనిషిని... ఎమ్మెల్యే మనిషిని... నేను ఏమి చేసినా నడుస్తుంది..' అని బెదిరిస్తున్నాడని పేర్కొంది. అలాగే తన పనితీరు సరిగ్గా లేదని, శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ సత్యశారదకు ఫిర్యాదు చేశాడని, దీనిపై తహసీల్దార్ ముప్పు కృష్ణను సోమవారం కార్యాలయంలో సంప్రదించగా.. చరణ్‌సింగ్‌తో మాట్లాడుకోవాలని సలహా ఇచ్చారని కల్పన వెల్లడించింది. తానేమీ తప్పు చేయలేదని చెబితే.. తనకు ఏమీ తెలియదని తప్పించుకున్నారని పేర్కొంది. దీంతో దిక్కుతోచని స్థితిలో కార్యాలయం పై అంతస్తులోకి వెళ్లి పురుగుల మందు తాగానని తెలిపింది. దీనిపై సమగ్ర విచారణ జరిపి చరణ్‌సింగ్, తహసీల్దార్‌పై తగిన చర్యలు తీసుకోవాలని ఆమె తన నోట్‌లో విన్నవించింది. ఇదిలా వుండగా, బాధితురాలు కల్పన ప్రస్తుతం నర్సంపేటలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది.



నర్సంపేట దవాఖానాలో చికిత్స పొందుతున్న జూనియర్ అసిస్టెంట్ కల్పన



పట్టుబడిన గంజాయి, నిందితుడి అరెస్టు చూపిస్తున్న ఏసీపీ వెంకటేష్, సీఐ, ఎస్సైలు


రూ.కోటి విలువైన గంజాయి పట్టివేత

నిందితుడు మహారాష్ట్ర వాసి

ఐనవోలు, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): ఐనవోలు పోలీసులు రూ. కోటి విలువైన గంజాయిని పట్టుకున్నారు. గంజాయిని తరలిస్తున్న నిందితుడి అరెస్టు వివరాలను సోమవారం ఐనవోలు పోలీస్‌స్టేషన్‌లో మామునూరు ఏసీపీ వెంకటేష్, పర్వతగిరి సీఐ రాజగోపాల్, ఐనవోలు ఎస్సై పస్తం శ్రీనివాస్‌లతో కలిసి వెల్లడించారు. ఏసీపీ కథనం ప్రకారం... ఎస్సై పస్తం శ్రీనివాస్ ఆదివారం వరంగల్-ఖమ్మం జాతీయ రహదారిపై పంథిని, చింతకుంట క్రాస్‌లో ఉన్న ఓ దాబా వద్ద వాహనాలను తనిఖీ చేస్తున్నారు. ఈ క్రమంలో ఖమ్మం నుంచి వరంగల్ వైపునకు కారులో ఏటి కురా గ్రామం, మోటాల తాలుక, బుల్డాన జిల్లా మహారాష్ట్రకు చెందిన శివసింగ్ అనుమానాస్పదంగా కారును నడుపుతూ అక్కడికి వచ్చాడు. వెంటనే కారును తిప్పుకుని వెళ్తుండగా కారును ఆపి సోదా చేశారు. కారు డిక్కీలో ప్యాక్ చేసిన 214.3 కిలోల గంజాయి ప్యాకెట్లను గుర్తించారు. దిని విలువ కేజీకి రూ.50వేల చొప్పున మొత్తం రూ.1.07 కోట్లుగా నిర్ధారించారు. పట్టుబడిన వ్యక్తి నుంచి 3 సెల్ ఫోన్లు, కారును స్వాధీనం చేసుకుని నిందితుడిని కోర్టులో హాజరుపరిచారు. గంజాయిని పట్టుకున్న ఎస్సై, పోలీసు సిబ్బందిని ఈ సందర్భంగా ఏసీపీ, సీఐలు అభినందించారు.

అధికంగా వాడితే అనర్థమే..

- ఇష్టారాజ్యంగా రసాయన ఎరువుల వాడకం
- నిస్సారమవుతున్న వ్యవసాయ నేలలు
- పంటలకు చీడపీడల ముప్పు
- యాజమాన్యంపై అవగాహన తప్పనిసరి అంటున్న శాస్త్రవేత్తలు



వర్ధన్నపేట, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలోని రైతులు పంటల ఎదుగుదలకు, అధిక దిగుబడులే లక్ష్యంగా యూరియా, డీఏపీ తదితర ఎరువులను అధికంగా వినియోగిస్తున్నారు. రైతులు ఎక్కువగా పత్తి, వరి పంటలు సాగు చేస్తుండగా పంటల్లో ఎరువుల వాడకంపై వారికి అవగహన ఉండటం లేదు. వ్యవసాయ శాఖ, శాస్త్రవేత్తల సూచనలు పట్టించుకోకుండా ఇతర రైతులు వాడుతున్నారని అవసరం ఉన్నా, లేకున్నా ఎడాపెడా రసాయనిక ఎరువులు వినియోగిస్తున్నారు. దీంతో నేల నిస్సారంగా మారడంతో పాటు పెట్టుబడులు పెరిగి రైతులు ఆర్థికంగా చితికిపోతున్నారు. ఎరువుల యాజమాన్యంలో రైతులు జాగ్రత్తలు పాటించాలని వ్యవసాయాధికారులు సూచిస్తున్నారు. యూరియా కోసం ఉమ్మడి జిల్లాలో పలుచోట్ల రైతులు ఆందోళనలకు దిగుతున్న నేపథ్యంలో యూరియా వాడకం చర్చనీయాంశంగా మారింది.

అధిక వినియోగం

రైతులు పంటల ఎదుగుదలకు, దిగుబడులకు నాలుగైదు దఫాలుగా రసాయనిక ఎరువులు వినియోగిస్తున్నారు. దీంతో పాటు తెగుళ్ల నివారణ కోసం ఏళ్ల తరబడి రసాయనిక ఎరువులు, పురుగు మందులను పెద్ద మొత్తంలో వినియోగిస్తున్నారు. రైతులు దిగుబడి లక్ష్యంగా అవగాహన లోపంతో అవసరం లేకున్నా ఎరువులు, (మిగతా 6లో..)

కాళోజీ ఫౌండేషన్‌కు నెలవెక్కడ?

(5వ పేజీ తరువాయి)

భవనాల నిర్మాణానికి అనుమతికి నగర పాలక సంస్థ అధికారులు అడ్డుపడ్డారు. తర్వాత కలెక్టర్‌గా వచ్చిన రాహుల్ బొజ్జా మొదట భవన నిర్మాణానికి ఆమోదం తెలిపినా.. కార్పొరేషన్ అధికారులు మెలికపెట్టడడంతో ఇచ్చిన స్థలాన్ని వెనక్కి తీసుకున్నారు. ఏకశిల పార్క్‌ను అభివృద్ధి చేయడానికి ముందు అందులో ఒక పాత భవనం ఉండేది. కనీసం అదైనా తమకు కేటాయించాలని అడిగినా అధికారులు ఇవ్వడానికి నిరాకరించారు. అభివృద్ధి పనుల్లో ఆ భవనాన్ని కూల్చేశారు. ఆ తర్వాత సుబేదారిలోని ఫారెస్టు ఆఫీసు వెనక, వరంగల్‌లోని ఉర్సుగుట్ట సమీపంలో స్థలం కేటాయించడానికి అధికారులు ముందుకు వచ్చినా భవన నిర్మాణానికి ఏ మాత్రం అనుకూలంగా లేకపోవడంతో ఫౌండేషన్ తీసుకోలేక పోయింది.

కాళోజీ ఫౌండేషన్ స్థలం విషయాన్ని అప్పటి సీఎం కేసీఆర్ దృష్టికి తీసుకుపోగా హనుమకొండ బాలసముద్రంలో మూడున్నర ఎకరాల్లో కాళోజీ కళాక్షేత్రం నిర్మిస్తున్నందు వల్ల ఆ పక్కనే కాళోజీ ఫౌండేషన్ భవన నిర్మాణానికి అర ఎకరం కేటాయిస్తానని హామీ ఇచ్చారు. ఆ తర్వాత స్థలం ఇవ్వకపోగా కేసీఆర్ మాటమార్చారు. స్థలం ఇస్తే అందులో భవన నిర్మాణం ఫౌండేషన్‌కు ప్రయాసతో కూడుకున్నది కనుక ఆ ఇబ్బందులేమీ లేకుండా కళాక్షేత్రంలోనే రెండుగదులతో పాటు సాహిత్య కార్యక్రమాల నిర్వహణకు 200 మంది కూర్చుకునే వీలుగా ఒక చిన్న హాలు నిర్మించి ఇస్తామని హామీ ఇచ్చారు. కళాక్షేత్రం నిర్మాణం కావడానికి పదేళ్లు పట్టింది. ఇంతలో బీఆర్ఎస్ ప్రభుత్వం మారి కాంగ్రెస్ అధికారంలోకి వచ్చింది. ఎట్టకేలకు కళాక్షేత్రం పూర్తయిందనిపించారు.

కళాక్షేత్రం పూర్తయింది కనుక అందులో తమకు చోటు దొరుకుతుందని కాళోజీ ఫౌండేషన్ ప్రతినిధులు ఆశపడ్డారు. ఫౌండేషన్ కార్యాలయం ఏర్పాటుకు రెండు గదులు, హాల్ నిర్మించి ఇవ్వాల్సిందిగా కాకతీయ పట్టణాభివృద్ధి అధికారులను అడగ్గా వారు మాటమార్చారు. ఫౌండేషన్ కార్యాలయానికి చోటు ఇవ్వాలన్నది కళాక్షేత్రం ప్లాన్‌లో ఎక్కడా పేర్కొనలేదని, కనుక తాము ఇవ్వలేమని అధికారులు తోసిపుచ్చుతున్నారు. దీంతో ఫౌండేషన్ అయోమయంలో పడిపోయింది. వాస్తవానికి కాళోజీ కళాక్షేత్రం నిర్మాణం కావడంలో ఫౌండేషన్ పాత్ర కూడా ఎంతో ఉంది. చివరికి వారికే అందులో చోటు లేకుండాపోయింది.

అటకెక్కిన అధ్యయన కేంద్రం

కాళోజీ శతజయంతి ఉత్సవాల సందర్భంగా కాళోజీ రచనలు, ఆయన ప్రజా జీవనం, రచనలపై అధ్యయనానికి ఒక కేంద్రం ఏర్పాటు చేయనున్నట్టు గత బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రకటించింది. సీఎం కేసీఆర్ ఈ మేరకు హామీ ఇచ్చారు. ఈ అధ్యయన కేంద్రాన్ని కూడా కాళోజీ కళాక్షేత్రంలోనే ప్రత్యేకంగా ఏర్పాటు చేయనున్నట్టు ప్రకటించారు. ఇందు కోసం ప్రత్యేకంగా ప్రస్తుతం కళాక్షేత్రంలో కాళోజీ గ్యాలరీ పక్కనే ప్రత్యేకంగా ఒక గదిని నిర్మించి ఇస్తామని చెప్పారు. అది కూడా ఆచరణలోకి రాలేదు. సరికదా కాళోజీ ఫౌండేషన్ నిర్వాహకులు కళాక్షేత్రం దరిదాపుల్లోకి కూడా ఉచితంగా వెళ్లలేని పరిస్థితి ఉంది. గదులు కేటాయించపోయినా ఫౌండేషన్ కాళోజీ యాదిలో ఏవైనా కార్యక్రమాలను ఉచితంగా నిర్వహించుకునే అవకాశం కూడా ఇవ్వడానికి కాకతీయ పట్టణాభివృద్ధి. అధికారులు సుముఖంగా లేరు. కళాక్షేత్రం ఎదుట కాళోజీ విగ్రహం ఏర్పాటు, లోపల కాళోజీ వాడిన వస్తువులు, పుస్తకాలతో ఒక గ్యాలరీ ఏర్పాటుతోనే అధికారులు సరిపెట్టారు.

కళాక్షేత్రంలో చోటు ఇవ్వాలి



కాళోజీ ఫౌండేషన్ కార్యాలయం ఏర్పాటు స్థలం కోసం పదేళ్లుగా కాళ్లరిగేలా తిరుగుతున్నాం. మేము కలవని అధికారి అంటూ లేడు. అడగని ప్రజాప్రతినిధులు లేరు. చివరికి ముఖ్యమంత్రులను, మంత్రులను, అధికారులను కలిశాం. కాళోజీ కళాక్షేత్రం నిర్మాణం పూర్తయ్యే వరకు అందులో రెండు గదులు, చిన్న హాలు నిర్మించి ఇస్తామని ఆశపెట్టారు. తీరా ఇప్పుడు అడిగితే అసలు ప్లాన్‌లోనే ఆ ప్రతిపాదన లేదని తిరస్కరిస్తున్నారు. కళాక్షేత్రంలో రెండు గదులు, 200 మంది కూర్చునే సామర్థ్యం కలిగిన ఒక చిన్న హాల్ నిర్మించి ఇస్తే అందులో కాళోజీ పేరిట అధ్యయన కేంద్రాన్ని, ఆయన రచనలతో కూడి లైబ్రరీని నిర్వహిస్తాం. హాలు అందుబాటులోకి వస్తే అందులో కాళోజీ స్మారకంగా ఏదో ఒక కార్యక్రమాన్ని నిర్వహిస్తాం. కాళోజీ రచనలపై పరిశోధనకు అవసరమైన ఏర్పాట్లు చేసుకుంటాం.

- నాగిళ్ల రామశాస్త్రి, కాళోజీ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు

బతుకమ్మ, దసరా ఉత్సవాల ఏర్పాట్లు చేయండి

వరంగల్ నగర మేయర్ గుండు సుధారాణి
ఇంజనీరింగ్ అధికారులతో సమావేశం

వరంగల్ కార్పొరేషన్, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): సద్దుల బతుకమ్మ, దసరా ఉత్సవాలకు పటిష్ట ఏర్పాట్లు చేయాలని మేయర్ గుండు సుధారాణి అధికారులకు సూచించారు. సోమవారం జీడబ్ల్యూఎంసీ ప్రధాన కార్యాలయంలో ఇంజనీరింగ్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ.. తెలంగాణ ఆడపడుచులు అత్యంత కన్నుల పండువగా జరుపుకునే సద్దుల బతుకమ్మ పండగ ఏర్పాట్లు పటిష్టంగా ఉండాలని అన్నారు. 66 డివిజన్‌లలో బతుకమ్మ జరుపుకునే ప్రాంతాలు, చెరువులు, కుంటల వద్ద అన్ని ఏర్పాట్లు చేయాలన్నారు. ఆయా ప్రాంతాల్లో గుంతలు పూడ్చి డస్టింగ్, లైటింగ్ ఏర్పాటు చేయాలన్నారు. చెరువులతో గుర్రపుడెక్కను తొలగించి మంచి నీటి సౌకర్యం ఏర్పాటు చేయాలన్నారు. బతుకమ్మల నిమ్మజ్జనం కోసం వరంగల్ నగరంలోని చిన్నవడ్డెపల్లి చెరువు, కట్టమల్లన్న చెరువు, ఉర్సు రంగలీల మైదానం, తోటమైదానం, శివనగర్ గ్రౌండ్, రంగశాయిపేట, ఖిలావరంగల్, బెస్తం చెరువు, మామునూరు పెద్దచెరువు, బంధం చెరువు, భద్రకాళి దేవాలయం, వేయిస్తంభాల గుడి దేవాలయం, మెట్టుగుట్ట, పద్మాక్షి దేవాలయం, మడికొండ చెరువులలో పేరుకుపోయిన గుర్రపుడెక్కను యుద్ధప్రాతిపదికన తొలగించాలన్నారు. బతుకమ్మ పండగలోపు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో ఇన్‌చార్జి ఎస్ఈ మహేందర్, డిప్యూటీ కమిషనర్ సమ్మయ్య, ఈఈలు రవికుమార్, సంతోష్‌బాబు, డీఈలు రవికిరణ్, సారంగం, రాజ్‌కుమార్, కార్తీకొరెడ్డి, సతీష్‌లతోపాటు ఏఈలు పాల్గొన్నారు.

పూల వ్యర్థాల డ్రైన్‌లలో వేయొద్దు..

వరంగల్ నగరంలో చాలాచోట్ల పూల వ్యాపారులు పూల వ్యర్థాలను రోడ్లు, డ్రైన్‌లలో వేస్తున్నారని, దీంతో డ్రైనేజీలు నిండిపోయి ప్రజలకు ఇబ్బందులు ఏర్పడుతాయని మేయర్ గుండు సుధారాణి అన్నారు. సోమవారం వరంగల్ నగరంలోని పలు ప్రాంతాల పూల దుకాణాలను పరిశీలించారు. పూల వ్యాపారులు, యజమానులతో మాట్లాడారు. వరంగల్ పోస్టాఫీస్ ప్రాంతంలో క్షేత్రస్థాయిలో పర్యటించి అక్కడి శానిటేషన్ అధికారులతో మాటాడారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ.. పూల వ్యాపారులు వ్యర్థాలను డ్రైన్‌లలో వేయకుండా అక్కడి సిబ్బంది వ్యాపారులకు అవగాహన కల్పించాలన్నారు. షాపుల నుంచి వెలువడిన చెత్తను డబ్బులలో వేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సీఎంహెచ్‌వో డాక్టర్ రాజారెడ్డి, కార్పొరేటర్ చింతాకుల అనిల్‌కుమార్, ఇన్‌చార్జి ఎస్ఈ మహేందర్, ఎంహెచ్‌వో డాక్టర్ రాజేశ్, ఇన్‌చార్జి ఈఈ సంతోష్‌బాబు, శానిటరీ సుపర్‌వైజర్లు, శానిటరీ జవాన్లు పాల్గొన్నారు.



ఇంజనీరింగ్ అధికారులతో మాట్లాడుతున్న సుధారాణి

ముగిసిన ఉమ్మడి జిల్లా స్థాయి చెస్ టోర్నీ

వరంగల్ స్పోర్ట్స్, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): వరంగల్ జిల్లా చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో హనుమకొండ పబ్లిక్‌గార్డెన్ సమీపంలోని టీటీడీ కల్యాణ మండపంలో నిర్వహించిన ఉమ్మడి వరంగల్ జిల్లా స్థాయి చెస్ టోర్నీ సోమవారం ముగిసింది. ఈ ముగింపు వేడుకలకు కేయూ అసిస్టెంట్ ప్రొఫెసర్ (డిపార్ట్‌మెంట్ ఆఫ్ మెకానికల్ ఇంజినీరింగ్ కళాశాల) ఆర్‌డీ ప్రసాద్ ముఖ్య అతిథిగా హాజరై విజేతలుగా నిలిచిన విద్యార్థులకు బహుమతులను. సర్టిఫికెట్లను ప్రదానం చేశారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. క్రీడల్లో గెలుపోటములను సమానంగా తీసుకున్నప్పుడు అనుకున్న లక్ష్యాన్ని చేరుకుంటారని హితవు పలికారు. క్రీడా పోటీల నిర్వహణ కార్యదర్శి కన్నా మాట్లాడతూ.. ఉమ్మడి వరంగల్ జిల్లా స్థాయి అండర్-15 బాలబాలికల విభాగంలో నిర్వహించిన చెస్ టోర్నీలో 40 మంది పాల్గొన్నారన్నారు. బాలుర విభాగంలో శ్రీసాయి ప్రీతం కనకాల, సాయి జోషిత్ బొల్లం, మొగిలి అభినవ్‌రెడ్డి, రిత్విక్ గుండు లు రాష్ట్రస్థాయి చెస్ టోర్నీకి ఎంపికయ్యారు. అదే విధంగా బాలికల విభాగంలో డి.అరుషి, వి.దిలీషా, ఎ.ఆద్య, బి.శ్రీలాస్యలు ఎంపికయ్యారు. ఇక్కడ జిల్లా స్థాయిలో ఎంపికైన క్రీడాకారులు అక్టోబరు చివరి వారంలో నిజామాబాద్ జిల్లా కేంద్రంలో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి అండర్ -15బాలబాలికల చెస్ టోర్నీకి ప్రాతినిధ్యం వహిస్తారని కన్నా తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్బిటర్లు ప్రేమ్‌సాగర్, వైశాలి, సీనియర్ క్రీడాకారులు పాల్గొన్నారు.



విజేతలకు బహుమతులను ప్రధానం చేస్తున్న నిర్వాహకులు, అతిథులు

నేడు కేయూలో కాళోజీ జయంతి

కేయూ క్యాంపస్ సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): కాకతీయ యూనివర్సిటీ పరిపాలన భవనం ప్రాంగణంలో నేడు (మంగళవారం) 10.30 గంటలకు కాళోజీ నారాయణరావు జయంతిని నిర్వహిస్తున్నట్లు కేయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రం సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. బోధన, బోధనేతర సిబ్బంది. స్కాలర్స్ విద్యార్థులందరూ హాజరుకావాలని కోరారు.

ఉపాధి కార్యాలయంలో జాబ్‌మేళా

హనుమకొండ కలెక్టరేట్, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): వరంగల్ ములుగురోడ్‌లోని ఐటీఐ ప్రాంగణంలో ఉన్న ఉపాధి కార్యాలయంలో మంగళవారం జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి కల్పనాధికారి ఎం.మల్లయ్య సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రథమ్ ఎడ్యుకేషన్ ఫౌండేషన్ కంపెనీలు ఎలక్ట్రికల్ బైక్ మెకానిక్ ట్రైనింగ్ అండ్ జాబ్, ఎలక్ట్రిక్ పెట్రోల్‌లలో 30 ఉద్యోగాల భర్తీకి ఇంటర్వ్యూలు నిర్వహిస్తామన్నారు. 18 నుంచి 32 ఏళ్ల వయసు, 10వ తరగతి, ఇంటర్, డిప్లొమా, డిగ్రీ, పీజీ చదివిన యువతీ యువకులు అర్హులని తెలిపారు. మరిన్ని వివరాలకు 7893394393 నెంబర్‌లో సంప్రదించాలని మల్లయ్య ఆ ప్రకటనలో కోరారు.

నెల్లుట్ల రమాదేవికి అవార్డు ఓరుగల్లుకు గర్వకారణం

హనుమకొండ టౌన్, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): కాళోజీ జయంతిని పురస్కరించుకొని ఈ నెల 9న ముఖ్యమంత్రి చేతుల మీదుగా కాళోజీ సాహిత్య అవార్డుకు ఎంపికై అందుకోబోతున్న ప్రముఖ కవయిత్రి, కార్టూనిస్టు నెల్లుట్ల రమాదేవిని సోమవారం వారి నివాసంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు ఏనుగుల రాకేష్‌రెడ్డి కలిసి శుభాకాంక్షలు తెలిపారు. రాకేష్‌రెడ్డి మాట్లాడుతూ.. అవార్డుకు రమాదేవి ఎంపిక కావడం ఎంతో గర్వకారణమన్నారు.

అమెరికాలో టీచింగ్ శిక్షణకు ఉపాధ్యాయుడి ఎంపిక



సంపత్ కుమార్

కమలాపూర్, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): కమలాపూర్ మండలం ఉప్పల్ జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుడు కొక్కుల సంపత్‌కుమార్ అమెరికాలో ఫుల్ బ్రైట్ శిక్షణకు ఎంపికయ్యారు. అమెరికాలో ఈ నెల 10 నుంచి అక్టోబరు 27 వరకు ఫుల్‌బ్రైట్ టీచింగ్ ఎక్సలెన్స్ అండ్ అచీవ్‌మెంట్ కార్యక్రమంలో పాల్గొననున్నారు. ఈ కార్యక్రమానికి యూఎస్ డిపార్ట్‌మెంట్ ఆఫ్ స్టేట్ బ్యూరో ఆఫ్ ఎడ్యుకేషన్ అండ్ కల్చరల్ అఫైర్స్ (ఈసీఏ) స్పాన్సర్ చేయనుంది. యూఎస్ ప్రభుత్వం, ఐఆర్ఈఎక్స్ నిధులను అందించనుంది. ఈ కార్యక్రమం కోసం ప్రపంచ వ్యాప్తంగా వేలాది మంది దరఖాస్తులు చేసుకోగా భారత దేశం నుంచి ముగ్గురు ఉపాధ్యాయులు మాత్రమే ఎంపికైయ్యారు.

జమ్మూ కాశ్మీర్‌కు చెందిన ఒకరు, తెలంగాణ రాష్ట్రం నుంచి ఇద్దరు ఉపాధ్యాయులు ఎంపికైనట్లు సంపత్‌కుమార్ ప్రకటనలో తెలిపారు. వీరు ఆరు వారాల పాటు వృత్తి పరమైన అభివృద్ధి శిక్షణలో పాల్గొననున్నారు. ఇందులో సాధారణ బోధనపై సెమినార్లు, తరగతి గదిలో సాంకేతికతను సమర్థవంతంగా ఉపయోగించడంలో మెళుకువలు నేర్చుకోనున్నట్లు తెలిపారు. ఈ శిక్షణ కోర్సులను అమెరికా విశ్వ విద్యాలయం రూపొందించి నిర్వహిస్తుందన్నారు. ఇందులో పాల్గొనేవారు తమ కార్యక్రమం, నిర్వహిస్తున్న విశ్వ విద్యాలయానికి సమీపంలోని సెకండరీ పాఠశాలలో అమెరికా భాగస్వామి ఉపాధ్యాయుడితో సహ బోధన, ప్రజెంటేషన్లు, పరిశీలనను పూర్తి చేస్తారు. సంపత్‌కుమార్ ఎంపిక పట్ల అమ్మ ఆదర్శ పాఠశాల చైర్ పర్సన్ రాధ, హెచ్‌ఎం వి.వాణి, ఉపాధ్యాయులు రేవతి, రామకృష్ణయ్య, ఇందిరారాణి, రాజేందర్, నయీంపాషా, శ్రీధర్, షర్మిళ, సుమలత, కేబీ కిరణ్, విద్యాభిమానులు, గ్రామస్థులు అభినందించారు.

ప్రజావాణి ఫిర్యాదులు త్వరగా పరిష్కరించండి

జీడబ్ల్యూఎంసీ అసిస్టెంట్ కమిషనర్ చంద్రశేఖర్
64 దరఖాస్తులు స్వీకరించిన వింగ్ అధికారులు
నగర పాలక సంస్థలో ప్రజావాణి కార్యక్రమం

వరంగల్ కార్పొరేషన్, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ప్రజావాణి కార్యక్రమం ద్వారా వచ్చే ఫిర్యాదులను త్వరితగతిన పరిష్కరించాలని, అప్పుడే ప్రజలకు మునిసిపల్ శాఖపై నమ్మకం ఏర్పడుతుందని వరంగల్ నగర పాలక సంస్థ (జీడబ్ల్యూఎంసీ) అసిస్టెంట్ కమిషనర్ చంద్రశేఖర్ అన్నారు. సోమవారం గ్రేటర్ వరంగల్ మహా నగర పాలక సంస్థ ప్రధాన కార్యాలయంలోని కౌన్సిల్ హాల్‌లో ప్రజావాణి కార్యక్రమం నిర్వహించారు. ప్రజల నుంచి దరఖాస్తుల స్వీకరించి పరిష్కార నిమిత్తం ఆయా విభాగాల ఉన్నతాధికారులకు అందజేశారు. ఈ సందర్భంగా చంద్రశేఖర్ మాట్లాడారు. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు జరిగిన గ్రీవెన్స్‌లో ప్రజల నుంచి 64 ఫిర్యాదులు స్వీకరించినట్టు వెల్లడించారు. కార్యక్రమంలో సీఎంహెచ్‌వో డాక్టర్ బొమ్మన రాజారెడ్డి, ఇన్‌చార్జి ఎస్ఈ మహేందర్, ఇన్‌చార్జి సీపీ రవీందర్ రాడేకర్, డిప్యూటీ కమిషనర్ సమ్మయ్య, పన్నుల అధికారి రామకృష్ణ, డీఎఫ్‌వో శంకర్‌లింగం, హార్టికల్చర్ అధికారి రమేష్, వెటర్నరి అధికారి డాక్టర్ గోపాల్‌రావుతో పాటు వివిధ విభాగాల వింగ్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజల ఫిర్యాదులు ఇలా..

● హనుమకొండ కోర్టు సమీపంలోని కీర్తి పెట్రోల్ పంపు పక్కనే ఉన్న ప్రభుత్వ స్థలాన్ని కొందరు అక్రమార్కులు 20 ఫీట్ల వరకు భూమిని కబ్జా చేసి అక్రమ కట్టడాలు నిర్మించినట్టు సమీపంలో నివసించే ప్రజలు ఫిర్యాదు చేశారు. ఈ అక్రమ కట్టడాలను వెంటనే కూల్చివేసి అక్కడి ప్రజలకు న్యాయం చేయాలని వినతి పత్రం అందించారు.

● కాజీపేట మండలం కడిపికొండ శివారు రాంపేట గ్రామంలో ఇటీవల కొందరు రియల్టర్లు కొందరు రైతుల నుంచి భూములు కొనుగోలు చేసి వెంచర్లు చేస్తున్నారు. తమ సొంత భూములకు సైతం వెళ్లకుండా కంచెలను నిర్మించి అటుగా వెళ్లకుండా అడ్డుకుంటున్నారు. అక్రమ వెంచర్ల యజమానులను గుర్తించి తగిన చర్యలు తీసుకుని చిన్న, సన్నకారు రైతులకు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు.

● 14వ డివిజన్ మణికంఠ కాలనీ (ఏనుమాముల) ప్రాంతంలో కొందరు వ్యక్తులు సెట్ బ్యాక్ కాకుండా అక్రమ నిర్మాణాలు చేపడుతున్నారు. అంతేకాకుండా రోడ్లపై మొరం, కంకర పోసి అటుగా వెళ్తే వారికి ఇబ్బంది కలిగిస్తున్నారని స్థానికులు తెలిపారు. అక్రమార్కులపై చర్యలు తీసుకోవాలని కోరారు.

● ఖిలావరంగల్ మండలం 17వ డివిజన్ బొల్లికుంటలో పలు కాలనీలలో సీసీ రోడ్లు లేనందున రోడ్డుకు రెండు వైపులా ఇండ్లు ఉన్నవారు రోడ్డును ఆక్రమించి ఇండ్ల నిర్మాణాలు చేపడుతున్నారు. దీనిపై గతంలో ఫిర్యాదు చేసినా అధికారులు పట్టించుకోలేదు. దీనిపై వెంటనే చర్యలు తీసుకుని సీసీ రోడ్డు వేయాలని ప్రజలు కోరారు.

● గ్రేటర్ వరంగల్ 2వడివిజన్ వంగపహాడ్ గ్రామంలోని ఓఆర్ఆర్‌కు ఆనుకుని ఉన్న సర్వే నెంబర్ 516 ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించి అదే గ్రామానికి చెందిన జూలూరి రాజు అనే వ్యక్తి ప్లాట్లు చేసి నగరంలో ఉంటున్న వ్యక్తులకు విక్రయిస్తున్నాడు. దీనిపై గతంలో కమిషనర్‌తో పాటు కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినట్లు గ్రామానికి చెందిన అరికిల్ల సుమన్ అనే వ్యక్తి ఫిర్యాదు చేశారు.

ఫిర్యాదులు

ఇంజనీరింగ్	- 13
హెల్త్, శానిటేషన్	- 06
ప్రాపర్టీ ట్యాక్స్, రెవెన్యూ	- 10
టౌన్‌ప్లానింగ్	- 30
హార్టికల్చర్	- 01
డిజాస్టర్ మేనేజ్‌మెంట్	- 01
ఎలక్ట్రికల్	- 03
మొత్తం	= 64



ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరిస్తున్న అసిస్టెంట్ కమిషనర్

వైద్య విద్యార్థులు పరిశోధనల్లో ఆసక్తి కనబర్చాలి

● కేఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ సంధ్య

వరంగల్ మెడికల్, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): వైద్య విద్యార్థులు పరిశోధనల్లో ఆసక్తి కనబర్చాలని కాకతీయ మెడికల్ కాలేజ్ ప్రిన్సిపాల్ డాక్టర్ సంధ్య సూచించారు. ఉస్మానియా, గాంధీ, కాకతీయ, తెలంగాణ మెడికల్ అలుమిని వార్షిక మహాసభ-2025 ఈ నెల 6న లూయిస్విల్ మారియట్ ఈస్ట్, కెంటకి, అమెరికాలో జరిగింది. ఈ కార్యక్రమంలో భాగంగా డాక్టర్ సంధ్య కేఆర్ఐటీఐ-2025 పోస్టర్‌ను ఆవిష్కరించి మాట్లాడారు. కేఎంసీ అభివృద్ధికి అలుమ్ని చేస్తున్న సహకారాన్ని అభినందించి కృతజ్ఞతలు తెలిపారు. భవిష్యత్ ప్రణాళికల్లో భాగంగా ఫ్రైన్ క్లినిక్, హాస్టళ్ల మొదలైన మౌలిక వసతుల అభివృద్ధి, అంతర్జాతీయ అవకాశాల కోసం విద్యార్థులకు ఎన్ఆర్ఐ పూర్వ విద్యార్థుల మెంటర్‌షిప్ అవసరాన్ని వివరించారు. వ్యక్తిగత సెలవులో ఉన్నప్పటికీ ఈ సమావేశంలో పాల్గొని కేఎంసీ ప్రతిష్టను అంతర్జాతీయ వేదికపై ప్రదర్శించినందుకు కళాశాలవర్గాలు డాక్టర్ సంధ్యా సుంకరనేనిని అభినందించాయి. ఆమె కృషి, నిబద్దత, దూరదృష్టి కేఎంసీ గర్వకారణంగా నిలిచాయి.

భద్రకాళి చెరువులో పడి యువకుడి మృతి



రెహాన్ మృతదేహం

వరంగల్ క్రైం, సెప్టెంబర్ 8 (ఆంధ్రజ్యోతి): భద్రకాళి చెరువులో పడి యువకుడు మృతి చెందినట్లు హనుమకొండ సీఐ శివకుమార్ తెలిపారు. సీఐ కథనం ప్రకారం.. వరంగల్ రామన్నపేటకు చెందిన రెహాన్ (19), పండు, రెహాన్ అనే ముగ్గురు యువకులు కలిసి చెరువు మత్తడి దగ్గరికి ఆదివారం సరదా కోసం వచ్చారు. ముగ్గురిలో రెహాన్ అనే యువకుడు చెరువులో మునిగి ఊపరాడక మృతిచెందినట్లు తెలిపారు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

రెనోవా బన్ను హాస్పిటల్ ప్రారంభం

● సామాన్యులకు అందుబాటులో క్యాన్సర్ చికిత్స

వరంగల్ మెడికల్, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ప్రపంచస్థాయి నాణ్యత కలిగిన క్యాన్సర్ చికిత్సను ప్రజలకు వైద్యుల ద్వారా అందించాలనే లక్ష్యంగా ఏర్పాటు చేసిన సంస్థ రెనోవా హాస్పిటల్స్. దేశంలోని క్యాన్సర్ రోగులకు సమగ్రమైన క్యాన్సర్ చికిత్స అందించడానికి వీలుగా పేరెన్నిక కలిగిన కొద్దిమంది నిపుణులైన క్యాన్సర్ వైద్యులు కలిసి దీనిని స్థాపించినట్లు రెనోవా గ్రూప్ ఆఫ్ హాస్పిటల్స్ ఫౌండర్, సీఈవో శ్రీధర్ పెద్దిరెడ్డి తెలిపారు. దేశంలోని క్యాన్సర్ వ్యాధిగ్రస్తులకు అత్యున్నతమైన వైద్యాన్ని అందుబాటు ధరలలో అందించాలనే లక్ష్యంతో దీనిని ఏర్పాటు చేశామన్నారు. హైదరాబాద్‌లోనే ప్రముఖమైన హాస్పిటల్‌గా పేరుగడించిన తరువాత గత అనుభావాలతో వరంగల్‌లో హాస్పిటల్‌ను ప్రారంభించింది. రెనోవా బన్ను హాస్పిటల్‌ను సోమవారం కాళోజీ నారాయణరావు ఆరోగ్య విజ్ఞాన విశ్వవిద్యాలయం వైస్‌చాన్సలర్ డాక్టర్ నందకుమార్‌రెడ్డి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో శ్రీధర్ పెద్దిరెడ్డి, డాక్టర్ రాజేష్ బొల్లం, డిప్యూటీ మేయర్ సయ్యద్ రిజ్వాన్‌మసూద్, స్థానిక కార్పొరేటర్ డి.విజయలక్ష్మీ సురేందర్, డాక్టర్ పి.కాళీప్రసాద్, ఐఎంఏ అధ్యక్షుడు డాక్టర్ కె.నాగార్జునరెడ్డి, డాక్టర్ శేషమాధవ్, డాక్టర్ నరేశ్, డాక్టర్ ఆలేటి రవీందర్‌రెడ్డి, డాక్టర్ వినోద్ కుమార్ దుస్సా, డాక్టర్ విష్ణువర్ధన్‌రెడ్డి తదితర వైద్యులు పాల్గొన్నారు.



హాస్పిటల్‌ను ప్రారంభిస్తున్న అతిథులు

అధికంగా వాడితే అనర్థమే..

(5వ పేజీ తరువాయి)

పురుగుల మందులు వాడుతూ ఆర్థికంగా, నేల నిస్సారంగా మారి నష్టపోతున్నారు. ఏటా ఉమ్మడి జిల్లా రైతులు ఎరువులకు రూ.340కోట్ల వరకు, పురుగు మందులకు రూ.230కోట్ల వరకు ఖర్చు చేస్తున్నారు. విచ్చలవిడిగా రసాయన ఎరువుల వాడకం వల్ల పచ్చని పొలాలు విషతుల్యమవుతుండగా, దిగుబడుల కంటే పెట్టుబడులే ఎక్కువై అప్పుల పాలవుతున్నారు. సేంద్రియ ఎరువులు తగ్గించి రసాయనిక మందులు వాడడం వల్లనే ఈ దుస్థితి నెలకొంటుంది.

సకాలంలో భాస్వరం

మొక్కల వేరుల పెరుగుదల పోషక పదార్థంగా భాస్వరం ఉపయోగపడుతుంది. దీనిని నాట్లు వేసే ముందు దమ్ములో లేదా నాట్లు వేసిన 15 రోజుల్లోపు కాంప్లెక్స్ ఎరువుగా వాడాల్సి ఉంటుంది. నాట్లు వేసిన 15 రోజులు తరువాత ఈ ఎరువును పొలంలో చల్లుకున్నా ఉపయోగం ఉండదు. అయితే పొలంలో జింక్ లోపం తలెత్తే ప్రమాదం ఉంటుంది. అందుకే ఈ ఎరువును సకాలంలో పైరుకు అందిస్తేనే మొక్కల ఎదుగుదల బాగుంటుంది.

పొటాష్ రోగ నిరోధక శక్తి

రోగ నిరోధక శక్తి పెంచడానికి, అవసరమైన పోషకాలను మొక్కలోని వివిధ భాగాలకు సరఫరా చేయడానికి పొటాష్ ఉపయోగపడుతుంది. పంటకు అవసరమయ్యే మొదటి దఫాలో 12 నుంచి 16 కిలోలు, రెండో దఫాలో 20 నుంచి 27 కిలోల మ్యూరేట్ ఆఫ్ పొటాష్‌ను పొలంలో చల్లుకోవాలి. దీనిని రెండు సమభాగాలుగా చేసి మొదటి దఫా, రెడో దఫా యూరియాతో కలిపి వేస్తే ఆశించిన దిగుబడులు సాధించవచ్చు.

మూడు విడతలుగా

వరి పైరు పెరిగేందుకు నత్రజని ఎంతగానో దోహదపడుతుంది. దీనిని మూడు దఫాలుగా పొలం చల్లుకోవాలి. నాట్లు వేసే ముందు, ఎదిగే దశలో, పొట్టకు వచ్చే దశలో నత్రజని పోషకాన్ని సరైన మోతాదులో పంటకు అందించేందుకు మూరియా వాడే విధానంపై రైతులకు అవగాహన ఉండాలి. ఎకరానికి 25 నుంచి 32 కిలోల నత్రజని అందించాలంటే 55 నుంచి 70 కిలోల యూరియాను పొలంలో చల్లుకోవాలి. దీనిని మూడు సమ భాగాలుగా విభజించి చల్లుకోవాల్సి ఉంటుంది. పైరు పెరుగుదల ఆశించిన రీతిలో లేకుంటే అదనంగా 10 నుంచి 15 కిలోల వరకు యూరియా వాడొచ్చు. యూరియా అధిక వినియోగం వల్ల అనేక అనర్థాలు ఎదురవుతాయి. యూరియా ఎక్కువైతే వరి మొక్కలు ఆకుల్లో పత్రహరితం అధికంగా ఉండి పురుగులు దాడి చేస్తాయి. అగ్గితెగులు, ఆకు ముడత తెగులు కూడా సోకే ప్రమాదం ఉంటుంది.

మోతాదు మించొద్దు



ఉమ్మడి జిల్లాలో నల్లరేగడి నేలలు ఎక్కువగా ఉన్నా అందులో నత్రజని లోపం అధికంగా ఉంది. చౌడు భూముల్లో జిప్సం, సల్ఫర్ లోపం ఉంది. పత్తి, వరి సాగు అధికంగా చేస్తుండగా దిగుబడికి రైతులు రసాయనిక ఎరువులే వినియోగిస్తున్నారు. దీంతో భూసారం దెబ్బతింటుంది. రైతులు పంట మార్పిడి చేస్తే దిగుబడులు పెరుగుతాయి. సేంద్రియ ఎరువులు, పశువుల పేడ, పచ్చి రొట్టె ఎరువులు, వర్మీకంపోస్టు వేసుకుంటే నత్రజని లోపం అధిగమించవచ్చు.

- విజయ్‌కుమార్, వ్యవసాయ అధికారి, వర్ధన్నపేట



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

ప్రభుత్వం తక్షణమే పెన్షన్లు పెంచాలి

కలెక్టరేట్ ఎదుట ఎమ్మార్పీఎస్ నాయకుల ధర్నా

వరంగల్ కలెక్టరేట్, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): దివ్యాంగులకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎన్నికల సందర్భంగా ఇచ్చిన మాట నిలుపుకోవాలని వారు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట సోమవారం ధర్నా చేపట్టారు. అంతకు ముందు ఏకశిల పార్కు నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు కట్ల రాజశేఖర్ మాదిగ మాట్లాడుతూ.. ప్రభుత్వం తక్షణమే దివ్యాంగుల పెన్షన్ రూ.4వేల నుంచి రూ.6వేలకు పెంచాలని డిమాండ్ చేశారు. వృద్ధులు, వితంతువులు, ఒంటరి మహిళలు, బీడీ కార్మికుల పెన్షన్ రూ.4 వేలకు పెంచాలని, ఇప్పటికే దరఖాస్తు చేసుకొని ఉన్న అర్హులైన వారికి నూతన పెన్షన్లు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని కలెక్టర్ సత్యశారదకు అందజేశారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ రాష్ట్ర, జిల్లా నాయకులు వంగూరి ఆనందరావు, వేల్పుల సూరన్న, కె.ప్రణయ్ దీప్, బాబు, రాజు యాదవ్, మాసాని గోపాల్, ధర్మన్న, గంగారపు మల్లన్న, చింతం సిద్ధు, చంద్రశేఖర్, బీర్రు హైమావతి, గంపుల మాలతి, దివ్యాంగులు, పెన్షన్‌దారులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

నా భార్య నన్ను చంపాలని చూస్తోంది..

మీడియా ముందు ఓ భర్త ఆవేదన



బాధితుడు బానోతు మహేష్

పర్వతగిరి, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : తన భార్య మరో వ్యక్తితో వివాహేతర సంబంధం పెట్టుకుని, తనను చంపాలని చూస్తోందని ఓ భర్త ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు. వారి నుంచి తనకు రక్షణ కల్పించాలని పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ సంఘటన వరంగల్ జిల్లాలో సోమవారం వెలుగులోకి వచ్చింది. బాధితుడి కథనం ప్రకారం వివరాలిలా ఉన్నాయి... పర్వతగిరి మండలంలోని సోమారం గ్రామ శివారు జగ్గు తండాకు చెందిన బానోతు మహేశ్ అలియాస్ బాలుకు అదే తండాకు చెందిన యువతితో 2009లో వివాహమైంది. వీరికి ఇద్దరు కుమారులు సంతానం. 11 సంవత్సరాల కిందట ఆమె తన సమీప బంధువైన ఓ వ్యక్తితో వివాహేతర సంబంధం పెట్టుకుంది.

ఈ విషయం మహేశ్‌కు తెలియడంతో భార్య ప్లేట్ మార్చింది. సదరు వ్యక్తి తనను వేధిస్తున్నాడని భర్తను నమ్మించి పోలీసులకు ఫిర్యాదు చేసింది. అనంతరం లోక్ అదాలత్‌లో భర్త మహేశ్‌కు తెలియకుండా కేసు వాపస్ తీసుకుంది. ఆ తర్వాత విషయం తెలుసుకున్న మహేశ్ భార్య తీరును గ్రహించాడు. తనను మభ్యపెట్టి వివాహేతర సంబంధం సాగిస్తోందని తెలుసుకున్నాడు. అప్పటి నుంచి ఇద్దరి మధ్య గొడవలు జరుగుతున్నాయి. పలుమార్లు పెద్దమనుషులకు, పోలీసులకు ఫిర్యాదు చేయగా వారు కౌన్సిలింగ్ నిర్వహించారు. అయినా భార్య తీరు మారలేదు. ఈ క్రమంలో ఆమెతో, ఆమె ప్రియుడితో తనకు ముప్పు ఉందని అనుమానించాడు. ఇటీవల వినాయక చవితి పండుగ సందర్భంగా తనను చంపేందుకు కుట్ర చేశారని మహేష్ ఈ నెల 3న పోలీసులకు ఫిర్యాదు చేశాడు. వారు విచారణ చేస్తున్న క్రమంలో సోమవారం మహేశ్ మీడియా ముందుకు వచ్చి భార్య తీరును వెల్లడించాడు. తనను కాపాడాలని మీడియా ద్వారా పోలీసులను కోరుతున్నట్టు తెలిపాడు.



నిత్య చైతన్యపతాక ప్రజాకవి కాళోజి


నేడు 111వ జయంతి

ధిక్కార స్ఫూర్తి.. ఉద్యమ దీప్తి..

హనుమకొండ కల్చరల్, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): తెలంగాణకు చిరునామాగా, 95 ఏళ్ల జీవిత కాలాన్ని ప్రజాఉద్యమాల కోసం వెచ్చించిన మహామనీషి.. 20వ శతాబ్దపు దార్శనికుడు.. నిరంతర ధిక్కార ధ్వని.. సమకాలీన సమాజానికి మార్గదర్శనం చేసే సాహిత్యాన్ని ఏనాడో అందించిన ప్రజాకవి కాళోజీ నారాయణ రావు 111వ జయంతి వేడుకలు మంగళవారం పెద్ద ఎత్తున నిర్వహించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి.

నా హృదిన ఇన్ని వేదనలు

అవనిపై జరిగేటి అవతవకలు జూసి.. ఎందుకో నా హృదికి ఇన్ని వేదనలు.. అంటూ సమాజంలోని ఎన్నో వెతలను నా గొడవగా చిత్రీకరించిన మనీషి కాళోజీ. అసమ్మతి, నిరసన, ధిక్కార స్వరం, మానవత్వపు మనుగడకు నిలువెత్తు సంతకం. కాళోజీ ఒక కాలేజీ అన్నది అక్షరసత్యం. అక్షర యోధుడు. ఈ కాలపు వేమన. పౌరహక్కుల సంతకం. మానవతకు జెండా. నిజమైన ప్రజాస్వామ్యవాది. నిత్య చైతన్య మూర్తి. ఉద్యమ జీవి. వీటన్నింటి చిరునామా కాళోజీయే. ఆయన కలం నుంచి జాలువారిన అక్షరాలు తూటాలవలే ప్రతీ తెలుగు వారి హృదయంలో ముద్రితమై ఆలోచనలు కలిగింప చేస్తాయి.



అన్నపురాశులు ఒక చోట..

అన్నపురాసులు ఒక చోట.. ఆకలి మంటలు ఒక చోట.. హంస తూలికలు ఒక చోట.. అంటూ సమాజంలో తరతమ వ్యత్యాసాలను ఎండగడుతూ రాసిన కాళోజీ సాహిత్యమంతా నిత్యచైతన్యమే. వందల సంఖ్యలో ఆయన రాసిన సాహిత్యం అంతా నా గొడవే. ముఖ్యంగా ఒక శతాబ్దకాలపు తెలంగాణ సామాజిక, రాజకీయ చరిత్ర అంతా ఆయన సాహిత్యమే. పలుకుబడుల బాష కావాలని పట్టుబట్టిన కాళన్న జయంతిని తెలుగు మాండలిక భాషా దినోత్సవంగా జరుపుతున్నారు. జరిగినవన్నీ చూస్తూ కూర్చుండ సాక్షీభూతుణ్ని కాను.. సాక్షాత్తు మానవుడినే.. అని గర్వంగా చెప్పిన మానవతామూర్తి. పద్మ విభూషణ్ ప్రజాకవి కాళోజీ జీవితాన్ని మానవీయ సంబంధాన్ని విడదీసి చూడలేం. బతుకు తప్పదు.. బతక్క తప్పదు.. అన్న గొప్ప సందేశం కాళోజీది. అన్యాయాన్నెదిరించిన కాళోజీకి అన్యాయాన్నెదిరించినవాడే ఆరాధ్యుడు.

రమాదేవికి కాళోజీ పురస్కారం

ప్రజాకవి కాళోజీ జయంతి సందర్భంగా ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అందించే కాళోజీ పురస్కారం ఈ సారి వరంగల్‌కే దక్కింది. జనగామ జిల్లా స్టేషన్‌ఘనపూర్‌కు చెందిన నెల్లుట్ల రమాదేవికి అవార్డును ప్రకటించారు. కాళోజీ అవార్డును ఏర్పాటు చేసినప్పటి నుంచి మహిళా కవయిత్రి అవార్డు అందుకోవడం ఇదే మొదటి సారి. అవార్డు కింద ఆమెకు రూ.లక్ష నగదును అందించనున్నారు.

తెలుగు బిడ్డవురోరి..

తెలుగు బిడ్డవురోరి.. తెలుగు మాట్లాడుటకు సంకోచ పడియెదవు సంగతేమిటిరా.. అంటూ మాతృభాష అయిన తెలుగును చిన్నచూపు చూస్తూ పరభాషా వ్యామోహంలో కూరుకుపోయిన వారిని ఆంధ్రంబు రాదంటు సకిలించు ఆంధ్రుడా.. చావవెందుకురా.. అని సూటిగా ప్రశ్నిస్తూ ఏనాడో కవిత్వం రాశాడు.

ఉద్యమశీలి

కాళోజీకి తెలంగాణ అంటే వల్లమాలిన అభిమానం. తొలి తెలంగాణ ఉద్యమంలో స్వయంగా పాల్గొని ప్రత్యేక రాష్ట్రం కోసం నినదించిన ఉద్యమకారుడు. 1969 మే ఒకటో తేదీన వరంగల్‌లో ప్రత్యేక తెలంగాణ ఉద్యమం పేరిట ప్రజా సమితి సదస్సులో కాళోజీ సంధించిన కవితాస్త్రం.. దోపిడీ చేసే ప్రాంతేతరులను దూరందాక తన్ని తరుముతాం.. ప్రాంతం వాడే దోపిడీ చేస్తే ప్రాణంతోనే పాతర వేస్తం.. తెలంగాణ వేరైతే దేశానికి అపత్తా.. అంటూ తెలంగాణ అంశంపై వందలాది కవితాస్త్రాలను కురిపించి ఉద్యమానికి ఆనాడే బాసటగా నిలిచిన కాళోజీ నేటి తెలంగాణ జీవితంలో నిత్యనూతడనుడాయన.

నేటి కార్యక్రమాలు

కాళోజీ జయంతిని పురస్కరించుకొని అధికారింగా హనుమకొండ జిల్లా యంత్రాంగం నక్కలగుట్టలోని కాళోజీ విగ్రహానికి జిల్లా కలెక్టర్, అధికారులు, కాళోజీ ఫౌండేషన్ సభ్యులు, కవులు, సాహిత్య ప్రముఖులు ఉదయం 10 గంటలకు పూల మాలలు సమర్పిస్తారు. కాళోజీ ఫౌండేషన్ ద్వారా ప్రతీ ఏటా ప్రదానం చేసే తెలుగు, ఉర్దూ కవుల వివరాలను ఈ సందర్భంగా ప్రకటించనున్నారు. హనుమకొండకు చెందిన కాళోజీ ఫౌండేషన్ కార్యదర్శి వీఆర్ విద్యార్థి, సంయుక్త కార్యదర్శి పొట్లపల్లి శ్రీనివాసరావు హైదరాబాద్‌లోని తెలంగాణ సాహిత్య అకాడమీ కార్యాలయంలో కాళోజీ జయంతి పేరిట ఏర్పాటు చేసిన తెలంగాణ భాషా దినోత్సవంలో పాల్గొంటారు. అదేవిధంగా హైదరాబాద్‌లోని బీఆర్ అంబేద్కర్ తెలంగాణ సచివాలయ సంఘం సహకారంతో నిర్వహించనున్న తెలంగాణ భాషా దినోత్సవంలో నగరానికి చెందిన ప్రముఖ రచయిత, కాళోజీ డాక్యుమెంటరీ సినిమా నిర్మాత, దర్శకుడు, ఇటీవల గద్దర్ జ్యూరీ ఫిల్మ్ వార్డు గ్రహీత ప్రభాకర్ జైనీ విశిష్ట అతిథిగా పాల్గొననున్నారు. అన్ని ప్రభుత్వకార్యాలయాలు, విద్యా సంస్థల్లో కాళోజీ జయంతి వేడుకలు జరగనున్నాయి.





వివరాలు వెల్లడిస్తున్న ఏసీపీ అంబటి నర్సయ్య

తండ్రిని చంపిన తనయుడి అరెస్టు

వివరాలు వెల్లడించిన ఏసీపీ

వర్ధన్నపేట సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : వర్ధన్నపేట మునిసిపాలిటీ పరిధిలోని గుబ్బెట తండాలో సెపెంబరు 6వ తేదీన తండ్రిని చంపిన తనయుడిని పోలీసులు సోమవారం అరెస్టు చేశారు. వర్ధన్నపేట ఏసీపీ అంబటి నర్సయ్య తెలిపిన వివరాల ప్రకారం..

వర్ధన్నపేట మునిసిపాలిటీ పరిధిలోని సపవట్ సురేశ్ ఆటో నడుపుతూ జీవనం సాగిస్తున్నాడు. నిందితుడు సురేశ్‌కు తాళ్లకుంటకు చెందిన మౌనికతో 2019లో వివాహం జరిగి ముగ్గురు సంతానం. కాగా, ఇటీవల కొంత కాలంగా భార్యాభర్తల మధ్య గొడవలు జరుగుతున్నాయి. సపవట్ సురేశ్ మరో మహిళతో వివాహేతర సంబంధం కొనసాగిస్తుండడంతో తరుచూ గొడవలు జరుగుతుండడం, తండ్రి సపవట్ రాజు మధ్యలోకి వెళ్లి గొడవను శాంతింపజేసి కొడుకు సురేశ్‌ను మందలించేవాడు. గొడవలు జరిగి మౌనిక పుట్టింటికి వెళ్లడంతో ఇటీవల పెద్ద మనుషుల సమక్షంలో పంచాయితీ నిర్వహించి భార్య మౌనికను సురేష్ ఇంటికి తీసుకువచ్చాడు. వివాహేతర సంబంధానికి భార్య మౌనిక, తండ్రి రాజు తరచూ అడ్డువస్తున్నారని, వీరిని అడ్డు తొలగించుకోవాలని ఆలోచన చేసిన సపవట్ సురేశ్ భార్య మౌనికతో మళ్లీ గొడవకు దిగాడు. తండ్రి సప వట్ రాజు (59) మధ్యలోకి వెళ్లి గొడవను సద్దు మనగ చేద్దాం అనుకునే ప్రయత్నంలో కోపోద్రిక్తుడైన సురేశ్ తండ్రి సపవట్ రాజును ఛాతిలో, మొకం పైన పిడుగుద్దులు గుద్ది కింద పడేసి బయటకు వెళ్లి పోయాడు.

తిరిగి మళ్లి సురేశ్ ఇంటికి వచ్చి అక్కడే ఉన్న తండ్రి రాజుపై దాడి చేసి పిల్లలను ఊయ్యాల ఊపడానికి కట్టిన చీరతో రాత్రి 7.30గంటల సమయంలో తండ్రి సపవట్ రాజు మెడకు చుట్టి బిగించి చంపి పారిపోయాడు. సురేశ్ అదే రాత్రి తొర్రూరు బస్టాండ్‌కు వెళ్లిపోయాడు. మళ్లీ అక్కడి నుంచి తిరిగి అదే రాత్రి వర్ధన్నపేట బస్టాండ్‌కు రాగా, వర్ధన్నపేట పోలీసులు పట్టుకొని అరెస్టు చేసినట్లు వర్ధన్నపేట ఏసీపీ అంబటి నర్సయ్య తెలిపారు. సపవట్ రాజు కుమార్తె మాలోతు స్వప్న ఫిర్యాదు మేరకు విచారణ చేపట్టిన వర్ధన్నపేట పోలీసులు వెస్ట్ జోన్ డీసీపీ రాజమహేంద్రనాయక్, వర్ధన్నపేట ఏసీపీ అంబటి నర్సయ్య ఆధ్వర్యంలో ప్రతిభ కనబరిచిన సీఐ శ్రీనివాసరావు, ఎస్ఐలు ఎన్.సాయిబాబు, ఎం.రాజులను వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్‌సింగ్ అభినందించారు.

చేపా చేపా ఎక్కడున్నావ్?

- జిల్లాలో ప్రారంభంకాని సీడ్ పంపిణీ
- అదునుదాటుతోందని మత్స్యకారుల ఆందోళన
- చేప పిల్లలకు బదుల నగదు పంపిణీ చేయాలని డిమాండ్

వరంగల్ వ్యవసాయం, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో చేపపిల్లల పంపిణీ ఇంకా ప్రారంభం కాలేదు. గత ప్రభుత్వంలో జూలై రెండో వారం నుంచే చేపపిల్లల పంపిణీ కార్యక్రమం మొదలయ్యేది. అలాంటిది సెప్టెంబరు రెండో వారం వచ్చినా ఇంకా వాటి ఊసే లేదు. దీంతో మత్సకారుల్లో ఆందోళన మొదలైంది. చేప పిల్లలను జూలై, ఆగస్టు నెలల్లో చెరువుల్లో వదిలితేదే ఫిబ్రవరి, మార్చి వరకు ఒక్కో చేప కిలో వరకు ఎదుగుతుంది. ఏప్రిల్ నుంచి జలాశయాల్లో నీటినిల్వలు తగ్గుముఖం పడుతాయి. క్రమక్రమంగా చేపలు చనిపోతాయి. అందువల్ల మత్సకారులు ఆలోపే చేపలను విక్రయిస్తారు. అందువల్ల ఇప్పటికైనా అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని మత్స్యకారులు కోరుతున్నారు. ఇప్పటికే అదను దాటుతుండడంతో మత్స్య పారిశ్రామిక సహకార సంఘాలు(సొసైటీలు) అనేక చెరువుల్లో చేపపిల్లలను వదిలాయి. దీనికోసం లక్షలాది రూపాయలు ఖర్చు చేశారు. అందువల్ల ప్రభుత్వం వెంటనే స్పందించి చేప పిల్లలకు బదులు సొసైటీలకు నగదు బదిలీ చేయాలని మత్స్యకారులు డిమాండ్ చేస్తున్నారు. దీనివల్ల రాబోయే కాలంలో కూడా అదను చూసి చెరువుల్లో చేపపిల్లలను



పోసుకునే అవకాశం ఉంటుందని అంటున్నారు.

కాంట్రాక్టు వ్యవస్థను రద్దు చేయాలి..

జలాశయాల్లో చేపపిల్లల పంపిణీకి గత బీఆర్ఎస్ ప్రభుత్వం 2018లో కాంట్రాక్టు వ్యవస్థను తీసుకువచ్చింది. అయితే దీనిలో అనేక లోపాలున్నాయని మత్స్యసహకార సంఘాలు ఆరోపిస్తున్నాయి. కాంట్రాక్టర్లు నాసిరకం చేపపిల్లను పంపిణీ చేస్తున్నారని, సైజులో, లెక్కల్లో తేడాలు ఉంటున్నాయని మత్సకారులు ఆరోపిస్తున్నారు. అందువల్ల చేపపిల్లల పంపిణీ సొసైటీలకే అప్పగించాలని కోరుతున్నారు.

జిల్లాలో 702 చెరువులు..

జిల్లాలో 702 చెరువులుండగా నీటి విస్తీర్ణం 12,910 హెకార్లు ఉన్నట్లు రికార్డులు చెబుతున్నాయి. అదేవిధంగా 184 మత్స్య పారిశ్రామిక సహకార సంఘాలుండగా వాటిలో 15,741 మంది సభ్యులు ఉన్నారు. చేపల పెంపకం, విక్రయమే వీరి ప్రధాన వృత్తిగా కొనసాగుతున్నారు.

నగదు బదిలీ చేయాలి..



రాష్ట్ర ప్రభుత్వం రైతులకు నేరుగా పెట్టుబడి సహాయం అందిస్తున్నట్లుగా మత్స్య పారిశ్రామిక సంఘాలకు చేపపిల్లల కొనుగోలు కోసం నేరుగా నగదు అందించాలి. దీంతో సంఘాలు సకాలంలో చేపపిల్లను కొనుగోలు చేసి జలాశయాల్లో వదిలేందుకు అవకాశం ఉంటుంది. ఇలా చేస్తేనే మత్స్యకారులకు ప్రయాజనం చేకూరుతుంది.

- నీరటి సదానందం, ముదిరాజ్ మహాసభ జిల్లా ప్రధాన కార్యదర్శి

రెండు ఏజెన్సీలు టెండరు దాఖలు..

ఈ ఏడాది చేపపిల్లలను పంపిణీ చేయడానికి వరంగల్ జిల్లా నుంచి రెండు, హనుమకొండ జిల్లా నుంచి ఒక ఏజెన్సీ టెండరు దాఖలు చేసినట్లు మత్స్యశాఖ అధికారులు చెబుతున్నారు. టెండర్ల దాఖలుకు సోమవారం నాటికే చివరి తేదీ అయినప్పటికీ మత్స్యశాఖ ఉన్నతాధికారులు ఈనెల 12 వరకు పొడిగించారు. 12న టెండర్లను తెరిచి ఏ ఏజెన్సీకి చేపల పంపిణీకి అవకాశం దక్కిందనేది ప్రకటిస్తారు. అదే విధంగా ఈనెలాఖరులోగా చేప పిల్లలను పంపిణీ చేసేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నట్లు సమాచారం.

రేవంత్ రెడ్డి బోగస్ మాటలతో సీఎం అయ్యాడు

మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు

పర్వతగిరి, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : రేవంత్ రెడ్డి బోగస్ మాటలు చెప్పి ప్రజలను మోసం చేసి ముఖ్యమంత్రి అయ్యాడని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు విమర్శించారు. సోమవారం మండలంలోని కల్లెడ గ్రామంలో బీఆర్ఎస్ పార్టీ నాయకుల విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో టీడీపీలో ఇద్దరం కలిసి పనిచేశామని, అప్పటి నుంచే ప్రజలను ఎలా మోసం చేయాలో మాతో చర్చించేవాడని ఆరోపించారు. అటువంటి వ్యక్తి తెలంగాణ రాష్ట్రానికి ముఖ్యమంత్రి అవుతాడని అనుకోలేదని, కానీ, రేవంత్ రెడ్డికి అదే కలిసొచ్చిందని ఎద్దేవా చేశారు. అధికార పార్టీ నుంచి మన పార్టీలో చేరుతున్నారంటే కాంగ్రెస్ అసమర్థ పాలన అర్థంచేసుకోవాలన్నారు. యూరియా కొరత వచ్చిందంటే ఈ ప్రభుత్వ పాలన రైతులకు తెలుస్తోందన్నారు. కేసీఆర్ హయాంలో రాజుగా బతికిన రైతులు నేడు పస్తుండాల్సి వస్తోందన్నారు. మండలంలోని ప్రతి కార్యకర్తని కలుపుకుని పోయి పార్టీ గెలుపు కోసం పాటుపడాలన్నారు. ఎప్పుడు ఎన్నికలు వచ్చినా మళ్లీ కేసీఆరే ముఖ్యమంత్రి అవుతారని



కల్లెడలో మాట్లాడుతున్న మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు

ఆశాభావం వ్యక్తంచేశారు. గడగడపకు మన కార్యకర్త తిరిగి ఈ బోగస్ ప్రభుత్వం చేసిన బోగస్ హామీలను గుర్తు చేసి అర్థమయ్యే రీతిలో ప్రచారం చేయాలన్నారు. కష్టపడి పనిచేసిన కార్యకర్తకే గుర్తింపు ఉంటుందన్నారు. త్వరలోనే కమిటీలు వేసి ప్రతీ కార్యకర్తకి శిక్షణ తరగతులు ఏర్పాటు చేస్తామన్నారు. ఇందిరమ్మ ఇండ్లని ఈ ప్రభుత్వం ప్రవేశపెట్టి ఒక మోసపూరిత ధోరణి వ్యవహరిస్తోందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన బోగస్ 420 హామీల వల్ల ప్రజలు మోసపోయారన్నారు. తెలంగాణ ఒక బ్లాక్ మెయిలర్ చేతిలో పడి నలిగిపోతోందని ఆరోపించారు. ప్రజలు, నిరుద్యోగ విద్యార్థులు ఎన్నికల కోసం వేచి చూస్తున్నారని తెలిపారు. పార్టీ క్యాడర్, యూత్, సోషల్ మీడియా యాక్టివ్‌గా పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు.రాష్ట్ర పాలన పట్ల ఎల్లప్పుడు అప్రమత్తంగా ఉండి వారి ఎత్తులను తిప్పికొట్టాలన్నారు. అనంతరం టీపీసీసీ ఎస్టీ సెల్ తేజావత్ వినీత్ నాయక్ ఆధ్వర్యంలో భారీగా కార్యకర్తలు ఎర్రబెల్లి సమక్షంలో బీఆర్ఎస్ కండువా కప్పుకున్నారు. ఈ కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ మోటపోతు మనోజ్ గౌడ్, మండల పార్టీ అధ్యక్షుడు ఎర్రబెల్లి రాజేశ్వర్ రావు, జిల్లా నాయకుడు చింతపట్ల సోమేశ్వర్ రావు, పరమేశ్వర్ రావు, మాజీ జడ్పీటీసీ లునావత్ పంతులు, మాజీ ఎంపీటీసీ మాడుగుల రాజు, దేవేంద్రచారి, మండల, గ్రామాల నాయకులు పాల్గొన్నారు.

ఇంటి నుంచే ఎంప్లాయ్‌మెంట్

కార్డు నమోదు

అంతర్జాలంలో ప్రత్యేక వెబ్‌సైట్ తీసుకొచ్చిన ప్రభుత్వం

హనుమకొండ కలెక్టరేట్, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): నిరుద్యోగ యువకులు ఉపాధి కార్యాలయల్లో తమ పేరును నమోదు చేసుకునేందుకు ఆసక్తి చూపడం లేదు. ప్రభుత్వ ఉద్యోగాల కల్పన లేకపోవడంతో వెనకడుగేస్తున్నారు. దీంతో రిజిస్ట్రేషన్ల ప్రక్రియ తగ్గుతోంది. ఇలాంటి పరిస్థితుల్లో ప్రభుత్వం చర్యలు చేపట్టింది. నిరుద్యోగులు ఉపాధి కార్యాలయానికి వెళ్లకుండానే అంతర్జాలంలో తమ పేరును రిజిస్ట్రేషన్ చేసుకునేందుకు వీలుగా అవకాశం కల్పించారు. దీంతో ఇంటి వద్ద ఉంటూనే నిరుద్యోగులు ఎంప్లాయ్‌మెంట్ కార్డు పొందుతున్నారు. రెన్యువల్ గడువులోను మార్పు చేశారు. ఆన్‌లైన్‌లో నమోదు, ప్రభుత్వ, ప్రైవేట్ రంగాల్లో ఉపాధి అవకాశాలపై ఉపాధి కార్యాలయ అధికారులు అవగాహన కల్పిస్తున్నారు. ఒకసారి అభ్యర్థి నమోదు చేసుకుంటే 54ఏళ్ల వరకు గడువు ఉంటుంది. అభ్యర్థుల వయసు 61నిండినప్పుడు కార్డు కాలం చెల్లుతుంది.

కారణాలు ఇవీ..

- గతంలో ప్రభుత్వ ఉద్యోగం రావాలంటే కచ్చితంగా ఉపాధి కార్యాలయంలో నమోదు తప్పని సరి ఉండేది.
- జిల్లాస్థాయి పోస్టులను అభ్యర్థుల విద్యార్హత, ఎంప్లాయ్‌మెంట్ సీనియారిటీ ప్రాతిపదికన ఎంపిక ఉండేది.
- 1994 తర్వాత కొంత ప్రాధాన్యం తగ్గడంతో ఎంప్లాయ్‌మెంట్ కార్డు తీసుకునేందుకు అభ్యర్థులు వెనకాడుతున్నారు.

నమోదు ఇలా..

నిరక్షరాస్యులు, ఉన్నత విద్యావంతులు కార్డు పొందవచ్చు. www.employment.telangana.gov.in అనే వెబ్‌సైట్‌లోకి వెళ్లాలి. యూజర్ ఐడీ, పాస్‌వర్డ్ వస్తుంది. అన్ని వివరాలు నమోదు చేయాలి. అభ్యర్థులు కార్యాలయానికి వెళ్లాల్సిన అవసరం లేకుండా పొందుతారు.

ఎంప్లాయ్‌మెంట్ రిజిస్ట్రేషన్ తప్పనిసరి



కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలలో ఏ ఉద్యోగం వచ్చినా అభ్యర్థులకు తప్పకుండా ఎంప్లాయ్‌మెంట్ రిజిస్ట్రేషన్ అవసరం. జిల్లాలో ఇప్పటివరకు 15,307 మంది నిరుద్యోగులు రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. ప్రతీ ఒక్క నిరుద్యోగ యువకులు రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. నిరుద్యోగులకు ప్రైవేట్ రంగాల్లో ఉద్యోగాల కోసం జాబ్‌మేళాలు నిర్వహిస్తున్నాం. నిరుద్యోగుల కోసం ఉపాధికల్పన శాఖ ప్రత్యామ్నాయ మార్గాలపై దృష్టిసారించింది. నిరుద్యోగులకు వ్యక్తిత్వ వికాసం, ఉపాధి రంగాలపై అవగాహన కల్పిస్తున్నాం.

- ఎం. మల్లయ్య, జిల్లా ఉపాధి కల్పనాధికారి

మల్లేశంకు సత్కారం

హనుమకొండ కల్చరల్, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : హనుమకొండలోని కాళోజీ కళాక్షేత్రం ఆడిటోరియంలో ఆదివారం రాత్రి జరిగిన కాకతీయ కళా వైభవం నవరస కళా పురస్కార ప్రదానోత్సవంలో ఉభయ రాష్ట్రాల కళాకారుల సంక్షేమ మండలి అధ్యక్షుడు ఈగ మల్లేశంను నిర్వాహకులు ఘనంగా సత్కరించారు. గాయత్రి పీఠాధిపతి శ్రీ కాతేంద్రశర్మ, శ్రీశాంతిక్రిష్ణ సేవా సమితి నిర్వాహకులు మల్లేశంను శాలువా, మెమెంటోతో సన్మానించారు.



ఈగ మల్లేశంను సన్మానిస్తున్న దృశ్యం



వేడుకల్లో పాల్గొన్న సౌదీ అరేబియా తెలుగు అసోసియేషన్ సభ్యులు

ఘనంగా తెలుగు భాషా దినోత్సవ వేడుకలు

వరంగల్ ఎడ్యుకేషన్, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): తెలుగు భాషా దినోత్సవ వేడుకలను సౌదీ అరేబియా రియాద్‌లో వైభవంగా నిర్వహించుకున్నారు. సౌదీ అరేబియా తెలుగు అసోసియేషన్ (ఎస్‌ఏటీఏ) ఆధ్వర్యంలో సక్సెస్ ఇంటర్నేషనల్ స్కూల్ ప్రాంగణంలో నిర్వహించిన వేడుకల్లో సాటా ఫౌండర్ మల్లేశ్, శ్రీనివాస్ మచ్చ మాట్లాడుతూ.. మన తెలుగు వారు అందరూ కలిసి తెలుగు భాష దినోత్సవ వేడుకలు జరుపుకోవడం ఆనందంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో కాశిబరాజు, అంజాద్, తేజ, స్వామి, శార్వాణి విద్యాధరణి, కోకిల, ప్రీతి, లోకేష్, సింగ్ నరేశ్, శహబాజ్ అహ్మద్, అద్దుల్, మిథున్, సురేశ్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

అక్రమ కేసులపై న్యాయస్థానాల్లో పోరాడుదాం..

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

హనుమకొండ టౌన్, సెప్టెంబరు8 (ఆంధ్రజ్యోతి): అక్రమ కేసులపై న్యాయస్థానాల్లో పోరాడుదామని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ అన్నారు. సోమవారం తెలంగాణ భవన్‌లో బీఆర్ఎస్ లీగల్‌సెల్ హనుమకొండ బాధ్యులతో కలిసి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. అక్రమ కేసులకు భయపడబోమని, బీఆర్ఎస్ శ్రేణులకు ఉద్యమాలు కొత్తకావని తెలిపారు. ఎన్ని అక్రమ కేసులు బనాయించినా ప్రజల తరపున పోరాడుతామని, వారి హక్కుల సాధన కోసం నినదిస్తామని పునరుద్ఘాటించారు. బీఆర్ఎస్ పార్టీ శ్రేణుల పక్షాన లీగల్‌సెల్ పోరాడుతుందని అన్నారు. కార్యక్రమంలో లీగల్‌సెల్ బాధ్యులు సీనియర్ న్యాయవాది తాళ్లపల్లి జనార్దన్‌గౌడ్, వినోద్‌కుమార్ పాల్గొన్నారు.



కేటీఆర్‌ను కలిసిన మాజీ ఎమ్మెల్యే వినయ్ భాస్కర్, బీఆర్ఎస్ లీగల్ సెల్ నాయకులు

సహజ ప్రసవాలకు ప్రాధాన్యం

గ్రావిడ్ హోం ఆస్పత్రి వైద్యురాలు డాక్టర్ వి.రమ్య

వరంగల్ మెడికల్, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): సహజ ప్రసవాలకు ప్రాధాన్యమిస్తున్నామని హనుమకొండ బాలసముద్రంలోని గ్రావిడ్ హోం ఆస్పత్రి స్త్రీ వైద్య నిపుణురాడు డాక్టర్ వందనశెట్టి రమ్య తెలిపారు. గర్భిణులకు తమ ఆస్పత్రిలో అధునాతన పద్ధతుల్లో వైద్య చికిత్స అందిస్తున్నామన్నారు.యాంటినేటల్ వ్యాయమాలు గర్భిణులతో చేయిస్తామని, విబ్యాక్ పద్ధతిలో ప్రసవాలను సహజ పద్ధతిలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఎవరికైనా మొదటి ప్రసవం సిజేరియన్ అయినప్పటికీ రెండో ప్రసవం సహజ పద్ధతిలో నిర్వహిస్తామని తెలిపారు. తొలి నుంచి తమ వద్ద వైద్య సేవలు పొందితే సహజ ప్రవసం తప్పకుండా చేస్తామని తెలిపారు. తమ ఆస్పత్రిలో ప్రతీ నెల 10 సహజ ప్రసవాలు జరుగుతున్నాయన్నారు. నొప్పిలేని ప్రసవాలు, కోతలేని నొప్పి తక్కువ ఉన్న ప్రసవాలు, తల్లీబిడ్డ క్షేమం, త్వరితగతిన రికవరీ, తక్కువ బ్లడ్ లాస్‌తోపాటు డేకేర్ ప్రసవాలకు తమ ఆస్పత్రి ప్రత్యేకత అని డాక్టర్ వందనశెట్టి రమ్య తెలిపారు.

సమాచారం లేకుండా క్రీడాకారుల ఎంపిక

కలెక్టర్‌కు వెటరన్ క్రీడాకారుడి ఫిర్యాదు

వరంగల్ కార్పొరేషన్, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): కొంత కాలంగా వరంగల్ క్రీడాసాధికార సంస్థ (డీఎస్ఏ)లో క్రీడాకారులకు అన్యాయం జరుగుతోందని, ఇటీవల నిర్వహించిన ప్రభుత్వ ఉద్యోగ క్రీడాకారుల ఎంపికలు ఎలాంటి సమాచారం లేకుండా నిర్వహించారని జీడబ్ల్యూఎంసీ పబ్లిక్ హెల్త్ మేనేజ్‌మెంట్ ఇంజనీరింగ్ విభాగం జూనియర్ అసిస్టెంట్, రాష్ట్ర క్రీడాకారుడు సీహెచ్ ఆదిశేషు ఆరోపించారు. తనకు జరిగిన అన్యాయంపై సోమవారం హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహాశబరీష్‌ను కలిసి వినతి పత్రం అందించారు. స్పందించిన కలెక్టర్ సంబంధిత అధికారిపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్టు తెలిపారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో ఐదుగురికి జైలు

కాజీపేట, సెప్టెంబరు8 (ఆంధ్రజ్యోతి): డ్రంకెన్ డ్రైవ్‌లో ఐదుగురికి జైలు శిక్షపడింది. కాజీపేట ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ పి.వెంక న్న తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కాజీపేట ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలో రెండు రోజుల కిందట డ్రంకెన్‌డ్రైవ్‌పై స్పెషల్ డ్రైవ్ నిర్వహించగా అర్షం చిరంజవి, రాగి వెంకన్న, పెంచల రవి, చిందం ప్రభాకర్, వినోద్ కుమార్‌లు మోతాదుకు మించి మద్యం సేవించి వాహనాలు నడుపుతూ పట్టుబడ్డారు. వీరిని సోమవారంకోర్టులోహాజరుపర్చగా సెకండ్‌క్లాస్ మెజిస్ట్రేట్ ఫాతిమా చిన్నప్ప విచారించి రెండు రోజుల జైలు శిక్ష విధించినట్లు ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ పి. వెంకన్న తెలిపారు.

లంబాడీల రిజర్వేషన్లు రాజ్యాంగబద్ధమే..

లంబాడీ జాయింట్ యాక్షన్ కమిటీ రాష్ట్ర కన్వీనర్ జైసింగ్ రాథోడ్

వడ్డేపల్లి, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): లంబాడీల ఎస్టీ రిజర్వేషన్లు రాజ్యాంగ బద్ధమేనని లంబాడీ జాయింట్ యాక్షన్ కమిటీ రాష్ట్ర కన్వీనర్ జైసింగ్ రాథోడ్ అన్నారు. సోమవారం హనుమకొండ పబ్లిక్ గార్డెన్ ప్రాంతంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద మంగళవారం వరంగల్‌లో నిర్వహించే లంబాడీల శాంతి ర్యాలీకి సంబంధించిన సన్నాహక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయనతో పాటు లంబాడీల జేఏసీ కన్వీనర్ జాటోత్ కిషన్‌నాయక్ మాట్లాడారు. రాజ్యాంగ బద్ధంగా ఎస్టీ జాబితాలో ఉన్న లంబాడీలను తొలగించాలంటూ రాజ్యాంగాన్ని ధిక్కరించే పద్ధతిలో కోయ, గోండులకు సంబంధించిన కొంత మంది స్వార్థ రాజకీయ నాయకులు వ్యవహరిస్తున్నారని దుయ్యబట్టారు. లంబాడీలపై జరుగుతున్న దుష్ప్రచారాన్ని తిప్పికొట్టేందుకు మంగళవారం ఉదయం 11గంటలకు హనుమకొండ బాలసముద్రంలోని తానునాయక్ విగ్రహం నుంచి పబ్లిక్ గార్డెన్ ప్రాంతంలోని అంబేద్కర్ విగ్రహం వరకు నిర్వహించే శాంతి ర్యాలీలో లంబాడీలు వేలాదిగా తరలి వచ్చి విజయవంతం చేయాలని వారు పిలుపు నిచ్చారు. లంబాడీ జాయింట్ యాక్షన్ కమిటీ రాష్ట్ర , జిల్లా నాయకులు వీరమ్మ గోపిసింగ్ నాయక్, వాంకుడోత్ వీరన్న నాయక్, బానోత్ వెంకన్న నాయక్, టీఎస్ నాయక్, భూక్యా శ్రావణ్ పాల్గొన్నారు.



కేటీఆర్‌ను కలిసిన మాజీ ఎమ్మెల్యే వినయ్ భాస్కర్, బీఆర్ఎస్ లీగల్ సెల్ నాయకులు

13న కేయూలో మాదిగ ఉద్యోగుల సదస్సు

కేయూ క్యాంపస్ సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 13న కాకతీయ యూనివర్సిటీలో ఉమ్మడి వరంగల్ జిల్లా మాదిగ ఉద్యోగుల సదస్సు నిర్వహిస్తామని కేయూ మాదిగ ఉద్యోగుల సంఘం అధ్యక్షకార్యదర్శులు డాక్టర్ పొడేటి శ్రీనివాస్, డాక్టర్ ఎస్.సుజాతలు తెలిపారు. సోమవారం కేయూలో కేయూ మాదిగ ఉద్యోగుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా శ్రీనివాస్, సుజాతలు పాల్గొని మాట్లాడారు. 13న జరిగే మాదిగ ఉద్యోగుల సదస్సు రాష్ట్ర అధ్యక్షుడు మంద దేవేందర్, ప్రసాద్, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ మల్లెపాక వెంకన్న, రాష్ట్ర జనరల్ సెక్రటరీ చెబర్తి యాదగిరిలు వస్తారని పేర్కొన్నారు. వర్సిటీ ఉద్యోగులందరూ హాజరుకావాలని కోరారు.

జాబితాపై అభ్యంతరాలు ఉంటే చెప్పండి..

రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలెక్టర్ స్నేహ శబరీష్



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ స్నేహ శబరీష్

హనుమకొండ కలెక్టరేట్, సెప్టెంబరు 8 (ఆంధ్ర జ్యోతి): జిల్లాలోని 12 మండలాల్లో గ్రామపంచాయ తీల వారిగా ముసాయిదా ఓటర్ల జాబితా, పోలింగ్ కేంద్రాల జాబితాను ప్రచురించామని, ముసాయిదా ఓటర్ల జాబితా, పోలింగ్ కేంద్రాల జాబితాపై అభ్యంతరాలు ఉంటే తెలియజేయాలని జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ రాజకీయ పార్టీల ప్రతినిధులకు సూచించారు. కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్‌హాల్‌లో సోమవారం వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు రాజకీయ పార్టీల ప్రతినిధుల నుంచి ముసాయిదా ఓటర్ల జాబితా, పోలింగ్ కేంద్రాల జాబితాపై అభ్యంతరాలను స్వీకరించి 9వ తేదీన సవరించిన అనంతరం 10వ తేదీన ప్రాదేశిక నియోజకవర్గాల వారిగా తుది ఓటర్ల జాబితాను ప్రదర్శిస్తామన్నారు. ఈ సమావేశంలో వివిధ రాజకీయ పార్టీల ప్రతి నిధులు పాల్గొన్నారు.

స్వాస్థ్‌నారీ, సశక్త్ నారీ కార్యక్రమాల అమలు

మహిళల ఆరోగ్యమే లక్ష్యంగా ఈ నెల 17వ తేదీ నుంచి అక్టోబర్ 2వ తేదీ వరకు స్వాస్థ్ నారీ, సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమాలు జిల్లా వ్యాప్తంగా నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ తెలిపారు. జిల్లా కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్‌హాల్‌లో సోమవారం కార్యక్రమాల అమలు విజయవంతంపై వివిధ శాఖల అధికారులతో కలెక్టర్ సమన్వయ సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ స్నేహ శబరీష్ మాట్లాడుతూ.. కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ శాఖ ఆదేశాలతో మహిళలకు అన్ని రకాల వైద్య పరీక్షలు చేసేందుకు ఈ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. వైద్య, ఆరోగ్య శాఖ రాష్ట్రంలోని మహిళలకు పక్షం రోజుల పాటు నిర్దేశించిన ఆస్పత్రుల్లో స్పెషలిస్ట్ వైద్యులతో అన్ని రకాల వైద్య పరీక్షలు చేసేందుకు ఏర్పాటు చేస్తామన్నారు. అధిక రక్తపోటు, మధుమేహం, ఓరల్ క్యాన్సర్, బ్రెస్ట్ క్యాన్సర్, సర్వైకల్ క్యాన్సర్ పరీక్షలు, బ్లడ్ డొనేషన్ క్యాంపులు నిర్వహిస్తామన్నారు. రక్తహీనతకు గురికాకుండా ఉండేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై యుక్త వయసు అమ్మాయిలకు, మహిళలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. ఈ సమావేశంలో జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ అప్పయ్య, జిల్లా పరిషత్ ఇన్‌చార్జి సీఈఓ రవి, జిల్లా పంచాయతీ అధికారి లక్ష్మీరమాకాంత్, జిల్లా విద్యాశాఖ అధికారి వాసంతి, జిల్లా సంక్షేమ అధికారి జయంతి తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

సమస్యలు వెంటనే పరిష్కరించాలి

హనుమకొండ కలెక్టరేట్, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ప్రజావాణి సమస్యలు వెంటనే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ సంబంధిత అధికారులకు సూచించారు. కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్‌హాల్‌లో సోమవారం ఉదయం 10:30 గంటల నుంచి మధ్యాహ్నం 1:30 గంటల వరకు నిర్వహించిన ప్రజావాణికి జిల్లా వ్యాప్తంగా వివిధ సమస్యలపై 150 ఫిర్యాదులు వచ్చాయి. కలెక్టర్ బాధితుల నుంచి వినతిని స్వీకరించి సంబంధిత డిపార్ట్‌మెంట్ అధికారిని పిలిచి సమస్యను విచారించి వెంటనే పరిష్కరించాలన్నారు. ప్రజావాణికి వచ్చిన ఫిర్యాదులలో హౌసింగ్ పీడీకి సంబంధించి 20, హసన్‌పర్తి తహసీల్దార్ కార్యాలయానికి 15, హనుమకొండ ఆర్‌డీఓ కార్యాలయానికి 14, జీడబ్ల్యూఎంసీకి 13 ఫిర్యాదులు రాగా, మిగతావి ఇతర డిపార్ట్‌మెంట్‌లకు సంబంధిచినవి వచ్చాయి. అనంతరం కలెక్టర్ స్నేహ శబరీష్ మాట్లాడుతూ.. ప్రజావాణి సమస్యలు పరిష్కరిస్తేనే ప్రభుత్వం, ప్రజావాణిపై ప్రజలకు నమ్మకం ఏర్పడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డి, జిల్లా రెవెన్యూ అధికారి వైవీ గణేష్, డీఆర్‌డీఓ మేన శ్రీను, పరకాల, హనుమకొండ ఆర్డీఓలు డాక్టర్ కె.నారాయణ, రాథోడ్ రమేష్, ఇతర జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న జిల్లాస్థాయి టీఎల్ఎం మేళా

వరంగల్ ఎడ్యుకేషన్, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో విద్య నభ్యసిస్తున్న విద్యార్థుల అభ్యస అనుభవాలను మెరుగుపర్చడానికి జిల్లా విద్యాశాఖ మౌలిక భాషా గణిత సామర్థ్యాల సాధన పేరుతో జిల్లాస్థాయి టీఎల్ఎం మేళాను నిర్వహించింది. లష్కర్ బజార్‌లోని ప్రభుత్వ బాలికల పాఠశాలలో సోమవారం ఏర్పాటు చేసిన ఈ మేళాను హనుమకొండ జిల్లా విద్యాశాఖ అధికారి డి.వాసంతి ప్రారంభించి మాట్లాడారు. తరగతి గదిలో విద్యాబోధన చేస్తున్నప్పుడు టీఎల్ఎం సామగ్రి అత్యంత అవసరమన్నారు. రెడీమేడ్‌గా తయారు చేసిన టీఎల్ఎం కాకుండా ఉపాధ్యాయులు సొంతంగా తయారు చేసి తరగతిగదిలో ఉపయోగిస్తే ఫలితాలు అద్భుతంగా ఉంటాయన్నారు. మండలస్థాయి నుంచి జిల్లాస్థాయి మేళాకు వచ్చిన టీఎల్ఎంలు చాలా నాణ్యతతో ఉన్నాయని, రాష్ట్రస్థాయికి ఎంపికైన టీఎల్ఎంలను ఉపాధ్యాయులు మరింత సృతజనాత్మకత జోడించి తయారు చేసి తీసుకెళ్లాలని సూచించారు.

ఈ మేళాలలో 14 మండలాల నుంచి వచ్చిన 140 మంది ఉపాధ్యాయులు విద్యార్థులకు బోధించే సమయంలో ఉపయోగించే బోధనోపకరణాలు సులభత రమైన, ఆకర్షణీయమైన, సృజనాత్మకమైనవి తయారు చేసి విద్యార్థులకు అర్థమయ్యే రీతితో ఏ విధంగా విద్య ను బోధించాలో ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో గుణాత్మక విద్య కో ఆర్డినేటర్ డాక్టర్ బండారు మన్మోహ న్, ప్రధానోపాధ్యాయురాలు ఉమాదేవి, సీఎంఓ బద్దం సుదర్శన్‌రెడ్డి, ఎంఈఓ నెహ్రూనాయక్, జిల్లా సైన్స్ అధికారి శ్రీనివాసస్వామి, వేణు ఆనంద్, మధుసూదన్ రెడ్డి, డైట్ రిటైర్డ్ లెక్చరర్లు ఎం.సోమయ్య, సిహెచ్.కేశవ రావు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న డీఈవో వాసంతి

అవయవ దానంతోనే మానవుడికి పునర్జన్మ

హసన్‌పర్తి, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): అవయవ దానంతోనే మానవుడికి పునర్జన్మ అని జిల్లా వైద్యాధికారి డాక్టర్ అప్పయ్య అన్నారు. జాతీయ నేత్ర దాన పక్షోత్సవాలలో భాగంగా గ్రేటర్ 1వ డివిజన్ పరిధి ముచ్చర్లలో తెలంగాణ నేత్ర, అవయవ , శరీర దాతల అసోసియేషన్ ఆధ్వర్యంలో దాతల కుటుంబాలకు సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా వైద్యాధికారి డాక్టర్ అప్పయ్య, ప్రాంతీయ నేత్ర వైద్యశాల వరంగల్ సూపరింటెండెంట్ డాక్టర్ భరత్‌కుమార్, ప్రొఫెసర్ డాక్టర్ హరదేవరాజ్‌లు స్థానిక కార్పొరేటర్ అరుణకుమారితో కలిసి దాతలను సన్మానించారు. ముందుగా గ్రామంలో నేత్ర దాన అవగాహన కోసం ర్యాలీ నిర్వహించారు. అనంతరం 56 మంది నేత్రదాతలను సన్మానించి సర్టిఫికెట్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ నవ్య, ఏఎన్ఎంలు కె.సత్యవతి, ఎం.శోభ, హెల్త్ అసిస్టెంట్ బి.ఉదయవర్యులు, ఆశలు సరిత, అరుణ, జయ, పద్మ, అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఉపేందర్‌రెడ్డి, బోగి సుజాత, ఎం.పద్మ, రవీందర్, కొన్‌రెడ్డి మల్లారెడ్డి, కె.నర్సిం హరాములు, జనార్ధన్‌రెడ్డి, రాజమణి, సాయిరెడ్డి, యోగా మాస్టర్ భాస్కర్, సాంబయ్య పాల్గొన్నారు.



అవయువదాతలను సన్మానిస్తున్న డీఎంహెచ్‌వో డాక్టర్ అప్పయ్య

వర్సిటీలను నిర్వీర్యం చేస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు

సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు అబ్బాస్

కేయూ క్యాంపస్, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ వర్సిటీలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మూకుమ్మడిగా కుట్రపూరితంగా నిర్వీర్యం చేస్తున్నాయని సీపీఎం తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు అబ్బాస్ ధ్వజమెత్తారు. సోమవారం కేయూ మానవీయ శాస్త్ర భవనంలో ఎస్ఎఫ్ఐ కేయూ కమిటీ నేతృత్వంలో విద్యార్థులకు సెమినార్ నిర్వహించారు. ఎస్ఎఫ్ఐ కేయూ అధ్యక్షకార్యదర్శులు చెన్నూరి సాయికుమార్, బిరెడ్డి జశ్వంత్‌ల అధ్యక్షతన జరిగిన సెమినార్‌కు అబ్బాస్ ముఖ్యఅతిథిగా హాజరై కీలక ప్రసంగం చేశారు.దేశంలోని వర్సిటీలను ప్రభుత్వాలు నిధులు ఇవ్వడం లేదన్నారు. కార్పొరేట్, ప్రైవేట్ వర్సిటీలకు కొమ్ముకాస్తూ విచ్చలవిడిగా అనుమతులిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వ వర్సిటీ విద్యార్థులకు మౌలిక వసతులను కల్పించడం లేదని అన్నారు. అలాగే బోధన, బోధనేతర సిబ్బంది ఖాళీలతో పాటు, హాస్టళ్ల, భవనాలు లేవన్నారు. నిధులిచ్చి వర్సిటీలను అభివృద్ధి చేయాలని డిమాండ్ చేశారు. ఎస్ఎఫ్ఐ హనుమకొండ జిల్లా అధ్యక్షకార్యదర్శులు స్టాలిన్, మంద శ్రీకాంత్‌లు మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి రెండేళ్ల అవుతున్నప్పటికీ విద్యాశాఖ మంత్రిని కేటాయించలేదన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి విద్యారంగాన్ని పట్టించుకోవడం లేదన్నారు. విద్యార్థుల సమస్యలపై పోరాటాలు తప్పవన్నారు. కాంట్రాక్టు అధ్యాపకుల సంఘం రాష్ట్ర జనరల్ సెక్రటరీ డాక్టర్ శ్రీధర్‌కుమార్‌లోథ్, డాక్టర్ జి.కృష్ణయ్యలు మాట్లాడుతూ.. విద్యారంగ సమస్యలపై పోరాటాలు చేయాలని, ప్రశ్నించే తత్వాన్ని అలవర్చుకోవాలని పిలుపునిచ్చారు. ఈ సెమినార్‌లో సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు గొడుగు వెంకట్, ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు బొచ్చు కల్యాణ్, సభ్యులు ఇస్మాయిల్, పవన్‌కుమార్, వర్సిటీ నేతలు మల్లేశ్, పూజ, శ్రావణి, శ్రీ సాయి, రాధిక, అనూష, ప్రవళిక, అనిత, శిరీష, సందీప్, రాహుల్, రాకేశ్, అరుణ్‌కుమార్, అభిలాష్, ఈశ్వర్, ప్రభాస్, సాయి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు అబ్బాస్



ర్యాలీని ప్రారంభిస్తున్న డాక్టర్ లక్ష్మీపతి

నేత్రదానంపై అవగాహన ర్యాలీ

వరంగల్ మెడికల్, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): నేత్రదానం చేసి మరణానంతరం కూడా జీవించవచ్చని కాకతీయ మెడికల్ కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ డాక్టర్ లక్ష్మీపతి అన్నారు. 40వ నేత్రదాన పక్షోత్సవాల ముగింపు సందర్భంగా అవగాహన ర్యాలీ నిర్వహించారు. ర్యాలీని డాక్టర్ లక్ష్మీపతి ప్రారంభించగా కేఎంసీ నుంచి ప్రాంతీయ నేత్ర వైద్యశాల వరకు కొనసాగింది. ఈ సందర్భంగా డాక్టర్ లక్ష్మీపతి మాట్లాడుతూ.. నేత్రదానంపై అవగాహన కల్పించి ఎక్కువ సంఖ్యలో నేత్నదానం చేసేలా ప్రోత్సహించాలన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ భరత్‌కుమార్, డాక్టర్ శ్రీకుమార్, డాక్టర్ హరిదేవ్, ప్రొఫెసర్స్, అసోసియేట్ ప్రొఫెసర్స్, అసిస్టెంట్ ప్రొఫెసర్స్, పీజీ డాక్టర్స్, విద్యార్థులు పాల్గొన్నారు.

ఇచ్చిన హామీలను కాంగ్రెస్ నెరవేర్చాలి

హసన్‌పర్తి, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవాలని కోరుతూ పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని నాయబ్ తహసీల్దారు రహీంకు స్థానిక కార్పొరేటర్ శివకుమార్‌తో కలిసి బీజేపీ నాయకులు వినతిపత్రం అందజేశారు. అనంతరం హసన్‌పర్తి బస్టాండులో ప్రధాని నరేంద్రమోదీ, ఆర్థిక మంత్రి నిర్మల సీతారామన్ నాయకత్వంలో జరిగిన జీఎస్టీ సంస్కరణలు పేద, మధ్య తరగతి ప్రజలకు అందిస్తున్న ఉపశమనాన్ని గుర్తిస్తూ మండల పార్టీ అధ్యక్షుడు మారం తిరుపతి ఆధ్వర్యంలో క్షీరాభిషేకం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఎస్సీ మోర్చ ఉపాధ్యక్షుడు బన్న ప్రభాకర్, వరంగల్ పార్లమెంట్ కన్వీనర్ తాళ్లపల్లి కుమారస్వామి, మాజీ ఎంపీటీసీ పిట్టల కుమారస్వామి పాల్గొన్నారు.

పెన్షన్‌లు పెంచేవరకు కాంగ్రెస్‌పై పోరాటం చేస్తాం..

ఎంఎస్‌పీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షుడు వైకే విశ్వనాథ్ మాదిగ

హనుమకొండ కలెక్టరేట్, సెప్టెంబర్8(ఆంధ్రజ్యోతి): పెన్షన్లు పెంచేవరకు కాంగ్రెస్‌పై పోరాటం చేస్తామని ఎంఎస్‌పీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షుడు వైకే విశ్వనాథ్ మాదిగ అన్నారు. వికలాంగుల హక్కుల పోరాట సమితి వీహెచ్‌పీఎస్ చేయూత పెన్షన్‌దారుల హక్కుల పోరాట సమితి సీపీహెచ్‌పీఎస్, ఎంఆర్‌పీఎస్ ఆధ్వర్యంలో పెన్షన్లు పెంచాలని డిమాండ్ చేస్తూ సోమవారం కలెక్టరేట్‌ను ముట్టడించి ధర్నా చేశారు. ఈ సందర్భంగా విశ్వనాథ్, జిల్లా ఇన్‌చార్జి కందుకూరి సోమన్న మాదిగ మాట్లాడుతూ.. ఎన్నికల ప్రచారంలో రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీ మేరకు పెన్షన్లు పెంచాలన్నారు. రేవంత్‌రెడ్డి సీఎం అయి 20నెలలు గడుస్తున్నా.. కూడా పెన్షన్ల పెంపుపై ఒక్కమాట కూడా మాట్లాడకపోవడం అన్యాయమన్నారు. వేలాదిమంది పెన్షనర్లు రోడ్ల మీదికి వచ్చి పోరాటం చేస్తున్నా.. సీఎం రేవంత్‌రెడ్డి పట్టించుకోకపోవడం సరికాదన్నారు. సీఎం మానవతాకోణంలో ఆలోచించి పెన్షన్లు పెంచి ఇచ్చిన మాట నిలుపుకోవాలని కోరారు. లేదంటే ఈ నెల 12వ తేదీన తహసీల్దార్ కార్యాలయాలను దిగ్బంధం చేస్తామన్నారు. ఈ నెల 20వ తేదీన ఎల్బీనగర్ నుంచి మొదలుకుని కోదాడ వరకు ఉన్న జాతీయ రహదారిని దిగ్బంధం చేస్తామని హెచ్చరించారు. అనంతరం జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్‌కు పెన్షన్లు పెంచే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంఎస్‌పీ జిల్లా అధ్యక్షుడు బండారి సురేందర్ మాదిగ, ఎంఆర్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు గద్దల సుకుమార్ మాదిగ, వీహెచ్‌పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు దూడల శ్రీనివాస్, జిల్లా అధ్యక్షుడు సింగారపు స్వామి, జిల్లా కార్యదర్శి రాజు, వీహెచ్‌పీఎస్ జిల్లా మహిళా నేతలు మమత, సరిత, స్వప్న, జ్యోతి, వీహెచ్‌పీఎస్, సీపీహెచ్‌పీఎస్, ఎంఆర్‌పీఎస్, ఎంఎస్‌పీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న వీహెచ్‌పీఎస్ నాయకులు, చేయూత పెన్షన్‌దారుల హక్కుల పోరాట సమితి నాయకులు

న్యాయవాది వెంకటేశ్వర్‌రావు మృతికి బార్ సంతాపం

వరంగల్ లీగల్, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): సీనియర్ న్యాయవాది సరికొండ వెంకటేశ్వర్‌రావు (68) మృతికి హనుమకొండ, వరంగల్ జిల్లాల బార్ అసోసియేషన్ల న్యాయవాదులు తమ ప్రగాఢ సంతాపాన్ని వ్యక్తం చేశారు. ఆయన తీవ్ర అనారోగ్యంతో ఆదివారం మృతి చెందారు. ఆయనకు భార్య వైదేహి ఉన్నారు. హనుమకొండ ప్రాంతానికి చెందిన వెంకటేశ్వర్ రావు.. 1997 నుంచి జిల్లా కోర్టులో న్యాయవాదిగా ప్రాక్టీస్ చేస్తున్నారు. సోమవారం జిల్లా కోర్టులోని బార్ అసోసియేషన్ హాల్‌లో ఏర్పాటుచేసిన సంతాప కార్యక్రమానికి వరంగల్ జిల్లా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు వలుస సుధీర్ అధ్యక్షత వహించారు. ఈ సమావేశంలో న్యాయవాదులు మాట్లాడు తూ.. కార్మికుల కేసులు వాదిస్తూ లేబర్ కోర్టులో ప్రముఖ పాత్ర పోషించేవారని ఆర్టీసీ కార్మికులు ఇతర అసంఘటిత, సంఘటిత కార్మికుల కేసుల్లో వాదించి వారికి న్యాయం చేసే వారని గుర్తు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఉభయ జిల్లాల ప్రధాన కార్యదర్శులు కొత్త రవి, డి.రమాకాంత్, కార్యవర్గ సభ్యులు, సీనియర్, జూనియర్ మహిళా న్యాయవాదులు పాల్గొన్నారు. అంతకు ముందు హనుమకొండ జిల్లా జడ్జి డాక్టర్ పట్టాభి రామారావు ఆధ్వర్యంలో సంతాప కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అదనపు జిల్లా జడ్జిలు సీనియర్, జూనియర్ జడ్జిలు, ప్రభుత్వ న్యాయవాది కె.నర్సింహరావు, న్యాయవాదులు పాల్గొన్నారు.



ఒబేసిటీ

అధిక బరువును తగ్గించుకునే మార్గాలెన్నో ఇప్పుడు అందుబాటులో ఉన్నాయి. అయితే వాటిని దగ్గరి దారులుగా భావించడం పొరపాటు. అత్యవసరమైతే తప్ప బరువు తగ్గించే మాత్రలు, ఇంజక్షన్ల జోలికి వెళ్లకూడదు. ఒబేసిటీ మందుల ప్రయోజనాలు, దుష్ప్రభావాల గురించి వైద్యులు ఇలా వివరిస్తున్నారు.

బరువు తగ్గించే మందులతో ప్రమాదమే!

అధిక బరువు బిఎమ్ఐ మీద ఆధారపడి ఉంటుంది. శరీర బరువు, ఎత్తు/మీటరుతో అధిక బరువును లెక్కించవచ్చు. బిఎమ్ఐ 18 కంటే తక్కువగా ఉండే దాన్ని పోషకాహార లోపంగా భావించాలి. 18.5 నుంచి 25 ఉంటే దాన్ని సరైన బరువుగా పరిగణించాలి. 25కు మించితే అధిక బరువుగా, 28, అంతకు మించితే ఒబేసిటీగా పరిగణించాలి. అయితే 13 నుంచి 18 ఏళ్ల వయస్కుల్లో హార్మోన్ల హెచ్చుతగ్గులకు గురవుతూ ఉంటాయి కాబట్టి బరువులో కూడా వ్యత్యాసాలు చోటుచేసుకుంటూ ఉంటాయి. మరీముఖ్యంగా ఈ వయసు అమ్మాయిల్లో నెలసరి మొదలై కార్టిసాల్ హార్మోన్ పెరిగి, తిండి పట్ల యావ పెరుగుతుంది. దాంతో బరువు పెరుగుతారు. ఇదే వయసు అబ్బాయిలు కూడా హార్మోన్ల హెచ్చుతగ్గుల ఫలితంగా ఎత్తు, బరువు పెరుగుతారు. అలాగే థైరాయిడ్ సమస్యల వల్ల కూడా శరీర బరువు పెరుగుతుంది. జన్యుపరమైన సమస్యల వల్ల కొంతమంది పిల్లలు అధిక బరువుతో పుడతారు. ఇలాంటి పిల్లల్లో భవిష్యత్తులో చిన్న వయసులోనే మధుమేహం తలెత్తుతుంది. దాంతో ఒబేసిటీ కూడా తలెత్తుతుంది. ఒబేసిటీ, హైపర్‌టెన్షన్, మధుమేహం... ఈ మిశ్రమ సమస్యను 'మెటబాలిక్ సిండ్రోమ్'గా పరిగణించాలి. ఈ కోవకు చెందినవాళ్లు అవసరానికి మించి తినకపోయినా, బరువు పెరిగిపోతూ ఉంటారు.

జన్యువులూ కారణమే!

కొందరు ఎంత తిన్నా సన్నగానే ఉంటారు. ఇంకొందరు కొంత తిన్నా లావైపోతూ ఉంటారు. పుట్టుకతో సంక్రమించే జన్యువులే ఇందుకు కారణం. ఆకలి, కొన్ని పదార్థాలు తినాలనే బలమైన కోరిక, సంతృప్తి, శరీరం శక్తిని ఖర్చు చేసుకునే వేగం, శరీరంలో కొవ్వు నిల్వ.. వీటికి సంబంధించిన జన్యువులుంటాయి.
ఈ జన్యువుల్లో లోపాలున్నప్పుడు సంబంధిత అంశాలన్నీ ప్రభావితమవుతాయి. ఆకలి మీద నియంత్రణ కోల్పోవడం, ఎంత తిన్నా సంతృప్తిని పొందలేకపోవడం, శరీరం శక్తిని ఖర్చుచేసుకునే వేగం తగ్గడం, శరీరంలో కొవ్వు పేరుకుపోతూ ఉండడం లాంటి సమస్యలన్నిటికీ సంబంధిత జన్యు లోపాలే కారణం. వీటిని నియంత్రించే వీలు ఉండదు కాబట్టి అంతిమంగా స్థూలకాయులైపోతూ ఉంటారు.

వ్యాయామంతోనే ఫలితం

శరీరం శక్తిని ఖర్చు చేసుకునే బేసిక్ మెటబాలిక్ రేటును పెంచుకోదగిన ఏకైక మార్గం... వ్యాయామం. అందుకోసం రోజుకు 20 నుంచి 30 నిమిషాలకు తగ్గకుండా వారానికి 150 నిమిషాల చొప్పున వేగంగా నడవాలి. ఇలా మూడు నెలల పాటు క్రమం తప్పక నడకను కొనసాగించగలిగితే కచ్చితంగా ఫలితం ఉంటుంది. అలాగే ఈత, జిమ్‌లో వ్యాయామాలతో కూడా ఫలితం ఉంటుంది. అలాగే ఆహార నియమాల్లో భాగంగా పిండిపదార్థాలు తగ్గించేసి, కూరగాయలు, ప్రొటీన్లు ఎక్కువగా తీసుకోవాలి.

ఉత్తమ మార్గం ఇదే!

అధిక బరువును వదిలించుకోడానికి సురక్షితమైన మార్గాన్నే ఎంచుకోవాలి. అవసరానికి మించి తినడం వల్ల, వ్యాయామం లోపించడం వల్ల బరువు పెరిగితే అదే ఆహారాన్ని తగ్గించి, వ్యాయామాన్ని పెంచి బరువు తగ్గించుకునే ప్రయత్నం చేయాలి. ఈ ప్రయత్నాలతో కచ్చితంగా అధిక బరువు అదుపులోకొస్తుంది. అయినప్పటికీ విపరీతమైన ఆకలి, కొన్ని పదార్థాలను తినాలనే యావ లాంటివి ఉన్నప్పుడు, వాటిని నియంత్రించే కొన్ని మాత్రలు వాడుకోవచ్చు. అవేంటంటే...

అరుగుదల పెంచే మాత్రలు: తిన్నది వెంటనే వేగంగా అరిగి, శరీరంలో క్యాలరీలు పేరుకుపోకుండా చేస్తాయి

కొవ్వును తగ్గించే మాత్రలు: తిన్నది అరిగిపోతున్నా, శరీరంలో కొవ్వు పేరుకుపోతుంటే, ఆ కొవ్వును కరిగించే మాత్రలు వాడుకోవచ్చు

ఆకలి తగ్గించే మాత్రలు: కొన్ని మాత్రలు మెదడును ప్రభావితం చేసి, ఆకలి కోరికను తగ్గిస్తాయి వీటిలో నాలుగు నుంచి 8 రకాల మాత్రలు అందుబాటులో ఉన్నాయి.

బరువు తగ్గించే ఇంజక్షన్లు

ఆకలి తగ్గించే ఇంజక్షన్: ఈ ఇంజక్షన్‌తో వాంతి వస్తున్న భావన నిరంతరం కొనసాగుతుంది. కాబట్టి తినాలనే కోరిక సన్నగిల్లుతుంది. దాంతో ఒకట్రెండు వారాల్లో పదార్థాల పట్ల వ్యామోహం తగ్గి, ఆకలి అదుపులోకొస్తుంది. ఈ ఇంజక్షన్ మధుమేహాలకు కూడా సహాయపడుతుంది.

సెమాగ్లూటైడ్: ఆకలి, అధిక బరువుతో పాటు మధుమేహాన్ని కూడా తగ్గించే ఇంజక్షన్ ఇది



ఆర్లిస్టాట్, సిబుట్రమైన్: ఈ ఇంజక్షన్లు శరీరంలోని కొవ్వును కరిగించి, విసర్జనతో శరీరం నుంచి తొలగిస్తాయి

ఈ ఇంజెక్షన్లు అందరికీ ఒకే ఫలితాన్ని అందించకపోవచ్చు. కొందర్లో కొన్ని దుష్ప్రభావాలు కూడా తలెత్తవచ్చు. కొందరికి కడుపు నొప్పి, విరోచనాలు, అజీర్తి, కడుపుబ్బరం వేధిస్తాయి.

ఇంజక్షన్లకూ నియమాలున్నాయి

అధిక బరువును తగ్గించుకోవడం కోసం మొదట మూడు నెలల పాటు ఆహార నియమాలు పాటిస్తూ, వ్యాయామాలు చేయాలి. అలాగే అధిక బరువుకు కారణమయ్యే థైరాయిడ్ సమస్యను మందులతో అదుపులో పెట్టుకోవాలి. వీటితో అనుకున్నంత ఫలితం కనిపించనప్పుడు మాత్రమే అంతిమ పరిష్కారంగా వైద్యులు బరువు తగ్గించే మాత్రలు, ఇంజక్షన్లను సూచిస్తారు. అయితే ఇవి వాడుకున్నంత కాలం ఆహార నియమాలు, వ్యాయామాలు తప్పక కొనసాగించాలి. వ్యాయామాలు మానేసి పూర్తిగా ఈ ఇంజక్షన్ల మీదే ఆధారపడితే, శరీరంలో ఆమ్లం పెరిగి, ఒంటి నొప్పులు, ఇన్‌ఫెక్షన్లు వేధిస్తాయి. బరువు తగ్గించే మాత్రలు, ఇంజక్షన్లు అందరికీ ఒకే రకమైన ఫలితాన్నివ్వవు. కాబట్టి రెండు నుంచి మూడు వారాల పాటు గమనిస్తూ, మాత్రలు, ఇంజక్షన్లలో, వాటి మోతాదుల్లో మార్పులు చేసుకుంటూ ఫలితాన్నీ, దుష్ప్రభావాలనూ గమనిస్తూ, వైద్యులు సరైన చికిత్సను ఎంచుకుంటూ ఉంటారు. ఇలాంటి చికిత్సను మూడు నెలల పాటు కొనసాగించి, అధిక బరువును వదిలించుకోవచ్చు. అయితే ఇలా తగ్గిన బరువు తిరిగి పెరగకుండా ఉంటుందని అనుకోకూడదు. తగ్గిన బరువును కొనసాగించాలంటే వైద్యులు సూచించే ఆహార నియమాలు, వ్యాయామాలు తప్పక కొనసాగించాలి.

డాక్టర్ శ్రీకృష్ణ ఆర్ బొడ్డు
కన్సల్టెంట్ జనరల్ ఫిజీషియన్,
కామినేని హాస్పిటల్స్,
ఎల్.బి నగర్, హైదరాబాద్.




మీకు తెలుసా?

మలబద్ధకం వదలాలంటే?

ఉదయాన్నే కాలకృత్యాలు తీరకపోతే రోజంతా ఇబ్బందిగానే ఉంటుంది. అయితే కొన్నిసార్లు మన ఆహారశైలి కారణంగా మలబద్ధకం తలెత్తి, తిరిగి రెండో రోజుకి సర్దుకుంటుంది. కానీ ఇదే ఇబ్బంది పదే పదే తలెత్తుతున్నా, రోజుల తరబడి వేధిస్తున్నా సుఖ విరేచనం జరిగేందుకు తోడ్పడే పదార్థాలను తీసుకోవాలి.

- **కలబంద:**
కలబందలో ఉండే 'ఆంథ్రాక్వినోన్స్' అనే కాంపౌండ్లు పెద్ద పేగుల్లో నీరు ఊరేలా చేసి, మ్యూకస్‌ను ఉత్పత్తి చేసి, పేగుల కదలికలను పెంచుతాయి. దాంతో తేలికగా విరేచనం జరిగి మలబద్ధకం వదులుతుంది. కాబట్టి అర కప్పు కలబంద గుజ్జు పరగడుపునే తీసుకుంటే ఫలితం ఉంటుంది.
- **సబ్జా:**
నీళ్లతో కలిస్తే సబ్జా జిగురులా తయారవుతుంది. ఆ తత్వం కారణంగా సబ్జా పేగుల్లో తేలికగా కదిలి మలబద్ధకాన్ని వదిలిస్తుంది. రాత్రంతా నీళ్లలో నానబెట్టిన సబ్జా విత్తనాలను పరగడుపునే తాగితే విరేచనం తేలికగా జరుగుతుంది.
- **అవిసెలు:**
వీటిలో పీచు పదార్థం ఎక్కువగా ఉంటుంది. మలబద్ధకం ఉన్నవారు వంటకాల్లో అవిసె గింజల పొడి కలుపుకుని తింటే, తగినంత పీచు శరీరానికి అందుతుంది. ఇది మలంతో కలిసి పేగుల్లో తేలికగా జారేందుకు సహాయపడుతుంది.



- **ఆకు కూరలు:**
ఆకు కూరల్లో ఉండే మెగ్నీషియమ్‌కు మలాన్ని మెత్తబరిచే గుణం ఉంటుంది. అంతేకాదు. పేగుల్లో నీరు ఊరేలా చేయగల శక్తి మెగ్నీషియమ్‌కు ఉంటుంది. ఈ గుణాల వల్ల ఆకు కూరలు తింటే విరేచనం తేలికగా జరుగుతుంది.
- **తాజా పళ్లు:**
కొందరికి తాజా పళ్లు సుఖ విరేచనానికి సహాయపడతాయి. ఆకలి తీరటంతోపాటు మలబద్ధకం తలెతకుండా ఉండాలంటే రోజుకి కనీసం 3 రకాల పళ్లు తినాలి. రాత్రి నిద్రకు ముందు మగ్గిన అరటి పండు తిన్నా ఉదయాన్నే సుఖ విరేచనం అవుతుంది.
- **కొబ్బరి నీళ్లు:**
వీటిలో ఉండే ఎలక్ట్రొలైట్లు మలబద్ధకానికి కారణమయ్యే డీహైడ్రేషన్‌ను తొలగించి, మూత్రనాళాన్ని శుభ్రం చేస్తాయి. ఫలితంగా మలబద్ధకం వదులుతుంది.

తెలుసుకుందాం

గుండె ఆరోగ్యం విషయంలో మనకెన్నో అనుమానాలుంటాయి. మరీ ముఖ్యంగా ఎలాంటి ఆహారం గుండెకు మేలు చేస్తుందో, ఏది కీడు చేస్తుందో తెలుసుకోవాలనే ఆసక్తి మనందర్లో ఉంటుంది. ఆ ఆహారమేదంటే..



గుండెకు రక్షణ ఇచ్చే ఆహారం

వీటితో గుండెకు చేటు

భోజనం తదనంతరం స్టార్చ్‌తో కూడిన చిరుతిళ్లు (బంగాళాదుంప, అరటికాయ చిప్స్) తినడం వల్ల, ఆయుర్దాయం తగ్గే అవకాశాలు 50% పెరుగుతాయనీ, గుండె జబ్బులు తలెత్తే అవకాశాలు 45% పెరుగుతాయనే ఓ అధ్యయనం అమెరికన్ హార్ట్ అసోసియేషన్ జర్నల్‌లో ప్రచురితమైంది. పళ్లు, కూరగాయలు, పాల ఉత్పత్తులు, పప్పుదినుసులతో కూడిన పోషకాహారాలను రోజులోని కొన్ని నిర్దిష్ట సమయాల్లో తినడం వల్ల ఆరోగ్యపరమైన అస్వస్థతలు దరి చేరకుండా ఉంటాయని ఈ అధ్యయనం చెబుతోంది.

ఏ ఆహారం? ఎప్పుడు?

ఉదయం, మధ్యాహ్నం, రాత్రి తీసుకునే ఆహారంలో పాలిష్ పట్టిన ధాన్యం, ఘనరూపంలోని కొవ్వులు, జున్ను, అదనపు చక్కెరలు, మాంసాలతో కూడి పాశ్చాత్య ఆహారపుటలవాట్లు కలిగిన వారు శ్వాసకోశ, గుండె సంబంధ రుగ్మతలతో చనిపోయే అవకాశాలు 44% ఎక్కువ. అలాకాకుండా మధ్యాహ్న భోజనంలో పళ్లు, కూరగాయలు, తృణధాన్యాలు, పెరుగు, నట్స్ తీసుకునేవారు ఇలాంటి గుండె సంబంధ రుగ్మతలతో చనిపోయే అవకాశాలు 34% తక్కువ. రాత్రి భోజనంలో కూరగాయలు, పప్పుదినుసులు తీసుకునేవారి విషయంలో హృద్రోగాలతో చనిపోయే అవకాశాలు 23% తక్కువ.

సమయమూ కీలకమే!

గుండె ఆరోగ్యం మెరుగ్గా ఉండాలంటే జీవ గడియారానికి అనుగుణంగా ఆహారం తీసుకోవాలి. ఇందుకోసం బ్రేక్‌ఫాస్ట్ తర్వాత పళ్లు తినాలి. మధ్యాహ్న భోజనంలో ప్రాసెస్‌డ్ ఫుడ్ మానేయాలి. మాంసం, అదనపు చక్కెరలు, పాలిష్ పట్టిన ధాన్యం తీసుకోకూడదు. బదులుగా పళ్లు, తృణధాన్యాలు తీసుకోవాలి.
సాయంత్రం స్నాక్స్‌గా గుప్పెడు వాల్‌నట్స్, లేదా ఓ కప్పు పెరుగు, తాజా బెర్రీలు తీసుకోవచ్చు. రాత్రి భోజనంలో వీలైనన్ని కూరగాయలు, పప్పు దినుసులు తీసుకోవాలి.



ఆర్థోపెడిక్ షూస్

పాదాలు పదిలంగా...

చెప్పులు అందంగా ఉంటే సరిపోదు, సౌకర్యంగా ఉండాలి. పాదాల్లోని లోపాలను భర్తీ చేయడంతో పాటు పొంచి ఉండే ప్రమాదాల నుంచి రక్షణ కల్పించాలి. మడమ శూల, కీళ్ల నొప్పులు, వంకరలు... ఇలా నడకను ఇబ్బంది పెట్టే సమస్యలకు తగిన చెప్పులెన్నో అందుబాటులో ఉంటున్నాయి. వాటి గురించి తెలుసుకుందాం!

మధుమేహులైతే...

కొత్తగా మధుమేహం బయల్పడి, దాన్ని అదుపులో ఉంచుకుంటున్నవాళ్లు సాధారణ చెప్పులు వేసుకోవచ్చు. కానీ పది నుంచి పదిహేనేళ్లకు పైగా మధుమేహంతో బాధపడుతున్నవాళ్ల నరాలు సున్నితంగా ఉంటాయి. దాంతో స్పర్శ తగ్గి, పాదాలు ఒరుసుకునే చోట అల్సర్లు ఏర్పడే ప్రమాదం ఉంటుంది. కాబట్టి ఈ కోవకు చెందినవాళ్లు, ఎమ్‌సిఆర్ (మైక్రో సెల్యులర్ రబ్బర్) చెప్పులు వేసుకోవాలి. లేదంటే మెత్తని చెప్పులు వేసుకోవాలి.

పాదాల్లో వైకల్యం ఉంటే...

పాదంలో పలు ఎముకలుంటాయి. వాటిలో దేన్లోనైనా పుట్టుకతోనే లోపం ఉండొచ్చు. లేదా పాదమే వంపు తిరిగి ఉండొచ్చు. అయితే ఎక్స్‌రేతో ఇలాంటి లోపాల తీవ్రతను, దశను కనిపెట్టే వైద్యులు, ఆ లోపానికి తగిన చెప్పులను సూచిస్తారు. వాటిని ఎవరికి వారు ప్రోస్థటిక్ షాపుల్లో స్వయంగా తయారు చేయించుకోవాలి. ఇందుకు వైద్యులు సహాయపడతారు. ఫలానా ప్రదేశం మీద ఒత్తిడి పడకూడదని వైద్యులు సూచించినప్పుడు, అందుకు తగిన చెప్పులను ప్రోస్థటిక్ నిపుణులు డిజైన్ చేసి అందిస్తారు. పాదంలోని పుట్టుక లోపాలు స్వల్పమైనవి అయితే, వాటిని ఇలాంటి 'ఆఫ్ లోడింగ్ స్లిప్పర్స్'తో, ఫిజియోథెరపీతో సరిదిద్దుకోవచ్చు. సమస్య మరింత క్లిష్టమైనదైతే సర్జరీ అవసరమవుతుంది. పాదాల్లో వైకల్యాలు భిన్నంగా ఉంటాయి కాబట్టి ఏ ఒక్కరి చెప్పులూ ఒకేలా ఉండవు. ఇవి రెడీమేడ్‌గా దొరకవు. పాదంలోని లోపం ఆధారంగా చెప్పులను డిజైన్ చేయించుకోవాలి.



సర్జరీ తదనంతరం

ఎముకలు విరిగినప్పుడు పాత రోజుల్లో పిండి కట్టు వేయించుకుని నెలల తరబడి ఇంటికే పరిమితమైపోయేవాళ్లం. కానీ ఇప్పుడు పిండికట్టు స్థానాన్ని పిఒపి కాస్ట్‌లు ఆక్రమించాయి. వీటిని వేయించుకుని, నడవడానికి వీలుండే 'ప్లాస్టర్ బూట్లు' అందుబాటులో ఉన్నాయి. అలాగే పాదానికి సర్జరీ చేసి, కోలుకున్న తర్వాత నడవడానికి ఉపయోగపడే చెప్పులు కూడా అందుబాటులోకొచ్చాయి. వాటిని 'వాకర్ బూట్' అంటారు. వీటితో పాదం మీద ఒత్తిడి పడదు. లోపల మెత్తని స్పాంజితో, పాదానికి చక్కని పట్టును, సంతులనాన్నీ అందించే ఈ బూట్లను వైద్యులు సూచించినంత కాలం వాడుకోవచ్చు.

మడమ శూల ఉంటే...

ఈ సమస్య తలెత్తినప్పుడు, మడమ మీద ఒత్తిడి పడే వీల్లేని 'సిలికాన్ హీల్' వాడుకోవాలి. బూట్లలో ఉండే సోల్‌ను తొలగించి, వాటి స్థానంలో సిలికాన్ హీల్స్‌ను అమర్చుకుని వాడుకోవాలి. చెప్పులు వేసుకునే అలవాటున్నవాళ్లు ఎమ్‌సిఆర్ చెప్పులు లేదా 'ఆర్థో హీల్' చెప్పులు వాడుకోవాలి. వీటిని బయటకు వెళ్లేటప్పుడే కాకుండా, ఇంట్లో కూడా వాడుకోవాలి. కాబట్టి రెండు జతల చెప్పులు కొని వాడుకోవాలి.



'ఇన్‌సోల్స్' ఎవరికంటే?

పోలియో ఉన్నవారికి ఒక వైపు కాలు కురచగా ఉండొచ్చు. పాతిక, ముప్పై ఏళ్ల క్రితం ప్రమాదాలకు గురై, కాలికి పిండి కట్టు వేయించుకుని అది విఫలమై, కాలి ఎముక పొడవులో హెచ్చుతగ్గులు చోటుచేసుకోవచ్చు. ఇలాంటి వారి కాళ్ల పొడవును సమం చేయడం కోసం వైద్యులు 'ఇన్‌సోల్స్' సూచిస్తారు. తేలికపాటి పోలియో సమస్య ఉన్నవారికి కూడా వైద్యులు ఇవే చెప్పులను సూచిస్తూ ఉంటారు.

చదును పాదాల కోసం...

పాదంలో వంపు లేకుండా చదునుగా ఉన్నప్పుడు, ఆ వంపును సృష్టించడం కోసం 'మీడియల్ ఆర్చ్ సపోర్టింగ్ సోల్స్'ను ఎంచుకోవాలి. పాదంలో వంపును సృష్టించే ఈ చెప్పులు వేసుకున్నప్పుడు చక్కని పట్టు దక్కి, మడమ శూల, పాదాల నొప్పులు వేధించకుండా ఉంటాయి.

వ్యాయామాలు చేసేటప్పుడు...

ఉడెన్ ఫ్లోరింగ్ ఉన్న చోట 'నాన్ స్లిప్ షూస్' ఎంచుకోవాలి. మైదానంలో, పార్కుల్లో, రోడ్డు మీద పరిగెత్తేవాళ్లు మెత్తగా, సౌకర్యంగా ఉండే బూట్లు వేసుకోవాలి. అలాగే ఈ బూట్ల సైజు ఎక్కువ, తక్కువ ఉండకూడదు. మడమ తేలికగా పైకీ, కిందకూ కదిలేలా ఉంటే సరిపోతుంది. అలాగని నడిచేటప్పుడు మడమ బూటులో నుంచి పూర్తిగా ఊడి రాకూడదు.

కీళ్ల నొప్పులుంటే...

కీళ్ల నొప్పులను అదుపు చేయడం కోసం కాలి కండరాలను బలపరుచుకోవాలి. అందుకోసం వైద్యులు ప్రతి రోజూ నడవమని సూచిస్తూ ఉంటారు. ఇలాంటి సందర్భాల్లో మెత్తని కుషన్ కలిగిన షూలు ఎంచుకోవాలి. చెప్పులు, చదునుగా ఉండే కాన్వాస్ బూట్లు లాంటివి వేసుకుని నడవకూడదు. నడక కోసం ఉద్దేశించిన స్పోర్ట్స్ షూస్ ఎంచుకోవాలి. రెట్టింపు సౌకర్యం కోసం సిలికాన్ ఇన్‌సోల్స్ కూడా వాడుకోవచ్చు.

డాక్టర్ ఆర్.ఎ. పూర్ణచంద్ర తేజస్వి
సీనియర్ ఆర్థోపెడిక్, జాయింట్ రీప్లేస్‌మెంట్ అండ్ స్పోర్ట్స్ మెడిసిన్ స్పెషలిస్ట్,
యశోద హాస్పిటల్స్, సికింద్రాబాద్



పరిశోధన

మళ్లీ మళ్లీ పెరిగే దంతాలు

పాల దంతాలు ఊడిపోయి, వాటి స్థానంలో శాశ్వత దంతాలొస్తాయి. ఈ రెండో దంతాలు ఊడిపోతే కట్టుడు దంతాలు మినహా మరే మార్గమూ ఉండదు. కానీ తాజాగా జపాన్ శాస్త్రవేత్తలు మూడోసారి దంతాలు పెరిగే ఒక ఔషధాన్ని సృష్టించే ప్రయత్నంలో ఉన్నారు. ఆసక్తికరమైన ఈ అంశం గురించి తెలుసుకుందాం!



రెండోసారి ఊడిపోయిన శాశ్వత దంతాల స్థానంలో, చిగుళ్ల నుంచి మూడో దంతాల సెట్ పెరగడం ఎలా ఉంటుందో ఒకసారి ఊహించండి. కిటానో ఆస్పత్రి మెడికల్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్‌కు చెందిన డాక్టర్ కట్సు టకహాషి నాయకత్వంలోని పరిశోధకుల బృందం, దంతాల పెరుగుదలకు అవరోధంగా మారుతున్న యుఎస్ఎజి-1 అనే జన్యు ప్రొటీన్‌ను అడ్డుకునే ఔషధాన్ని అభివృద్ధి చేసింది. ఎలుకల మీద చేపట్టిన ప్రయోగాల్లో, ఈ ప్రొటీన్‌ను అణచివేయడం ద్వారా, కొత్త దంతాల పెరుగుదల విజయవంతంగా ఊపందుకోవడాన్ని పరిశోధకులు కనిపెట్టారు. 2013 నాటికి ఈ చికిత్సను ప్రజలందరికీ అందుబాటులోకి తీసుకురావాలనే లక్ష్యంతో, మనుషుల మీద కూడా ఈ ప్రయోగాలను చేపట్టడానికి పరిశోధకులు సిద్ధపడుతున్నారు. ఈ ప్రయోగం విజయవంతమైతే, ఎన్నో కోట్ల మందికి మూడవ దంతాల సెట్ ప్రయోజనం దక్కుతుంది. దశాబ్దాల పునరుత్పాదక పరిశోధన ఆధారంగా నిర్మితమైన సైన్స్.. షార్కులు, ఏనుగుల మాదిరిగానే మనుషులు కూడా సహజసిద్ధంగా పెరిగే బహుళ దంతాల సెట్‌ను కలిగి ఉంటారని పరిశోధకులు నమ్ముతున్నారు. డెంటల్ పల్ప్, ఎముకల పునరుత్పాదకతలో కొనసాగుతున్న అభివృద్ధి ఆధారంగా.. జన్యుపరమైన కారణాల రీత్యా, ప్రమాదాల్లో, లేదా వార్థక్యంతో కోల్పోయిన దంతాలను తిరిగి మొలిపించుకునే వీలు కలుగుతుందని పరిశోధకులు అంటున్నారు.

అధ్యయనం

గ్రీన్ టీతో మెదడు చురుకుదనం

గ్రీన్ టీ ఆరోగ్యకరం అనే విషయం మనందరికీ తెలిసిందే! అయితే గ్రీన్ టీలోని సహజసిద్ధ మూలకాలు అల్జీమర్స్ నుంచి మెదడుకు రక్షణ కల్పిస్తాయనే ఒక అధ్యయనం తాజాగా వెలుగులోకొచ్చింది.



గ్రీన్ టీలోని నికోటినమైడ్, ఎపిగాలోక్టేకిన్ గాలేట్ అనే రెండు సహజసిద్ధ మూలకాలు మెదడులోని పాత కణాలు కొత్త వాటిలా చురుగ్గా పని చేసేందుకు దోహదపడతాయని క్యాలిఫోర్నియా విశ్వవిద్యాలయ పరిశోధకులు కనిపెట్టారు. ఈ రెండు మూలకాలు, నష్ట నివారణలో తోడ్పడే జిటిపి అనే కీలక శక్తి అణువులను పునరుద్ధరిస్తాయని వారు పేర్కొంటున్నారు. ఈ ప్రయోగాన్ని వయసు పైబడిన ఎలుకల మీద చేపట్టినప్పుడు, అల్జీమర్స్ వ్యాధితో ముడిపడి ఉన్న అమైలాయిడ్ బీటా అనే ప్రొటీన్ మోతాదు తగ్గడాన్ని పరిశోధకులు గుర్తించారు. సాధారణంగా మనుషులకు వయసు పైబడినప్పుడు, మెదడు కణాలు శక్తిని కోల్పోతూ ఉంటాయి. ఆ కణాలను గ్రీన్ టీలోని రెండు సహజసిద్ధ మూలకాలతో చికిత్స చేసినప్పుడు, కేవలం 24 గంటల్లోనే, శక్తిమోతాదులు పెరిగి, మెదడులో 'ఆటోఫజీ' ఊపందుకుంటోంది. ఈ చికిత్స ఆక్సిడేటివ్ స్ట్రెస్‌ను కూడా తగ్గిస్తుంది. గతంలో అల్జీమర్స్ పరిశోధనల్లో, మెదడు కణాలను ఆరోగ్యంగా ఉంచడంలో జిటిపి పాత్రకున్న ప్రాధాన్యాన్ని పరిశోధకులు పెద్దగా పట్టించుకోలేదు. తాజా అధ్యయనంలో వాటిని బలపరుచుకునే మార్గం తెలిసింది కాబట్టి గ్రీన్ టీతో మెదడు కణాలను ఆరోగ్యంగా ఉంచుకోవడం ద్వారా అల్జీమర్స్‌కు అడ్డుకట్ట వేయగలిగే మార్గం సుగమం అయింది.

నేటి నుంచి 'ప్రిజన్ డ్యూటీ మీట్'

» 3 రోజులపాటు 36 విభాగాల్లో క్రీడా పోటీలు

హైదరాబాద్, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన జైళ్ల శాఖ సిబ్బంది తమ క్రీడా నైపుణ్యాలను ప్రదర్శించేందుకు తెలంగాణ సిద్ధమైంది. మూడు రోజుల పాటు జరగనున్న 7వ ఆల్ ఇండియా ప్రిజన్ డ్యూటీ మీట్-2025 మంగళవారం తెలంగాణ రాష్ట్ర పోలీస్ అకాడమీలో ప్రారంభం కానుంది. గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ఈ కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంభించనున్నారు. ఈ క్రీడా సంబరంలో 21 రాష్ట్రాలు, 3 కేంద్రపాలిత ప్రాంతాల నుంచి మొత్తం 1300 మంది క్రీడాకారులు పాల్గొంటున్నారు. వీరిలో 184 మంది మహిళా క్రీడాకారులు కూడా ఉన్నారు. వీరంతా 36విభాగాల్లో తమ ప్రతిభను ప్రదర్శించనున్నారు. ఈ పోటీలకు ఇప్పటికే హైదరాబాద్ చేరుకున్న క్రీడాకారులకు తెలంగాణ జైళ్ల శాఖ డీజీ సౌమ్యా మిశ్రా స్పోర్ట్స్ కిట్‌లతో పాటు చెక్కతో చేయించిన చార్మినార్ ప్రతిమలను అందజేశారు. ఈ క్రీడా పోటీలు బ్యూరో ఆఫ్ పోలీస్ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ ఆధ్వర్యంలో జరుగుతున్నాయి. దీనికి సంబంధించిన అధికారిక పతాకాన్ని బీపీఆర్‌డీ అసిస్టెంట్ డైరెక్టర్ కేకే మీనా నుంచి సౌమ్యా మిశ్రా సోమవారం అందుకున్నారు.

సోషల్ మీడియాలో..
మరొకరితో సన్నిహితంగా ఉన్న ఫొటోలు ప్రత్యక్షం

» పాత మిత్రుడిపై పోలీసులకు నటి ఫిర్యాదు

పంజాగుట్ట, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): మరొకరితో సన్నిహితంగా ఉన్న తన చిత్రాలు, వీడియోలను సోషల్ మీడియాలో చూసి ఓ నటి కంగుతిన్నది. వెంటనే పోలీసులను ఆశ్రయించి అనుమానితుడిపై ఫిర్యాదు చేసింది. ఏపీకి చెందిన నటి బేగంపేటలో ఉంటున్నారు. గతంలో ఆమె చెరుకూరి రాధాకృష్ణ అనే వ్యక్తితో సన్నిహితంగా మెలిగింది. ఈ క్రమంలో అతడు ఆమె ఫొటోలు, వీడియోలు తీశాడు. ఆ తర్వాత అతడి నుంచి వేధింపులు ఎదురుకావడంతో ఆమె ఆ వ్యక్తిని దూరం పెట్టింది. దీంతో ఆమె ఫొటోలు, వీడియోలు సామాజిక మాధ్యమాల్లో పోస్టు చేస్తానని అతడు బ్లాక్ మెయిల్ చేశాడు. అతడి స్నేహితులు కూడా ఆమెను వేధించారు. కాగా, మరొకరితో ఆమె సన్నిహితంగా ఉన్న ఫొటోలు, వీడియోలు ఈ నెల 1న సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్‌లలో కనిపించాయి. దీంతో ఆమె 2న రాధాకృష్ణపై అనుమానం వ్యక్తం చేస్తూ పంజాగుట్ట పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు రాధాకృష్ణను పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది.

కాంగ్రెస్ నేత లైంగికంగా వేధిస్తున్నాడు

» అతడితో పాటు తహసీల్దార్‌పై చర్యలు తీసుకోండి

» ఆఫీసులో పురుగుల మందు తాగిన ఉద్యోగిని

నల్లబెల్లి, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): అధికార పార్టీ నాయకుడు లైంగికంగా వేధిస్తున్నాడంటూ ప్రభుత్వ ఉద్యోగిని ఆత్మహత్యాయత్నం చేసింది. అతడితో పాటు తన పై అధికారి అయిన తహసీల్దార్‌పై చర్యలు తీసుకోవాలని.. ఆఫీసులోనే పురుగుల మందు తాగింది. వరంగల్ జిల్లా నల్లబెల్లి మండల తహసీల్దార్ కార్యాలయంలో పనిచేస్తున్న జూనియర్ అసిస్టెంట్ వాంకుడోతు కల్పన సోమవారం ఈ దారుణానికి పాల్పడింది. గమనించిన సిబ్బంది వెంటనే ఆమెను తహసీల్దార్ కారులో నర్సంపేటలోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. సూసైడ్ నోట్ రాసిన బాధితురాలు.. సోషల్ మీడియాలో దాన్ని పోస్ట్ చేసింది. బిల్‌నాయక్ తండాకు చెందిన కాంగ్రెస్ నాయకుడు మాలోతు చరణ్‌సింగ్ తనను లైంగికంగా వేధిస్తున్నాడని ఆమె ఆరోపించింది. అలాగే తన పనితీరు సరిగా లేదని, శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌కు ఫిర్యాదు చేశాడని వెల్లడించింది. దీనిపై తహసీల్దార్ ముప్పు కృష్ణను సోమవారం కార్యాలయంలో సంప్రదించగా.. చరణ్‌సింగ్‌తో మాట్లాడుకోవాలని సలహా ఇచ్చారని తెలిపింది. దీంతో దిక్కుతోచని స్థితిలో కార్యాలయంలోనే పురుగుల మందు తాగానని పేర్కొంది. దీనిపై విచారణ జరిపి చరణ్‌సింగ్, తహసీల్దార్‌పై చర్యలు తీసుకోవాలని విన్నవించింది.

మరిన్ని కంపెనీల కార్ల ధరలూ తగ్గాయ్..!

» ధరల తగ్గింపును ప్రకటించిన లెక్సస్, కియా, ఆడి, స్కోడా

న్యూఢిల్లీ, సెప్టెంబరు 8: ఆటోమొబైల్స్‌పై జీఎస్టీ రేటును ప్రభుత్వం తగ్గించిన నేపథ్యంలో ఆ మేరకు ప్రయోజనాన్ని కస్టమర్లకు అందించేందుకు మరికొన్ని కార్ల కంపెనీలు ధరలను తగ్గించాయి. ఇప్పటికే టాటా మోటార్స్, మహీంద్రా అండ్ మహీంద్రా, రెనో, టయోటా, హ్యూండయ్ తమ కార్ల ధరలను తగ్గిస్తున్నట్టు ప్రకటించాయి. తాజాగా మరిన్ని కంపెనీలు ఈ జాబితాలో చేరాయి.

- లగ్జరీ కార్ల కంపెనీ లెక్సస్ ఇండియా తన మొత్తం కార్ల శ్రేణి ధరలను రూ.20.8 లక్షల వరకు తగ్గిస్తున్నట్టు సోమవారం ప్రకటించింది. ధరలు ఈ నెల 22 నుంచి అమల్లోకి వస్తాయని పేర్కొంది. తగ్గించిన ధరల శ్రేణి రూ.1.47లక్షల (సెడాన్ ఈఎస్ 300హెచ్‌పై) నుంచి రూ.20.8లక్షల వరకు (ఎస్‌యూవీ ఎల్ఎక్స్ 500డీపై) ఉంది.
- కియా ఇండియా తన వాహనాల ధరలను రూ.4.48 లక్షల వరకు తగ్గిస్తున్నట్టు సోమవారం వెల్లడించింది. ధరల తగ్గింపు రూ.48,513 (కారెన్స్‌పై) నుంచి రూ.4,48,542 (కార్నివాల్) మధ్య ఉంది. ఈ నెల 22 నుంచి తగ్గించిన ధరలు అమల్లోకి వస్తాయని కంపెనీ పేర్కొంది.
- జేఎస్‌డబ్ల్యూ ఎంజీ మోటార్ ఇండియా తన మోడల్ ధరలను రూ.54,000 నుంచి రూ.3.04 లక్షల వరకు తగ్గించింది. ఈ ధరలు ఈనెల 7వ తేదీ నుంచే అమల్లోకి వచ్చినట్టు తెలిపింది.
- నిస్సాన్ మోటార్ తన కాంపాక్ట్ ఎస్‌యూవీ మ్యాగ్నైట్ ధరలను రూ.లక్ష వరకు తగ్గించింది. సవరించిన ధరలు ఈ నెల 22న లేదా తర్వాత చేసే అన్ని డెలివరీలకు వర్తిస్తాయని పేర్కొంది. కొత్త ధరలతో తక్షణమే కస్టమర్లు బుకింగ్ చేసుకోవచ్చని తెలిపింది.
- ఆడి ఇండియా తన వాహనాల ధరలను రూ.2.6 లక్షల నుంచి రూ.7.8 లక్షలకు పైగా తగ్గించినట్టు వెల్లడించింది. కొత్త ధరల ప్రకారం.. కంపెనీ ఎంట్రీ ఎస్‌యూవీ క్యూ3 ధర రూ.43.07 లక్షల నుంచి ప్రారంభమౌతుంది. ఇంతకు ముందు దీని ధర రూ.46.14 లక్షలు ఉండేది. అలాగే టాప్ టాప్ ఎండ్ ఎస్‌యూవీ క్యూ8 ప్రారంభ ధర ఇంతకు ముందు రూ.1.18 కోట్లు ఉండగా.. ఇప్పుడు రూ.1.1 కోట్ల నుంచి ప్రారంభమవుతుంది. ఎస్‌యూవీ మోడళ్లయిన క్యూ5, క్యూ7, సెడాన్ మోడళ్లయిన ఏ4, ఏ6 ధరలను కూడా కంపెనీ తగ్గించింది.
- స్కోడా ఇండియా తన కార్ల ధరలను రూ.3.3 లక్షల వరకు తగ్గిస్తున్నట్టు పేర్కొంది. ఈ నెల 21కన్నా ముందు బుకింగ్ చేసుకునే వారికి రూ.2.5 లక్షల వరకు డిస్కౌంట్లతో కంపెనీ అదనంగా ప్రత్యేక పండగ ఆఫర్‌ను కూడా ప్రకటించింది. ప్రస్తుతం స్కోడా కొడియాక్ ధరలు రూ.46.89 లక్షల (ఎక్స్‌షోరూమ్) నుంచి ప్రారంభమవుతున్నాయి. దీని ధర రూ.3.3 లక్షల వరకు తగ్గనుంది. స్కోడా కుశాక్ ప్రస్తుత ధర రూ.10.99 లక్షలుండగా.. రూ.66 వేల వరకు తగ్గనుంది. దీనిపై పరిమిత కాల డిస్కౌంట్ ఆఫర్ ఈ నెల 21 దాకా రూ.2.5 లక్ష వరకు ఉంటుంది. స్కోడా స్లావియా రూ.10.49 లక్షల నుంచి ప్రారంభమవుతుండగా.. దీని ధర రూ.63వేల వరకు తగ్గనుంది. డిస్కౌంట్ ఆఫర్ రూ.1.2 లక్షల వరకు ఉంది.

ఆధార్ ఆధారమే!

» అది చూపిస్తే ఓటర్ కార్డు ఇవ్వాల్సిందే

» ఓటర్ నమోదుకు 12వ పత్రంగా అంగీకరించండి

» ఈసీకి సుప్రీంకోర్టు ఆదేశం

» ఆధార్ పౌరసత్వ గుర్తింపు కాదని స్పష్టీకరణ



న్యూఢిల్లీ, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఆధార్ పౌరసత్వాన్ని ధ్రువీకరించే కార్డు కాదని, అయితే బిహార్‌లో ఓటర్‌గా పరిగణించేందుకు దాన్ని కూడా పరిగణనలోకి తీసుకోవాల్సిందేనని సుప్రీంకోర్టు ఎన్నికల కమిషన్‌ను ఆదేశించింది. ఎన్నికల కమిషన్ పరిగణనలోకి తీసుకునే 11 డాక్యుమెంట్లకు అదనంగా 12వ డాక్యుమెంట్‌గా ఆధార్ కార్డును చేర్చాలని స్పష్టం చేసింది. సుప్రీంకోర్టు ఎన్నిసార్లు ఆదేశాలు జారీ చేసినా ఆధార్‌ను ఈసీ అధికారులు ఆమోదించడం లేదని ఆర్జేడీ, ఎంఐఎం ఇతర పార్టీలు పిటిషన్ దాఖలు చేయడంతో సుప్రీం ఈ ఆదేశాలు జారీ చేసింది. ఓటర్‌గా గుర్తించేందుకు ఆధార్‌ను కూడా గుర్తింపు కార్డుగా సమర్పించడాన్ని ఆమోదించాలని సుప్రీం న్యాయమూర్తులు జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మల్యా బాగ్చీ సోమవారం మధ్యంతర ఉత్తర్వులు జారీ చేశారు. కింది స్థాయిలో అధికారులంతా ఆధార్‌ను ఓటర్ల జాబితాలో చేర్చేందుకు ఆమోదించాలని ఆదేశాలు జారీ చేయాలని, తమ వెబ్‌సైట్‌లలో ఈ విషయం స్పష్టం చేయాలని న్యాయమూర్తులు ఆదేశించారు. అదే సమయంలో ఆధార్‌తో పాటు ఓటర్ సమర్పించిన డాక్యుమెంట్లు ఏవైనా సరైనవా కాదా తనిఖీ చేసే అధికారం ఈసీకి ఉన్నదని కోర్టు స్పష్టం చేసింది ఆధార్ పౌరసత్వాన్ని ధ్రువీకరించే కార్డు కాదని ఆధార్ చట్టంలోనే ఉందని, ప్రజాప్రాతినిధ్య చట్టంలోని సెక్షన్ 23(4) ప్రకారం మనిషిని గుర్తించేందుకు అది ఉపయోగపడుతుందని తెలిపింది. ఆధార్ కార్డును కూడా ఓటర్ల జాబితాలో చేర్చేందుకు ఆధారంగా పరిగణనలోకి తీసుకుంటామని ఎన్నికల కమిషన్ ఇచ్చిన హామీ పత్రాన్ని సుప్రీంకోర్టు ఆమోదించింది.

ఆధార్ ఓకే అంటే షోకాజ్ ఇచ్చారు

ఆధార్‌ను కూడా పరిగణనలోకి తీసుకోవాలని సుప్రీంకోర్టు మూడుసార్లు ఆదేశాలు జారీ చేసినప్పటికీ నియోజకవర్గ స్థాయి ఓటర్ల నమోదు అధికారులు(ఈఆర్‌వో), బూత్ స్థాయి అధికారులు ఆమోదించడం లేదని, బూత్ స్థాయి అధికారి ఆధార్‌ను అంగీకరించినందుకు ఆయనకు షోకాజ్ నోటీసులు జారీ చేశారని ఆర్జేడీ న్యాయవాది కపిల్ సిబల్ సుప్రీంకోర్టు దృష్టికి తీసుకువచ్చారు. ఆధార్ కార్డును ఆమోదించాల్సిందిగా ఇంతవరకూ ఈసీ తమ కింది స్థాయి అధికారులకు ఆదేశాలు జారీ చేయలేదని ప్రస్తావించారు. ఎన్నికల కమిషన్ తరఫు న్యాయవాది రాకేశ్ ద్వివేదీ వాదిస్తూ ఆధార్‌ను పౌరసత్వానికి రుజువుగా భావించలేమని చెప్పారు. కపిల్ సిబల్ స్పందిస్తూ, పౌరసత్వాన్ని గుర్తించే బాధ్యత ఈసీది కాదని అన్నారు. ఒక వ్యక్తి పౌరుడా కాదా అన్న విషయం నిర్ణయించే అధికారం ఈసీకి ఉన్నదని, ఈ విషయం స్పష్టం చేయాలని రాకేశ్ ద్వివేదీ సుప్రీంకోర్టును కోరారు. అయితే, ఈసీ కోరిన 11 డాక్యుమెంట్లలో పాస్‌పోర్టు, పుట్టినతేదీ సర్టిఫికెట్ తప్ప మిగతా వేవీ పౌరసత్వాన్ని ధ్రువీకరించవని న్యాయమూర్తి బాగ్చీ ఎత్తి చూపారు. వాదోపవాదాల తర్వాత చివరకు రేషన్ కార్డు, ఫోటో గుర్తింపు కార్డుతో పాటు ఆధార్‌ను 12వ డాక్యుమెంట్‌గా చేర్చి ఓటర్‌గా నమోదు చేసుకునేందుకు రుజువుగా స్వీకరించాలని సుప్రీంకోర్టు ఆదేశాలు జారీ చేసింది. కావాలంటే ఆధార్ కార్డు సరైనదో కాదో తనిఖీ చేసుకోవచ్చని తెలిపింది.

ప్రాణహిత-చేవెళ్ల డీపీఆర్ సవరించండి

» తుమ్మిడిహెట్టి బ్యారేజీ నిర్మాణానికి కట్టుబడి ఉన్నాం

» మేడిగడ్డ పునరుద్ధరణ డిజైనర్‌గా ఐఐటీ రూర్కీ వద్దు

» సమ్మక్క సాగర్ పనుల వేగం పెంచండి: మంత్రి ఉత్తమ్




హైదరాబాద్, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టులో భాగంగా తుమ్మిడిహెట్టి బ్యారేజీ నిర్మాణానికి కట్టుబడి ఉన్నామని, ఇందుకోసం తక్షణమే సవరణ డీపీఆర్‌ను సిద్ధం చేసి, అనుమతుల కోసం దాఖలు చేయాలని అధికారులను మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఆదేశించారు. జలసౌధలో సోమవారం ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి రెండేళ్లు పూర్తికానున్న నేపథ్యంలో డిసెంబరు నాటికల్లా పనులను వేగిరం చేయాలన్నారు. ఎన్నికల మ్యానిఫెస్టోలో ఇచ్చిన మాట ప్రకారం ఉమ్మడి రాష్ట్రంలో ప్రారంభించిన ప్రాణహిత-చేవెళ్లను ఎట్టి పరిస్థితుల్లోనూ పూర్తి చేయాలన్నారు. సీతారామ ఎత్తిపోతల పథకం, చనకా కొరాటా, చిన్న కాళేశ్వరం(ముక్తేశ్వర్), మొడికుంటవాగు ప్రాజెక్టులకు టెక్నికల్ అడ్వయిజరీ కమిటీ(టీఏసీ) అనుమతులు లభించిన నేపథ్యంలో ప్రధానమంత్రి కృషి సించాయ్ యోజన(పీఎంకేఎస్‌వై-ఏఐబీపీ) కింద సాయం కోసం అభ్యర్థించాలని ఆదేశించారు. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల పునరుద్ధరణ డిజైన్లు, పరీక్షలు ఎక్కడి దాకా వచ్చాయని సెంట్రల్ డిజైన్ ఆర్గనైజేషన్(సీడీవో) చీఫ్ ఇంజనీర్(సీఈ)ను మంత్రి ప్రశ్నించారు. కొత్త బ్యారేజీల డిజైన్లు/డ్రాయింగ్‌లు సిద్ధం చేయడానికి ఐఎస్(భారతీయ ప్రమాణాల)కోడ్‌లు ఉన్నాయి కానీ.. బ్యారేజీలు కుంగినప్పుడు పునరుద్ధరణకు ఏం చేయాలన్న దానిపై కోడ్‌లు లేకపోవడంతో డిజైన్లు తయారు చేయలేకపోతున్నామని ఆయన పేర్కొన్నారు. దీంతో ఉత్తమ్ ఆగ్రహం వ్యక్తం చేస్తూ.. బ్యారేజీల పునరుద్ధరణ డిజైన్ల తయారీ బాధ్యత నుంచి తప్పించుకోలేరని స్పష్టంచేశారు. అలాగే, బ్యారేజీల పునరుద్ధరణ డిజైనర్‌గా ఐఐటీ రూర్కీని నియమించాలన్న ప్రతిపాదన రాగా.. బ్యారేజీలు నిర్మించిన సమయంలో కన్సల్టెంట్‌గా ఐఐటీ రూర్కీ ఉందని, ఇప్పుడు ఆ సంస్థ సేవలు అక్కర్లేదని మంత్రి తేల్చిచెప్పారు. దీనికి బదులుగా ఐఐటీ మద్రాసు వంటి పురాతన విద్యాసంస్థల సేవలు తీసుకోవాలని, వారిచ్చే డిజైన్లకు చట్టబద్ధత కల్పించాల్సింది సీడీవో సీఈనేనని తేల్చిచెప్పారు. పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకంలో భాగంగా ఉద్దండపూర్ వద్ద భూసేకరణ సమస్యలు ఉన్నాయని అధికారులు పేర్కొనగా... త్వరితగతిన పూర్తి చేయాలని మంత్రి సూచించారు. కొడంగల్-నారాయణపేట, డిండి ఎత్తిపోతల పథకం, పెండ్లిపాకల, నక్కలగండి రిజర్వాయర్ల పనుల కోసం సత్వరమే భూసేకరణ చేపట్టాలన్నారు. ఎన్‌డీఎస్‌ఏ నివేదిక ప్రకారం జూరాల ప్రాజెక్టు కట్టపై వాహనాల రాకపోకల నియంత్రణకు దిగువన ప్రత్యామ్నాయంగా బ్యారేజీ కమ్ బ్రిడ్జి నిర్మాణానికి ప్రతిపాదనలు ఇవ్వాలని సూచించారు. వచ్చే మంత్రివర్గ సమావేశం నాటికి దేవాదుల ఎత్తిపోతల పథకం ప్యాకేజీ-3, 6కింద పనుల పురోగతిపై నివేదిక సమర్పించాలని అధికారులను ఆదేశించారు.ఎస్ఎల్‌బీసీ టన్నెల్ పనుల పునరుద్ధరణలో భాగంగా హెలిబోర్న్ సర్వేకు రెండు హెలికాప్టర్లు సిద్ధంగా ఉన్నాయని, తక్షణమే ఏరియల్ మ్యాగ్నటిక్ సర్వే చేపట్టాలని సూచించారు.

సమ్మక్కసాగర్‌కు ఎన్వోసీ కోసం ఛత్తీస్‌గఢ్‌కు

సమ్మక్కసాగర్ ప్రాజెక్టు (తుపాకులగూడెం బ్యారేజీ)కు నిరభ్యంతర పత్రం (ఎన్వోసీ) కోసం మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి రంగంలోకి దిగారు. బుధవారం ఆయన ఛత్తీస్‌గఢ్ వెళ్లనున్నారు. ఆ రాష్ట్ర సీఎం విష్ణుదేవ్ సాయిని నేరుగా కలిసి ఎన్వోసీ జారీ చేయాలని మంత్రి కోరనున్నారు. ఈనెల 23న సీడబ్ల్యూసీ ఈ ప్రాజెక్టుపై సమావేశం నిర్వహించనుంది. ఈలోగా ఛత్తీస్‌గఢ్ నుంచి ఎన్వోసీ వస్తే ప్రాజెక్టు గట్టెక్కే అవకాశాలుండటంతో మంత్రి ఉత్తమ్ రంగంలోకి దిగారు.

చిత్రజ్యోతి
★ SINCE 1965 ★

మొదట రచన.. ఇప్పుడు గానం!



రామ్ పోతినేని హీరోగా నటిస్తున్న తాజా చిత్రం 'ఆంధ్రా కింగ్ తాలూకా'. మహేశ్‌బాబు పి. దర్శకత్వంలో మైత్రీ మూవీ మేకర్స్ సంస్థ నిర్మిస్తోంది. ఈ సినిమాలో ఫస్ట్ సింగిల్ 'నువ్వుంటే చాలే' ను హీరో రామ్ రాయడం విశేషం. ఈ పాట అందరినీ ఆకట్టుకుంటోంది. ఇప్పుడు సెకండ్ సింగిల్ 'పప్పీ షేమ్'ను విడుదల చేశారు. ఈ పాటను హీరో రామ్ పాడడం విశేషం. వివేక్, మెర్విన్ స్వరపరిచారు. గీత రచయిత భాస్కరభట్ల తన రచనలో వినోదాన్ని, అభిమానుల జ్ఞాపకాలను అద్భుతంగా పొందుపరిచారు. తొలిసారిగా రామ్ పాడిన ఈ పాట ఇప్పుడు యూత్‌లో హల్‌చల్ చేస్తోంది. రామ్, ఇలా ఒకే సినిమాతో గీత రచయితగా, గాయకుడిగా తన ప్రతిభను ప్రదర్శించడం విశేషం. భాగ్యశ్రీ బోర్సే హీరోయిన్‌గా నటిస్తున్న ఈ చిత్రంలో కన్నడ స్టార్ ఉపేంద్ర కీలక పాత్ర పోషిస్తున్నారు. రావు రమేశ్, మురళీశర్మ, సత్య, రాహుల్ రామకృష్ణ, వీటీవీ గణేశ్ ఇతర ముఖ్య పాత్రలను పోషిస్తున్నారు. ప్రస్తుతం చివరి దశ షూటింగ్ జరుపుకొంటున్న ఈ చిత్రం నవంబర్ 28న విడుదల కానుంది. నవీన్ యర్నేని, వై.రవిశంకర్ నిర్మాతలు.

ఘనవిజయం సాధించాలి

దామోదర ప్రసాద్



సన్నీ కునాల్, దేవిక సాహా, ఆశ ప్రధాన పాత్రధారులుగా తెరకెక్కుతున్న చిత్రం 'రోహిణి'. సంగ కుమార్ దర్శకత్వంలో కుశాల్ రాజు నిర్మిస్తున్నారు. తాజాగా ఈ సినిమా ఆడియో వేడుకను నిర్వహించారు. ఫిల్మ్ ఛాంబర్ కార్యదర్శి దామోదర ప్రసాద్, నిర్మాత చదలవాడ శ్రీనివాస రావు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా దామోదర ప్రసాద్ మాట్లాడుతూ 'చిత్రం ఘనవిజయం సాధించాలి' అని కోరారు. 'మంచి కంటెంట్‌తో వస్తోన్న సినిమా ఇది' అని చదలవాడ శ్రీనివాస రావు చెప్పారు. 'ఈ చిత్రం అందరినీ ఆకట్టుకుంటుంది' అని సంగ కుమార్ తెలిపారు.







సీనియర్ నిర్మాత అల్లు అరవింద్ తల్లి కనకరత్నమ్మ దశదిన కర్మ సోమవారం హైదరాబాద్‌లో జరిగింది. ఈ కార్యక్రమానికి ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్, మెగాస్టార్ చిరంజీవి, రామ్‌చరణ్ తదితరులు హాజరయ్యారు. కనకరత్నమ్మ చిత్రపటానికి నివాళులు అర్పించి ఆవిడతో తమకున్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు.



ముంబై పర్యటనలో భాగంగా సోమవారం బసవతారకం ఆస్పత్రి ప్రతినిధులతో నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్‌ను సందర్శించారు నందమూరి బాలకృష్ణ. ఈ సందర్భంగా అక్కడి అధికారులు ఆయనకు స్టాక్ ఎక్స్ఛేంజ్ బెల్‌ను మోగించే అవకాశం ఇచ్చారు. ఈ ఘనత సాధించిన తొలి దక్షిణాది హీరో ఆయనే కావడం గమనార్హం.

హారర్ సినిమాలంటే ఇష్టం

కౌశిక్



'నాకు హారర్ సినిమాలంటే ఇష్టం. ఈ తరహా చిత్రాలకు ప్రత్యేక అభిమానులు ఉంటారు. వారికోసం ఒక కథ చేయాలని ఎప్పటినుంచో ఉండేది. అది ఇప్పుడు నెరవేరింది. ఒక వైపు ఉత్కంఠ.. మరో వైపు భయం.. ఈ రెండింటి సమ్మేళనమే 'కిష్కింధపురి' సినిమా అని అన్నారు దర్శకుడు కౌశిక్ పెగల్లపాటి. బెల్లంకొండ సాయి శ్రీనివాస్, అనుపమ పరమేశ్వరన్ ప్రధాన పాత్రధారులుగా ఆయన తెరకెక్కించిన చిత్రం 'కిష్కింధపురి'. షైన్ స్క్రీన్స్ బేనర్‌పై సాహు గారపాటి నిర్మించారు. సినిమా ఈనెల 12న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సందర్భంగా కౌశిక్ మీడియాతో చిత్ర విశేషాలు పంచుకున్నారు.

- నా తొలి చిత్రం 'చావు కబురు చల్లగా' తర్వాత గీతా ఆర్ట్స్‌లోనే మరో సినిమా చేయాలి. కొన్ని కారణాల వల్ల జాప్యం జరిగింది. ఒక సందర్భంలో నిర్మాత సాహు గారపాటికి ఈ కథ చెప్పాను. తర్వాత బెల్లంకొండ శ్రీనివాస్ విన్నారు. అలా ఈ ప్రాజెక్టు పట్టాలెక్కింది.
- ప్రేక్షకులకు ఒక ప్రత్యేక తరహా అనుభూతిని ఇవ్వాలనే ఉద్దేశంతోనే ఈ సినిమా తీశాం. ఇందులో ఓ ముఖ్యమైన విషయాన్ని చెప్పబోతున్నాను.
- కిష్కింధపురి అంటే మనకు రామాయణం గుర్తొస్తుంది. ఈ కథకి స్ఫూర్తి రామాయణమే. అయితే ఆ స్ఫూర్తి చాలా ఆసక్తికరంగా ఉంటుంది.


అద్భుత దృశ్య కావ్యం

విశ్వప్రసాద్



తేజ సజ్జా కథానాయకుడిగా కార్తీక్ ఘట్టమనేని దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'మిరాయ్'. మంచు మనోజ్, శ్రియా శరణ్, రితికా నాయక్ కీలక పాత్రలు పోషించారు. టీజీ విశ్వప్రసాద్ నిర్మించారు. ఈనెల 12న సినిమా విడుదలవుతోన్న సందర్భంగా మేకర్స్ వైజాగ్‌లో ప్రీరిలీజ్ వేడుకను నిర్వహించారు. ఈ సందర్భంగా తేజ సజ్జా మాట్లాడుతూ 'మిరాయ్' ఒక యాక్షన్ ఫ్యాంటసీ అడ్వెంచర్. మీ కోసం సరికొత్త ప్రపంచాన్ని సృష్టించాం. థియేటర్లలోనే చూడాల్సిన చిత్రమిది. సినిమాలోని విజువల్స్‌కి, సంగీతానికి గూస్‌బంప్స్ పక్కా' అని తెలిపారు. 'ఇది నాకు కమ్‌బ్యాక్ చిత్రం. ఈ సినిమాతో మనోజ్ 2.0ని చూస్తారు' అని మంచు మనోజ్ చెప్పారు. 'ఈ సినిమా ఒక అద్భుత దృశ్య కావ్యం. తప్పకుండా పాన్ వరల్డ్ ఫ్రాంచైజీ అవుతుందనే నమ్మకం ఉంది' అని టీజీ విశ్వప్రసాద్ తెలిపారు.

క్షణక్షణం ఉత్కంఠభరితం



రాగ్‌మయూర్, మెరిన్ ఫిలిప్ జంటగా 'డీజే టిల్లు' ఫేమ్ విమల్‌కృష్ణ ఓ చిత్రం తెరకెక్కిస్తున్నారు. రాజీవ్ చిలక, రాజేశ్ జగ్తియాని, హిరాచంద్ దండ్, నవీన్‌చంద్ర నిర్మిస్తున్నారు. ప్రిన్స్ సెసిల్, అనన్నయ్య, చరిత్ర్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. సోమవారం ఈ చిత్రాన్ని ప్రారంభించారు మేకర్స్. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 'ఈ సినిమా క్షణక్షణం ఉత్కంఠభరితంగా ఉంటుంది' అని తెలిపారు. ఈ చిత్రానికి ఎడిటర్: అబినవ్ కూనపరెడ్డి, సంగీతం: శ్రీచరణ్ పాకాల.

ప్రభావవంతమైన 'భద్రకాళి'
- తృప్తి రవీంద్ర, రియా జిత్తు



'ఇది ఒక ప్రభావవంతమైన కథ. నేటి సమాజానికి ఇలాంటి కథ చాలా అవసరం. అందరికీ కనెక్ట్ అవుతుంది. అందరినీ ఆలోచింపజేస్తుంది' అని అన్నారు కథానాయికలు తృప్తి రవీంద్ర, రియా జిత్తు. విజయ్ ఆంటోని హీరోగా అరుణ్ ప్రభు తెరకెక్కించిన చిత్రం 'భద్రకాళి'. విజయ్ ఆంటోని ఫిల్మ్ కార్పొరేషన్, మీరా విజయ్ ఆంటోని కార్పొరేషన్ సంస్థల సమర్పణలో సర్వంత్ రామ్ క్రియేషన్స్ బేనర్‌పై రామాంజనేయులు జవ్వాజీ నిర్మించారు. సినిమా ఈనెల 19న ప్రేక్షకుల ముందుకు వస్తోంది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో తృప్తి రవీంధ్ర మాట్లాడుతూ 'ఈ చిత్రంలో నా పాత్ర అందరికీ కనెక్ట్ అయ్యేలా ఉంటుంది. దర్శకుడు పాత్రను అద్భుతంగా మలిచారు. తెలుగు ప్రేక్షకులు అన్ని రకాల సినిమాలను గొప్పగా ఆదరిస్తారు' అని అన్నారు. రియా జిత్తు మాట్లాడుతూ 'విజయ్ ఆంటోని మ్యూజిక్ వింటూ పెరిగాను. ఇప్పుడు ఆయన సినిమాలో నటించే అవకాశం రావడం చాలా సంతోషంగా ఉంది' అని అన్నారు.

తెలుగు సినిమా ఖ్యాతిని పెంచేలా..




'శుక్ర', 'మాటరాని మౌనమిది' చిత్రాల దర్శకుడు పూర్వాజ్ తెరకెక్కిస్తోన్న సినిమా 'ఏ మాస్టర్ పీస్'. అరవింద్ కృష్ణ, జ్యోతి పూర్వాజ్, మనీష్ గిలాడ, అషు రెడ్డి ప్రధాన పాత్రధారులుగా నటిస్తున్నారు. శ్రీకాంత్ కండ్రేగుల, మనీష్ గిలాడ, ప్రజయ్ కామత్ నిర్మిస్తున్నారు. ప్రస్తుతం సినిమా చిత్రీకరణ తుది దశకు చేరుకుంది. ఈ సందర్భంగా షూటింగ్ స్పాట్‌లో చిత్రబృందం మీడియా సమావేశం ఏర్పాటు చేసింది. దర్శకుడు పూర్వాజ్ మాట్లాడుతూ 'ఈ చిత్రంలో మనీష్ గిలాడ సూపర్ విలన్‌గా నటిస్తున్నారు. సూపర్ హీరోగా అరవింద్ కృష్ణ కనిపిస్తారు. ఈ కథలో శివుడి నేపథ్యం ఉంటుంది. కాబట్టి మహా శివరాత్రికి సినిమాను విడుదల చేయాలని అనుకుంటున్నాం' అని చెప్పారు. హీరో అరవింద్ కృష్ణ మాట్లాడుతూ 'తెలుగు సినిమా ఖ్యాతిని పెంచేలా ఈ చిత్రం రూపుదిద్దుకుంటోంది' అని తెలిపారు. నిర్మాత మనిష్ గిలాడ మాట్లాడుతూ 'నాలోని సూపర్ విలన్‌ను ప్రేక్షకులకు పరిచయం చేయబోతున్న మా దర్శకుడికి కృతజ్ఞతలు' అని అన్నారు.

అందరికీ కనెక్టయ్యే కథ



అజయ్ దిషన్, ధనుష హీరో హీరోయిన్లుగా గణేశ్ చంద్ర దర్శకత్వంలో 'బుకీ' అనే యూత్‌ఫుల్ ఎంటర్‌టైనర్ సినిమా సోమవారం ఘనంగా ప్రారంభమైంది. విజయ్ ఆంటోనీ ఫిల్మ్ కార్పొరేషన్, శరవంత్ రామ్ క్రియేషన్స్ బేనర్లపై రామాంజనేయులు జవ్వాజీ నిర్మిస్తున్నారు. ముహూర్తపు సన్నివేశానికి హీరో సత్యదేవ్ క్లాప్ కొట్టగా, నిర్మాత సి.కల్యాణ్ కెమెరా స్విచ్చాన్ చేశారు. హీరోయిన్ మంచు లక్ష్మీ స్క్రిప్ట్ అందించారు. హీరో విజయ్ ఆంటోని, రామాంజనేయులు గౌరవ దర్శకత్వం వహించారు. ఈ సందర్భంగా విజయ్ ఆంటోని మాట్లాడుతూ "బుకీ' విజయం సాధిస్తుందనే నమ్మకం ఉంది' అని చెప్పారు. మంచు లక్ష్మీ మాట్లాడుతూ 'ఇది అందరికీ కనెక్ట్ అయ్యే కథ. ఈ ప్రాజెక్టులో భాగమైనందుకు ఆనందంగా ఉంది' అని అన్నారు.

ఈసారి అల్కా'రాజే'



యూఎస్ ఓపెన్ చాంపియన్ కార్లోస్

ఫైనల్లో సినర్‌పై విజయం ● నెం.1 ర్యాంక్ కూడా కైవసం

న్యూయార్క్: ఫెడరర్, నడాల్, జొకోవిచ్‌ల బిగ్ త్రీ శకం ముగిసి కార్లోస్ అల్కారజ్, జానిక్ సినర్ జమానా మొదలైంది. ఒక గ్రాండ్‌స్లామ్ నీదైతే..మరొకటి నాది అన్న చందంగా ఈ ఇద్దరి జోరు నడుస్తోంది. వింబుల్డన్‌లో సినర్ చాంపియన్‌గా ఆవిర్భవిస్తే..ఈ ఏడాది చివరి గ్రాండ్‌స్లామ్ యూఎస్ ఓపెన్‌లో అల్కారజ్ జయకేతనం ఎగుర వేశాడు. ఆదివారం అర్ధరాత్రి జరిగిన పురుషుల సింగిల్స్ ఫైనల్లో రెండో సీడ్ అల్కారజ్ (స్పెయిన్) 6-2, 3-6, 6-1 6-4తో ఇటలీకి చెందిన టాప్ సీడ్ సినర్‌ను చిత్తు చేశాడు. తద్వారా వింబుల్డన్ తుదిపోరులో సినర్ చేతిలో ఓటమికి అల్కారజ్ బదులు తీర్చుకున్నాడు. రెండున్నర గంటల పోరులో అల్కారజ్ 10 ఏస్‌లతో బెంబేలెత్తించగా.. రెండు ఏస్‌లకే పరిమితమైన జానిక్ నాలుగు డబుల్‌ఫాల్ట్‌లు చేశాడు. 22 ఏళ్ల కార్లోస్‌కిది రెండో యూఎస్ ఓపెన్ టైటిల్. ఈ సీజన్‌లో ఫ్రెంచ్ ఓపెన్ నెగ్గాడు. మరోవైపు 24 ఏళ్ల సినర్ ఈ ఏడాది ఆస్ట్రేలియన్, వింబుల్డన్ టైటిళ్లను సొంతం చేసుకున్నాడు. అంటే..నాలుగు గ్రాండ్‌స్లామ్‌లను ఇద్దరు చెరో రెండు పంచుకున్నారన్నమాట. ఓవరాల్‌గా అల్కారజ్‌కిది కెరీర్‌లో ఆరో గ్రాండ్‌స్లామ్.

డబుల్ ధమాకా

యూఎస్ ఓపెన్ విజయంతో అల్కారజ్.. ప్రపంచ నెంబర్‌వన్ ర్యాంక్‌నూ చేజిక్కించుకొని డబుల్ ధమాకా సృష్టించాడు. ఈ టోర్నీకి ముందు అల్కారజ్ రెండో ర్యాంక్‌లో ఉన్నాడు. అతను టాప్ ర్యాంక్‌లోకి రావడం 2023 సెప్టెంబరు తర్వాత ఇదే తొలిసారి. ఇప్పటిదాకా అగ్రస్థానంలో ఉన్న సినర్.. ఫైనల్ ఓటమితో రెండో ర్యాంక్‌కు పడిపోయాడు.



ట్రంప్‌పై ఫ్యాన్స్ గరం గరం

అల్కారజ్, సినర్ ఫైనల్ మ్యాచ్‌కు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ హాజరయ్యారు. దాంతో ప్రేక్షకులను క్షుణ్ణంగా తనిఖీ చేశాకే స్టేడియంలోకి అనుమతించారు. ఇంకా..భద్రతా కారణాల రీత్యా వాళ్ల కార్లను స్టేడియానికి ఎంతో దూరంలో నిలిపి వేయించారు. పైగా..ట్రంప్ రాకవల్ల మ్యాచ్ నిర్ణీత సమయాని కన్నా అరగంట ఆలస్యంగా ప్రారంభమైంది. ట్రంప్ రాకతో తీవ్ర అసౌకర్యానికి లోనైన అభిమానులు..బిగ్ స్ర్కీన్‌పై ఆయన కనిపించగానే హేళన చేశారు.

సూపర్-4కు భారత్

● 12-0తో సింగపూర్‌పై గెలుపు
● మహిళల ఆసియా కప్ హాకీ

హంగ్జౌ (చైనా): మహిళల ఆసియా కప్‌లో భారత హాకీ జట్టు సూపర్-4కు దూసుకెళ్లింది. పూల్-బిలో సోమవారం జరిగిన ఆఖరి మ్యాచ్‌లో భారత్ 12-0తో సింగపూర్‌ను చిత్తు చేసింది. నవనీత్ (14వ, 20వ, 28వ నిమిషాలు), ముంతాజ్ (2వ, 32వ, 39వ) చెరో మూడు గోల్స్‌తో చెలరేగగా.. నేహ (11వ, 38వ) డబుల్ సాధించింది. లాల్‌రెమ్సియామి (13వ), ఉదిత (29వ), షర్మిలా దేవి (45వ), రుతుజా (53వ) తలో గోల్ చేశారు. మొత్తం మూడు మ్యాచ్‌ల నుంచి ఏడు పాయింట్లు సాధించిన భారత్.. జపాన్‌తో సమంగా నిలిచినా మెరుగైన గోల్స్ తేడాతో గ్రూప్ టాపర్‌గా సూపర్-4 బెర్త్ దక్కించుకొంది. బుధవారం జరిగే సూపర్-4 మ్యాచ్‌లో కొరియాతో భారత్ తలపడనుంది.

చికితకు సీఎం రేవంత్ అభినందనలు



హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి): ఇటీవల యూత్ వరల్డ్ చాంపియన్‌షిప్‌లో స్వర్ణం నెగ్గిన తెలుగు ఆర్చర్ తానిపర్తి చికితరావును సీఎం రేవంత్ రెడ్డి అభినందించారు. చికిత సోమవారం రేవంత్‌ను ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసింది. భవిష్యత్‌లో చికిత మరిన్ని పతకాలు సాధించాలని సీఎం ఆకాంక్షించారు. నూతన స్పోర్ట్స్ పాలసీ ప్రకారం చికితకు నగదు ప్రోత్సాహకం ఇవ్వడంతో పాటు రెండు ఎంఎన్‌సీ సంస్థల నుంచి కూడా సీఎస్ఆర్ నిధులు అందించేందుకు చర్యలు తీసుకోవాలని శాట్ చైర్మన్ శివసేనా రెడ్డిని రేవంత్ ఆదేశించారు. కార్యక్రమంలో పెద్దపల్లి ఎమ్మెల్యే విజయ రమణారావు తదితరులు పాల్గొన్నారు.

ఆసియా సమరానికి సై

ఎనిమిది జట్ల పోరు నేటి నుంచి

తొలి మ్యాచ్‌లో అఫ్ఘాన్‌తో హాంకాంగ్ ఢీ | జోష్‌లో టీమిండియా

రాత్రి 8 గం. నుంచి సోనీ నెట్‌వర్క్‌లో



ఇంగ్లండ్‌లో పర్యటన తర్వాత టీమిండియా మరోసారి మైదానంలోకి అడుగుపెట్టబోతోంది. అయితే ఈసారి ఫార్మాట్ మారింది. ధనాధన్ ఆటతో.. ఎడారి దేశంలో తుఫాన్ సృష్టించేందుకు జట్టు సిద్ధమైంది. ఉపఖండ జట్ల మధ్య నేటి నుంచి జరిగే ఆసియా కప్‌లో సూర్యకుమార్ సేన మరింత జోష్‌తో బరిలోకి దిగుతోంది. ట్రోఫీ కోసం ఎనిమిది జట్లు పోటీపడుతున్నా, ఎనిమిది సార్లు విజేత భారతే ఫేవరెట్. స్టార్లు విరాట్, రోహిత్ లేకుండా బరిలోకి దిగుతున్న మన జట్టు.. టోర్నీలో తన పోరును యూఏఈతో బుధవారం ఆరంభించనుంది. ఇక టోర్నీకే హైలైట్‌గా నిలిచే ఇండో-పాక్ సమరం ఈనెల 14న జరగనుంది.

భారత్ షెడ్యూల్ (మ్యాచ్‌లన్నీ రాత్రి 8 నుంచి)

సెప్టెంబరు 10	యూఏఈతో	దుబాయ్‌లో
సెప్టెంబరు 14	పాకిస్థాన్‌తో	దుబాయ్‌లో
సెప్టెంబరు 19	ఒమన్‌తో	అబుధాబిలో

దుబాయ్: టీ20 ప్రపంచకప్‌నకు సన్నాహంగా భావిస్తున్న ఆసియాకప్ టోర్నీకి రంగం సిద్ధమైంది. యూఏఈలోని దుబాయ్, అబుదాబిలో మంగళవారం నుంచి ఈనెల 28 వరకు మ్యాచ్‌లు జరుగనున్నాయి. దీంతో రానున్న 20 రోజుల పాటు ఆసియాకు చెందిన ఎనిమిది జట్లు ధనాధన్ ఆటతీరుతో అభిమానులను అలరించబోతున్నాయి. పొట్టి ఫార్మాట్‌లో జరుగుతున్న ఈ టోర్నీ ఆరంభ మ్యాచ్‌లో అఫ్ఘానిస్థాన్-హాంకాంగ్ జట్లు అబుధాబిలో తలపడనున్నాయి. డిఫెండింగ్ చాంపియన్ భారత్ బుధవారం యూఏఈతో టైటిల్ పోరును ఆరంభించనుంది. గ్రూప్ 'ఎ'లో టీమిండియాతో పాటు పాకిస్థాన్, యూఏఈ, ఒమన్ ఉండగా.. గ్రూప్ 'బి' నుంచి శ్రీలంక, అఫ్ఘానిస్థాన్, బంగ్లాదేశ్, హాంకాంగ్ పోటీపడుతున్నాయి. ప్రతీ గ్రూప్ నుంచి తొలి రెండు స్థానాల్లో నిలిచిన జట్లు సూపర్-4కు వెళతాయి. అందులో రెండు స్థానాల్లో నిలిచిన జట్లు ఫైనల్‌కు అర్హత సాధిస్తాయి. మొత్తంగా ఇప్పటికి 15 సార్లు జరిగిన ఆసియాకప్‌లో రెండుసార్లు మాత్రమే టీ20 ఫార్మాట్‌లో ఆడించారు. 2023లో శ్రీలంకలో జరిగిన చివరి టోర్నీని వన్డే ఫార్మాట్‌లో నిర్వహించగా, భారత్ విజేతగా నిలిచింది.

పాక్‌తో పోరుపైనే కళ్లన్నీ..!

ఏ జట్టు ఎవరితో ఆడినా ఈనెల 14న దుబాయ్‌లో జరిగే భారత్-పాక్ పోరుపైనే అందరి దృష్టి ఉండనుంది. పహల్గామ్ ఉగ్రదాడి తర్వాత ఇరు దేశాల మధ్య యుద్ధ వాతావరణం నెలకొనడంతో పాక్‌తో క్రికెట్ ఆడకూడదనే డిమాండ్లు వినిపించాయి. అయితే ఇరు జట్ల మధ్య ద్వైపాక్షిక సిరీస్‌లు జరుగకపోయినా.. ఐసీసీ, ఏసీసీ స్థాయిలో నిర్వహించే ఈవెంట్లలో పాల్గొనవచ్చని కేంద్ర ప్రభుత్వం తేల్చి చెప్పడంతో ఇరుజట్ల మధ్య మ్యాచ్‌కు గ్రీన్‌సిగ్నల్ లభించింది. ఈసారి పాక్ స్టార్లు బాబర్ ఆజమ్, మహ్మద్ రిజ్వాన్ లేకపోవడంతో ఆ జట్టు కళ తప్పింది. అంతగా అనుభవంలేని యువ ఆటగాళ్లతో పాక్ బరిలోకి దిగుతున్నా ఇరు దేశాల అభిమానులకు ఈ మ్యాచ్‌పై ఆసక్తి మాత్రం తగ్గదని చెప్పవచ్చు. ఒకవేళ రెండు జట్లు ఫైనల్‌కు వస్తే మొత్తం మూడుసార్లు వీరి మధ్య పోరును తిలకించే చాన్సుంది.



భారత్‌కు పోటీ ఉంటుందా?

ఆసియాకప్‌లో బరిలోకి దిగిన ప్రతీసారి భారత జట్టును ఫేవరెట్‌గానే పరిగణిస్తుంటారు. ఈసారి కూడా మిగతా జట్ల నుంచి ఏమేరకు పోటీ ఎదురవుతుందో చూడాలి. కాస్తయినా సవాల్ విసరగల పాకిస్థాన్, శ్రీలంక జట్లు ప్రస్తుతం సంధిదశలో ఉన్నాయి. అంతా సవ్యంగా జరిగితే సూర్యకుమార్ నేతృత్వంలోని భారత జట్టు తొమ్మిదో టైటిల్‌ను ఖాతాలో వేసుకోగలుగుతుంది. రోహిత్, విరాట్, జడేజాలాంటి ఆటగాళ్లు లేకపోయినా జట్టు పటిష్ఠంగానే కనిపిస్తోంది. ఇక, రానున్న టీ20 వరల్డ్‌కప్‌నకు ముందు జట్టు బలాబలాలపై కూడా ఆసియా కప్ ద్వారా స్పష్టత రానుంది. ఇంగ్లండ్‌లో భీకర ఫామ్ చాటుకున్న వైస్‌కెప్టెన్ శుభ్‌మన్ గిల్ జట్టులో చేరడం మరింత సానుకూలాంశం కానుంది. 15 మందిలో అందరూ ప్రతిభావంతులే కావడంతో తుది జట్టు ఎంపిక కూడా సమస్య కాబోతోంది. అందుకే సంజూ శాంసన్ చోటుపై సందేహాలు నెలకొన్నాయి. యూఏఈలో పిచ్‌లు స్పిన్నర్లకు అనుకూలించనుండడంతో అక్షర్, కుల్దీప్, వరుణ్ ఆడనున్నారు. వికెట్ కీపర్‌గా జితేశ్ శర్మ వైపు మొగ్గు చూపవచ్చు. తొలి మ్యాచ్ యూఏఈతో అయినప్పటికీ స్టార్ పేసర్ బుమ్రాను ఆడించనున్నట్టు సమాచారం. ఓపెనర్లుగా అభిషేక్, గిల్ ఆ తర్వాత తిలక్, సూర్య, హార్దిక్, అక్షర్, జితేశ్ రానున్నారు.

భారత జట్టు

సూర్యకుమార్ (కెప్టెన్), గిల్, అభిషేక్, తిలక్ వర్మ, హార్దిక్, అక్షర్, కుల్దీప్, జితేశ్, శాంసన్, వరుణ్, బుమ్రా, అర్ష్‌దీప్, దూబే, రింకూ సింగ్, హర్షిత్ రాణా.

కామెంట్రీ ప్యానెల్‌లో సన్నీ వీరూ

ఆసియాకప్ టీ20 టోర్నీ కోసం సోనీ నెట్‌వర్క్ తమ కామెంట్రీ ప్యానెల్‌ను వెల్లడించింది. ఇందులో భారత్ నుంచి గవాస్కర్, రవిశాస్త్రి, మంజ్రేకర్, ఊతప్ప ఇంగ్లి‌ష్‌లో.. వీరేంద్ర సెహ్వాగ్, ఇర్ఫాన్, అజయ్ జడేజా, సాబా కరీమ్, అభిషేక్ నాయర్ హిందీలో తమ కామెంట్రీతో అలరించనున్నారు.

భారత్‌కు కాంస్యం

కాఫా నేషన్స్ కప్ ఫుట్‌బాల్

హిసోర్ (తజకిస్థాన్): కాఫా నేషన్స్ కప్ ఫుట్‌బాల్ చాంపియన్‌షిప్‌లో తన ఆగమనాన్ని భారత్ ఘనంగా చాటింది. మూడో స్థానం కోసం సోమవారం జరిగిన మ్యాచ్‌లో తనకంటే ఎంతో మెరుగైన ప్రత్యర్థి ఒమన్‌కు పెనాల్టీ షూటౌట్‌లో 3-2తో భారత్ షాకిచ్చింది. దాంతో కాంస్య పతకంతో టోర్నీని భారత్ ముగించింది.

పంజాబ్ జట్టు నన్ను అవమానించింది



న్యూఢిల్లీ: ఐపీఎల్ ఫ్రాంచైజీ పంజాబ్ కింగ్స్ లెవెన్ తనను ఎంతో అవమానించిందని వెస్టిండీస్ దిగ్గజ క్రికెటర్ క్రిస్ గేల్ ఆవేదన చెందాడు. 2018 నుంచి 2021 వరకు ఆ జట్టుకు ఆడిన సమయంలో తాను ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొన్నట్టు గేల్ తెలిపాడు. 'పంజాబ్ జట్టు కారణంగా ఐపీఎల్‌లో నా కెరీర్ అర్థంతరంగా ముగిసింది. సీనియర్‌గా నాకు ఆ జట్టులో తగిన గౌరవం లభించలేదు. ఆ జట్టు నన్ను చిన్న పిల్లాడిగా భావించింది. కోచ్ కుంబ్లే వైఖరి కూడా బాధించింది' అని ఓ పాడ్‌కాస్ట్‌లో నాటి విషయాలను గేల్ గుర్తు చేసుకున్నాడు.

అర్జున్ గెలుపు.. గుకేష్ ఓటమి

సమర్‌ఖండ్ (ఉజ్బెకిస్థాన్): ఫిడే గ్రాండ్ స్విస్ చెస్ టోర్నీ ఐదో రౌండ్‌లో గ్రాండ్‌మాస్టర్ అర్జున్ ఇరిగేసి విజయం సాధించాడు. నికిటా విటిగోవ్ (రష్యా)తో సోమవారం జరిగిన గేమ్‌లో అర్జున్ నెగ్గాడు. ఇక అమెరికాకు చెందిన యువ గ్రాండ్‌మాస్టర్ అభిమన్యు మిశ్రా.. గుకేష్‌కు షాకిచ్చాడు. ప్రజ్ఞానంద, దివ్యా దేశ్‌ముఖ్‌కు ఓటమి ఎదురవగా.. హరికృష్ణ గేమ్‌ను డ్రాగా ముగించాడు. హారిక, వైశాలి గేమ్‌లు డ్రాగా ముగిశాయి.

ఎఫ్‌ఎంసీజీకి 'ఎంఆర్‌పీ' తంటా

ఎఫ్‌ఎంసీజీ కంపెనీలు ఈ నెల 22 నుంచి తగ్గించిన జీఎస్‌టీ రేట్లను అమలు చేయటంపై మల్లగుల్లాలు పడుతున్నాయి. ఇప్పటికే గిడ్డంగులు, కిరాణా దుకాణాల్లో పాత ఎంఆర్‌పీతో ఉన్న వస్తువులపై కొత్త రేట్లను ఎలా అమలు చేయాలో తెలియక తలలు పట్టుకుంటున్నాయి. దీంతో పాత ఎంఆర్‌పీ రేట్లపై డిస్కౌంట్‌తో అమ్మేందుకు అనుమతించాలని ప్రభుత్వాన్ని కంపెనీలు కోరుతున్నాయి. కొన్ని రిటైల్ చెయిన్స్ అయితే ఇందుకు ఇప్పటికే సిద్ధమయ్యాయి. 'ఖాతాదారుడికి ఇచ్చే తుది బిల్లులో ప్రభుత్వం తగ్గించిన జీఎస్‌టీ రేటును డిస్కౌంట్ రూపంలో తగ్గించి ఇస్తాం' అని వీమార్ట్ సీఎండీ లలిత్ అగర్వాల్ తెలిపారు. 'ప్రస్తుతం ప్రతి ఒక్కరూ ఈ సరుకులపై ఏమి చేయాలి? అనే ఆలోచిస్తున్నారు' అని ఇమామీ కంపెనీ వైస్ చైర్మన్, ఎండీ హర్షవర్ధన్ అగర్వాల్ తెలిపారు. మారిన జీఎస్‌టీ రేట్లకు అనుగుణంగా కొత్త ఎంఆర్‌పీతో వస్తువులను మార్కెట్లో విడుదల చేసేందుకు కొద్దిగా సమయం పడుతుందని కంపెనీలు చెబుతున్నాయి. వచ్చే నెల తొలి వారం లేదా మధ్య నాటికి గానీ ఇది సాధ్యం కాదని గోద్రెజ్ కన్స్యూమర్ ఎండీ, సీఈఓ సుధీర్ సేనాపతి చెప్పారు. దీంతో తగ్గిన జీఎస్‌టీ రేట్లను వినియోగదారులకు బదిలీ చేయడంలో కొన్ని స్వల్పకాలిక అవాంతరాలు తప్పక పోవచ్చన్నారు.

కోల్ ఇండియా డేటా సెంటర్లు

మూసివేసిన గనుల్లో ఏర్పాటుకు యోచన

కోల్‌కతా: ప్రభుత్వ రంగ బొగ్గు ఉత్పత్తి దిగ్గజం కోల్ ఇండియా లిమిటెడ్ (సీఐఎల్).. డేటా సెంటర్ల రంగంలోకి ప్రవేశించే ఆలోచన చేస్తోంది. మూసివేసిన గనుల్లో వీటిని ఏర్పాటు చేయాలని భావిస్తోంది. సాధ్యాసాధ్యాలపై కన్సల్టెంట్లు, అధికారులతో సమగ్ర అధ్యయనం చేపట్టనున్నట్లు సీఐఎల్ వెల్లడించింది. సీఐఎల్ అనుబంధ విభాగాలకు చెందిన నాలుగు స్థలాలు.. ఉమ్రెర్ (డబ్ల్యూసీఎల్), కోబ్రాలోని సరైపాలి (ఎస్ఈసీఎల్), జార్సుగూడ దగ్గర్లోని హిమ్‌గిర్ రాంపూర్ (ఎంసీఎల్), నిగాహి(ఎన్‌సీఎల్)ని ఇందుకు ఎంపిక చేసినట్లు సీఐఎల్ తెలిపింది. కాగా వచ్చే 5-6 ఏళ్లలో దేశీయ డేటా సెంటర్ల రంగంలోకి 2,000-2,500 కోట్ల పెట్టుబడులు రావచ్చని పరిశ్రమ వర్గాల అంచనా. గడిచిన కొన్నేళ్లలో దేశంలో డిజిటల్ సేవల వినియోగం అనూహ్యంగా పెరిగింది. దాంతో డేటా సెంటర్ల ఆవశ్యకత కూడా పెరుగుతూ వస్తోంది. దేశీయంగా డేటా నిక్షిప్త అవసరాలను తీర్చేందుకు వీలుగా నిరుపయోగంగా ఉన్న గనులను, వాటిలోని మౌలిక వసతులను డేటా సెంటర్ల ఏర్పాటుకు ఉపయోగించుకోవాలని సీఐఎల్ చూస్తోంది. ఇందుకు సంబంధించిన అధ్యయన నివేదిక ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసికం (అక్టోబరు-డిసెంబరు)లో అందుబాటులోకి రావచ్చని భావిస్తోంది.

ఆర్థిక మాంద్యం అంచున అమెరికా!

మూడీస్ ప్రధాన ఆర్థికవేత్త మార్క్ జాండీ హెచ్చరిక



ఉద్యోగ గణాంకాల మాంద్యం ఘంటికలు

ట్రంప్ టారిఫ్ వార్ కారణంగా అమెరికాలో ఉద్యోగావకాశాలు కూడా సన్నగిల్లుతున్నాయి. అమెరికా కార్మిక శాఖ గణాంకాల ప్రకారం.. గత నెలలో వ్యవసాయేతర ఉద్యోగ నియామకాలు అంచనాల కంటే తగ్గి 22,000కు పరిమితం అయ్యాయి. అదే సమయంలో నిరుద్యోగిత రేటు 4.2 శాతం నుంచి 4.3 శాతానికి పెరిగింది. అంతేకాదు, మే, జూన్ నెలలకు విడుదల చేసిన ఉద్యోగ గణాంక అంచనాలను కూడా భారీగా తగ్గించింది. అమెరికా ఆర్థిక వ్యవస్థ ఒత్తిడిలో ఉందనడానికి ఇది సంకేతమని విశ్లేషకులు అంటున్నారు. ట్రంప్ సుంకాలు అమెరికన్ కార్పొరేట్ కంపెనీల లాభాలపైనా ప్రభావం చూపనున్నాయని, దాంతో కంపెనీలు వ్యయ నియంత్రణపై దృష్టి సారిస్తాయని, పర్యవసానంగా అక్కడి జాబ్ మార్కెట్ మరింత బలహీనపడే అవకాశాలున్నాయని జాండీ అన్నారు.

న్యూయార్క్: ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు మరో ముప్పు ముంచుకొస్తోందా..? అగ్రరాజ్యం అమెరికా మళ్లీ ఆర్థిక మాంద్యంలోకి జారుకోనుందా..? అవుననే అంటున్నారు పలువురు విశ్లేషకులు. ప్రస్తుత స్థూల ఆర్థిక గణాంకాలను బట్టి చూస్తే అమెరికా మాంద్యం అంచుల్లో ఉందని అంతర్జాతీయ క్రెడిట్ రేటింగ్ ఏజెన్సీ మూడీస్ ప్రధాన ఆర్థికవేత్త మార్క్ జాండీ హెచ్చరించారు. యూఎస్ జీడీపీలో మూడో వంతు (33.33 శాతం) ఇప్పటికే తిరోగమనంలోకి జారుకుంది లేదా జారుకునేందుకు అధిక అవకాశాలున్నాయని ఆయన పేర్కొన్నారు. మరో మూడో వంతు నిలకడగా సాగుతుండగా.. మిగతా మూడో వంతు మాత్రమే పురోగమిస్తోందన్నారు. రాష్ట్రాల వారీగా చూస్తే, వ్యోమింగ్, మోంటానా, మిన్నెసోటా, మిస్సిస్సిప్పీ, కాన్సాస్, మసాచుసెట్స్‌కు మాంద్యం ముప్పు పొంచి ఉందన్నారు. ట్రంప్ అధికారంలోకి వచ్చాక ప్రభుత్వ ఉద్యోగాలకు భారీగా కోతపెట్టడంతో వాషింగ్టన్ డీసీ కూడా ఆర్థిక ఇబ్బందులెదుర్కొంటోందన్నారు. 2008లో అమెరికా ఆర్థిక సంక్షోభాన్ని ముందే అంచనావేసిన ఆర్థికవేత్తల్లో జాండీ ఒకరు. ఆ సంక్షోభం అమెరికాతో పాటు మొత్తం ప్రపంచాన్ని కుదిపివేసిన విషయం తెలిసిందే.

ధరలు మళ్లీ పైపైకి: అమెరికాలో ధరలు, ముఖ్యంగా నిత్యావసరాల రేట్లు మళ్లీ పెరుగుతున్నాయని.. త్వరలోనే విస్మరించలేని స్థాయికి ఎగబాకవచ్చని జాండీ అన్నారు. తాజా ద్రవ్యోల్బణ గణాంకాలు కూడా ఈ విషయాన్ని స్పష్టం చేస్తున్నాయన్నారు. ధరాభారం కారణంగా అమెరికన్ల కొనుగోలు శక్తి కూడా తగ్గిందని, వినియోగదారుల వ్యయ వృద్ధి 2008-09 ఆర్థిక సంక్షోభ కాలం నాటి కనిష్ఠ స్థాయికి జారుకుందన్నారు. ఈ జూలైలో అమెరికాలో వినియోగదారు ధరల ఆధారిత ద్రవ్యోల్బణం మరో 0.2 శాతం పెరిగి 2.7 శాతానికి చేరుకుంది. వచ్చే ఏడాదికాలంలో సూచీ 4 శాతానికి ఎగబాకవచ్చని జాండీ అంచనా. తత్ఫలితంగా అమెరికన్ల కొనుగోలు శక్తి మరింత తగ్గిపోవచ్చని జాండీ అన్నారు.

మాంద్యం అంటే: వరుసగా రెండు త్రైమాసికాల పాటు జీడీపీ వృద్ధి రేటు క్షీణిస్తే (రుణాత్మక స్థాయికి పడిపోవడం) ఆ దేశం ఆర్థిక మాంద్యంలోకి జారుకున్నట్లుగా పరిగణిస్తారు. ట్రంప్ సుంకాల యుద్ధం ఫలితంగా ఈ ఏడాది తొలి త్రైమాసికం (జనవరి-మార్చి)లో అమెరికా జీడీపీ 0.50 శాతం క్షీణించగా.. రెండో త్రైమాసికం (ఏప్రిల్-జూన్)లో మాత్రం 3.3 శాతం వృద్ధిని నమోదు చేయగలిగింది.

అంటే, ప్రస్తుతం అమెరికా పరిస్థితి చావు తప్పి కన్ను లొట్టబోయినట్లుగా ఉంది. పెరుగుతున్న ధరలు, సుంకాలతో పెరిగిన వాణిజ్య అనిశ్చితి, తగ్గుతున్న కొనుగోళ్లు ముున్ముందు త్రైమాసికాల్లో ఆ దేశ జీడీపీని మాంద్యంలోకి నెట్టవచ్చన్న ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి.

బిజినెస్

హైదరాబాద్ ఓఆర్ఆర్ ద్వారా ఆగస్టులో రూ.74 కోట్ల ఆదాయం

ఐఆర్‌బీ ఇన్‌ఫ్రా

న్యూఢిల్లీ: హైదరాబాద్ బాహ్య వలయ రహదారి (ఓఆర్ఆర్) ఐఆర్‌బీ ఇన్‌ఫ్రా కంపెనీకి కనకవర్షం కురిపిస్తోంది. ఆగస్టు నెలలో ఈ రహదారి టోల్ వసూళ్లు రూ.73.7 కోట్లకు చేరాయి. గత ఏడాది ఇదే కాలంతో పోలిస్తే ఇది రూ.5 కోట్లు ఎక్కువని కంపెనీ తెలిపింది. 2023 ఆగస్టులో హెచ్ఎండీఏకు రూ.7,380 కోట్లు చెల్లించడం ద్వారా ఐఆర్‌బీ ఇన్‌ఫ్రా ఈ రహదారిపై 30 ఏళ్ల పాటు టోల్ వసూలు చేసుకునే హక్కులు పొందింది. గత నెల ఐఆర్‌బీ ఇన్‌ఫ్రాకి దేశంలోని 17 టోల్‌వే ప్రాజెక్టుల ద్వారా రూ.563 కోట్ల ఆదాయం వచ్చింది. అందులో అత్యధికంగా రూ.147.7 కోట్లు మహారాష్ట్రలోని టోల్‌వేస్ ద్వారా వచ్చింది. ఆ తర్వాత రూ.73.7 కోట్లు ఐఆర్‌బీ గోల్కొండ ఎక్స్‌ప్రెస్‌వే (హైదరాబాద్ ఓఆర్ఆర్) ద్వారా సమకూరింది.

16 నుంచి సీఐఐ ఇంధన సామర్థ్య సదస్సు

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): భారత పరిశ్రమల సమాఖ్య (సీఐఐ) ఈ నెల 16 నుంచి 18 వరకు హైదరాబాద్‌లో 24వ ఇంధన సామర్థ్య సదస్సు నిర్వహిస్తున్నట్టు ప్రకటించింది. ఇది పరిశ్రమ వృత్తి నిపుణులు, పరిశ్రమ అగ్రనేతలు, ప్రభుత్వ, విద్యా రంగాల ప్రతినిధులు, దేశ, విదేశాలకు చెందిన ప్రధాన పారిశ్రామికవేత్తలు ఈ సదస్సుకు హాజరవుతారని తెలిపింది. ఇంధన వినియోగంలో అసాధారణ ప్రతిభ కనబరిచిన వారికి సీఐఐ నేషనల్ అవార్డ్ ఫర్ ఎక్సలెన్స్ ఇన్ ఎనర్జీ మేనేజ్‌మెంట్ పురస్కారం అందించనున్నట్టు సీఐఐ తెలిపింది.

యూపీఐ చెల్లింపుల్లోకి వియోనా ఫిన్‌టెక్

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): థర్డ్‌పార్టీ అప్లికేషన్ ప్రొవైడర్‌గా (టీపీఏపీ) సేవలందించేందుకు నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎన్‌పీసీఐ) అనుమతి లభించిందని హైదరాబాద్ కేంద్రంగా ఉన్న వియోనా ఫిన్‌టెక్ ప్రకటించింది. దీనివల్ల భాగస్వామ్య బ్యాంకులతో కలిసి తాము యూనిఫైడ్ పేమెంట్ ఇంటర్‌ఫేస్ (యూపీఐ) సేవలు అందించగలుగుతామని, తద్వారా డిజిటల్ పేమెంట్ వ్యవస్థ మరింతగా విస్తరించే అవకాశం లభిస్తుందని వియోనా ఫిన్‌టెక్ వ్యవస్థాపకుడు రవీంద్రనాథ్ యార్లగడ్డ తెలిపారు. వియోనా తన గ్రామ్‌పే డిజిటల్ మాధ్యమం ద్వారా నిరంతరాయంగా చెల్లింపులు, వసూళ్లు నిర్వహిస్తూ రైతులు, చిన్న వ్యాపారులు, స్థానిక సామాజిక వర్గాలకు సాధికారత కల్పిస్తోంది. బడుగు, బలహీన వర్గాలకు సేవలు మరింత విస్తరించే లక్ష్యంతో వియోనా గ్రామ్‌పే వేదికపై రైతుల మార్కెట్ ప్లేస్ ఏర్పాటు చేసింది. దీన్ని ఉపయోగించుకుని రైతులు వేగవంతంగా లావాదేవీలు నిర్వహించుకుంటూ తమ ఉత్పత్తులకు మెరుగైన గిట్టుబాటు ధరలు పొందగలుగుతారని వియోనా వెల్లడించింది.

మార్కెట్లోకి టీవీఎస్ ఎన్‌టార్‌క్యూ 150



ధర రూ.1,19,000

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): టీవీఎస్ మోటార్ కంపెనీ.. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ మార్కెట్లోకి హైపర్ స్పోర్ట్ స్కూటర్ టీవీఎస్ ఎన్‌టార్‌క్యూ 150ను తీసుకువచ్చింది. సోమవారం నాడిక్కడ కంపెనీ ఏపీ, తెలంగాణ జనరల్ మేనేజర్ (సేల్స్) కెంద్‌రాజ్ జోషి, బ్రాండ్ మేనేజర్ రాజ్ బిశ్వాస్ ఈ స్కూటర్‌ను విడుద చేశారు. 149.7 సీసీ రేస్ ట్యూన్డ్ ఇంజన్, స్టెల్త్ ఎయిర్‌క్రాఫ్ట్ డిజైన్‌తో ఈ స్కూటర్‌ను తీసుకువచ్చినట్లు జోషి వెల్లడించారు. ఈ స్కూటర్ పరిచయ ధర రూ.1,19,000 (ఆల్ ఇండియా ఎక్స్ షోరూమ్). యువతను లక్ష్యంగా చేసుకుని ఐఎస్ఎస్- స్ట్రీట్ మోడ్, బూస్ట్- రేస్ మోడ్, ఏబీఎస్, ట్రాక్షన్ కంట్రోల్ సిస్టమ్ వంటి ప్రత్యేక ఫీచర్లతో ఈ స్కూటర్‌ను తీసుకువచ్చినట్లు తెలిపారు. ప్రస్తుతం తెలుగు రాష్ట్రాల స్కూటర్ మార్కెట్లో టీవీఎస్ మోటార్ వాటా 38 శాతం వరకు ఉందని, ఈ కొత్త స్కూటర్‌తో ఇది మరింత పెరుగుతుందని అంచనా వేస్తున్నట్లు జోషి తెలిపారు. కాగా ప్రభుత్వ నిర్ణయానికి అనుగుణంగా ఈ నెల 22 నుంచి జీఎస్‌టీ తగ్గింపును అమలు చేయనున్నట్లు చెప్పారు.

బంగారం సరికొత్త రికార్డు

ఫ్యూచర్స్ మార్కెట్లో రూ.1.09 లక్షలకు..

న్యూఢిల్లీ: పసిడి పరుగు ఆపనంటోంది. ఫ్యూచర్స్ మార్కెట్లో 10 గ్రాముల బంగారం ధర సరికొత్త జీవితకాల గరిష్ఠానికి చేరుకుంది. మల్టీ కమోడిటీ ఎక్స్ఛేంజీ (ఎంసీఎక్స్)లో అక్టోబరు డెలివరీ కాంట్రాక్టు ధర రూ.452 పెరిగి రూ.1,08,180కి చేరగా.. డిసెంబరు డెలివరీ కాంట్రాక్టు రేటు సైతం రూ.370 ఎగబాకి రూ.1.09 లక్షలు దాటింది. కిలో వెండి డిసెంబరు కాంట్రాక్టు ధర కూడా రూ.1,703 పెరుగుదలతో రూ.1,26,400 పలికింది.

స్వల్ప లాభంతో సరి


సెన్సెక్స్ 76 పాయింట్లు అప్

ముంబై: దేశీయ స్టాక్ మార్కెట్ సోమవారం తీవ్ర ఊగిసలాటలకు లోనైనప్పటికీ స్వల్ప లాభాలను నమోదు చేసింది. ఫెడ్ రేట్లు తగ్గవచ్చన్న అంచనాల నేపథ్యంలో అంతర్జాతీయ మార్కెట్లో ట్రేడింగ్ ట్రెండ్ బలపడటంతో పాటు ఆటో, కన్స్యూమర్ రంగ షేర్లలో కొనుగోళ్లతో సెన్సెక్స్ మోస్తరు లాభాల్లో ప్రారంభమైంది. ఒక దశలో 461 పాయింట్ల మేర ఎగిసి 81,171 వద్ద ఇంట్రాడే గరిష్ఠాన్ని నమోదు చేసింది. చివరలో మదుపరులు పెద్దఎత్తున లాభాల స్వీకరణకు దిగడంతో సూచీ 76.54 పాయింట్ల లాభంతో 80,787.30 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 32.15 పాయింట్ల లాభంతో 24,773.15 వద్ద ముగిసింది.

వచ్చేనెలలో ఎల్‌జీ ఐపీఓ: దక్షిణకొరియాకు చెందిన ఎల్‌జీ ఎలక్ట్రానిక్స్.. భారత విభాగ పబ్లిక్ ఇష్యూ (ఐపీఓ)ను వచ్చే నెలలో ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తోంది. ఐపీఓ ద్వారా కంపెనీలో 15 శాతం వాటాకు సమానమైన 10.2 కోట్ల షేర్లను విక్రయించనుంది. తద్వారా రూ.15,000 కోట్లు సమీకరించే అవకాశం ఉంది.

ఇన్ఫోసిస్ షేర్ల బైబ్యాక్!: దేశీయ ఐటీ దిగ్గజ సంస్థ ఇన్ఫోసిస్ మరోసారి షేర్ల బైబ్యాక్‌కు సిద్ధమవుతోంది. ఈ నెల 11న జరిగే బోర్డు సమావేశం దీనిపై నిర్ణయం తీసుకుంటుందని కంపెనీ స్టాక్ ఎక్స్ఛేంజీలకు తెలిపింది. అయితే ఈ బైబ్యాక్ ద్వారా ఎన్ని షేర్లను, ఎంత మొత్తానికి బైబ్యాక్ చేసేది వెల్లడించలేదు. కంపెనీ డైరెక్టర్ల బోర్డే దీనిపై నిర్ణయం తీసుకోనుంది. 2022లోనూ ఇన్ఫోసిస్ కంపెనీ ఒక్కో షేరును రూ.1,830 చొప్పున రూ.9,300 కోట్ల విలువైన షేర్లను బైబ్యాక్ చేసింది. సోమవారం బీఎస్ఈలో ఇన్ఫోసిస్ షేరు 0.81 శాతం నష్టంతో రూ.1,432.65 వద్ద ముగిసింది.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



9వ తేదీ			
హైదరాబాద్	535	విజయవాడ	545
వరంగల్	537	గోదావరి	545
చిత్తూరు	563	విశాఖపట్నం	555
		డజను గుడ్లు రూ. 72	

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	113	విజయవాడ	135
వరంగల్	113	గుంటూరు	125
కరీంనగర్	113	ఒంగోలు	125
మహబూబ్‌నగర్	113	చిత్తూరు	105
కర్నూలు	113	నెల్లూరు	110
విశాఖపట్నం	139	అనంతపురం	110
గోదావరి	135		



బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	1,08,380 ▲	99,350 ▲	1,37,000 ▲
విజయవాడ	1,11,500 ▲	1,05,500 ▼	1,28,000 ▲
విశాఖపట్నం	1,11,660 ▲	99,350 ▼	1,37,000 ▼
రాజమండ్రి	1,08,930 ▲	99,850 ▲	1,26,500 ▼
ప్రొద్దుటూరు	1,10,900 ▲	1,02,000 ▲	1,27,200 ▼
ముంబై	1,08,037 ▲	98,962 ▲	1,24,413 ▲

బీసీలకు 42% రిజర్వేషన్లు

సాధించేదాకా పోరు

తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత



హైదరాబాద్, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు సాధించేవరకు వెనక్కి తగ్గేదిలేదని, కాంగ్రెస్ ప్రభుత్వంపై పోరాటం చేస్తామని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత పేర్కొన్నారు. సోమవారం బంజారాహిల్స్‌లోని జాగృతి కార్యాలయంలో బీసీ కులాల నాయకులతో ఆమె సమావేశమయ్యారు. ఈ సందర్భంగా కవిత మాట్లాడారు. బీసీ సంఘాలను కలుపుకొని ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చేలా ఉద్యమ కార్యాచరణ రూపొందిస్తామని తెలిపారు. బీసీలకు ఇచ్చిన ఒక్క హామీని కూడా ప్రభుత్వం నెరవేర్చలేదని, కామారెడ్డి బీసీ డిక్లరేషన్ అమలు చేయకుండా బీసీలను కాంగ్రెస్ మోసం చేస్తోందని విమర్శించారు. రాష్ట్రంలో బీసీలకు 42శాతం రిజర్వేషన్లు కల్పించిన తర్వాతనే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని కవిత డిమాండ్ చేశారు.

వి.ప్రకాశ్.. నోరు అదుపులో పెట్టుకో లేకుంటే దాడులు తప్పవు: జాగృతి నేతలు

ఎమ్మెల్సీ కవితపై ఇష్టమొచ్చినట్లు మాట్లాడుతున్న వి.ప్రకాశ్ నోరు అదుపులో పెట్టుకోవాలని, లేకపోతే దాడులు తప్పవని తెలంగాణ జాగృతి నాయకులు హెచ్చరించారు. సోమవారం జాగృతి కార్యాలయంలో శ్రీకాంత్‌గౌడ్, ఇతర నాయకులు మాట్లాడారు. క్వాంటమ్, ఆమ్‌వేల పేరుతో తెలంగాణ ప్రజలను మోసం చేసిన చరిత్ర ప్రకాశ్‌దని మండిపడ్డారు. కాళేశ్వరం అవినీతిలో ఆయనకూ భాగస్వామ్యం ఉందని, జలవనరుల నిర్వహణ కార్పొరేషన్ చైర్మన్‌గా ఆయన వాటా ఎంతో చెప్పాలని నిలదీశారు. ప్యాకేజీలకు అమ్ముడుపోయి నోటికొచ్చినట్లు మాట్లాడుతున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. చెల్లిపై అవాకులుపేలితే కేటీఆర్ మాట్లాడకపోవడం బాధాకరమన్నారు. కవితపై కొందరు చేస్తున్న వ్యక్తిగత విమర్శలపై కేటీఆర్ స్పందించాలని కోరారు.

జస్టిస్ సుదర్శన్‌రెడ్డికి మద్దతు ఇవ్వకపోవడం తెలంగాణ ప్రజలను మోసగించడమే

- బీఆర్‌ఎస్‌ది ఆత్మహత్యాసదృశ్యం:నారాయణ

హైదరాబాద్, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఉపరాష్ట్రపతి ఎన్నికల్లో బీఆర్‌ఎస్ వైఖరిపై సీపీఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. తెలంగాణ బిడ్డ, ప్రముఖ న్యాయవాది అయిన జస్టిస్ సుదర్శన్ రెడ్డికి బీఆర్‌ఎస్ మద్దతు ఇవ్వకపోవడం తెలంగాణ ప్రజలను మోసం చేయడమేనని ఆయన ఓ ప్రకటనలో విమర్శించారు. ఉపరాష్ట్రపతి ఎన్నికలలో తటస్థ వైఖరి తీసుకోవడం అత్యంత విచారకరమని, ఇది బీఆర్‌ఎస్ పార్టీకి ఆత్మహత్యాసదృశ్యమే అవుతుందని అభిప్రాయపడ్డారు.

తెలంగాణ బిడ్డకు మద్దతివ్వరా?: చామల

న్యూఢిల్లీ, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ బిడ్డ జస్టిస్ సుదర్శన్ రెడ్డికి బీఆర్‌ఎస్ ఎందుకు ఓటెయ్యదో కేసీఆరే ప్రజలకు చెప్పాలని కాంగ్రెస్ ఎంపీ చామల కిరణ్‌కుమార్ రెడ్డి డిమాండ్ చేశారు. రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించాల్సిన బాధ్యత కేసీఆర్‌కు లేదా? అని నిలదీశారు. టీఆర్‌ఎస్ పేరును బీఆర్‌ఎస్‌గా మార్చినప్పుడే తెలంగాణతో పేగుబంధం తెగిపోయిందని.. అది మరోసారి రుజువైందన్నారు. 'ఉప రాష్ట్రపతి ఎన్నికల్లో నోటా లేదు కాబట్టి మాకు వాటా లేదన్నట్టు కేటీఆర్ మాట్లాడడం బాధ్యతారాహిత్యం. ఇలాంటి వైఖరి వల్లే లోక్‌సభలో ఒక్క సీటూ గెలుచుకోలేకపోయారు. కనీసం రాజ్యసభలో ఉన్న ఆ నలుగురైనా ఓటేయకపోతే ఎలా.. ప్రజాస్వామ్యానికి కేసీఆర్ ఇచ్చే గౌరవం ఇదేనా?' అని ప్రశ్నించారు.

అయిదేళ్లుగా ఎన్నికలు నిర్వహించని తెలంగాణ బార్ కౌన్సిల్

- రాష్ట్రపతికి జేఏసీ చైర్మన్ పొన్నం అశోక్‌గౌడ్ ఫిర్యాదు

హైదరాబాద్, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర బార్ కౌన్సిల్‌కు గత ఐదేళ్లుగా ఎన్నికలు నిర్వహించకుండా పాలకవర్గం అక్రమంగా కొనసాగుతోందని, దీనిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ బార్ కౌన్సిల్ ఎన్నికల జేఏసీ చైర్మన్, టీపీసీసీ లీగల్‌సెల్ చైర్మన్ పొన్నం అశోక్ గౌడ్ రాష్ట్రపతికి ఫిర్యాదు చేశారు. ఈ మేరకు సోమవారం లేఖరాశారు. న్యాయవాద వృత్తిలో జవాబుదారీతనాన్ని, ప్రజాస్వామ్యయుత నిర్వహణ కోసం పాలకవర్గం గడువు ముగిసిన వెంటనే ఎన్నికలు నిర్వహించాలని అడ్వకేట్స్ యాక్ట్- 1961 నిర్దేశిస్తోందని, ఆ చట్టాన్ని తుంగలో తొక్కుతూ ప్రస్తుత కార్యవర్గం గత ఎనిమిదేళ్లుగా పదవుల్లో కొనసాగుతోందని పేర్కొన్నారు. తక్షణం జోక్యం చేసుకుని ఎన్నికలు నిర్వహించే విధంగా బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (బీసీఐ)కి ఆదేశాలు జారీచేయాలని కోరారు.

మహిళల భద్రత దృష్ట్యా నిఘా కెమెరాలను నియంత్రించండి

- హైకోర్టులో పిటిషన్

హైదరాబాద్, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): మహిళల వ్యక్తిగత జీవనానికి విఘాతం కలుగుతున్న దృష్ట్యా నిఘా కెమెరాల విక్రయాలను నియంత్రించాలని కోరుతూ హైకోర్టులో పిటిషన్ దాఖలయింది. హెవెన్స్ హోం సొసైటీ వ్యవస్థాపక అధ్యక్షురాలు జి. వరలక్ష్మి ఈ పిటిషన్ దాఖలు చేశారు. మార్చి 29న పోలీసుశాఖలోని మహిళా భద్రతా విభాగం జారీ చేసిన సర్క్యులర్ అమలయ్యేలా చూడాలని కోరారు. దాని ప్రకారం నిఘా కెమెరాలు విక్రయించే వ్యక్తులు తమ దుకాణాల వద్ద అనుమతి లేకుండా వీడియోలు చిత్రీకరిస్తే మూడేళ్లవరకు జైలుశిక్ష, రూ. 2 లక్ష జరిమానా విధించే అవకాశం ఉందంటూ బోర్డులు పెట్టాల్సి ఉంటుంది. హోటళ్లు, హాస్టళ్లు, షాపింగ్ మాల్స్ రెస్టారెంట్లు తదితర ప్రాంతాల్లో మహిళల వీడియోలను చిత్రీకరిస్తున్న నేపథ్యంలో ఆ ఆదేశాలు ఇచ్చింది. ఇవి అమలయ్యేలా చూడాలని కోరారు. వాదనలు విన్న జస్టిస్ ఎన్వీ శ్రవణ్‌కుమార్ ధర్మాసనం.. పిటిషనర్ విజ్ఞప్తిపై చర్యలు తీసుకోవాలని డీజీపీ, ఇతర అధికారులకు ఆదేశాలు జారీచేసింది. ప్రభుత్వం ఏయే చర్యలు తీసుకుంటుందో వివరాలు తెలియజేయాలని హోంశాఖకు ఆదేశాలు జారీచేసింది.

అల్లు అరవింద్‌కు జీహెచ్‌ఎంసీ నోటీసు

- అనుమతి లేకుండా పెంట్‌హౌస్ కట్టారని తాఖీదు

హైదరాబాద్, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): బంజారాహిల్స్, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): ప్రముఖ సినీ నిర్మాత అల్లు అరవింద్‌కు జీహెచ్‌ఎంసీ సోమవారం నోటీసు జారీ చేసింది. జూబ్లీహిల్స్ రోడ్డు నంబరు 45లో ఆయన అల్లు బిజినెస్ పార్క్ పేరిట సుమారు వెయ్యి గజాల్లో భవనం నిర్మించారు. గ్రౌండ్ ఫ్లోర్‌తో పాటు నాలుగు అంతస్థుల వరకు జీహెచ్‌ఎంసీ అనుమతులు తీసుకున్నారు. ఏడాది క్రితమే ఆ ఇంటి నిర్మాణం పూర్తి చేశారు. అయితే, ఇటీవల అదనంగా పెంట్‌హౌస్ నిర్మించారు. దీంతో అక్రమంగా నిర్మించిన పెంట్‌హౌస్‌ను ఎందుకు కూల్చవద్దంటూ జీహెచ్‌ఎంసీ టౌన్ ప్లానింగ్ అధికారులు నోటీసులు జారీ చేశారు.

'సృష్టి' కేసులో ఏపీలో ముగ్గురు వైద్యులపై వేటు

అమరావతి, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ ప్రధాన కేంద్రంగా నడుస్తున్న సృష్టి సంతాన సాఫల్య కేంద్రంలో జరిగిన అక్రమాలతో సంబంధమున్న ముగ్గురు ప్రభుత్వ వైద్యులపై ఏపీ ప్రభుత్వం వేటు వేసింది. విశాఖపట్నంలోని ఆంధ్రా మెడికల్ కాలేజీ అనెస్థీషియా విభాగాధిపతి డా.వాసుపల్లి రవి, గైనకాలజీ విభాగంలో అసోసియేట్ ప్రొఫెసర్ డా.పి.ఉషాదేవి, శ్రీకాకుళం బోధనాసుపత్రి పీడియాట్రిక్స్ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ డా.ఎ.విద్యుల్లతను ప్రభుత్వం సస్పెండ్ చేసింది. సృష్టి కేసులో ఈ ముగ్గురిపై సరోగసీ చట్టం, జువెనైల్ జస్టిస్ చట్టంలోని పలు సెక్షన్ల కింద కేసులు నమోదు చేసి గత 28న అరెస్టు చేసినట్లు హైదరాబాద్ పోలీసులు తెలిపారు. ఈ నేపథ్యంలో ఈ ముగ్గురు వైద్యులపై వచ్చిన ఆరోపణల తీవ్రత దృష్ట్యా పోలీసులు అరెస్టు చేసిన తేదీ నుంచే సస్పెండ్ చేయాలని మంత్రి సత్యకుమార్ ఆదేశించారు.

42% బీసీ రిజర్వేషన్లతోనే స్థానిక ఎన్నికలకు!

- రాష్ట్రపతి, గవర్నర్ వద్ద బిల్లుల పెండింగ్ అంశాన్ని వివరిస్తూ కోర్టును సమయం కోరనున్న సర్కారు
- చట్టబద్ధంగా రిజర్వేషన్లు కల్పించేందుకే.. మొగ్గు
- కోర్టు అంగీకరిస్తే నవంబర్‌లో ఎన్నికల నిర్వహణ



హైదరాబాద్, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): బీసీలకు 42శాతం రిజర్వేషన్లు కల్పించాకే స్థానిక ఎన్నికలకు వెళ్లాలని, అది కూడా చట్టబద్ధంగా రిజర్వేషన్లు కల్పించాలని ప్రభుత్వం భావిస్తోంది. బీసీ రిజర్వేషన్లకు సంబంధించిన రెండు బిల్లులు నాలుగు నెలలుగా రాష్ట్రపతి వద్ద పెండిగ్‌లో ఉన్నాయి. ఇటీవల పంచాయతీరాజ్, మునిసిపల్ చట్టాలను సవరిస్తూ మరో రెండు బిల్లులను అసెంబ్లీ ఆమోదించి, గవర్నర్‌కు పంపగా.. అవీ పెండింగ్‌లో ఉన్నాయి. చట్టబద్ధంగా రిజర్వేషన్ కల్పించాలంటే రాష్ట్రపతి, గవర్నర్ వద్ద పెండింగ్‌లో ఉన్న బిల్లులకు ఎవరో ఒకరి వద్ద ఆమోద ముద్ర పడాల్సిందే. వాస్తవానికి బిల్లులకు ఆమోదముద్ర పడకుంటే.. నేరుగా జీవో ఇచ్చి ఎన్నికలకు వెళ్లాలని ప్రభుత్వం భావించింది. కానీ, ఎవరైనా కోర్టుకు వెళ్తే ఆ జీవోను కొట్టివేసే అవకాశాలున్నాయి. ఈ నేపథ్యంలో బిల్లుల ఆమోదం కోసం మరికొంత కాలం వేచి ఉండాలని ప్రభుత్వం భావిస్తోంది. సెప్టెంబరు 30లోపు స్థానిక సంస్థల ఎన్నికలు పూర్తిచేయాలన్న హైకోర్టు ఆదేశాల నేపథ్యంలో.. బీసీలకు రిజర్వేషన్ల కల్పన కోసం తాము ఏం చేశామన్నది వివరిస్తూ కొంత సమయం కోరాలని సర్కారు యోచిస్తోంది. ఎంత గడువు కోరదామనే అంశంపైనా తర్జనభర్జన నడుస్తోంది. రెండు లేదా మూడు నెలల సమయం ఇచ్చేందుకు హైకోర్టు అంగీకరిస్తే.. ఎన్నికలు నవంబర్ నెలలో నిర్వహించే అవకాశాలు ఉన్నాయని అంటున్నారు.

టీటీడీ ఈవోగా మళ్లీ సింఘాల్



అమరావతి, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఏపీలో 11 మంది సీనియర్ ఐఏఎస్ అధికారులను ప్రభుత్వం బదిలీ చేసింది. కీలకమైన శాఖలు అప్పగించింది. కేంద్ర సర్వీసుల నుంచి తిరిగొచ్చి పోస్టింగ్ కోసం ఎదురుచూస్తున్న అనిల్ కుమార్ సింఘాల్ మరోసారి తిరుమల తిరుపతి దేవస్థానాల (టీటీడీ) కార్యనిర్వహణాధికారి (ఈవో)గా నియమితులయ్యారు. ఆ స్థానంలో ఉన్న జె.శ్యామలరావును సాధారణ పరిపాలనా విభాగం (జీఏడీ-పొలిటికల్) ముఖ్య కార్యదర్శిగా ప్రభుత్వం బదిలీచేసింది. ప్రస్తుతం అక్కడున్న ముకేశ్‌కుమార్ మీనాను రెవెన్యూ (ఎక్సైజ్) ముఖ్య కార్యదర్శిగా నియమించింది. అటవీ-పర్యావరణ శాఖ స్పెషల్ సీఎస్‌గా ఉన్న జి.అనంతరామును బదిలీచేసి గవర్నర్ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా నియమించింది. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. సింఘాల్ గతంలోనూ టీటీడీ ఈవోగా పనిచేశారు. చంద్రబాబు హయాంలో 2017 మే 6న ఈ బాధ్యతలు చేపట్టిన ఆయన.. వైసీపీ ప్రభుత్వంలో 2020 అక్టోబరు 4 వరకు పనిచేశారు.

22 మందితో బీజేపీ రాష్ట్ర కమిటీ

(మొదటిపేజీ తరువాయి)



బీసీలు ఏడుగురు, ఎస్సీలు ముగ్గురు, ఎస్టీ ఒకరు ఉన్నారు. (అధ్యక్షుడితో కలిపితే మొత్తం కమిటీ సభ్యుల సంఖ్య 23 కాగా, ఓసీల సంఖ్య 12 అవుతుంది). ఇక కమిటీ కూర్పులో బీసీలకు, మహిళలకు మూడో వంతు పదవులు దక్కాయి. గత కమిటీలో ఉన్నవారిలో ఐదుగురికి మాత్రమే మళ్లీ అవకాశం లభించింది. 8 మంది ఉపాధ్యక్షులు, 8 మంది కార్యదర్శులు, ముగ్గురు ప్రధాన కార్యదర్శులు, కోశాధికారి, సంయుక్త కోశాధికారి, ముఖ్య అధికార ప్రతినిధితో కలిపి కొత్త కమిటీని ప్రకటించారు. గత కమిటీలో పార్టీ అధికార ప్రతినిధిగా ఉన్న సీనియర్ నేత, దివంగత ప్రధాని పీవీ మనవడు ఎన్.వి.సుభాష్‌ను ముఖ్య అధికార ప్రతినిధిగా నియమించారు. బండారు దత్తాత్రేయ కూతురు బండారు విజయలక్ష్మి, మాజీ ఎమ్మెల్యే బద్దం బాల్‌రెడ్డి తనయుడు బద్దం మహిపాల్‌రెడ్డిలకు తొలిసారిగా రాష్ట్ర కమిటీలో చోటు దక్కింది. మాజీ మంత్రి దేవేందర్‌గౌడ్ తనయుడు వీరేందర్‌గౌడ్‌ను అనూహ్యంగా ప్రధాన కార్యదర్శి పదవి వరించింది. కాగా, ఐదు మోర్చాలకు కొత్తవారిని నియమించారు. బీజేపీ కొత్త కమిటీలో 10 మంది హైదరాబాద్‌లో స్థిరపడ్డవారే కావడం చర్చనీయాంశమైంది. వీరంతా సికింద్రాబాద్ లోక్‌సభ నియోజకవర్గం పరిధిలోనే నివాసం ఉంటున్నారని పార్టీ వర్గాలు తెలిపాయి. గ్రామీణ ప్రాంత శ్రేణులకు ఆశించిన మేర అవకాశం కల్పించలేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

బీజేపీ కొత్త కమిటీ ఇలా..

ఉపాధ్యక్షులు: బూర నర్సయ్యగౌడ్, కాసం వెంకటేశ్వర్లు యాదవ్, భండారి శాంతికుమార్, ఎం.జయశ్రీ, కొల్లి మాధవి, జరుప్లావత్ గోపి (కళ్యాణ్‌నాయక్), రఘునాథరావు, బండ కార్తీకరెడ్డి

ప్రధాన కార్యదర్శులు: ఎన్.గౌతంరావు, టి.వీరేందర్‌గౌడ్, వేముల అశోక్

కార్యదర్శులు: ఒ.శ్రీనివాసరెడ్డి, కొప్పు బాషా, భరత్‌ప్రసాద్, బండారు విజయలక్ష్మి, స్రవంతిరెడ్డి, కరణం పరిణీత, బద్దం మహిపాల్‌రెడ్డి, తూటుపల్లి రవికుమార్, కోశాధికారి: డి.వాసుదేవ్, సంయుక్త కోశాధికారి: విజయ్ జైన్, ముఖ్య అధికార ప్రతినిధి: ఎన్.వి.సుభాష్

ఏడు మోర్చాల అధ్యక్షులు..

మహిళా మోర్చా: మేకల శిల్పారెడ్డి, యువమోర్చా: గణేశ్ కుంద్రె; కిసాన్‌మోర్చా: బస్వాపురం లక్ష్మీనర్సయ్య, ఎస్సీ మోర్చా: కాంతి కిరణ్, ఎస్టీ మోర్చా: నేనావత్ రవినాయక్, ఓబీసీ మోర్చా: గందమళ్ల ఆనంద్‌గౌడ్, మైనారిటీ మోర్చా: సర్దార్ జగ్మోహన్‌సింగ్

గోషామహల్ కార్యకర్తలకు చోటేదీ?

- బీజేపీపై మండిపడ్డ ఎమ్మెల్యే రాజాసింగ్

హైదరాబాద్ సిటీ, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): బీజేపీ రాష్ట్ర కొత్త కమిటీపై గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. రాష్ట్ర కమిటీలో గోషామహల్ నియోజకవర్గ కార్యకర్తలకు చోటు ఇవ్వకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. బీజేపీ గౌరవాన్ని మూడు సార్లు కాపాడిన వ్యక్తి, గోషామహల్ అసెంబ్లీకి చెందిన బీజేపీ కార్యకర్తలకు రాష్ట్ర కమిటీలో పదవి ఇవ్వడానికి ఆసక్తి చూపలేదని విమర్శించారు. ఇంకెన్నాళ్లు అన్యాయం చేస్తారని ప్రశ్నించారు. గ్రేటర్ హైదరాబాద్‌లో ఒకే ఒక అసెంబ్లీ సీటును గెలిపించిన గోషామహల్ కార్యకర్తలను ఎలా విస్మరిస్తారని నిలదీశారు. ఇది రాష్ట్ర కమిటీలా లేదని, సికింద్రాబాద్ పార్లమెంటు కమిటీలా ఉందని ఎద్దేవా చేశారు. కాగా, వినాయక నిమజ్జనం ప్రశాంతంగా జరిపిన ఘనత సీఎం రేవంత్‌రెడ్డికే దక్కుతుందని రాజాసింగ్ చెప్పారు. హుస్సేన్ సాగర్‌లోకి వచ్చే మురుగు నీటిని మళ్లించాల్సిన అవసరం ఉందని, ఈ విషయంపై సీఎం దృష్టి సారించాలని కోరారు.



తెలంగాణ విమోచన కరపత్రాలను విడుదల చేస్తున్న రాంచందర్‌రావు

బీసీ రిజర్వేషన్‌పై జీవో ఎందుకివ్వరు?

- రిజర్వేషన్లు ఇవ్వాలన్న ఉద్దేశం కాంగ్రెస్‌కు లేదు
- అందుకే బీజేపీపై నెపం: రాంచందర్‌రావు

హైదరాబాద్, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42శాతం రిజర్వేషన్‌పై జీవో ఎందుకు ఇవ్వడం లేదని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు.. రాష్ట్ర ప్రభుత్వాన్ని నిలదీశారు. ఈ జీవోకు మద్దతు ఇచ్చేందుకు తాము సిద్ధమని ప్రకటించారు. బీసీ రిజర్వేషన్‌పై నెల కిందట తాను చేసిన సూచన మేరకే రాష్ట్ర ప్రభుత్వం మొన్న అసెంబ్లీలో పంచాయతీరాజ్ చట్ట సవరణ చేసిందని చెప్పారు. చట్ట సవరణ చేయకుంటే రిజర్వేషన్ సాధ్యం కాదని తాను చెప్పానని.. ఆ మాట కాంగ్రెస్ నాయకులకు అర్థంగాక, తాను బీసీలకు వ్యతిరేకమని ప్రచారం చేశారని మండిపడ్డారు. బీసీలకు రిజర్వేషన్ ఇవ్వాలన్న ఉద్దేశం కాంగ్రెస్‌కు ఉంటే న్యాయపరమైన ప్రక్రియలోనే చిత్తశుద్ధి కనబరిచేదని అన్నారు. సోమవారం బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో రాంచందర్‌రావు మీడియాతో మాట్లాడారు. తెలంగాణ బీసీ సమాజాన్ని కాంగ్రెస్ మోసం చేస్తోందని మండిపడ్డారు. కామారెడ్డి డిక్లరేషన్‌ను అమలు చేయాలని బీసీలు డిమాండ్ చేస్తుంటే.. కాంగ్రెస్ తమపై రాళ్లు వేస్తోందని ఆరోపించారు. బీసీ డిక్లరేషన్ అమలు చేసిన రోజే కాంగ్రెస్‌కు కామారెడ్డి గడ్డపై మాట్లాడే అధికారముందని స్పష్టం చేశారు. కామారెడ్డి డిక్లరేషన్ కాదు.. అది బీసీలకు ద్రోహం.. అని మండిపడ్డారు. 'బీసీలకు 42శాతం రిజర్వేషన్ అమలు చేయడం చేతగాదని మీరు చెప్పండి. మేం అధికారంలోకి రాగానే ఇస్తాం. పంచాయతీరాజ్ చట్ట సవరణ చేశారు. బిల్లును గవర్నర్‌కు పంపించారు. కేంద్రంగానీ, బీజేపీగానీ ఎక్కడ అడ్డుకుంది..?' అని ఆయన నిలదీశారు. స్థానిక సంస్థలకు ఎన్నికలు నిర్వహించకపోవడంతో రూ.3వేల కోట్లు నిలిచిపోయాయని, దీనికి రాష్ట్ర ప్రభుత్వానిదే బాధ్యత అని రాంచందర్‌రావు స్పష్టం చేశారు. తమ పార్టీ సీనియర్ నేత బండారు దత్తాత్రేయను ఉపరాష్ట్రపతి అభ్యర్థిగా ప్రతిపాదించాలన్న కాంగ్రెస్.. తాను మాత్రం రెడ్డి సామాజికవర్గం అభ్యర్థిని నిలబెట్టిందని విమర్శించారు. రెండేళ్లలో బీసీలకు ఏం న్యాయంచేశారని కాంగ్రెస్‌ను రాంచందర్‌రావు నిలదీశారు.

చర్య తీసుకున్నాక నేను మాట్లాడేదేముంది?

(మొదటిపేజీ తరువాయి)

పేరు ప్రస్తావించకుండా సమాధానం ఇచ్చారు. "పార్టీ కీలకంగా సమావేశమై చర్చలు జరిపింది. తర్వాతనే సస్పెన్షన్ నిర్ణయం తీసుకుంది. ఒకసారి చర్యలు చేపట్టాక నేను మాట్లాడటానికి ఏమీ లేదు" అన్నారు. మంగళవారం జరిగే ఉప రాష్ట్రపతి ఎన్నికల్లో బీఆర్‌ఎస్ పాల్గొనబోవడం లేదని కేటీఆర్ ప్రకటించారు. యూరియా కొరతపై 20 రోజుల కిందట హెచ్చరించినా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించ లేదని, వారి వైఖరికి నిరసనగా, 71 లక్షల మంది తెలంగాణ రైతన్నలకు సంఘీభావంగా ఉప రాష్ట్రపతి ఎన్నికలకు దూరంగా ఉంటున్నట్లు చెప్పారు. ఇరు కూటముల అభ్యర్థుల విషయంలో బీఆర్‌ఎస్ తటస్థంగా ఉంటుందని తెలిపారు. హైదరాబాద్ నగరంలో భారీ స్థాయిలో డ్రగ్స్ పట్టుబడటం కాంగ్రెస్ నిర్లక్ష్య పాలనకు నిదర్శనమని అన్నారు. డ్రగ్స్‌లో ముఖ్యమంత్రికి ముడుపులు ముట్టడం వల్లే పోలీసులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నట్లు అనుమానం కలుగుతోందని వ్యాఖ్యానించారు. మహారాష్ట్ర పోలీసులు చర్లపల్లిలో డ్రగ్స్ పట్టుకుంటే సీఎంకు సమాచారమే లేదన్నారు. ఎమ్మెల్యేలు పార్టీ మారినట్లు ఓ టీవీ చర్చలో పీసీసీ అధ్యక్షుడు స్వయంగా అంగీకరించారని, కడియం శ్రీహరి కూడా కాంగ్రెస్‌లో చేరినట్లు అంగీకరించారని, ఇక విచారణ అక్కర్లేదని, స్పీకర్ ఫిరాయింపు ఎమ్మెల్యేలపై వేటు వేయాలని కోరారు. కాళేశ్వరంపై సీబీఐ విచారణకు ఆదేశించిన రేవంత్‌రెడ్డి అదే కాళేశ్వరంప్రాజెక్టు ఆధారంగా నిర్మించిన మల్లన్నసాగర్‌ను మూసీ నదితో అనుసంధానం ప్రాజెక్టుకు శంకుస్థాపన చేస్తున్నారని కేటీఆర్ ప్రస్తావించారు. రేవంత్ తలా తోక లేనోడని, నీళ్లు తేవాల్సిన తల దగ్గర కాకుండా తోకలాంటి గండిపేట వద్ద శంకుస్థాపన చేస్తున్నారని వ్యాఖ్యానించారు. 16 వేల కోట్ల మూసీ సుందరీకరణ ప్రాజెక్టును లక్షన్నర కోట్లకు పెంచితే అడ్డుకున్నామని, అందుకే, విడతల వారీగా జనాల సొమ్ము దోచుకునేందుకే ఈ పథకాలను మొదలుపెట్టారని ఆరోపించారు. కొండ పోచమ్మ సాగర్ నుంచి హైదరాబాద్‌కు గోదావరి జలాలను తీసుకొచ్చే పథకం అంచనాలను రూ.1,100 కోట్ల నుంచి 7,390 కోట్లకు పెంచారని, మల్లన్నసాగర్ నుంచి నీళ్లు తెచ్చే విధంగా మార్పులు చేశారని చెప్పారు. రూ.4 వేల కోట్లతో నిర్మించిన మేడిగడ్డ బరాజ్‌లో కేవలం రూ.250 కోట్లు మాత్రమే ఖర్చయ్యే 7వ బ్లాక్‌లోని మూడు పిల్లర్ల రిపేర్లను తమ సొంత డబ్బులతో చేస్తామని నిర్మాణ కంపెనీ ఎల్ అండ్ టీ చెబుతోందని ప్రస్తావించారు. ప్రజాధనం ఎక్కడ వృథా అవుతుందో రేవంత్ చెప్పాలన్నారు. ఉచిత మంచినీటి పథకాన్ని జీహెచ్‌ఎంసీ ఎన్నికల తర్వాత రద్దు చేస్తారని ఆరోపించారు. సుంకిశాల రిటైనింగ్ వాల్ కూలిన ఘటనకు కారణమైన కాంట్రాక్ట్ కంపెనీని బ్లాక్‌లిస్టు చేయాలని అధికారులు నివేదిక ఇచ్చినా అదే కంపెనీకి రేవంత్ వేల కోట్ల పనులు అప్పగిస్తున్నారని కేటీఆర్ చెప్పారు. కేంద్ర ప్రభుత్వం సైతం ఆ కంపెనీని బ్లాక్ లిస్టు చేసిందన్నారు. అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న కంపెనీలకు మూసీ సుందరీకరణ అప్పగించే ప్రయత్నాల్లో ఉన్నారని ఆరోపించారు. కంపెనీలకు మూసీ సుందరీకరణ అప్పగించే ప్రయత్నాల్లో ఉన్నారని ఆరోపించారు.

కవిత ప్రకటనతో

కేసీఆర్ కుటుంబ దోపిడీ గుట్టురట్టు!

- కార్లలో డీజిల్ పోసుకోలేని స్థాయి నుంచి వేల కోట్లకు పడగలెత్తారు
- వచ్చే ఎన్నికల నాటికి బీఆర్‌ఎస్ ఖేల్ ఖతం
- టీపీసీసీ విస్తృత కార్యవర్గ సమావేశంలో మహేశ్‌గౌడ్



విస్తృతస్థాయి సమావేశంలో టీపీసీసీ చీఫ్ మహేశ్‌గౌడ్, మీనాక్షి, డిప్యూటీ సీఎం భట్టి, మంత్రి పొన్నం తదితరులు

హైదరాబాద్, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఒకప్పుడు కార్లలో డీజిల్ పోసుకోలేని స్థితిలో ఉన్న కేసీఆర్ కుటుంబం నేడు వేల కోట్లకు పడగలెత్తిందని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ అన్నారు. అవినీతి సొమ్ముతోనే ఈ స్థాయికి చేరిందని ఆరోపించారు. ఆ కుటుంబం ఓ దొంగల ముఠా అని విమర్శించారు. వచ్చే ఎన్నికల నాటికి బీఆర్‌ఎస్ ఖేల్ ఖతమని చెప్పారు. కవిత ప్రకటనతో కేసీఆర్ కుటుంబ దోపిడీ బట్టబయలైందన్నారు. సోమవారం గాంధీభవన్‌లో టీపీసీసీ విస్తృత కార్యవర్గ సమావేశం జరిగింది. ఇందులో పలు అంశాలపై చర్చ జరిగింది. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని మహేశ్ గౌడ్ పార్టీ నాయకులకు సూచించారు. ఎన్నికలు వచ్చినప్పుడే బీజేపీ నాయకులకు దేవుడు గుర్తొస్తాడని విమర్శించారు. కిషన్‌రెడ్డి, బండి సంజయ్ దేవుళ్ల పేరు చెప్పి గెలిచారని ఆరోపించారు. ఓటు చోరీ వల్లే మోదీ మూడోసారి అధికారంలోకి వచ్చారన్నారు. ఓటు చోరీపై రాహుల్ పోరాటం చేస్తున్నారని తెలిపారు. ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామన్న బీజేపీ.. 12 ఏళ్లలో 24 కోట్ల ఉద్యోగాలు ఇచ్చిందా? అని మహేశ్ గౌడ్ ప్రశ్నించారు. కాంగ్రెస్ పార్టీలో అన్ని వర్గాల వారు బీసీ రిజర్వేషన్లకు కట్టుబడి ఉన్నారన్నారు. ఉచిత బస్సు మొదలుకొని సన్న బియ్యం వరకు రాష్ట్రంలో అనేక చరిత్రాత్మక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నామని చెప్పారు. ఈ విషయంలో తెలంగాణ దేశానికే రోల్ మోడల్‌గా నిలిచిందన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలో కాంగ్రెస్ పార్టీ మరోసారి అధికారంలోకి రావడం ఖాయమని తేల్చి చెప్పారు. 2029లో మోదీకి పరాభవం తప్పదని.. రాహుల్ ప్రధాని కావడం తథ్యమని అన్నారు. ఈ నెల 15న లక్షల మందితో కామారెడ్డిలో నిర్వహించతలపెట్టిన బహిరంగ సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

బీఆర్‌ఎస్ ఎన్ని ముక్కలవుతుందో: భట్టి

బీఆర్‌ఎస్ చేసిన తప్పిదాలతో ఆ పార్టీ ఎన్ని ముక్కలు అవుతుందో తెలియని పరిస్థితి నెలకొందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలు, ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలకు ఆకర్షితులై రాష్ట్రం నలుమూలల నుంచి వస్తున్న వివిధ పార్టీల నేతలు, కార్యకర్తలను ఒక ఉద్యమంలా పార్టీలోకి ఆహ్వానించాలని కాంగ్రెస్ నేతలకు సూచించారు. రాహుల్ గాంధీని ప్రధాని చేయడానికి అంతా కలిసి పని చేద్దామని, ఆయన ప్రధాని కావడం దేశానికి అవసరమని అన్నారు. ఈ సందర్భంగా పీసీసీ అధ్యక్షుడిగా ఏడాది పూర్తి చేసుకున్న మహేశ్‌గౌడ్‌కు అభినందనలు తెలిపారు. స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో ప్రతి కార్యకర్తకు ఏదో ఒక పదవి లభిస్తుందని చెప్పారు.

దేశవ్యాప్తంగా తెలంగాణ మోడల్: మీనాక్షి

తెలంగాణ మోడల్‌ను దేశవ్యాప్తంగా అమలు చేసేందుకు కాంగ్రెస్ పార్టీ సిద్ధంగా ఉందని ఏఐసీసీ ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్ చెప్పారు. తాను ఇన్‌చార్జిగా బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి రెండు నెలలకోసారి పీసీసీ సమావేశం నిర్వహించడం శుభ పరిణామమని అన్నారు. కాంగ్రెస్ పార్టీలో 70-80 శాతం పాత వారికి పదవులు ఇచ్చామని, మిగిలిన 20 శాతం కొత్త వారికి అవకాశం కల్పించామని చెప్పారు. రేవంత్ ఓసీ అయినప్పటికీ బలహీన వర్గాలకు చెందిన మహేశ్‌గౌడ్‌తో సమన్వయం చేసుకుంటూ ముందుకెళ్తున్నారని ప్రశంసించారు.

కామారెడ్డి సభతో కాంగ్రెస్ సత్తా చూపెట్టాలి

- బీసీ రిజర్వేషన్లకు కేంద్రం మోకాలడ్డు
- యూరియా విషయంలోనూ వివక్ష: పొన్నం

హైదరాబాద్, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): కామారెడ్డి బహిరంగ సభతో కాంగ్రెస్ సత్తా ఏంటో బీజేపీకి చూపెట్టాలని మంత్రి పొన్నం ప్రభాకర్ కార్యకర్తలకు పిలుపునిచ్చారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు పెంచుతూ శాసనసభలో తాము చట్టం చేస్తే.. ఆ రిజర్వేషన్లు పెరగకుండా కేంద్రంలోని బీజేపీ సర్కారు మోకాలడ్డుతోందని దుయ్యబట్టారు. టీపీసీసీ విస్తృత స్థాయి సమావేశంలో పొన్నం మాట్లాడారు. కామారెడ్డి డిక్లరేషన్‌కు కట్టుబడి తమ ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోందన్నారు. ఇచ్చిన హామీలు అమలు చేస్తున్నామని.. ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి విస్తృత అవగాహన కల్పించాలని నేతలకు సూచించారు. పార్టీ కార్యకర్తల కృషితోనే అధికారంలోకి వచ్చామని.. సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో మరోసారి అధికారంలోకి వస్తామని ధీమా వ్యక్తం చేశారు. టీపీసీసీ అధ్యక్షుడిగా ఏడాది కాలం పూర్తి చేసుకున్న మహేశ్‌కుమార్ గౌడ్‌కు అభినందనలు తెలిపారు. అనంతరం మీడియాతోనూ పొన్నం మాట్లాడారు. కేంద్రంలోని బీజేపీ సర్కారు యూరియా కేటాయింపుల్లో తెలంగాణ పట్ల వివక్ష చూపుతోందని.. ఎరువుల కోసం ఎన్ని సార్లు విజ్ఞప్తులు చేసినా పట్టించుకోవట్లేదని మండిపడ్డారు. కాంగ్రెస్ సర్కారు పట్ల రైతుల్లో వ్యతిరేకత తెచ్చేందుకు బీజేపీ, బీఆర్‌ఎస్ కుట్రలు చేస్తున్నాయన్నారు. తెలంగాణ రైతాంగాన్ని బీఆర్‌ఎస్ నాయకులు రెచ్చగొడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.



ఇప్పుడు మీ ఓటు ఎవరికి..?

'ఉప రాష్ట్రపతి ఎన్నికల్లో యూరియా ఇస్తే ఓటు వేస్తాం.. లేకపోతే వేయమని కేటీఆర్ అన్నారు కదా.. మరి ఇప్పుడు యూరియా ఇవ్వలేదు.. ఓటు ఎవరికి వేస్తారు..? తెలుగు బిడ్డకు వేస్తారా.. ఎవరికో వేస్తారా..! కిషన్ రెడ్డి, బండి సంజయ్.. మీరు ప్రాతినిధ్యం వహిస్తున్న తెలంగాణకు అవసరమైన ఎరువులు అందించేలా కేంద్రంతో మాట్లాడండి.' అని పొన్నం విజ్ఞప్తి చేశారు. వెంటనే యుద్ధ ప్రాతిపదికన తెలంగాణకు ఎరువులు పంపించాలని కేంద్రాన్ని డిమాండ్ చేశారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావుకు ఎరువులు, రైతులపై అవగాహనే లేదని.. ఆయనకు తెలిసిందల్లా రిజర్వేషన్లను వ్యతిరేకించడమేనని ఎద్దేవా చేశారు.

ప్రజల మన్ననలు పొందేలా పనిచేయాలి

» ఆర్‌అండ్‌బీ ఈఎన్సీకి మంత్రి కోమటిరెడ్డి సూచన

హైదరాబాద్, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట రెడ్డిని ఆ శాఖ ఇంజినీర్ ఇన్ చీఫ్ (ఈఎన్సీ) మోహన్‌నాయక్ సోమవారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా తనను ఆర్ అండ్‌బీ ఈఎన్సీగా నియమించడం పట్ల మంత్రికి మోహన్‌నాయక్ కృతజ్ఞతలు తెలిపారు. అలాగే



మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఈఎన్సీ మోహన్‌నాయక్

ఎస్ఈల నుంచి సీఈలుగా పదోన్నతి పొందిన కిషన్‌రావు, శ్రీనివాసరెడ్డి, వెంకటేశ్వరరావు, లక్ష్మణ్ కూడా మంత్రిని కలిసి కృతజ్ఞతలు చెప్పారు. ప్రభుత్వ నమ్మకాన్ని, ప్రజల మన్ననలు పొందేలా పనిచేయాలని ఇంజినీర్లకు కోమటిరెడ్డి వెంకట రెడి సూచించారు.

'ఉద్యోగుల ఆరోగ్య పథకం' విధి విధానాలను రూపొందించండి: సీఎస్

ప్రభుత్వ ఉద్యోగులకు సంబంధించిన నగదు రహిత 'ఉద్యోగుల ఆరోగ్య పథకం' (ఈహెచ్ఎస్) విధి విధానాలను వెంటనే రూపొందించాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు ఉన్నతాధికారులను ఆదేశించారు. ప్రతిపాదిత ఈహెచ్ఎస్ విధి విధానాలపై సోమవారం సచివాలయంలో సీనియర్ ఐఏఎస్ అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. ఇతర రాష్ట్రాల్లో ప్రభుత్వ ఉద్యోగులకు అమలవుతున్న వివిధ పథకాలు, బీమా కంపెనీల విధానాలను అధ్యయనం చేసి, సాధ్యమైనంత త్వరగా నివేదికను సిద్ధం చేయాలని సీఎస్ ఆదేశించారు.

సీఎంపై అనుచిత వ్యాఖ్యలు.. వ్యక్తి అరెస్టు

వనస్థలిపురం, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఓ వాట్సాప్ గ్రూపులో సీఎం రేవంత్‌రెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు చేసిన వ్యక్తిని పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ సంఘటన హైదరాబాద్‌లోని వనస్థలిపురంలో జరిగింది. స్థానిక ఇంజాపూర్‌లోని వెంకటేశ్వర కాలనీకి చెందిన బొక్క మురళీధర్ రెడ్డి (44) అనే వ్యక్తి గత నెల 29న తుర్కయంజాల్ పేరుతో ఉన్న వాట్సాప్ గ్రూపులో తెలంగాణ అనే క్యాప్షన్‌తో పాటు రేవంత్‌రెడ్డి ఫోటోను జతచేసి "సర్పంచులు, ఎమ్మెల్యేలు అవినీతి పాల్పడకుండా ఉండలేరు. సిగ్గు సిగ్గు రేవంత్ సిగ్గు సిగ్గు... గాంధీలో నీళ్ల లేవట... ఆపరేషన్లు బంద్, బాత్రూంలకు తాళాలు" అని పోస్టు పెట్టాడు. ఇది గమనించిన ఇంజాపూర్‌కు చెందిన మెతరి దర్శన్ అనే వ్యక్తి గత నెల 30న వనస్థలిపురం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీంతో దర్యాప్తు చేపట్టిన పోలీసులు నిందితుడిని సోమవారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

విద్యుత్తు రంగ కమిటీల పునర్వ్యవస్థీకరణ

హైదరాబాద్, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): విద్యుత్తు రంగంలో వ్యూహాత్మక ప్రణాళిక, సమన్వయం కోసం అపెక్స్ కమిటీ(తెలంగాణ పవర్ ప్లానింగ్ కో-ఆర్డినేషన్ కమిటీ-టీజీపీపీసీసీ)తో పాటు పవర్ ట్రేడింగ్ కమిటీ, బ్యాలెన్సింగ్ అండ్ సెటిల్‌మెంట్ కమిటీలను పునర్వ్యవస్థీకరిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు ఇంధనశాఖ ముఖ్యకార్యదర్శి నవీన్‌మిట్టల్ జీవో నెం.33ను జారీ చేశారు. ఇదివరకు అపెక్స్ కమిటీలో ముగ్గురు మాత్రమే(ట్రాన్స్‌కో, ఉత్తర, దక్షిణ డిస్కంల సీఎండీలు) ఉండేవారు. తాజాగా ఇంధన శాఖ ముఖ్యకార్యదర్శికి కమిటీ చైర్మన్‌గా బాధ్యతలు అప్పగించారు. ఇక ముందు ఏ విద్యుత్ కొనుగోలు ఒప్పందం జరిగినా.. ఆ ఒప్పందంపై ఇంధన శాఖ ముఖ్యకార్యదర్శి విధాన నిర్ణయం తీసుకోనున్నారు. ఇక పవర్ ట్రేడింగ్ కమిటీ చైర్‌పర్సన్‌గా ట్రాన్స్‌కో డైరెక్టర్(ఫైనాన్స్) ఉండనున్నారు. బ్యాలెన్సింగ్ సెటిల్‌మెంట్ కమిటీ చైర్‌పర్సన్‌గా ట్రాన్స్‌కో డైరెక్టర్(కమర్షియల్) వ్యవహరిస్తారు.

దేవాదాయ కమిషనర్‌గా శైలజా రామయ్యర్

దేవాదాయ శాఖ కమిషనర్‌గా శైలజా రామయ్యర్‌కు ప్రభుత్వం అదనపు బాధ్యతలు అప్పగించింది. ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణా రావు సోమవారం ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేశారు. తదుపరి ఉత్తర్వులు వెలువడే వరకు శైలజా రామయ్యర్ కమిషనర్ బాధ్యతలు నిర్వహించనున్నారు. కాగా ఆమె ఇప్పటికే దేవాదాయ శాఖ ముఖ్య కార్యదర్శిగా కొనసాగుతున్నారు.

కేబీఆర్ పార్కు చెట్ల నరికివేతపై కేంద్రం వివరణ కోరిన హైకోర్టు

పర్యావరణపరంగా సున్నిత ప్రాంతమైన కేబీఆర్ పార్కు వద్ద మల్టీ లెవల్ ఫ్లైఓవర్ నిర్మాణం కోసం వేల సంఖ్యలో చెట్లను నరికేయడాన్ని వ్యతిరేకిస్తూ దాఖలైన పిటిషన్లపై వివరణ ఇవ్వాలని కేంద్ర ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశాలు జారీచేసింది. జీవవైవిధ్య ప్రాంతమైన కేబీఆర్ పార్కు వద్ద వ్యూహాత్మక రోడ్డు అభివృద్ధి ప్రణాళిక (ఎస్ఆర్డీపీ)లో భాగంగా నిర్మించే ఫ్లైఓవర్ కోసం చెట్లను తొలగించడాన్ని సవాల్ చేస్తూ గతంలో కింగ్‌షుక్ నాగ్, కాజల్ మహేశ్వరి తదితరులు వేర్వేరుగా ప్రజాప్రయోజన వ్యాజ్యాలు దాఖలు చేశారు. సోమవారం వీటిపై చీఫ్ జస్టిస్ ఏకేసింగ్, జస్టిస్ మొహియుద్దీన్ ధర్మాసనం విచారణ చేపట్టింది. ఈ అంశంపై రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే కౌంటర్లు దాఖలు చేసినందున కేంద్ర ప్రభుత్వం తన స్పందన తెలియజేయాలని ధర్మాసనం ఆదేశాలు జారీచేసింది.

నిమ్స్‌లో 'రీజనరేటివ్ మెడిసిన్': డైరెక్టర్ బీరప్ప



నిమ్స్, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): లివర్ పాడైనా, మోకాలి చిప్ప అరిగినా అధైర్యపడొద్దని, శస్త్ర చికిత్సతో పనిలేకుండానే ఇంజెక్షన్ ద్వారా లివర్‌కు పునరుజ్జీవం పోయొచ్చని నిజాం ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (నిమ్స్) వైద్యులు అంటున్నారు. ఆస్పత్రిలో అక్టోబరు 2 తర్వాత రోగులకు ఈ ఇంజెక్షన్ అందుబాటులోకి రానున్నట్టు నిమ్స్ డైరెక్టర్ ప్రొఫెసర్ నగరి బీరప్ప తెలిపారు. "ఈ విధానాన్ని 'రీజనరేటివ్ మెడిసన్' అంటారు. ఇప్పటికే ఈ ప్రాజెక్టుపై పరిశోధనలు జరుగుతున్నాయి. యూఎస్‌కు చెందిన ఓ సంస్థతో ఒప్పందం కుదిరింది. ఎంతో ఖరీదైన ఈ ఇంజెక్షన్ సామాన్యులకు కూడా అందుబాటులోకి తీసుకువచ్చేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి. అభివృద్ధి చెందిన దేశాల్లో ఈ విధానం ద్వారా ఇప్పటికే వైద్యం అందుబాటులో ఉంది" అని ప్రొఫెసర్ చెప్పారు. నిమ్స్‌లో అక్టోబరు 2 విజయదశమి రోజున వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించనున్నారు. దాంతో రూ.80 లక్షల వ్యయంతో రూపొందించిన నెక్స్ట్ - జనరేషన్ సీక్వెన్సింగ్ మిషన్ (టార్గెట్ థెరపీ) అందుబాటులోకి రానుందని ప్రొఫెసర్ తెలిపారు. ఐసీఎమ్ఆర్ ప్రాజెక్టులో భాగంగా ఈ మిషన్‌ను అందుబాటులోకి తీసుకు వస్తున్నట్లు చెప్పారు. అభివృద్ధి చెందిన దేశాలతో సమానంగా నిమ్స్ ఆసుపత్రిలో రోగులకు నాణ్యమైన వైద్య సౌకర్యాలు కల్పించడమే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తుందని ప్రొఫెసర్ బీరప్ప పేర్కొన్నారు.

కేంద్ర, రాష్ట్ర దర్యాప్తు సంస్థల పరస్పర సహకారం

» ఉన్నతాధికారుల కీలక సమావేశం

హైదరాబాద్, సెప్టెంబర్ 8 (ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర దర్యాప్తు సంస్థల మధ్య సమన్వయం కోసం కీలక సమావేశం జరిగింది. హైదరాబాద్ కేంద్రంగా సోమవారం జరిగిన ఈ సమావేశంలో ఎన్ఐఏ, ఎన్ఎస్‌జీ డీజీలతోపాటు తెలంగాణ డీజీపీ కూడా పాల్గొన్నారు. ఆయా కేసుల్లో కేంద్ర, రాష్ట్ర దర్యాప్తు సంస్థల మధ్య సమాచార మార్పిడికి సంబంధించిన కీలక అంశాలపై ఈ సమావేశంలో చర్చించారు. ఎన్ఎస్‌జీ డీజీ శ్రీనివాసన్, ఎన్ఐఏ డీజీ సదానంద దాతే ఇతర కీలక అధికారులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో నెలకొన్న పరిస్థితుల నేపథ్యంలో కేంద్ర, రాష్ట్ర దర్యాప్తు సంస్థల మధ్య సమన్వయానికి సంబంధించి జరిగిన సమావేశం ప్రాధాన్యం సంతరించుకుంది.

వంద రోజుల్లో మేడారం పనులు పూర్తికావాలి

జంపన్న వాగులో నీరుండేలా చెక్ డ్యామ్స్.. జాతరలో భక్తులకు ఇబ్బందులు రాకూడదు

» వారంలో స్వయంగా వచ్చి పరిశీలిస్తా: సీఎం

» మేడారం, బాసర ఆలయాల అభివృద్ధిపై అధికారులతో సమీక్ష

హైదరాబాద్/ములుగు, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): మేడారంలో చేపట్టనున్న అభివృద్ధి పనులను వంద రోజుల్లో పూర్తి చేయాలని సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశించారు. జంపన్న వాగులో నీరు నిలిచేలా ప్రాంతాల వారీగా ఎక్కడికక్కడ చెక్ డ్యామ్‌ల నిర్మాణాలకు ప్రణాళికలు రూపొందించాలని సూచించారు. ఈ వారంలో తానే స్వయంగా వచ్చి క్షేత్రస్థాయిలో పనులను పరిశీలిస్తానని, అందుకు సంబంధించిన ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. మేడారం, బాసర ఆలయాల అభివృద్ధి పనులపై సీఎం రేవంత్ రెడ్డి సోమవారం ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు. మేడారం అభివృద్ధికి సంబంధించిన డిజైన్లను పరిశీలించిన సీఎం.. పూర్తిగా సహజసిద్ధమైన రాతి కట్టడాలతో నిర్మాణాలు ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. భక్తులకు సౌకర్యంగా ఉండేలా ఎంట్రీ, ఎగ్జిట్, పార్కింగ్ వసతులు ఉండాలని సూచించారు. మేడారం మహాజాతర నాటికి భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఆలయ విస్తరణ, అభివృద్ధికి సంబంధించి స్థానిక సెంటిమెంట్‌ను గౌరవించడంతోపాటు నిపుణులు, పూజారుల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోవాలని సూచించారు. సమీక్షలో మంత్రులు కొండా సురేఖ, సీతక్క, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, అడ్లూరి లక్ష్మణ్, సీఎం ముఖ్య కార్యదర్శి శ్రీనివాసరాజు, దేవాదాయ శాఖ ముఖ్య కార్యదర్శి శైలజా రామయ్యర్ పాల్గొన్నారు.

మాస్టర్‌ప్లాన్ వివరాలు సిద్ధం చేసుకోండి

::: అధికారులకు మంత్రి పొంగులేటి ఆదేశాలు

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వచ్చేవారం మేడారంలో పర్యటించనున్నట్లు ఉమ్మడి వరంగల్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా మేడారం సమ్మక్క-సారలమ్మల జాతర ఏర్పాట్లతో పాటు మాస్టర్‌ప్లాన్‌లో నిర్ణయించిన అభివృద్ధి పనులను సీఎం క్షేత్రస్థాయిలో పరిశీలిస్తారని చెప్పారు. ఈ మేరకు మాస్టర్ ప్లాన్ వివరాలు, అభివృద్ధి పనుల ప్రణాళికలను సిద్ధం చేసుకోవాలని అధికారులను మంత్రి పొంగులేటి ఆదేశించారు. గిరిజన సంస్కృతి, సంప్రదాయాలు ఉట్టిపడేలా ఆలయ ఆధునికీకరిస్తామని అన్నారు. సెప్టెంబరు 15 నుంచి పనులు ప్రారంభించి, జనవరి మొదటి వారం లోగా పూర్తయ్యేలా కార్యాచరణ రూపొందించాలని అధికారులకు సూచించారు. మేడారం మాస్టర్ ప్లాన్‌ను సీఎం రేవంత్ పరిశీలించారని, మూడు నెలల వ్యవధిలో పనులు పూర్తవ్వాలని ఆదేశించారని పేర్కొన్నారు. మేడారం జాతరకు అవసరమైన ఏర్పాట్లను యుద్ధప్రాతిపదికన చేపడుతున్నామని వివరించారు.

మూసీ పునరుజ్జీవం.. చేసి చూపిస్తాం





కోకాపేట వద్ద హెచ్ఎండీఏ ఆధ్వర్యంలో నిర్మించిన ట్రంపెట్ ఇంటర్‌చేంజ్ (ఇన్‌సెట్‌లో) ట్రంపెట్‌ను ప్రారంభిస్తున్న సీఎం రేవంత్

(మొదటిపేజీ తరువాయి)

ఉస్మాన్‌సాగర్ జలాశయాల నిర్మాణం పూర్తయితే.. వందేళ్లుగా హైదరాబాద్ దాహార్తి తీరుతోందన్నారు. కాంగ్రెస్ హయాంలోనే హైదరాబాద్‌కు మంజీరా, కృష్ణా, గోదావరి జలాల తరలింపు ప్రాజెక్టులు చేపట్టారని గుర్తు చేశారు. గతంలో సచివాలయం ముందు ఖాళీ బిందెలు, కుండల ప్రదర్శనలు జరిగేవని, అలాంటి ఇబ్బందులన్నింటికీ కాంగ్రెస్ ప్రభుత్వమే పరిష్కారం చూపిందన్నారు. ప్రస్తుతం ఎల్లంపల్లి నుంచే హైదరాబాద్‌కు నీటి సరఫరా జరుగుతోందని, అది కూడా కాంగ్రెస్ హయాంలో నిర్మించిందేనని పేర్కొన్నారు. సీఎంగా వైఎస్సార్, మంత్రిగా శ్రీధర్‌బాబు ఉన్నప్పుడు ప్రాజెక్టును ప్రారంభించగా... 2016లో హైదరాబాద్‌కు నీళ్లు వచ్చాయన్నారు. నాడు మునిసిపల్ మంత్రిగా ఉన్న ఒకాయన శామీర్‌పేట వద్ద నెత్తి మీద గోదావరి జలాలు చల్లుకున్నాడని, నీళ్లు చల్లుకున్నంత మాత్రాన చేసిన పాపాలు పోవని పరోక్షంగా కేటీఆర్‌ను ఉద్దేశించి పేర్కొన్నారు. 'ఒకాయన తాటి చెట్టులా పెరిగాడే కానీ.. మోకాలులోనూ మెదడు లేదు. కాళేశ్వరం నీళ్లు మల్లన్నసాగర్ నుంచి తీసుకుంటున్నారంటూ అర్థరహితంగా మాట్లాడుతున్నడు' అని హరీశ్‌రావును ఉద్దేశించి వ్యాఖ్యానించారు. ఎల్లంపల్లి ప్రాజెక్టును మీ తాత లేదా ముత్తాత కట్టారా? ప్రాణహిత- చేవెళ్ల ప్రాజెక్టులో మల్లన్నసాగర్ (ప్రతిపాదిత ప్రణాళికలోని తడ్కపల్లి చెరువును ఉద్దేశిస్తూ) లేదా? అని నిలదీశారు. కాసుల కక్కుర్తితో తుమ్మిడిహెట్టి దగ్గర నిర్మించాల్సిన బ్యారేజీని మేడిగడ్డలో నిర్మించడం ద్వారా రంగారెడ్డి జిల్లాకు బీఆర్ఎస్ అన్యాయం చేసిందన్నారు. 'మహారాష్ట్ర సీఎంతో మాట్లాడుతున్నం.. 152 మీటర్ల ఎత్తులో బ్యారేజీ కట్టేందుకు అనుమతి అడిగాం. త్వరలో అక్కడకు వెళ్తా. వాస్తవానికి 148మీటర్ల ఎత్తులో ప్రాజెక్టు కట్టేందుకు గతంలోనే ఒప్పందం జరిగింది. మధ్యే మార్గంగా 149-150 మీటర్లు ఎత్తులో ప్రాజెక్టును నిర్మించి రెండు లక్షల ఎకరాలకు సాగు నీరందిస్తాం" అని పేర్కొన్నారు. గోదావరి జలాలు తరలించడం ద్వారా చేవెళ్ల, వికారాబాద్, తాండూరు, పరిగి, కొడంగల్ ప్రజలను ఆదుకుంటామన్నారు.

పదేళ్లలో బీఆర్ఎస్‌కు ఆ ఆలోచనే రాలేదు

పదేళ్ల పాలనలో గోదావరి, కృష్ణా జలాలను హైదరాబాద్‌కు తరలించాలన్న ఆలోచనే చేయని ఘనత బీఆర్ఎస్‌ది అని ధ్వజమెత్తారు. "ఎన్నికలకు ముందు నల్లగొండలో ప్రచారానికి వెళ్లినప్పుడు.. అన్నా మూసీ నది మాకు విషం ఇస్తోందని అక్కడి ప్రజలు చెప్పారు. ఆనాడే వారికి మాట ఇచ్చా. అందుకే పునరుజ్జీవ ప్రాజెక్టు చేపట్టాం. తద్వారా హైదరాబాద్‌నూ సుందర నగరంగా తీర్చిదిద్దుతాం" అని అన్నారు. ఎవరు అడ్డం పడినా, ఒక్కొక్క అవాంతరాన్ని అధిగమించుకుంటూ వెళ్తామని స్పష్టం చేశారు. రూ.7360 కోట్లతో 20 టీఎంసీల గోదావరి జలాలను జంట జలాశయాలకు తీసుకు వస్తున్నామని, ఇందులో 15, 16 టీఎంసీలు హైదరాబాద్ దాహార్తి తీర్చేందుకు, పరిసర ప్రాంతాల్లోని చెరువులు నింపేందుకు వినియోగిస్తామన్నారు. 4, 5 టీఎంసీలు మూసీ ప్రక్షాళనకు వాడనున్నట్టు తెలిపారు. మురికి కూపంగా మారిన మూసీ నదిని అద్భుతంగా మార్చుకుందామా? వద్దా? అనేది ప్రజలు ఆలోచించాలని కోరారు. కాంగ్రెస్‌కు మంచి పేరు వస్తుందనే కొందరు దుర్మార్గులు మూసీ పునరుజ్జీవ ప్రాజెక్టుకు అడ్డుపడుతున్నారని ఆరోపించారు. 'రాజకీయంగా కోపం ఉంటే మాతో కొట్లాడండి. కడుపులో విషం పెట్టుకొని ప్రాజెక్టులను ఆపొద్దు. కలిసి రండి.. అభివృద్ధిలో భాగస్వాములు కండి' అని ప్రతిపక్షాలకు పిలుపునిచ్చారు. గేట్ వే ఆఫ్ హైదరాబాద్ కింద బుద్వేల్‌ను అద్భుతంగా అభివృద్ధి చేయాలనుకుంటున్నామని, మూడేళ్లలో ప్రపంచంతో పోటీ పడేలా హైదరాబాద్‌ను అభివృద్ధి చేస్తామని చెప్పారు. వచ్చే వందేళ్ల రాష్ట్రం, హైదరాబాద్‌ను ఎలా అభివృద్ధి చేయాలన్న స్పష్టమైన ప్రణాళికతో తెలంగాణ రైజింగ్-2047 విజన్ డాక్యుమెంట్ తీసుకొస్తున్నామని, డిసెంబరు 9న జాతికి అంకితం చేస్తామన్నారు. విపక్ష నేతలు ఎన్ని కుట్రలు చేసినా, ఎన్ని రకాలుగా అడ్డం పడినా ప్రభుత్వం తిప్పికొడుతుందని, ఒక్కొక్కరి సంగతి తేలుస్తుందని అన్నారు. 'ఇది ఇందిరమ్మ రాజ్యం.. పేదల రాజ్యం.. పేదలకు న్యాయం జరుగుతుంది' అని ఉద్ఘాటించారు.

ట్రంపెట్ ఇంటర్‌చేంజ్ ప్రారంభోత్సవం

కోకాపేట వద్ద హెచ్ఎండీఏ ఆధ్వర్యంలో నిర్మించిన ట్రంపెట్ ఇంటర్‌చేంజ్‌ను సీఎం రేవంత్ రెడ్డి ప్రారంభించారు. కోకాపేట నియోపోలీస్ లేఅవుట్‌కు, ఔటర్ రింగ్ రోడ్డుకు అనుసంధానంగా ఏర్పాటు చేసిన ట్రంపెట్ ఇంటర్‌చేంజ్ (ఎగ్జిట్ 1ఏ) వల్ల ఇటు శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయం, అటు పటాన్‌చెరు వైపు చేరుకోవడం మరింత సులభతరం కానుంది.

ఢిల్లీ వెళ్లిన సీఎం రేవంత్

హైదరాబాద్, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఉపరాష్ట్రపతి ఎన్నిక నేపథ్యంలో సీఎం రేవంత్ రెడ్డి సోమవారం సాయంత్రం ఢిల్లీ వెళ్లారు. ఇండియా కూటమి తరఫున జస్టిస్ సుదర్శన్‌రెడ్డి పోటీ చేస్తున్న విషయం తెలిసిందే. ఈ ఎన్నిక అనంతరం సీఎం రేవంత్ పలువురు కేంద్రమంత్రులను కలిసే అవకాశం ఉన్నట్టు తెలిసింది. ఫ్యూచర్‌సిటీ నుంచి అమరావతి మీదుగా బందరు పోర్టు వరకు గ్రీన్‌ఫీల్డ్ రోడ్డుకు సంబంధించిన పనులను త్వరితగతిన ప్రారంభించాలని, రైలు మార్గాన్ని మంజూరు చేయాలని కేంద్రాన్ని కోరనున్నారు. రీజినల్ రింగు రోడ్డు ఉత్తరభాగానికి టెండర్లను ఆహ్వానించడంతో పాటు, రాష్ట్ర ప్రభుత్వం రూపొందించిన దక్షిణభాగం అలైన్‌మెంట్‌కు ఆమోదం తెలపాలని విజ్ఞప్తి చేయనున్నారు. హైదరాబాద్- కరీంనగర్- రామగుండం మార్గంలో కొత్త అలైన్‌మెంట్‌ను ఆమోదించాలని, మెట్రో రెండో దశకు నిధులివ్వాలని కేంద్ర మంత్రులను కోరనున్నారు.



సీసీఐ చైర్మన్ సంజయ్ బంగాను సన్మానిస్తున్న మంత్రి శ్రీధర్ బాబు

ఆదిలాబాద్ సీసీఐ ప్లాంటును కేంద్రమే పునరుద్ధరించాలి

» ప్రైవేటీకరణకు మేం వ్యతిరేకం

» మంత్రి శ్రీధర్‌బాబు

» 2 వేల కోట్లు అవసరమన్న సీసీఐ సీఎండీ

» పూర్తి వ్యయం కేంద్రమే భరించాలన్న మంత్రి

» పునరుద్ధరణపై సచివాలయంలో సమీక్ష

హైదరాబాద్, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : మూతపడిన ఆదిలాబాద్‌లోని సిమెంట్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా(సీసీఐ) ప్లాంటును పునరుద్ధరించాలని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. ఈ పరిశ్రమను తిరిగి నడిపించాలని సీఎం రేవంత్ రెడ్డి, తాను పలు సందర్భాల్లో కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమల శాఖ మంత్రి హెచ్.డి. కుమారస్వామిని కలిసి కోరిన విషయాన్ని ఆయన గుర్తుచేశారు. సీసీఐ ప్లాంటు పునరుద్ధరణపై సచివాలయంలో మంత్రి సోమవారం నిర్వహించిన సమీక్షలో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, సీసీఐ సీఎండీ సంజయ్ బంగా, ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పునరుద్ధరణ ప్రతిపాదనలపై శ్రీధర్ బాబు చర్చించారు. ప్లాంటును ఆధునిక యంత్రాలు ఏర్పాటు చేసి పునరుద్ధరించడానికి రూ. 2 వేల కోట్లు అవసరమవుతాయని సీఎండీ మంత్రికి తెలిపారు. మంత్రి స్పందిస్తూ.. వెనుకబడిన ఆదిలాబాద్ జిల్లాలోని ఈ భారీ పరిశ్రమను పూర్తిస్థాయిలో కేంద్ర ప్రభుత్వమే పునరుద్ధరించాలని సీఎం రేవంత్ రెడ్డి పలు సందర్భాల్లో కోరిన విషయాన్ని గుర్తుచేశారు. ఇది అందుబాటులోకి వస్తే మూడు వేలమందికి ఉపాధి దొరుకుతుందని తెలిపారు.

రాష్ట్రంలో 'ఏఐ' సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్ ఏర్పాటు ఆస్ట్రేలియన్ విశ్వవిద్యాలయంతో ఒప్పందం

తెలంగాణలో రాష్ట్ర ప్రభుత్వ భాగస్వామ్యంతో 'ఏఐ సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్' ఏర్పాటు చేసేందుకు ఆస్ట్రేలియాకు చెందిన ప్రముఖ విద్యాసంస్థ 'డికిన్ విశ్వవిద్యాలయం' ముందుకొచ్చింది. మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు సమక్షంలో డికిన్ విశ్వవిద్యాలయం వీసీ ప్రొఫెసర్ ఇయాన్ మార్టిన్, ఐటీ శాఖ డిప్యూటీ సెక్రటరీ భవేష్ మిశ్రా ఒప్పందంపై సంతకాలు చేశారు. 'అంతర్జాతీయ భాగస్వామ్యాల ద్వారా ఏఐ రంగంలో తెలంగాణను గ్లోబల్ లీడర్‌గా తీర్చిదిద్దాలన్నదే మా ప్రభుత్వ సంకల్పం.. ఏఐలో నూతన ఆవిష్కరణలు, నైపుణ్యాభివృద్ధిని ప్రోత్సహించాలనే లక్ష్యంతోనే ఈ సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్ ఏర్పాటుకు డికిన్ విశ్వవిద్యాలయంతో ఒప్పందం చేసుకున్నాం' అని ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు వివరించారు.

ఉపాధి పథకాలు, ఇందిరమ్మ ఇళ్లకు విరివిగా రుణాలివ్వాలి

రైతులకు రుణాలివ్వడంలో మానవీయ కోణంలో ఆలోచించాలి.. ఆస్తుల తాకట్టు, డిపాజిట్ల పేరుతో రైతులపై ఒత్తిడి తేవొద్దు

రాష్ట్రస్థాయి బ్యాంకర్ల కమిటీ భేటీలో డిప్యూటీ సీఎం భట్టి



హైదరాబాద్, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): స్వయం ఉపాధి పథకాలు, ఇందిరమ్మ ఇళ్లు, వ్యవసాయ అనుబంధ రంగాలకు విరివిగా రుణాలివ్వాలని రాష్ట్ర డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క బ్యాంకర్లకు సూచించారు. సోమవారం ప్రజాభవన్‌లో జరిగిన రాష్ట్ర స్థాయి బ్యాంకర్ల కమిటీ (ఎస్ఎల్‌బీసీ) సమావేశంలో భట్టి మాట్లాడారు. రుణాలిచ్చే సమయంలో ఆస్తులను తాకట్టు పెట్టాలని, ఫిక్స్‌డ్ డిపాజిట్లు చేయండంటూ రైతులపై ఒత్తిడి చేయొద్దని చెప్పారు. ప్రభుత్వం వ్యవసాయ రంగాన్ని ఆర్థిక వ్యవస్థకు వెన్నెముకగా భావిస్తోందని పేర్కొన్నారు. రైతులకు సకాలంలో పంట రుణాలు ఇవ్వాలని, ఈ విషయంలో బ్యాంకర్లు మానవీయ కోణంలో ఆలోచించాలని అన్నారు. 'తెలంగాణ రైజింగ్'లో బ్యాంకర్ల పాత్ర ఉందని, 2025-26 ఆర్థిక సంవత్సరపు మొదటి త్రైమాసికంలో బ్యాంకులు ప్రాధాన్య రంగ రుణాల్లో మంచి ఫలితాలు సాధించాయని తెలిపారు. వార్షిక రుణ ప్రణాళిక(ఏసీపీ)లో మొదటి త్రైమాసికంలోనే 33.64% ఫలితాలు సాధించడం అభినందనీయమన్నారు. రైతు రుణమాఫీ పథకంలో భాగంగా కిసాన్ క్రెడిట్ కార్డు ఖాతాలను గణనీయంగా పునరుద్ధరించామని పేర్కొన్నారు. వరి ఉత్పత్తి పెరగడంతో... ఎఫ్‌సీఐకి ఎక్కువ మొత్తంలో ధాన్యాన్ని సరఫరా చేసే రాష్ట్రాల్లో తెలంగాణ ఒకటిగా ఎదిగిందన్నారు. ఆయిల్ పామ్ సాగును ప్రోత్సహించడానికి ప్రభుత్వం అవసరమైన సహకారం అందిస్తోందని తెలిపారు. ఇందిరా మహిళా శక్తి పథకం కింద స్వయం సహాయక సంఘాల మహిళలకు సాధికారత కల్పిస్తున్నామని, వారికి బ్యాంకులు మరింత రుణ సహాయం అందించాలన్నారు. రాష్ట్రంలో మొదటి సంవత్సరం 4.5 లక్షల ఇందిరమ్మ ఇళ్లను నిర్మిస్తున్నామని.. ఒక్కో ఇంటి నిర్మాణానికి ప్రభుత్వం రూ.5 లక్షలను ఖర్చు చేస్తోందని, ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు రుణాలు ఇవ్వాలని బ్యాంకర్లను కోరారు. స్వయం ఉపాధి పథకాల ద్వారా లబ్ధి పొందాలని ఆశిస్తున్న యువకుల పట్ల బ్యాంకర్లు సానుకూల దృక్పథంతో వ్యవహరించాలన్నారు.

రాష్ట్రంలోని బ్యాంకుల్లో డిపాజిట్లు 8.64 లక్షల కోట్లు

3 నెలల్లో రూ.23,883 కోట్లు పెరుగుదల

రైతులకు రూ.41 వేల కోట్ల రుణాలు

ఎంఎస్ఎంఈలకు 68వేల కోట్లు, ముద్ర రుణాలు 3,303 కోట్లు

బ్యాంకర్ల కమిటీ భేటీలో ప్రకటన

హైదరాబాద్, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొలి మూడు నెలల్లో (ఏప్రిల్-జూన్) రాష్ట్రంలోని బ్యాంకుల్లో డిపాజిట్లు రూ.23,883 కోట్లు పెరిగి రూ.8,64,312 కోట్లకు చేరాయి. అలాగే అడ్వాన్సులు రూ.12,021 కోట్లు పెరిగి రూ.10,93,382 కోట్లకు చేరుకున్నాయి. ఎస్ఎల్‌బీసీ సమావేశం సందర్భంగా తొలి త్రైమాసికంలో డిపాజిట్లు, రుణాల వివరాలను బ్యాంకర్లు ప్రకటించారు. ఈ త్రైమాసికంలో వివిధ సంక్షేమ పథకాల్లో భాగంగా ప్రజలకు పంపిణీ చేసిన వివరాలను కూడా బ్యాంకర్ల కమిటీ ప్రకటించింది. తొలి మూడు నెలల్లో స్వల్పకాలిక వ్యవసాయ రుణాలుగా రూ.17,577 కోట్లు అందివ్వగా.. మొత్తం లక్ష్యంలో ఇది 32.73 శాతంగా ఉంది. అలాగే వ్యవసాయ, అనుబంధ రంగాలకు పెట్టుబడి రుణాల కింద రూ.23,473 కోట్లు ఇవ్వగా.. మొత్తం లక్ష్యంలో ఇది 30.93 శాతం. ప్రాధాన్యత రంగాల కింద గృహ రుణాలకు రూ.1,407 కోట్లు, ఉన్నత విద్యకు రూ.110 కోట్లు విడుదల చేశారు. సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలకు (ఎంఎస్ఎంఈ) రూ.68,033 కోట్లు, వ్యాపారస్తులకు ముద్ర రుణాలు రూ.3,303 కోట్లు ఇచ్చారు. వ్యవసాయ మౌలికవసతుల అభివృద్ధికి రూ.5 వేల కోట్లు లక్ష్యంగా నిర్దేశించగా రూ.3,645 కోట్లు మంజూరు చేశారు. సామాజిక భద్రత పథకంలో భాగంగా.. ప్రధాన మంత్రి సురక్షా బీమా యోజన పథకంలో 1.97 కోట్ల మందికి జీవిత బీమా కల్పిస్తున్నారు. ప్రధాన మంత్రి జీవనజ్యోతి బీమా యోజన 95.48 లక్షల మందికి అమల్లో ఉంది. అలాగే 24.21 లక్షల మంది అటల్ పెన్షన్ యోజన కింద రక్షణ పొందుతున్నారు.

రాబడుల పెంపునకు కమిటీలు వేయండి

» రాబడి మార్గాలపై కర్ణాటక, తమిళనాడులో అధ్యయనం చేయాలి

» అధికారులకు డిప్యూటీ సీఎం భట్టి ఆదేశం

» ప్రాజెక్టుల్లో ఇసుక ఆదాయానికి మార్గం : ఉత్తమ్

హైదరాబాద్, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఆదాయార్జన శాఖల్లో రాబడులు పెరిగేందుకు అధికారులతో కమిటీలు వేయాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఉన్నతాధికారులను ఆదేశించారు. వనరుల సమీకరణ క్యాబినెట్ సబ్ కమిటీ సమావేశం సోమవారం భట్టి అధ్యక్షతన సచివాలయంలో జరిగింది. సమావేశంలో కమిటీ సభ్యులైన మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, జూపల్లి కృష్ణారావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా భట్టి మాట్లాడుతూ వాణిజ్య పన్నుల శాఖ రాబడిలో 4.7శాతం, గనుల శాఖలో 18.6శాతం రాబడి వృద్ధి కనిపిస్తోందన్నారు. ఇతర రాబడుల శాఖల్లో కాస్త మందగమనం ఉంటోందని, ఇందుకు కారణాలపై అధ్యయనం చేయాలని చెప్పారు. రాబడుల శాఖల్లో ఆదాయ పెరుగుదలకు అధికారులతో కమిటీలు ఏర్పాటు చేయాలని, ఈ కమిటీలు కర్ణాటక, తమిళనాడు వంటి రాష్ట్రాల్లో రాబడి మార్గాలపై అధ్యయనం చేయాలన్నారు. మంత్రి ఉత్తమ్ మాట్లాడుతూ భారీ నీటి పారుదల ప్రాజెక్టుల్లో పూడికతీత పనులను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. తద్వారా ప్రాజెక్టుల నీటి నిల్వ సామర్థ్యం పెరుగుతుందని, ఇసుక మేట వేస్తుందని తెలిపారు. ఈ ఇసుక ద్వారా రాష్ట్రానికి ఆదాయం సమకూరుతుందన్నారు. మొదట ఒక ప్రాజెక్టులో పూడికతీతను వెంటనే ప్రారంభించాలని సూచించారు. ఏజెన్సీ ప్రాంతాల్లో ఇసుక తవ్వకం పనులను పూర్తిగా గిరిజన ఏజెన్సీలకు ఇవ్వాలన్నారు. గిరిజనులకు యంత్ర సామగ్రి అందుబాటులో ఉండదని, ఈ దృష్ట్యా ఐటీడీఏల్లోని ఇంజనీరింగ్ విభాగం యంత్ర సామగ్రిని సమకూర్చాలని చెప్పారు. ఔటర్ రింగ్ రోడ్డు (ఓఆర్ఆర్) లోపల ఉన్న కాలుష్య కారక పరిశ్రమల తరలింపునకు మూడు వారాల్లో విధివిధానాలను రూపొందించాలని మంత్రులు సంబంధిత అధికారులను ఆదేశించారు. సమావేశంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, ఆర్థిక శాఖ ముఖ్యకార్యదర్శి సందీప్‌కుమార్ సుల్తానియా పాల్గొన్నారు.

ఆ శాఖల్లో ఉద్యోగుల బదిలీలకు గ్రీన్ సిగ్నల్

రాష్ట్ర ఆదాయార్జన శాఖలైన వాణిజ్య పన్నులు, ఎక్సైజ్, స్టాంపులు-రిజిస్ట్రేషన్ల శాఖల్లోని ఉద్యోగులు, అధికారుల బదిలీలకు ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. ఈమేరకు ఆర్థిక శాఖ ముఖ్యకార్యదర్శి సందీప్‌కుమార్ సుల్తానియా సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఆదాయార్జన శాఖల్లో బదిలీలకు గతంలో ప్రభుత్వం జారీ చేసిన మార్గదర్శకాలను అనుసరించాలని ఉన్నతాధికారులకు సూచించారు.

అంపశయ్య నవీన్, అంతడుపుల రమాదేవిలకు పొన్నం సత్తయ్య జీవిత సాఫల్య పురస్కారాలు

» 13న రవీంద్రభారతిలో ప్రదానం..


అంపశయ్య నవీన్; అంతడుపుల రమాదేవి

కరీంనగర్ కల్చరల్/హైదరాబాద్, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): పొన్నం సత్తయ్య జీవిత సాఫల్య పురస్కారాలకు సాహిత్య విభాగంలో నవలా రచయిత అంపశయ్య నవీన్, కళారంగంలో అంతడుపుల రమాదేవి ఎంపికయ్యారు. ఈమేరకు పొన్నం సత్తయ్య చారిటబుల్ ట్రస్ట్ ఉపాధ్యక్షుడు పొన్నం అశోక్ గౌడ్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మంత్రి పొన్నం ప్రభాకర్ తన తండ్రి పొన్నం సత్తయ్య గౌడ్ చారిటబుల్ ట్రస్టు ద్వారా ఏటా రచయితలు, కళాకారులకు పురస్కారాలు అందజేస్తున్న సంగతి తెలిసిందే.. ఎంపిక కమిటీ కన్వీనర్ డాక్టర్ పొన్నం రవిచంద్ర సారథ్యంలో జ్యూరీ కమిటీ సభ్యులు కేంద్ర సమాచార శాఖ మాజీ కమిషనర్ మాడభూషి శ్రీధర్, సీనియర్ జర్నలిస్టు దిలీప్‌రెడ్డి, రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ సంచాలకుడు మామిడి హరికృష్ణ, రచయిత్రి అయినంపూడి శ్రీలక్ష్మి.. ట్రస్టు చైర్మన్, మంత్రి పొన్నం ప్రభాకర్‌కు ఎంపికైన వారి పేర్లు, వివరాల పత్రాన్ని అందజేశారని అశోక్ గౌడ్ వెల్లడించారు. పొన్నం సత్తయ్య 15వ వర్ధంతి సందర్భంగా ఈనెల 13న రవీంద్రభారతిలో పురస్కారాలు అందజేసి అవార్డు గ్రహీతలకు రూ.51 వేల నగదుతో పాటు మెమెంటో, ప్రశంసా పత్రాన్ని అందజేయనున్నట్లు వివరించారు.

నేత్రదానానికి ఆర్టీసీ తోడ్పాటు!

» బస్సుల్లో ఉచితంగా కార్నియాల తరలింపు

» సరోజినీదేవి కంటి ఆస్పత్రితో ఆర్టీసీ ఒప్పందం

హైదరాబాద్, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): సామాజిక బాధ్యతలో భాగంగా నేత్రదానానికి టీజీఎస్ ఆర్టీసీ తోడ్పాటు అందించనుంది. సరోజినీదేవి కంటి ఆస్పత్రి ఆధ్వర్యంలో రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో సేకరించిన కార్నియాలను ఆర్టీసీ బస్సుల్లో ఉచితంగా హైదరాబాద్‌కు తరలించాలని నిర్ణయించింది. ఈ మేరకు 'నెట్‌వర్క్ టు సైట్' పేరుతో సరోజినీదేవి కంటి ఆస్పత్రితో ఒప్పందం చేసుకుంది. మెహిదిపట్నంలోని సరోజినీదేవి కంటి ఆస్పత్రి ప్రాంగణంలో సోమవారం జరిగిన కార్యక్రమంలో ఆర్టీసీ ఎండీ వీసీ సజ్జనార్, ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ మోదిని ఒప్పంద పత్రాలపై సంతకాలు చేశారు. ఈ సందర్భంగా సజ్జనర్ మాట్లాడుతూ.. పవిత్రమైన ఈ దాతృత్వ కార్యక్రమంలో ఆర్టీసీ భాగస్వామ్యం కావడం సంతోషంగా ఉందన్నారు. దేశంలో ఏటా 3 లక్షలకుపైగా మంది నేత్రాల కోసం ఎదురుచూస్తుంటే.. కేవలం 18 వేల మార్పిడిలు మాత్రమే జరుగుతున్నాయన్నారు. మరణానంతరం నేత్రదానం చేసేందుకు ముందుకు రావాలని పిలుపునిచ్చారు.

తెరుచుకున్న యాదగిరిగుట్ట ఆలయం

యాదగిరిగుట్ట, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): సంపూర్ణ చంద్రగ్రహణం తర్వాత యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి ఆలయం, పాతగుట్ట, శివాలయాలను సోమవారం వేకువజామున తెరిచారు. ప్రధానాలయం, ఉప, అనుబంధ ఆలయాలను 3.30గంటలకు తెరిచిన ఆలయ అధికారులు ఉదయం ఐదు గంటల వరకు శుభ్రం చేశారు. అనంతరం ఆలయం, మాడవీధుల్లో ఆస్థాన విద్వాంసుల మంగళవాయిద్యాల నడుమ అర్చకులు సంప్రోక్షణ చేపట్టారు. సుమారు 14 గంటల తర్వాత నిత్య పూజలు ప్రారంభమయ్యాయి. ఉదయం 8.15గంటలకు భక్తులను సర్వదర్శనాలకు అనుమతించారు.


సెంట్రల్ లైబ్రరీ ఆవరణలో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న కె.శ్రీనివాస్

పఠనంలో నేటితరం పిల్లలు ముందంజ

» 'పుస్తకంతో నడక'లో సీనియర్ జర్నలిస్టు కె.శ్రీనివాస్

» సుందరయ్య విజ్ఞాన కేంద్రం నుంచి సిటీ సెంట్రల్ లైబ్రరీ వరకూ ర్యాలీ

చిక్కడపల్లి, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): అన్ని స్థాయిల్లో గ్రంథాలయాలను బలోపేతం చేయాలని ప్రభుత్వానికి పలువురు వక్తలు విజ్ఞప్తి చేశారు. ప్రపంచ అక్షరాస్యతా దినోత్సవం సందర్భంగా 'మరో గ్రంథాలయ ఉద్యమం, పుస్తకంతో నడక' అనే కార్యక్రమాన్ని సోమవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రం నుంచి చిక్కడపల్లిలోని సిటీ సెంట్రల్ లైబ్రరీ వరకూ నడక ర్యాలీని రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ చైర్మన్ డాక్టర్ రియాజ్ ప్రారంభించారు. సిటీ సెంట్రల్ లైబ్రరీ ఆవరణలో జరిగిన సమావేశంలో సీనియర్ జర్నలిస్టు కె.శ్రీనివాస్ మాట్లాడుతూ.. పఠనం ద్వారా విజ్ఞాన సముపార్జనలో నేటి తరం పిల్లలు ఎంతో ముందున్నారని ఏ రూపంలో చదివినా అది పఠనమే అవుతుందని, నేటి తరం పిల్లలకు చాలా విషయ పరిజ్ఞానం ఉందని చెప్పారు. పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే వారి కోసం ప్రత్యేక రీడింగ్ రూమ్‌లు కేటాయిస్తే.. గ్రంథాలయాల్లో వివిధ విజ్ఞానాన్ని అందించే పుస్తకాలు చదివే వారి సంఖ్య పెరుగుతుందన్నారు. ప్రభుత్వమే కొత్త పుస్తకాలు కొనుగోలు చేసి గ్రంథాలయాలకు సరఫరా చేస్తే మరింత అభివృద్ధి చెందుతాయని చెప్పారు. రాష్ట్ర అధికార భాషా సంఘం మాజీ చైర్మన్ జూలూరు గౌరీ శంకర్, జర్నలిస్టు ఎన్.వేణుగోపాల్ మాట్లాడుతూ నగర పాలక సంస్థలు, మున్సిపాలిటీలు వసూలు చేసే ఆస్తిపన్నులోని 8% లైబ్రరీ సెస్‌ను అప్పగిస్తే గ్రంథాలయాలు ఎంతో అభివృద్ధి చెందుతాయన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ సాహిత్య అకాడమీ బాలాచారి, ప్రొఫెసర్ రవీందర్ రెడ్డి, రచయిత్రి కొండవీటి సత్యవతినాళేశ్వరం శంకరం, రుక్మిణి, కందుకూరి రాము, భూపతి వెంకటేశ్వర్లు, కాసుల రవికుమార్,పాటు పలువురు సాహితీ వేత్తలు, రచయితలు పాల్గొన్నారు.

సింధూర నారాయణకు సౌత్ ఇండియా బిజినెస్ అవార్డ్



హైదరాబాద్, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): విద్యారంగంలో చేసిన కృషికి నారాయణ విద్యాసంస్థల డైరెక్టర్ డాక్టర్ పి.సింధూర నారాయణ దుబాయ్‌లో సౌత్ ఇండియా బిజినెస్ అవార్డ్-25 అందుకున్నారు. దక్షిణాది రాష్ట్రాల నుంచి వేర్వేరు రంగాల్లో రాణిస్తున్న వారిని ఈ పురస్కారానికి ఎంపిక చేసినట్లు సోమవారం ప్రకటనలో తెలిపారు. పదేళ్లకు పైగా సినీ రంగానికి చెందిన వ్యక్తులను గౌరవిస్తున్న సౌత్ ఇండియన్ ఇంటర్నేషనల్ మూవీ అవార్డ్స్ సంస్థ.. వ్యాపార రంగంలో ఉన్నత విలువలు, నూతన ఆవిష్కరణలను ప్రోత్సహించేందుకు ఈ అవార్డును అందిస్తోంది. అవార్డ్ స్వీకరించిన సందర్భంగా సింధూర నారాయణ మాట్లాడుతూ.. ముందు ఉత్పత్తి చేసి దానికి మార్కెట్ వెతకడం కంటే ఉన్న సమస్యలకు పరిష్కారం చూపడం ముఖ్యం అన్నారు. నారాయణ విద్యాసంస్థల్లో ప్రతి విద్యార్థి సమగ్రాభివృద్ధి సాధించే విధంగా పాఠ్యప్రణాళికలను రూపొందించినట్లు చెప్పారు. నారాయణ విద్యా సంస్థలు ఆసియాలో అతి పెద్ద విద్యా సంస్థల్లో ఒకటిగా ఎదిగిందన్నారు. నాణ్యమైన విద్యను అందిస్తూ.. మీ కలలే మా కలలు అనే నినాదాన్ని నిజం చేస్తున్నామన్నారు. విద్యారంగంలో సింధూర నారాయణ చేసిన కృషిని నిర్వాహకులు ఈ సందర్భంగా కొనియాడారు.

శిథిలావస్థలో 'ప్రజాకవి' కాళోజీ ఇల్లు

» కలగా స్మారక మందిర నిర్మాణం

» పట్టించుకోని ప్రభుత్వం

» నెరవేరని గత బీఆర్ఎస్ సర్కార్ హామీలు


హనుమకొండ నక్కలగుట్టలో శిథిలావస్థలో ఉన్న కాళోజీ ఇల్లు

హనుమకొండ/హైదరాబాద్/హైదరాబాద్ సిటీ, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): 'పుట్టుక నీది.. చావు నీది.. బ్రతుకంతా దేశానిది' అంటూ తెలంగాణ ఉద్యమమే ఊపిరిగా జీవించిన ప్రజాకవి.. కాళోజీ. ఆయన బతికున్న రోజుల్లో హనుమకొండలో నివసించిన ఇల్లు ఒక సాహిత్య లోగిలిగా వెలుగొందింది. వివక్ష ఎక్కడున్నా వ్యతిరేకించి, అణిచివేత-అన్యాయాలపై ధిక్కార స్వరం వినిపించిన కాళోజీ నారాయణ రావు.. తుది శ్వాస విడిచేవరకు నివసించిన నక్కలగుట్టలోని ఆయన నివాసం క్రమంగా శిథిలావస్థకు చేరుకుంటోంది. కాళోజీ మరణించిన తర్వాత.. ఇంటిలో సగభాగం కూలిపోయి, మరమ్మతులు లేక కళావిహీనంగా తయారయింది. ఆయన కుమారుడు చనిపోయిన తర్వాత.. ప్రస్తుతం ఆ ఇల్లు ప్రైవేటు వ్యక్తుల నిర్వహణలో ఉంది. కాళోజీ శత జయంతి ఉత్సవాల సందర్భంగా మాజీ సీఎం కేసీఆర్ కూడా భావితరాలకు స్ఫూర్తినిచ్చేలా కాళోజీ ఇంటిని తీర్చిదిద్దుతామని చేసిన వాగ్దానం నెరవేరలేదు. ఇటీవలే ఇతర రాష్ట్రాలకు చెందిన రచయితలు వరంగల్ జరిగిన ఒక కార్యక్రమంలో పాల్గొనేందుకు వచ్చి కాళోజీ నివసించిన ఇంటిని చూసేందుకు వెళ్లారు. అంతటి మహనీయుడి ఇల్లు దయనీయ స్థితిలో ఉండడం చూసి విచారం వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఇప్పటికైనా ఇంటిని స్వాధీనం చేసుకుని స్మారక మందిరంగా తీర్చిదిద్దాలని కోరుతున్నారు.

కాళోజీ కథల పుస్తకాన్ని ఆవిష్కరించిన మంత్రి జూపల్లి

తెలంగాణ సాహిత్య అకాడమీ ప్రచురించిన 'కాళోజీ కథలు' పుస్తకాన్ని సోమవారం సచివాలయం లో మంత్రి జూపల్లి కృష్ణారావు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సాహిత్య రంగానికి, తెలంగాణ భాషకు కాళోజీ చేసిన కృషిని కొనియాడారు. 'నా గొడవ' అనే పుస్తకంలో కవిత్వమే కా కుండా సాహిత్యంలోని అనేక అంశాలను స్పృశించారని అన్నారు. ఆయన 111వ జయంతి సందర్భంగా ప్రజాకవి రాసిన కథలను ఒక పుస్తక రూపంలోకి తీసుకురావడం మంచి ప్రయత్నమని అకాడమీ అధికారులను ఆయన అభినందించారు. ఈ కార్యక్రమం లో తెలంగాణ సాహిత్య అకాడమీ కార్యదర్శి డాక్టర్ నామోజు బాలాచారి, కవి యాకుబ్ పాల్గొన్నారు.

ధర కాసింత.. చల్లుడు కొండంత!

పంటల అవసరానికి మించి యూరియా వినియోగిస్తున్న రైతులు

» డీఏపీ, కాంప్లెక్స్ ఎరువుల ధరలతో పోలిస్తే యూరియా అగ్వ

» దీంతో యూరియా వైపే మొగ్గు..

» నిరుటికన్నా పెరిగిన అమ్మకాలు

హైదరాబాద్, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): దేశీయంగా ఉత్పత్తి తగ్గిపోవడానికి తోడు.. విదేశాల నుంచి దిగుమతులూ తగ్గడంతో యూరియాకు కొరత ఏర్పడిన మాట వాస్తవమే. అయితే రైతుల తీరూ ఈ కొరతకు కారణమే అనిపిస్తోంది. వేసిన పంటలకు మోతాదుకు మించి ఇష్టారీతిన చల్లటం, భవిష్యత్తు అవసరాల కోసం బస్తాలకు బస్తాలు నిల్వ చేసి పెట్టుకోవడం, డీఏపీ, కాంప్లెక్ ఎరువుల ధరతో పోలిస్తే తక్కువ ధరకే లభ్యమవుతున్న కారణంగా అన్నదాతలు యూరియావైపే మొగ్గుచూపుతుండటంతో అది బంగారమవుతోంది. పైగా వ్యవసాయేతర అవసరాలకూ యూరియాను మళ్లించడం, సరుకును వ్యాపారులు బ్లాక్ మార్కెట్‌కు తరలించడంతోనూ సాగు అవసరాల కోసం యూరియాకు తీవ్ర కొరత ఏర్పడింది. ఆశ్చర్యం ఏమిటంటే.. వచ్చే యాసంగి సీజన్‌లో సాగుచేసే పంటలకోసం కూడా కొందరు రైతులు యూరియా బస్తాలు కొనుగోలుచేసి నిల్వచేస్తున్నట్లు అధికారులు చెబుతున్నారు.

ఇందుకే యూరియా వైపు మొగ్గు

45 కిలోల యూరియా బస్తా వాస్తవ ధర రూ.2,234. కేంద్ర ప్రభుత్వం 1,967 రూపాయల సబ్సిడీ ఇస్తోంది. అంటే.. రైతులకు ఒక్కో బస్తా రూ.266 మాత్రమే పడుతోంది. దీనితో పోల్చితే కాంప్లెక్స్ ఎరువుల ధరలు భిన్నం. సబ్సిడీ పోనూ డీఏపీ బస్తా ధర రూ.1,360 పడుతోంది. అలాగే.. ఎంవోపీ, 14-35-14,

ఎరువుల ధరల పట్టిక (రూ.లలో)

ఎరువు పేరు	అసలు ధర	సబ్సిడీ	అమ్మకపు ధర
యూరియా	2,234	1,967	266.50
డీఏపీ	2,740	1,390	1,350
14.35.14	2,881	1,081	1,800
20.20.0.13	2,383	883	1,500
28.28.0	3,013	1,033	1,800
ఎంవోపీ	1,871	71.40	1,800
ఎస్ఎస్‌పీ	1,013	363	650

28-28-0 బస్తాలు రూ.1,800 చొప్పున ఇస్తున్నారు. 20-20-0-13 బస్తా ధర రూ. 1,500 ఉండగా, ఎస్ఎస్‌పీ ధర రూ.650గా ఉంది. వీటిలో ఏ కాంప్లెక్స్ ఎరువుల ధరలు చూసినా యూరియా కన్నా ఎక్కువే. వాస్తవానికి ఒక ఫార్ములాతో తయారుచేసిన ఎరువుకు మరొక ఫార్ములాతో తయారుచేసిన ఎరువు ప్రత్యామ్నాయం కానే కాదు. రైతులు మాత్రం ఎక్కువ ధరకు దొరికే కాంప్లెక్స్ ఎరువులకు బదులుగా తక్కువ ధరకు లభ్యమయ్యే యూరియాను కొని పంటలకు గుప్పుతున్నారు. సబ్సిడీ ఎక్కువగా ఉండటంతో రైతులు ఎగబడి యూరియా కొంటున్నారు. ఫలితంగానే యూరియా వాడకం గణనీయంగా పెరిగింది. వ్యవసాయ శాస్త్రవేత్తలు, అధికారుల సిఫారసు మేరకు... ఎకరం వరికి 45 కిలోల బస్తాలు 2 వేస్తే చాలు. రైతులు మాత్రం ఎకరం వరి పొలానికి 3 నుంచి 4 బస్తాలు వేస్తున్నారు. పత్తికి ఎకరానికి 2 నుంచి 3 బస్తాలు సరిపోతాయి. కానీ నాలుగైదు బస్తాలు గుప్పుతున్నారు. మొక్కజొన్నకు 3 నుంచి 4 బస్తాలు వేస్తే అదే ఎక్కువ... కానీ 8 బస్తాల నుంచి 10 బస్తాల వరకు వేస్తున్నారు. ఈ క్రమంలో మొక్కజొన్న విస్తీర్ణం పెరగటంమూ యూరియా కొరతకు ప్రధాన కారణం అవవుతోంది. అవసరానికి మించి యూరియా గుప్పుతుండటంతో ఎంత సరఫరాచేసినా కొరత ఏర్పడుతోంది.

నిరుటి కన్నా ఎక్కువ సరఫరా

ఈ వానాకాలం పంటలకు 9.80 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా అవసరం అని వ్యవసాయశాఖ ప్రణాళికలో పేర్కొంది. ఇప్పటివరకు (సెప్టెంబరు 8వ తేదీ నాటికి) 8.23 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా అమ్మకాలు రాష్ట్రవ్యాప్తంగా జరిగాయి. నిరుడు ఇదే సమయానికి 8.05 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా అమ్మకం జరిగింది. నిరుటితో పోలిస్తే ఎక్కువ సరఫరా చేసినప్పటికీ ఇంకా క్షేత్రస్థాయిలో యూరియా కొరత ఉంది. 25 వేల మెట్రిక్ టన్నుల యూరియా నిల్వలు ఉన్నాయి. ఒక్క సెప్టెంబరు మొదటివారంలోనే 40 వేల మెట్రిక్ టన్నుల యూరియా రాష్ట్రానికి వచ్చింది. ప్రతిరోజు 10 వేల టన్నుల చొప్పున 2 లక్షల టన్నుల యూరియా వస్తోందని మంత్రి తుమ్మల చెబుతున్నారు. సీఎం, తుమ్మల కేంద్ర మంత్రులను కలిసి విజ్ఞప్తులు చేస్తున్నప్పటికీ సమస్య పరిష్కారం కావటం లేదు. నిరుడు బఫర్ స్టాక్ 3.52 లక్షల టన్నులు ఉండగా ఈసారి కేవలం 25 వేల టన్నులే ఉండటం కూడా సమస్యగా పరిణమించింది. పంట సీజన్ ప్రారంభంలోనే గతంలో 4-5 లక్షల మెట్రిక్ టన్నుల బఫర్ స్టాక్ పెట్టేవారు. ఈ ఖరీఫ్ సీజన్ ప్రారంభ నిల్వ కేవలం 1.92 లక్షల మెట్రిక్ టన్నులే ఉండటంతో సరఫరాలో తేడా వచ్చింది. దీనికితోడు ఏప్రిల్ నుంచి ఆగస్టు వరకు 2.11 లక్షల టన్నుల యూరియా కేంద్రం నుంచి రాష్ట్రానికి రాలేదు.

బ్లాక్‌తో మరింత సమస్య

యూరియా కొరతకు కొంత కారణం రైతులైతే... డీలర్లు, వ్యాపారులు, వ్యవసాయశాఖ అధికారులు కూడా ప్రధాన కారణంగా కనిపిస్తున్నారు. క్షేత్రస్థాయిలో వ్యాపారులు, అధికారులు మిలాఖత్ అయిపోయి... యూరియాను బ్లాక్ మార్కెట్‌కు తరలించినట్లు ఆరోపణలు వస్తున్నాయి. బ్లాక్ మార్కెట్‌కు తరలించిన యూరియాను పట్టుకోవటంలో విజిలెన్స్, వ్యవసాయశాఖ అధికారులు విఫలమైనట్లు ఆరోపణలు వస్తున్నాయి. సాక్షాత్తూ మంత్రి తుమ్మల ఆదేశాలు జారీచేసినా ఇంతవరకు బ్లాక్ మార్కెట్‌కు తరలించిన యూరియా నిల్వలను సీజ్ చేయలేదు. రాష్ట్రానికి వచ్చే యూరియా రేక్‌లో 60 శాతం ప్రాథమిక వ్యవసాయ, సహకార సంఘాలకు, 40 శాతం ప్రైవేటు డీలర్లకు కేటాయిస్తున్నారు. యూరియాను సక్రమంగా పంపిణీ చేయటంలో పీఏసీఎస్ సిబ్బంది పలు చోట్ల విఫలమవుతుండా, ప్రైవేటు డీలర్లు మాత్రం అధిక ధరలకు బహిరంగ మార్కెట్లో యూరియా అమ్ముకుంటున్నారు.

రసాయన పరిశ్రమల్లో వాడకం

వ్యవసాయరంగంలోనే కాకుండా పరిశ్రమ, వైద్య, ఇంధన, రసాయనరంగాల్లోనూ యూరియాను విరివిగా వినియోగిస్తున్నారు. రసాయన పరిశ్రమల్లో... ప్లాస్టిక్స్, ఫార్మాల్డిహైడ్ రెసిన్, ఎక్స్‌ప్లోసివ్స్ తయారీలో యూరియా వాడుతున్నారు. టెక్స్‌టైల్ పరిశ్రమలో బట్టల రంగులు బాగా పట్టుబడేందుకు ఉపయోగిస్తున్నారు. ఫార్మారంగంలో క్రీములు, చర్మానికి సంబంధించిన ఉత్పత్తుల్లో యూరియా వాడుతున్నారు. కొన్ని మందుల తయారీలో కూడా వాడుతున్నారు. పెట్రోకెమికల్స్‌లో డీజిల్ వాహనాల్లో వాడే 'ఆడ్ బ్లూ' తయారీలో యూరియా వినియోగిస్తున్నారు. ఈ క్రమంలో వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఇటీవల అధికారులను అప్రమత్తం చేశారు. పరిశ్రమలను తనిఖీచేయాలని, యూరియా నిల్వలు ఎక్కడైనా ఉంటే సీజ్ చేసి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

న్యాయస్థానాలను రాజకీయ యుద్ధ క్షేత్రాలుగా మార్చొద్దు

» సీఎం రేవంత్‌పై బీజేపీ పరువు నష్టం పిటిషన్ కొట్టివేత

» రూ.10 లక్షల జరిమానా విధిస్తామని సుప్రీంకోర్టు హెచ్చరిక

న్యూఢిల్లీ, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): న్యాయస్థానాలను రాజకీయ యుద్ధ క్షేత్రాలుగా మార్చొద్దని సుప్రీంకోర్టు హెచ్చరించింది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై తెలంగాణ బీజేపీ తరఫున ఆ పార్టీ నేత కాసం వెంకటేశ్వర్లు వేసిన పిటిషన్ విషయంలో సర్వోన్నత న్యాయస్థానం తీవ్రంగా స్పందించింది. రాజకీయ నాయకుడు మందమైన చర్మం(మొండి పట్టుదల, స్వభావం, విమర్శలను ధైర్యంగా ఎదుర్కొనే తత్వం) కలిగి ఉండాలని సీజేఐ జస్టిస్ బీఆర్ గవాయ్ వ్యాఖ్యానించారు. కేసు పూర్వాపరాల్లోకి వెళ్తే.. 2024 లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో భాగంగా.. కొత్తగూడెంలో జరిగిన సభలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి "బీజేపీ అధికారంలోకి వస్తే.. రిజర్వేషన్లు రద్దవుతాయి" అని వ్యాఖ్యానించారు. ఈ వ్యాఖ్యలు బీజేపీ ప్రతిష్టను దెబ్బతీశాయంటూ ఆ పార్టీ నేత కాసం వెంకటేశ్వర్లు ఫిర్యాదు చేశారు. దీనిపై ప్రజాప్రతినిధుల కోర్టు విచారణ జరిపి.. రేవంత్‌రెడ్డిపై కేసు నమోదు చేయాలని పోలీసులను ఆదేశించింది. ఈ తీర్పుపై రేవంత్‌రెడ్డి హైకోర్టుకు వెళ్లారు. హైకోర్టు ఈ ఏడాది ఆగస్టు 1న హైకోర్టు రేవంత్‌రెడ్డికి అనుకూలంగా తీర్పునిస్తూ.. ట్రయల్ కోర్టు ఆదేశాలను రద్దు చేసింది. దీనిపై కాసం వెంకటేశ్వర్లు గత నెల 28న సుప్రీంకోర్టులో స్పెషల్ లీవ్ పిటిషన్ వేశారు. సోమవారం ఆ పిటిషన్‌పై సీజేఐ జస్టిస్ బీఆర్ గవాయ్, జస్టిస్ వినోద్ చంద్రన్, జస్టిస్ అతుల్ ఎస్.చందూర్కర్‌ల ధర్మాసనం విచారించింది. తెలంగాణ బీజేపీ తరఫున సీనియర్ న్యాయవాది రంజిత్‌కుమార్ వాదనలను వినిపించేందుకు సిద్ధమవ్వగా.. "పిటిషన్‌ను డిస్మిస్ చేస్తున్నాం" అని జస్టిస్ గవాయ్ ప్రకటించారు. మరోమారు రంజిత్ తన వాదనలను వినిపించే ప్రయత్నం చేయగా.. జస్టిస్ గవాయ్ ఆయనపై ఆగ్రహం వ్యక్తం చేశారు. "రాజకీయ పోరాటాలకు కోర్టులను ఉపయోగించవద్దని మేము పదేపదే చెబుతున్నాం. అటువంటి పిటిషన్లను తిరస్కరించాం. మేం మరోసారి చెప్పేది ఒక్కటే. మీరు రాజకీయ నాయకుడయితే వీటన్నింటినీ భరించే బలమైన నైపుణ్యం మీకు ఉండాలి. విమర్శలను ఎదుర్కొనే, భరించే సామర్థ్యం ఉండాలి. రాజకీయ వ్యాఖ్యలను రాజకీయ స్ఫూర్తితోనే ఎదుర్కోవాలి" అని వ్యాఖ్యానించారు. ఆ తర్వాత కూడా రంజిత్ తన వాదనలను వినిపించే ప్రయత్నం చేయగా.. సీజేఐ అసహనం వ్యక్తం చేశారు. ఇలాంటి పిటిషన్లు వేస్తే.. రూ.5 వేలు, 25 వేలు, రూ.10 లక్షల జరిమానా విధిస్తామని హెచ్చరిస్తూ.. విచారణను ముగిస్తున్నట్లు ప్రకటించారు.

అదును దాటాక చల్లినా దండగే!

యూరియా దొరక్క రైతుల్లో నిర్వేదం.. ముందురోజు రాత్రి చేరుకుని జాగారం

» క్యూలో నీరసించి పడిపోతుతున్న వైనం

» ఎరువుల కేంద్రాల వద్ద అవే చెప్పుల వరుసలు

» ఆగ్రహంతో రైతుల ఆందోళనలు.. రాస్తారోకోలు

(ఆంధ్రజ్యోతి న్యూస్‌నెట్‌వర్క్)


మంచిర్యాల జిల్లా కోటపల్లిలో యూరియా కోసం క్యూలో నిల్చున్న మహిళా రైతులు

రైతులకు సరిపడా యూరియా దొరకడం లేదు. క్యూ లైన్లలో అదేపనిగా నిలబడాల్సి రావడంతో అలసటా తప్పడం లేదు. యవుసం పనులు మానుకొని, క్యూలో నిలబడటానికే రోజంతా సరిపోతోందని.. అదును దాటాక యూరియా దొరికినా ఉపయోగం ఉండదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్రవ్యాప్తంగా సోమవారం కూడా ఎరువుల కేంద్రాల వద్ద రైతులు బారులుతీరారు. ఖమ్మం జిల్లా నేలకొండపల్లిలో మహిళా రైతు కూరాకుల మల్లమ్మ క్యూలో సొమ్మసిల్లి పడిపోయింది. ఆసిఫాబాద్ జిల్లా రెబ్బెన మండలంలో హై వేపై రైతులు రాస్తారోకో చేశారు. వరంగల్ జిల్లా నెక్కొండలో మంగళవారం యూరియా ఇస్తున్నారని తెలియడంతో రైతులు సోమవారం రాత్రి 10 గంటలకే చేరుకొని క్యూలో నిల్చున్నారు. పెద్దపల్లి జిల్లా ముత్తారంలో, కరీంనగర్ జిల్లా సైదాపూర్‌లో, మెదక్ జిల్లా రామాయంపేట మండలం రాయులాపూర్‌లో, సిద్దిపేట జిల్లా రాయ్‌పోల్‌లో రైతులు క్యూలో చెప్పులు, చెట్ల కొమ్మలు పెట్టారు. మహబూబ్‌నగర్ జిల్లా మహ్మదాబాద్ మండలం వెంకటరెడ్డిపల్లి స్టేజీ మహబూబ్‌నగర్-చించోళి రహదారిపై రైతులు బైఠాయించి ఆందోళన నిర్వహించారు. మిడ్జిల్, మూసాపేట, హన్వాడ మండలాల్లోనూ ఇదే పరిస్థితి కనిపించింది. సిద్దిపేట జిల్లా హుస్నాబాబాద్‌లో ప్రధాని మోదీ దిష్టిబొమ్మ దహనం చేశారు. రంగారెడ్డి జిల్లాలో చౌదరిగూడ, యాలాల మండలాల్లో రైతులు రోడ్లపైకి వచ్చి ఆందోళన వ్యక్తం చేశారు. తాండూరు మండలం ఎల్మకన్నె ప్యాక్స్ వద్దకు ఉదయం 6గంటలకే 300 మంది రైతులు చేరుకున్నారు. 10 గంటలకు అధికారులు ఒక్కో బస్తా చొప్పున టోకెన్లు రాసిచ్చారు. ఆ టోకెన్ల ప్రకారం యూరియా అందజేశారు.

రైతులకు ఇబ్బందుల్లేకుండా యూరియా పంపిణీ

» అందుకు తగిన చర్యలు తీసుకోండి


» అధికారులకు తుమ్మల ఆదేశాలు

యూరియా పంపిణీలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వ్యవసాయశాఖ అధికారులను ఆదేశించారు. ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు, ప్రైవేటు డీలర్లతో పాటు రైతు వేదికల వద్ద కూడా యూరియా పంపిణీ చేపట్టాలన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 500 రైతు వేదికల వద్ద యూరియా అమ్మకాలు జరిపేందుకు వీలుగా రెండు రోజుల వ్యవధిలో 500 ఈ-పాస్ యంత్రాలు తెప్పించి, సిబ్బందికి శిక్షణ ఇప్పించి యూరియా అమ్మకాలు చేపడుతున్నట్లు తుమ్మల తెలిపారు. రైతులకు ముందస్తుగా టోకెన్లు జారీచేయటం ద్వారా క్యూలైన్లు, తోపు లాటలు లేకుండా పంపిణీ జరుగుతున్నదని అన్నారు. కొన్ని రాజకీయ పార్టీలు స్వార్థంతో యూరియా పంపిణీ కేంద్రాల వద్ద కావాలని ఆందోళనలు చేస్తూ దిగజారుడు రాజకీయాలు చేస్తున్నాయని, రైతులు అలాంటి వారి విషయంలో అప్రమత్తంగా ఉండాలని విజ్ఞప్తి చేశారు.

ఓటరు జాబితాలో.. తప్పుల కుప్పలు

» తుది ఓటరు జాబితా ముసాయిదాలోనూ అదే తీరు

» జాబితాల్లో చనిపోయిన ఓటర్ల పేర్లు


1026 | ఎ.సి -పి.ఎస్ - వరుస సంఖ్య : 85 - 280 - 263
ఓటరు పేరు : [illegible]
భర్త పేరు : [illegible]
వయస్సు :22 లింగము :F
ఇంటి నెంబరు. :3-26
ఎపిక్ నెంబరు RFQ2672491

1029 | ఎ.సి -పి.ఎస్ - వరుస సంఖ్య : 85 - 280 - 551
ఓటరు పేరు : [illegible]
తండ్రి పేరు : [illegible]
వయస్సు :22 లింగము :F
ఇంటి నెంబరు. :3-26
ఎపిక్ నెంబరు RFQ2505246

కొల్లాపూర్ మండలం రామాపురంలో రోజా అనే మహిళకు ఉన్న డబుల్ ఓట్లు

మహబూబ్‌నగర్/నిజామాబాద్, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు గ్రామ పంచాయతీల వారీగా ఈ నెల 2న విడుదల చేసిన తుది ఓటర్ జాబితా ముసాయిదాలో కూడా మళ్లీ అవే తప్పులు దొర్లాయి. మృతుల పేర్లు ఉండటం, ఒకే వ్యక్తికి రెండు ఓట్లు, వలస వెళ్లిన వారివీ ఉండటంతో అసలు ఓటర్లు గందరగోళానికి గురవుతున్నారు. తాజాగా ఉమ్మడి మహబూబ్ నగర్, నిజామాబాద్ జిల్లాల ఓటరు జాబితాలో క్షేత్రస్థాయిలో అనేక తప్పిదాలు చోటు చేసుకున్నాయి. మహబూబ్‌నగర్ పొల్కంపల్లిలో ఒక మహిళ ఫొటోతో ఆమె పేరు " అ" , ఆమె తండ్రి పేరు "శ" అని ముద్రించారు. గండీడ్ మండలం రుసుంపల్లిలో 1200 ఓట్లు ఉండగా 46 మంది చనిపోయిన వారి పేర్లు జాబితాలో వచ్చాయి. పోతులమడుగు పంచాయతీ పరిధిలో 20 మంది చనిపోయిన వారి పేర్లు, 15 మంది వరకు పేర్లు తప్పుగా నమోదు కావడం కనిపించింది. గట్టు మండలం చాగదోనలో అశోక్ అనే పేరుకు బదులు అనొక్కు అని రావడం గమనార్హం. నాగర్‌కర్నూలు జిల్లా వంగూరు, పెద్ద కొత్తపల్లి, కొల్లాపూర్, కల్వకుర్తి మండలాల పరిధిలోనూ ఇదే పరిస్థితి నెలకొంది.

నిజామాబాద్‌లోనూ.. ఇదే పరిస్థితి

ఇక, నిజామాబాద్ జిల్లా ఓటర్ల జాబితా తప్పుల తడకగా ఉంది. జిల్లాలోని డొంకేశ్వర్ మండలం మారంపల్లి గ్రామంలో హేమంత్ కుమార్ పేరు మీద ఒకే వార్డులో మూడు ఓట్లు వచ్చాయి. అదే గ్రామంలో పది మంది చనిపోయిన వారి ఓట్లను తొలగించలేదు. అన్నారం గ్రామంలో ఓటరు జాబితాలో రెండు సార్లు పేర్లు వచ్చిన వారు ఆరుగురు ఉన్నారు. బూత్ లెవల్ అధికారులు ఇంటింటి సర్వే చేపట్టి ఓటర్ల వివరాలు సేకరించడంతో పాటు మృతులు, వలస వెళ్లిన వారు, రెండు ఓట్లు ఉన్న వారి పేర్లను తొలగించాలని ప్రజలు కోరుతున్నారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda press, Sy no.1054, Andhrajyothi Building, Madikonda Village, Khazipet Mandal, Hanamkonda (Dist), Pin. 506142, Editor: N.Rahul Kumar. Ph. No. (0870) 2100480/84.
RNI No:APTEL/2003/9741, Managing Director : Vemuri Radha Krishna Founder: K.L.N.Prasad.